బలమైన పునాది

# బైబిల్ అధ్యయన నోట్స్
# ఎఫెసీయులకు పత్రిక

సందర్భం □ వివరణ □ అన్వయం

సువార్త సంబంధం □ బైబిల్ అధ్యయన ప్రశ్నలు



సిద్ధపరిచినవారు: బాబు గంటా

# విషయ సూచిక

ముందుమాట - బైబిల్ అధ్యయన మార్గదర్శకాలు 1
ఎఫెసీయులకు - నేపథ్యం, పత్రిక పరిచయం 3
ఎఫెసీయులకు 1:1-14 7
ఎఫెసీయులకు 1:15-23 13
ఎఫెసీయులకు 2:1-10 20
ఎఫెసీయులకు 2:11-22 28
ఎఫెసీయులకు 3:1-13 34
ఎఫెసీయులకు 3:14-21 40
ఎఫెసీయులకు 4:1-16 45
ఎఫెసీయులకు 4:17-32 50
ఎఫెసీయులకు 5:1-21 55
ఎఫెసీయులకు 5:22-33 60
ఎఫెసీయులకు 6:1-9 66
ఎఫెసీయులకు 6:10-24 72

# ముందుమాట

## బైబిల్ అధ్యయనానికి కొన్ని ముఖ్యమైన మార్గదర్శకాలు

ప్రియమైన బైబిల్ స్టడీ లీడర్లకు,

ఈ నోట్స్‌ను బైబిల్ స్టడీ లీడర్లకు త్వరగా చూసుకునే రిఫరెన్స్‌గా ఉపయోగపడాలని సిద్ధం చేశాను. ఇవి మీరు వ్యక్తిగతంగా, జాగ్రత్తగా, లోతుగా చేసే దేవుని వాక్య అధ్యయనానికి ప్రత్యామ్నాయం కావు.

లేఖనాలను మరింత బాగా అర్థం చేసుకోవడానికి మంచి Study Bibles, Commentaries చాలా ఉన్నాయి. వాటిలో GM Study Bible ఒక మంచి వనరు. ఇది ఇప్పుడు అనేక భారతీయ భాషల్లో ఆన్‌లైన్‌లో ఉచితంగా అందుబాటులో ఉంది. అయితే Study Bible లేదా Commentary చూడకముందు, ముందుగా బైబిల్ భాగాన్ని మీరే జాగ్రత్తగా చదవండి— వీలైతే రెండు మూడుసార్లు చదవండి. ఏమి చెప్పబడుతోంది? ఎవరు మాట్లాడుతున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఏ పరిస్థితిలో మాట్లాడుతున్నారు? ఈ భాగానికి ముందు, తరువాత ఏమి ఉంది? అని గమనించండి.

మన మొదటి పని ఏదైనా ఆసక్తికరమైన విషయం చెప్పడం కాదు. దేవుడు తన వాక్యంలో నిజంగా ఏమి చెప్పాడో అర్థం చేసుకోవడం.

## Exegesis మరియు Eisegesis

ప్రతి బైబిల్ స్టడీ లీడర్ ఈ రెండు పదాలను అర్థం చేసుకోవడం మంచిది.
Exegesis అంటే మన ఆలోచనలను వాక్యంలో పెట్టడం కాదు; వాక్యంలో ఉన్న అర్థాన్ని బయటకు తీసి అర్థం చేసుకోవడం. "ఈ లేఖనాన్ని రాసిన రచయిత అసలు ఏమి చెప్పాలనుకున్నాడు?" అని అడగాలి. మన అభిప్రాయాలకు వాక్యాన్ని సరిపెట్టకూడదు; వాక్యమే మన ఆలోచనలను సరిచేసి, మార్చాలి.

Eisegesis దీనికి వ్యతిరేకం. అంటే మన సొంత ఆలోచనలను వాక్యంలోకి తీసుకురావడం. ముందే మనకు ఒక అభిప్రాయం ఉండి, దానికి మద్దతుగా కనిపించే ఒక వచనాన్ని తీసుకోవడం. ఇది లేఖనాన్ని తప్పుగా అర్థం చేసుకోవడానికి, తప్పుగా ఉపయోగించడానికి దారితీస్తుంది.

అందుకే మొదట, "ఈ వచనం నాకు ఏమి చెబుతోంది?" అని అడగకుండా,
"ఈ వచనం దాని సందర్భంలో అసలు ఏమి చెబుతోంది?" అని అడగాలి.
దాని అర్థం తెలుసుకున్న తరువాత, "ఈ సత్యం నేడు మన జీవితానికి ఎలా వర్తిస్తుంది?" అని ఆలోచించాలి.
బైబిల్ అధ్యయనానికి ఒక సులభమైన పద్ధతి

ముందుగా సందర్భం (Context) తెలుసుకోండి. ఈ పుస్తకం ఎవరు రాశారు? ఎవరికి రాశారు? ఎందుకు రాశారు? అప్పటి పరిస్థితులు ఏమిటి? ఈ భాగానికి ముందు, తరువాత ఏమి ఉంది? అని చూడండి. ఒక వచనాన్ని దాని పేరా, అధ్యాయం, పుస్తకం, మొత్తం లేఖన సందేశం నుండి వేరుచేసి అర్థం చేసుకోకూడదు.

తర్వాత వచనం వెంబడి వచనం వివరణ (Verse-by-Verse Exposition) చేయండి. మళ్లీ మళ్లీ వచ్చే మాటలు, ఆజ్ఞలు, వాగ్దానాలు, హెచ్చరికలు, పోలికలు, కారణాలు, ఫలితాలను గమనించండి. ఇది దేవుని గురించి ఏమి చెబుతోంది? మనిషి గురించి ఏమి చెబుతోంది? నమ్మవలసిన సత్యం ఉందా? పాటించవలసిన ఆజ్ఞ ఉందా? గమనించవలసిన హెచ్చరిక లేదా అర్థం చేసుకోవలసిన వాగ్దానం ఉందా? అని ప్రశ్నించండి.

తర్వాత మీ పరిశీలనలను అన్వయ ప్రశ్నలుగా (Application Questions) మార్చండి. కేవలం ఏమి చేయాలో చెప్పకుండా, వారే ఆలోచించేలా ప్రశ్నించండి. నా ఆలోచనలో ఏమి మారాలి? నేను నమ్మవలసినది, ఒప్పుకోవలసినది, విడిచిపెట్టవలసినది లేదా పాటించవలసినది ఏదైనా ఉందా? ఈ సత్యం నా రోజువారీ జీవితం, సంబంధాలు, ప్రాధాన్యతలు, నిర్ణయాలను ఎలా మార్చాలి?

చివరిగా ప్రతి భాగంలో సువార్త సంబంధం (Gospel Connection) కోసం చూడండి. ఈ భాగం సృష్టి, పతనం, విమోచన, పునరుద్ధరణ అనే దేవుని గొప్ప కథతో ఎలా కలుస్తుంది? దేవుని కృప మనకు ఎందుకు అవసరమో ఇది ఎలా చూపిస్తుంది? క్రీస్తు వ్యక్తిత్వం, ఆయన కార్యం, సిలువ మరణం, పునరుత్థానం లేదా ఆయన ఇచ్చే నూతన జీవితం వైపు ఇది మనలను ఎలా నడిపిస్తుంది? అని అడగండి.

## గుర్తుంచుకోవడానికి ఒక సులభమైన క్రమం:

జాగ్రత్తగా చదవండి → సందర్భాన్ని అర్థం చేసుకోండి → వాక్యాన్ని వివరించండి → అన్వయ ప్రశ్నలు అడగండి → సువార్త సంబంధాన్ని చూడండి.

మన లక్ష్యం ఒక బైబిల్ స్టడీ పాఠాన్ని పూర్తి చేయడం మాత్రమే కాదు. దేవుని వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకొని, ఆ సత్యం మన విశ్వాసం, ఆలోచనలు, స్వభావం, సంబంధాలు, రోజువారీ జీవితాన్ని ఎలా మార్చాలో ఇతరులు కూడా చూడడానికి సహాయం చేయడం.

లీడర్లమైన మనం కూడా దేవుని వాక్యానికి విద్యార్థులమే. అందుకే, “ఈ భాగం నుండి నేను ఇతరులకు ఏమి బోధించాలి?” అని అడగకముందు, “ఈ భాగం ద్వారా దేవుడు నాకు ఏమి నేర్పిస్తున్నాడు?” అని అడగడం మంచిది.

ఈ నోట్స్ మీకు దేవుని వాక్యాన్ని మరింత ఆస్వాదించడానికి, లోతుగా అర్థం చేసుకోవడానికి, ఆనందంతో అధ్యయనం చేసి ఇతరులతో పంచుకోవడానికి సహాయపడాలని ఆశిస్తూ ప్రార్థిస్తున్నాను.

బాబు గంటా

## బైబిల్ స్టడీ పాఠం 1 ఎఫెసీయులకు: నేపథ్యం, సంఘ ప్రారంభం, సవాళ్లు మరియు సమగ్ర అవలోకనం

పౌలు ఎఫెసీయులకు పత్రికను చెరసాలలో ఉన్నప్పుడు, సుమారు క్రీ.శ. 60–62 మధ్య రాశాడు. కొన్ని ఇతర పత్రికల మాదిరిగా ఒక ప్రత్యేక సంఘ సమస్యను మాత్రమే పరిష్కరించడం ఈ పత్రిక ముఖ్య ఉద్దేశం కాదు. క్రీస్తులో దేవుడు మనకొరకు ఏమి చేశాడు? ఆ సువార్త మన వ్యక్తిగత జీవితం, సంఘ జీవితం, కుటుంబం, సంబంధాలు, పని, ఆత్మీయ పోరాటాన్ని ఎలా మార్చాలి? అనే గొప్ప చిత్రాన్ని ఈ పత్రిక చూపిస్తుంది.

## ఎఫెసు సంఘం ఎలా ప్రారంభమైంది?

ఎఫెసులో సువార్త పని ఒక్కసారిగా ప్రారంభం కాలేదు. అపొల్లో అక్కడ బోధించాడు. అతనికి దేవుని మార్గం గురించి ఇంకా స్పష్టత అవసరమైనప్పుడు అకుల, ప్రిస్కిల్లలు అతనికి మరింత పూర్తిగా వివరించారు (అపొ. కార్యములు 18:24–26). తర్వాత పౌలు ఎఫెసుకు వచ్చి కొందరు శిష్యులను కలిశాడు. వారికి యేసుక్రీస్తు గురించి మరింత స్పష్టంగా బోధించాడు (అపొ. కార్యములు 19:1–7). తరువాత సమాజ మందిరంలో సుమారు మూడు నెలలు దేవుని రాజ్యం గురించి బోధించాడు. వ్యతిరేకత పెరిగినప్పుడు తురన్ను బోధశాలలో ప్రతిరోజూ బోధించడం కొనసాగించాడు. ఈ పరిచర్య సుమారు రెండు సంవత్సరాలు సాగింది. దాని ప్రభావం ఎఫెసుతో మాత్రమే ఆగలేదు; ఆసియా ప్రాంతమంతటికి ప్రభువు వాక్యం విస్తరించింది (అపొ. కార్యములు 19:8–10). అందుకే ఎఫెసు సంఘం ఒక చిన్న తాత్కాలిక పరిచర్య ఫలితం కాదు. దీర్ఘకాల బోధన, వ్యక్తిగత శిష్యత్వం, సువార్త ప్రచారం, దేవుని కార్యం ద్వారా ఈ సంఘం బలపడింది.

## సంఘంలో ఎలాంటి ప్రజలు ఉండేవారు?

ఎఫెసు ఒక ముఖ్యమైన వాణిజ్య, మత, సాంస్కృతిక నగరం. అక్కడ ప్రసిద్ధమైన అర్తెమి దేవత ఆలయం ఉండేది. విగ్రహారాధన, మాంత్రిక ఆచారాలు, అన్యమత ప్రభావం బలంగా ఉండేవి (అపొ. కార్యములు 19:19, 23–27). ఈ నేపథ్యం నుండి అనేక అన్యజనులు క్రీస్తును నమ్మారు. అదే సమయంలో యూదులూ సంఘంలో ఉన్నారు. అందుకే ఎఫెసీయుల పత్రికలో యూదులు మరియు అన్యజనులు క్రీస్తులో ఒకే శరీరంగా చేయబడ్డారు అనే విషయం చాలా ముఖ్యంగా కనిపిస్తుంది (2:11–22; 3:6).

సంఘంలో భిన్నమైన నేపథ్యాలు, సంస్కృతులు, ఆత్మీయ అనుభవాలు కలిగిన ప్రజలు ఉండేవారు. కొందరు యూద మత నేపథ్యం నుండి, మరికొందరు విగ్రహారాధన, మాంత్రిక ఆచారాల నేపథ్యం నుండి వచ్చారు. ఇప్పుడు వారందరూ ఒకే ప్రభువు, ఒకే విశ్వాసం, ఒకే శరీరంలో జీవించడం నేర్చుకోవాలి (4:4–6).

## ఎఫెసు సంఘం ఎదుర్కొన్న సవాళ్లు

ఈ సంఘం అనేక సవాళ్ల మధ్య జీవించింది.

**మొదట**, విగ్రహారాధనతో నిండిన సమాజంలో పరిశుద్ధంగా జీవించడం పెద్ద సవాలు. సువార్త కారణంగా కొందరు తమ మాంత్రిక గ్రంథాలను కాల్చివేశారు. అర్తెమి విగ్రహాల వ్యాపారం కూడా ప్రభావితమైంది. దీనివల్ల పెద్ద కలహం వచ్చింది (అపొ. కార్యములు 19:18–41).

**రెండవది**, యూదులు మరియు అన్యజనులు ఒకే సంఘంగా జీవించడం సులభం కాదు. పాత మత, జాతి, సాంస్కృతిక గోడలు ఉండేవి. అందుకే పౌలు క్రీస్తు "విభజన గోడను" కూల్చి వారిని ఒకే కొత్త ప్రజగా చేశాడని చెబుతున్నాడు (2:14–16).

**మూడవది**, తప్పుడు బోధల ప్రమాదం ఉంది. పౌలు తరువాత ఎఫెసు పెద్దలను హెచ్చరిస్తూ, తన తరువాత "క్రూరమైన తోడేళ్లు" మందలోకి రావచ్చని చెప్పాడు (అపొ. కార్యములు 20:28–31). అందుకే ఎఫెసీయులకు 4లో విశ్వాసులు "ప్రతి బోధగాలికి" కొట్టుకుపోకుండా పరిపక్వులవ్వాలని చెబుతున్నాడు.

**నాలుగవది**, పాత జీవనశైలిని విడిచి కొత్త జీవితం ధరించడం అవసరం. అబద్ధం, కోపం, దొంగతనం, చెడ్డ మాటలు, లైంగిక అపవిత్రత, లోభం - ఇవన్నీ విడిచి క్రీస్తువంటి జీవితం నేర్చుకోవాలి (4:17–32; 5:1–18).

**ఐదవది**, ఆత్మీయ పోరాటం నిజమైనది. అందుకే పౌలు చివరగా, "మన పోరాటం రక్తమాంసములతో కాదు" అని చెప్పి దేవుని సంపూర్ణ కవచాన్ని ధరించమంటున్నాడు (6:10–18).

ఈ నేపథ్యాన్ని గుర్తుంచుకుంటే ఎఫెసీయుల పత్రిక మరింత స్పష్టంగా కనిపిస్తుంది: క్రీస్తులో కొత్త గుర్తింపు → ఒక కొత్త ప్రజ → ఒక కొత్త జీవన విధానం → ఆత్మీయ పోరాటంలో స్థిరంగా నిలబడటం.

## ఎఫెసీయుల పత్రికను ఎలా గుర్తుంచుకోవాలి?

ఈ పత్రికను చాలా సులభంగా రెండు భాగాలుగా గుర్తుంచుకోవచ్చు:

1–3 అధ్యాయాలు - క్రీస్తులో దేవుడు మనకొరకు చేసినది.
4–6 అధ్యాయాలు - దేవుడు చేసిన దాని కారణంగా మనం ఎలా జీవించాలి. అంటే:

మొదట కృప – తరువాత విధేయత.
మొదట సువార్త – తరువాత సువార్తకు తగిన జీవితం.
మొదట మన కొత్త గుర్తింపు – తరువాత కొత్త నడవడి.

## 1వ అధ్యాయం – క్రీస్తులో ప్రతి ఆత్మీయ ఆశీర్వాదం

పౌలు మనతో కాకుండా దేవునితో ప్రారంభిస్తున్నాడు. జగత్తు పునాది వేయబడకముందే దేవుడు తన కృపాపూర్వక ఉద్దేశాన్ని కలిగియున్నాడు.
ఈ అధ్యాయంలో పదే పదే "క్రీస్తులో," "ఆయనయందు," "ఆయన ద్వారా" అనే భావాలు కనిపిస్తాయి.
క్రీస్తులో మనం ఎన్నుకోబడ్డాము, దేవుని కుటుంబంలోకి దత్తత పొందాము, ఆయన రక్తం ద్వారా విమోచన, పాపక్షమాపణ పొందాము, వారసత్వం పొందాము, పరిశుద్ధాత్మతో ముద్రించబడ్డాము.
తర్వాత పౌలు విశ్వాసులు దేవుణ్ణి మరింతగా తెలుసుకోవాలని ప్రార్థిస్తున్నాడు. ఆయన పిలుపులోని నిరీక్షణను, వారసత్వ మహిమను, విశ్వాసులయందు పనిచేసే దేవుని అపారమైన శక్తిని గ్రహించాలని కోరుతున్నాడు.
ముఖ్య వచనాలు: 1:3; 1:4–5; 1:7; 1:13–14; 1:18–23.
ఆలోచించండి: క్రీస్తులో దేవుడు నాకు ఇప్పటికే ఇచ్చిన ఆత్మీయ సంపదను నేను నిజంగా గ్రహిస్తున్నానా?

## 2వ అధ్యాయం - మరణం నుండి జీవానికి, కృప ద్వారా

క్రీస్తు లేకుండా మన పరిస్థితి ఏమిటో పౌలు స్పష్టంగా చెబుతున్నాడు:
"మీ అపరాధములచేతను పాపములచేతను మీరు చచ్చినవారై యుండగా..." (2:1).
మనకు కొంచెం మెరుగుదల అవసరం కాదు. మనకు జీవం అవసరం.
అప్పుడు అద్భుతమైన మలుపు వస్తుంది:
"అయినను దేవుడు..." (2:4).

దేవుడు తన గొప్ప ప్రేమ, కనికరం వల్ల క్రీస్తుతో మనలను జీవింపజేశాడు.
ఎలా రక్షించబడ్డాము? విశ్వాసం ద్వారా కృపచేత. క్రియల ద్వారా కాదు (2:8–9).
అయితే మంచి పనులకు స్థానం ఉంది. అవి రక్షణకు కారణం కాదు; రక్షణ యొక్క ఫలితం.
"మనము దేవుని పనితనమై... సత్క్రియలు చేయుటకై క్రీస్తుయేసునందు సృష్టింపబడినవారము" (2:10).
తర్వాత క్రీస్తు యూదులను, అన్యజనులను ఒకటిగా చేసి ఒక కొత్త ప్రజగా- సంఘంగా - నిర్మిస్తున్నాడని పౌలు చెబుతున్నాడు.
ముఖ్య వచనాలు: 2:1; 2:4–5; 2:8–10; 2:14; 2:19–22.
**ఆలోచించండి**: దేవుని కోసం నేను చేసిన వాటిమీద ఆధారపడుతున్నానా? లేక క్రీస్తులో దేవుడు నా కోసం చేసినదానిమీద ఆధారపడుతున్నానా?

## 3వ అధ్యాయం – క్రీస్తు మర్మం మరియు సంఘం

పౌలు ఇక్కడ “మర్మం” గురించి మాట్లాడుతున్నాడు. అంటే ఎప్పటికీ అర్థంకాని రహస్యం కాదు. గతంలో పూర్తిగా తెలియక, ఇప్పుడు దేవుడు వెల్లడించిన సత్యం.
ఆ మర్మం ఏమిటి? సువార్త ద్వారా యూదులు, అన్యజనులు సహవారసులు, ఒకే శరీర సభ్యులు, క్రీస్తులో ఒకే వాగ్దానంలో భాగస్థులు అయ్యారు (3:6).

సంఘం దేవుని తరువాత వచ్చిన ఆలోచన కాదు. అది దేవుని నిత్య ప్రణాళికలో భాగం. సంఘం ద్వారా దేవుని నానావిధమైన జ్ఞానం వెల్లడవుతోంది.
తర్వాత పౌలు విశ్వాసులు పరిశుద్ధాత్మ ద్వారా అంతరంగంలో బలపడాలని, ప్రేమలో వేరుపారి స్థిరపడాలని, క్రీస్తు ప్రేమ యొక్క వెడల్పు, పొడవు, ఎత్తు, లోతును గ్రహించాలని ప్రార్థిస్తున్నాడు.
ముఖ్య వచనాలు: 3:6; 3:10; 3:16–19; 3:20–21.
**ఆలోచించండి**: సంఘాన్ని కేవలం ఆదివారం సమావేశంగా చూస్తున్నానా? లేక దేవుని నిత్య ప్రణాళికలో భాగంగా చూస్తున్నానా?
ఇక్కడ ఒక ముఖ్యమైన మలుపు – “కాబట్టి...”
మొదటి మూడు అధ్యాయాలు ప్రధానంగా దేవుడు మనకొరకు ఏమి చేశాడో చెబుతున్నాయి.

## 4వ అధ్యాయం ఇలా ప్రారంభమవుతుంది:

“మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకొనవలెనని...” (4:1).
క్రమాన్ని గమనించండి:
మొదట కృప – తరువాత విధేయత.
మొదట మన కొత్త గుర్తింపు – తరువాత కొత్త జీవితం.
మొదట క్రీస్తు చేసినది – తరువాత మనం చేయవలసినది.

## 4వ అధ్యాయం – మీ పిలుపుకు తగినట్లుగా నడవండి

సువార్తకు తగిన జీవితం ఎలా కనిపిస్తుంది?
పౌలు వినయం, సాత్వికం, దీర్ఘశాంతం, ప్రేమ, ఐక్యతతో ప్రారంభిస్తున్నాడు.
క్రీస్తు తన సంఘానికి వివిధ వరాలను ఇచ్చాడు. ఎందుకు? దేవుని ప్రజలు పరిచర్యకు సిద్ధపరచబడి, ఆత్మీయంగా ఎదగడానికి.
లక్ష్యం ఏమిటి? విశ్వాసులు పరిపక్వులై, ప్రతి బోధగాలికి కొట్టుకుపోకుండా, ప్రేమతో సత్యం చెప్పుతూ క్రీస్తులో ఎదగాలి.
తర్వాత పౌలు క్రైస్తవ మార్పును ఇలా వివరిస్తున్నాడు:
పాత స్వభావాన్ని విడిచిపెట్టండి → మనస్సు నూతనీకరించబడనివ్వండి → కొత్త స్వభావాన్ని ధరించండి.
అబద్ధం స్థానంలో సత్యం.
దొంగతనం స్థానంలో నిజాయితీ పని, దాతృత్వం.
చెడ్డ మాటల స్థానంలో క్షేమాభివృద్ధి కలిగించే మాటలు.
చేదు, కోపం స్థానంలో దయ, కరుణ, క్షమ.
ముఖ్య వచనాలు: 4:1–3; 4:11–16; 4:22–24; 4:29; 4:32.
**ఆలోచించండి**: సువార్త నా మాటలను, కోపాన్ని, పనిని, సంబంధాలను, క్షమించే విధానాన్ని మార్చుతున్నదా?

## 5వ అధ్యాయం – ప్రేమలో, వెలుగులో, జ్ఞానంతో నడవండి

పౌలు క్రైస్తవ జీవితాన్ని మూడు అందమైన విధాలుగా వివరిస్తున్నాడు:
ప్రేమలో నడవండి.
వెలుగు పిల్లలుగా నడవండి.
జ్ఞానంతో నడవండి.

### మన ప్రేమకు ఆదర్శం ఎవరు?

"క్రీస్తు మనలను ప్రేమించి తనను తాను మనకొరకు అప్పగించాడు" (5:2).
తర్వాత పౌలు లైంగిక పరిశుద్ధత, మాటలు, కృతజ్ఞత, సమయ వినియోగం, దేవుని చిత్తాన్ని అర్థం చేసుకోవడం గురించి చెబుతున్నాడు.
ఆపై:
"ఆత్మతో నింపబడండి" (5:18).
ఆత్మతో నింపబడిన జీవితం ఆరాధన, కృతజ్ఞత, వినయం, సంబంధాలలో కనిపించాలి.
తర్వాత ఈ సువార్తను వివాహానికి అన్వయిస్తున్నాడు. భర్త, భార్యల సంబంధం క్రీస్తు మరియు సంఘం మధ్య ఉన్న సంబంధాన్ని ప్రతిబింబించాలి.
ముఖ్య వచనాలు: 5:1–2; 5:8–10; 5:15–18; 5:21; 5:25; 5:32–33.
ఆలోచించండి: క్రీస్తు ప్రేమ నిజంగా నన్ను నడిపిస్తే, నా కుటుంబం, సంబంధాలు, సమయ వినియోగం, నిర్ణయాలు ఎలా మారాలి?

## 6వ అధ్యాయం – ఇంటిలో, పనిలో, ఆత్మీయ పోరాటంలో క్రీస్తు

పౌలు సువార్తను రోజువారీ జీవితంలోకి తీసుకొస్తున్నాడు.
పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలి. తల్లిదండ్రులు పిల్లలను రెచ్చగొట్టకుండా ప్రభువు శిక్షణలో పెంచాలి.
పనివారు మనుష్యులను మెప్పించడానికి మాత్రమే కాకుండా ప్రభువుకు చేసినట్లుగా పని చేయాలి. యజమానులు, నాయకులు కూడా తమకు పరలోకంలో ఒక ప్రభువు ఉన్నాడని గుర్తుంచుకొని న్యాయంగా ప్రవర్తించాలి.
తర్వాత పౌలు ఆత్మీయ పోరాటాన్ని గుర్తుచేస్తున్నాడు:
"మన పోరాటం రక్తమాంసములతో కాదు" (6:12).
అందుకే మన స్వంత బలంపై కాకుండా ప్రభువులో బలపడాలి. దేవుడు ఇచ్చిన సంపూర్ణ కవచాన్ని ధరించాలి:
సత్యం, నీతి, సమాధాన సువార్త, విశ్వాసం, రక్షణ, దేవుని వాక్యం, ప్రార్థన.
ముఖ్య వచనాలు: 6:1–4; 6:5–9; 6:10–12; 6:14–18.
**ఆలోచించండి**: ఇంటిలో, పనిలో, ఆత్మీయ పోరాటంలో నేను నా స్వంత శక్తిపై ఆధారపడుతున్నానా? లేక ప్రభువులో బలపడుతున్నానా?

## ఎఫెసీయుల పత్రిక యొక్క ప్రధాన సందేశం

ఈ పత్రికను మూడు చిన్న మాటలతో గుర్తుంచుకోవచ్చు:
SIT – కూర్చోండి – అధ్యాయాలు 1–3
క్రీస్తులో మీ స్థానం తెలుసుకోండి. దేవుడు మీకొరకు ఏమి చేశాడో అర్థం చేసుకోండి.
WALK = నడవండి – అధ్యాయాలు 4–5
క్రీస్తుకు చెందినవారిగా మీ పిలుపుకు తగినట్లుగా జీవించండి.
STAND – నిలబడండి – అధ్యాయం 6
ఆత్మీయ పోరాటంలో దేవుడు ఇచ్చిన సంపూర్ణ కవచంతో స్థిరంగా నిలబడండి.
ఈ పత్రిక అంతటా కనిపించే గొప్ప సత్యం కృప.
మనం చనిపోయినవారము – దేవుడు మనలను జీవింపజేశాడు.
మనం దూరంగా ఉన్నాము – క్రీస్తు మనలను దగ్గరకు తీసుకొచ్చాడు.
మనం వేరుగా ఉన్నాము – క్రీస్తు మనలను ఒకటిగా చేశాడు.
మనకు నిరీక్షణ లేదు – ఇప్పుడు మనం క్రీస్తులో ఉన్నాము.

అందుకే ఎఫెసీయుల పత్రిక మనలను ఒక గొప్ప ప్రశ్న అడుగుతోంది:
క్రీస్తులో దేవుడు నా కోసం ఇంత గొప్ప కార్యం చేసి ఉంటే, అది నేను నన్ను చూసుకునే విధానాన్ని, సంఘాన్ని చూసే విధానాన్ని, నా కుటుంబాన్ని, సంబంధాలను, పనిని, రోజువారీ జీవితాన్ని ఎలా మార్చాలి?

# క్రీస్తులో ప్రతి ఆత్మీయ ఆశీర్వాదం

## సందర్భం

పౌలు ఈ పత్రిక రాస్తున్నప్పుడు ఎక్కడ ఉన్నాడో తెలుసా? చెరసాలలో. అతని చేతులకు సంకెళ్లు ఉన్నాయి. స్వేచ్ఛ లేదు. పరిస్థితులు సులభంగా లేవు. అయితే పౌలు తన పత్రికను ఎలా మొదలుపెట్టాడు?

"నేను చాలా కష్టాల్లో ఉన్నాను" అని మొదలుపెట్టాడా? లేదు. దేవుడు ఎవరు? దేవుడు మనకు ఏమి చేశాడు? అనే విషయాలతో మొదలుపెట్టాడు.

ఎఫెసీయులకు 1:3–14 చదివితే అది ఒక గొప్ప స్తుతిగీతంలా ఉంటుంది. ఒక మాట మళ్లీ మళ్లీ కనిపిస్తుంది. అది ఏమిటో గమనించారా?

"క్రీస్తులో... ఆయనలో... క్రీస్తు ద్వారా..."

ఎందుకు పౌలు ఈ మాటలను మళ్లీ మళ్లీ చెబుతున్నాడు? ఎందుకంటే మన గొప్ప ఆశీర్వాదాలు కేవలం డబ్బు, ఆరోగ్యం, మంచి ఉద్యోగం, మంచి ఇల్లు లేదా సౌకర్యవంతమైన జీవితం కాదు. మన గొప్ప ఆశీర్వాదాలు క్రీస్తులో ఉన్నాయి.

ఈ భాగంలో ఒక ఆశీర్వాదం మరొక ఆశీర్వాదానికి ఎలా దారితీస్తుందో చూడండి:

ఆశీర్వదించబడ్డాము → ఏర్పరచబడ్డాము → దేవుని కుటుంబంలో చేర్చబడ్డాము → విమోచించబడి క్షమించబడ్డాము → దేవుని గొప్ప ప్రణాళికలో భాగమయ్యాము → స్వాస్థ్యం పొందాము → పరిశుద్ధాత్మతో ముద్రించబడ్డాము.

## మొదట ఒక ప్రశ్న:

"దేవుడు నన్ను ఆశీర్వదించాడు" అని మీరు చెప్పినప్పుడు మీ మనసులోకి మొదట ఏమి వస్తుంది? డబ్బా? ఆరోగ్యమా? కుటుంబమా? ఉద్యోగమా? లేక క్రీస్తులో దేవుడు ఇప్పటికే ఇచ్చిన ఆత్మీయ ఆశీర్వాదాలా?

1. ప్రతి ఆత్మీయ ఆశీర్వాదంతో ఆశీర్వదించబడ్డాము - ఎఫెసీయులకు 1:1–3. పౌలు తనను ఎలా పరిచయం చేసుకుంటున్నాడు?

"దేవుని చిత్తమువలన క్రీస్తుయేసు అపొస్తలుడైన పౌలు" అని చెప్పి, విశ్వాసులకు కృప మరియు సమాధానం కలగాలని కోరుతున్నాడు. తర్వాత వెంటనే ఏమి చేస్తున్నాడు? దేవుని స్తుతిస్తున్నాడు.

ఎందుకు?

## క్రీస్తులో పరలోక సంబంధమైన ప్రతి ఆత్మీయ ఆశీర్వాదంతో దేవుడు మనలను ఆశీర్వదించాడు (1:3).

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించండి. పౌలు, "ఒకరోజు దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు" అని చెప్పడం లేదు. ఇప్పటికే ఆశీర్వదించాడు అని చెబుతున్నాడు.

అయితే ఆ ఆశీర్వాదాలు ఏమిటి?

తరువాతి వచనాలు వాటిని ఒక్కొక్కటిగా చూపిస్తున్నాయి. దేవుడు మనలను ఏర్పరచుకున్నాడు. తన కుటుంబంలో చేర్చుకున్నాడు. విమోచించాడు. క్షమించాడు. తన ప్రణాళికలో భాగం చేశాడు. స్వాస్థ్యం ఇచ్చాడు. పరిశుద్ధాత్మతో ముద్రించాడు.

అయితే మనం ఆలోచించాల్సిన ప్రశ్న ఏమిటి?

దేవుడు ఇప్పటికే ఇచ్చిన గొప్ప ఆశీర్వాదాలను గుర్తించకుండా, ఇంకా ఏమి ఇవ్వలేదో దాని గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నామా?

## 2. ఎందుకు ఆశీర్వదించబడ్డాము? - క్రీస్తులో ఏర్పరచబడ్డాము - ఎఫెసీయులకు 1:4

ఇప్పుడు పౌలు మనలను ఎంత వెనక్కి తీసుకువెళ్తున్నాడో చూడండి.

మన పుట్టుకకు ముందా? అవును.

మన తల్లిదండ్రుల పుట్టుకకు ముందా? అవును.

అంతకంటే ముందు? "లోకము పునాది వేయబడకమునుపే ఆయనలో మనలను ఏర్పరచుకొనెను" (1:4).

మనం దేవుని గురించి ఆలోచించకముందే, క్రీస్తులో దేవునికి మనకొరకు ఒక కృపగల ఉద్దేశం ఉంది.

కానీ దేవుడు మనలను ఎందుకు ఏర్పరచుకున్నాడు?

కేవలం పరలోకానికి వెళ్లడానికి మాత్రమేనా? కాదు.

ఆయన ఎదుట పరిశుద్ధులుగా, నిర్దోషులుగా ఉండటానికి.

అంటే దేవుడు మనలను రక్షించడమే కాదు; మనలను మార్చాలని కూడా కోరుతున్నాడు.

అయితే ఎన్నిక గురించి తెలుసుకున్నప్పుడు మనం గర్వపడాలా?

"నేను ఇతరులకంటే మంచివాడిని. అందుకే దేవుడు నన్ను ఎన్నుకున్నాడు" అని చెప్పగలమా? లేదు.

దేవుని ఎన్నిక మనలో వినయం, కృతజ్ఞత, ఆరాధన, పరిశుద్ధంగా జీవించాలనే కోరిక కలిగించాలి.
ఇప్పుడు మనల్ని మనం అడుగుదాం:
దేవుని ఉద్దేశం నన్ను పరిశుద్ధునిగా మార్చడమైతే, ఆయన మార్చాలని కోరుతున్న ఏదైనా విషయాన్ని నేను ఇంకా పట్టుకొని ఉన్నానా?

## 3. ఏర్పరచబడ్డాము — దేవుని కుటుంబంలోకి తీసుకోబడ్డాము — ఎఫెసీయులకు 1:5–6

దేవుడు మనలను ఏర్పరచుకొని అక్కడితో ఆగిపోయాడా? లేదు.
పౌలు ఇప్పుడు దత్తపుత్రత్వం గురించి చెబుతున్నాడు.
యేసుక్రీస్తు ద్వారా మనలను తన పిల్లలుగా స్వీకరించాలని దేవుడు ముందుగానే నిర్ణయించాడు (1:5).
ఇది ఎంత గొప్ప విషయం!
సువార్త అంటే కేవలం, "నీ పాపాలు క్షమించబడ్డాయి; ఇప్పుడు వెళ్లిపో" అని దేవుడు చెప్పడం కాదు.
ఒక న్యాయమూర్తి ఒక నేరస్థుడితో, "నీ శిక్ష రద్దయింది. నీవు వెళ్లవచ్చు" అంటే అది గొప్ప వార్తే.
కానీ అదే న్యాయమూర్తి, "ఇప్పుడు నీవు నా కుటుంబానికి చెందినవాడివి. నా ఇంటికి రా" అంటే?
అది ఇంకా గొప్ప విషయం కాదా?
క్రీస్తు ద్వారా దేవుడు మనలను క్షమించడమే కాదు, తన కుటుంబంలోకి తీసుకుంటాడు.
మనం దీనిని సంపాదించామా? లేదు.
మన మంచి పనుల వల్ల వచ్చిందా? లేదు. ఇది కృప.

**కాబట్టి ఒక ప్రశ్న:** నేను దేవుని అంగీకారాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్న బయటి వ్యక్తిలా జీవిస్తున్నానా? లేక క్రీస్తు ద్వారా దేవుని కుటుంబంలోకి తీసుకోబడిన బిడ్డగా జీవిస్తున్నానా?

## 4. పాపులమైన మనం దేవుని పిల్లలు ఎలా కాగలం? – ఎఫెసీయులకు 1:7–8

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న వస్తుంది.
దేవుడు పరిశుద్ధుడు. మనం పాపులం. అయితే పాపులమైన మనం పరిశుద్ధుడైన దేవుని కుటుంబంలోకి ఎలా రావచ్చు?
పౌలు మనలను ఎక్కడికి తీసుకువెళ్తున్నాడు? సిలువ దగ్గరకు.
"ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నది" (1:7).
విమోచన అంటే ఏమిటి? ఒక మూల్యం చెల్లించి బానిసత్వం నుండి విడిపించడం.
అయితే మనలను విడిపించడానికి చెల్లించిన మూల్యం ఏమిటి? క్రీస్తు రక్తం.
మనకు క్షమాపణ ఉచితంగా లభించింది. కానీ అది చౌకైనది కాదు. యేసు తన ప్రాణాన్ని ఇచ్చాడు.
ఇది మనలను రెండు తప్పుల నుండి కాపాడుతుంది.

**మొదటి తప్పు**: "నా పాపం అంత పెద్ద విషయం కాదు."

నిజమా? మన పాపం చిన్నదైతే క్రీస్తు ఎందుకు మరణించాల్సి వచ్చింది?

**రెండవ తప్పు:** "నా పాపం చాలా పెద్దది. దేవుడు నన్ను క్షమించలేడు."

అది కూడా నిజం కాదు. ఎందుకంటే క్రీస్తు బలి సరిపోతుంది.
కాబట్టి అపరాధభావం మనలను బాధిస్తున్నప్పుడు మనం ఎక్కడ చూడాలి?
మన వైఫల్యాల వైపా? లేక క్రీస్తు పూర్తి చేసిన కార్యం వైపా?

## 5. విమోచించబడ్డాము – దేవుని గొప్ప ప్రణాళికలో భాగమయ్యాము – ఎఫెసీయులకు 1:9–10

ఇప్పుడు పౌలు మన వ్యక్తిగత రక్షణ నుండి ఇంకా పెద్ద చిత్రానికి తీసుకువెళ్తున్నాడు. దేవుడు నన్ను రక్షించాడు. అది నిజం. కానీ దేవుని ప్రణాళిక నా రక్షణతో మాత్రమే ముగుస్తుందా? లేదు.
దేవుని గొప్ప ఉద్దేశం ఏమిటి? పరలోకమందున్న వాటినీ, భూమిమీద ఉన్న వాటినీ సమస్తాన్ని క్రీస్తులో ఏకం చేయడం (1:10).

చరిత్ర ఎటు వెళ్తుందో తెలియకుండా సాగడం లేదు. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. దేశాలు మారతాయి. సంస్కృతులు మారతాయి. మనుషుల ప్రణాళికలు విజయవంతమవుతాయి లేదా విఫలమవుతాయి. కానీ దేవుని ప్రణాళికకు ఒక కేంద్రం ఉంది.
**ఆ కేంద్రం యేసుక్రీస్తు.**
అయితే మనం ఏ ప్రశ్న అడగాలి? "నా ప్రణాళికల్లో యేసుకు కొంచెం స్థానం ఎలా ఇవ్వాలి?" అనా?
లేక,

"క్రీస్తు కేంద్రంగా ఉన్న దేవుని ప్రణాళికలో నా జీవితం ఎలా సరిపోవాలి?" అనా?

## 6. దేవుని ప్రణాళికలో భాగం – క్రీస్తులో స్వాస్థ్యం – ఎఫెసీయులకు 1:11–12

సమస్తం క్రీస్తు వైపు సాగుతుంటే, క్రీస్తుకు చెందిన మనకు ఏమి ఉంది?
స్వాస్థ్యం ఉంది.
దేవుడు తన చిత్తసంకల్పం ప్రకారం సమస్తాన్ని జరిగిస్తున్నాడని పౌలు చెబుతున్నాడు (1:11).
**దీని అర్థం ఏమిటి?** మన జీవితం దేవుని సార్వభౌమ ఉద్దేశానికి బయట లేదు.
ఈ రోజు మన పరిస్థితులు కష్టంగా ఉండవచ్చు. మనకు అన్నీ అర్థం కాకపోవచ్చు. కానీ మన ప్రస్తుత పరిస్థితులే మన కథ మొత్తం కాదు. దేవుని ప్రజల కోసం ఇంకా గొప్ప స్వాస్థ్యం ఎదురుచూస్తోంది.
ఇదంతా చివరికి దేనికోసం? "ఆయన మహిమకు కీర్తి కలుగుటకై" (1:12).
మన రక్షణ దేవుని కృపతో ప్రారంభమై, దేవుని మహిమకు దారితీస్తుంది.
కాబట్టి కష్టకాలంలో మనం మనకు ఏమి గుర్తుచేసుకోవాలి? "ఇది నా కథకు ముగింపు కాదు."

## 7. ఆ స్వాస్థ్యం నిజంగా మనకు లభిస్తుందని ఎలా తెలుసు? ఎఫెసీయులకు 1:13–14

ఇక్కడ మరో ప్రశ్న రావచ్చు. "దేవుడు స్వాస్థ్యం ఇస్తానని చెప్పాడు. కానీ అది నిజంగా నాకు లభిస్తుందని ఎలా తెలుసు?"
పౌలు దేనివైపు చూపిస్తున్నాడు? పరిశుద్ధాత్మ వైపు.
"మీరు విశ్వసించినప్పుడు వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మచేత ముద్రించబడితిరి" (1:13).

**ఇక్కడ ఉన్న క్రమాన్ని గమనించండి:**

సత్యవాక్యాన్ని విన్నారు → రక్షణ సువార్తను విన్నారు → విశ్వసించారు → పరిశుద్ధాత్మతో ముద్రించబడ్డారు.
"ముద్ర" అంటే ఏమిటి?
అది దేవునికి చెందినవారమనే గుర్తు. అంతేకాదు, పరిశుద్ధాత్మ మన రాబోయే స్వాస్థ్యానికి హామీ.
ఒక వస్తువు కొనేటప్పుడు ముందుగా కొంత అడ్వాన్స్ ఇస్తే, దాని అర్థం ఏమిటి? "నేను దీనిని తీసుకుంటాను; మిగిలినది కూడా చెల్లిస్తాను" అనే హామీ.
అలాగే విశ్వాసిలో ఉన్న పరిశుద్ధాత్మ, దేవుడు ప్రారంభించిన రక్షణ కార్యాన్ని పూర్తి చేస్తాడనే హామీ.

**అయితే సందేహం వచ్చినప్పుడు ఎక్కడ చూడాలి?**
"నేను బలంగా ఉన్నానా? నా భావాలు ఎలా ఉన్నాయి?" అని మాత్రమే చూడాలా?
లేక దేవుని వాగ్దానం మరియు పరిశుద్ధాత్మ కార్యం వైపు చూడాలా?

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు ఒకసారి వెనక్కి చూసుకుందాం.
పౌలు సంబంధం లేని ఏడు విషయాలు చెప్పాడా? లేదు.
ఒకటి మరొకదానికి దారితీస్తోంది:
దేవుడు మనలను ఆశీర్వదించాడు
→ క్రీస్తులో ఏర్పరచుకున్నాడు
→ తన కుటుంబంలోకి తీసుకున్నాడు
→ క్రీస్తు రక్తం ద్వారా విమోచన, క్షమాపణ ఇచ్చాడు
→ తన గొప్ప ప్రణాళికలో భాగం చేశాడు
→ క్రీస్తులో స్వాస్థ్యం ఇచ్చాడు
→ ఆ స్వాస్థ్యానికి హామీగా పరిశుద్ధాత్మతో ముద్రించాడు.

## సులభంగా గుర్తుంచుకోవాలంటే:

ఆశీర్వాదం → ఎన్నిక → దత్తపుత్రత్వం → విమోచన → దేవుని ప్రణాళిక → స్వాస్థ్యం → పరిశుద్ధాత్మ ముద్ర

వీటన్నిటినీ కలిపే మాట ఏమిటి? "క్రీస్తులో."

## అన్వయం

ఇప్పుడు మన జీవితానికి వద్దాం. "దేవుడు నన్ను ఆశీర్వదించాడు" అని చెప్పినప్పుడు మనం సాధారణంగా దేని గురించి మాట్లాడతాం?

మంచి ఆరోగ్యం? మంచి ఇల్లు? పిల్లల విజయం? ఉద్యోగం? డబ్బు? ప్రయాణం? కష్టాల నుండి విడుదల?
ఇవన్నీ దేవునికి కృతజ్ఞత చెప్పవలసిన వరాలే. కానీ పౌలు ఎక్కడ మొదలుపెడుతున్నాడు?

క్రీస్తులో మనకు ఉన్న ఆత్మీయ సంపద దగ్గర.

కాబట్టి మనం మనకు ఇలా గుర్తుచేసుకోవచ్చు:
క్రీస్తులో నేను ఏర్పరచబడ్డాను. క్రీస్తులో దేవుని కుటుంబంలో చేర్చబడ్డాను. క్రీస్తులో నాకు విమోచన ఉంది. క్రీస్తులో నాకు క్షమాపణ ఉంది. క్రీస్తులో నాకు స్వాస్థ్యం ఉంది. క్రీస్తులో నేను పరిశుద్ధాత్మతో ముద్రించబడ్డాను.

అయితే పరిస్థితులు కష్టంగా ఉన్నప్పుడు కూడా, "దేవుడు నన్ను ఆశీర్వదించాడు" అని చెప్పగలమా? పౌలు చెప్పగలిగాడు.
ఎక్కడి నుండి? చెరసాల నుండి!
అతను తన పరిస్థితులను చూసి దేవుని స్తుతించలేదు. క్రీస్తులో తనకు ఉన్న మారని సంపదను చూసి దేవుని స్తుతించాడు.

## సువార్త సంబంధం

ఈ ఆశీర్వాదాలన్నింటి మధ్యలో ఎవరు ఉన్నారు? యేసుక్రీస్తు.

మన సమస్య ఏమిటి? మనం పాపులం.
మనలను మనమే విమోచించుకోగలమా? లేదు.
మన మంచి పనులతో పాపాన్ని తొలగించగలమా? లేదు.
మన ప్రయత్నాలతో దేవుని కుటుంబంలో స్థానం సంపాదించగలమా? లేదు.
అయితే మనకు నిరీక్షణ ఎక్కడ ఉంది? క్రీస్తులో.

"ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నది" (1:7).
క్రీస్తు ద్వారా దేవుడు మనలను క్షమించడమే కాదు. తన కుటుంబంలోకి తీసుకున్నాడు. స్వాస్థ్యం ఇచ్చాడు. తన ఆత్మతో ముద్రించాడు.

**ఈ భాగంలో త్రియేక దేవుని కార్యాన్ని కూడా గమనించండి:**

**తండ్రి** – మన రక్షణను ప్రణాళిక చేశాడు.
**కుమారుడు** – తన రక్తం ద్వారా విమోచనను సాధించాడు.
**పరిశుద్ధాత్మ** – మనలను ముద్రించి, రాబోయే స్వాస్థ్యానికి హామీగా ఉన్నాడు.

ఇదంతా ఎందుకు? "ఆయన మహిమకు కీర్తి కలుగుటకై."

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు

1. ఎఫెసీయులకు 1:1–14 చదవండి. "క్రీస్తులో," "ఆయనలో," "క్రీస్తు ద్వారా" అనే మాటలు ఎందుకు మళ్లీ మళ్లీ వస్తున్నాయి? మన ఆత్మీయ ఆశీర్వాదాలన్నిటికీ కేంద్రం ఎవరు?
2. 1:3–4 ప్రకారం దేవుడు మనలను ఎలా ఆశీర్వదించాడు? మనలను ఎందుకు ఏర్పరచుకున్నాడు? దేవుని ఉద్దేశం మనలను పరిశుద్ధులుగా చేయడమైతే, అది మన జీవన విధానాన్ని ఎలా మార్చాలి?
3. 1:5–6లో దత్తపుత్రత్వం గురించి ఏమి నేర్చుకుంటాం? మనం దేవుని అంగీకారాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తున్నామా? లేక కృపచేత స్వీకరించబడిన పిల్లలుగా జీవిస్తున్నామా?
4. 1:7–8 ప్రకారం విమోచన, క్షమాపణ ఎలా లభించాయి? సిలువ మన పాపం ఎంత తీవ్రమైనదో, దేవుని కృప ఎంత గొప్పదో ఎలా చూపిస్తుంది?
5. 1:9–10 ప్రకారం దేవుని గొప్ప ప్రణాళిక ఏమిటి? క్రీస్తు మన జీవితంలో ఒక భాగమా? లేక మన జీవితమంతటికీ కేంద్రమా?
6. 1:11–12 ప్రకారం మనకు ఏ స్వాస్థ్యం ఉంది? దేవుడు తన ఉద్దేశం ప్రకారం కార్యం చేస్తున్నాడనే సత్యం కష్టకాలంలో మనకు ఎలాంటి నిరీక్షణ ఇస్తుంది?
7. 1:13–14లో క్రమాన్ని గమనించండి: వారు ఏమి విన్నారు? ఏమి చేశారు? తరువాత ఏమి జరిగింది? పరిశుద్ధాత్మతో

ముద్రించబడటం, ఆయన మన స్వాస్థ్యానికి హామీగా ఉండటం అంటే ఏమిటి?

8. ఈ భాగం మొత్తాన్ని బట్టి నిజంగా "ఆశీర్వదించబడటం" అంటే ఏమిటి? క్రీస్తులో మనకు ఇప్పటికే ఉన్న ఆత్మీయ సంపద మన ప్రార్థన, ఆరాధన, ఆలోచన మరియు రోజువారీ జీవితాన్ని ఎలా మార్చాలి?

## నాయకులకు సహాయం – ప్రశ్నలకు ముఖ్యమైన జవాబులు

గమనిక: ఈ జవాబులను వెంటనే చెప్పకండి. మొదట అందరూ వాక్యాన్ని చదవనివ్వండి. "ఈ వచనంలో మీకు ఏమి కనిపిస్తోంది?" "ఎందుకు?" "దీని అర్థం ఏమై ఉండవచ్చు?" అని అడగండి. వారు తమ మాటల్లో చెప్పేలా ప్రోత్సహించండి. అవసరమైనప్పుడు మాత్రమే ఈ పాయింట్లతో సహాయం చేయండి.

### 1. "క్రీస్తులో" – కేంద్రం ఎవరు?

ప్రతి ఆత్మీయ ఆశీర్వాదానికి క్రీస్తే కేంద్రం. మన మంచితనం లేదా మన సాధన వల్ల ఇవి రాలేదు. క్రీస్తులో మనకు లభించాయి. మరింతగా అడగండి: "ఈ భాగం నుండి క్రీస్తును తీసివేస్తే, ఈ ఆశీర్వాదాలలో ఏదైనా మనకు మిగులుతుందా?"

### 2. దేవుడు మనలను ఎలా ఆశీర్వదించాడు? ఎందుకు ఏర్పరచుకున్నాడు?

పౌలు ప్రధానంగా భౌతిక సంపద గురించి కాదు. క్రీస్తులోని ఆత్మీయ ఆశీర్వాదాల గురించి మాట్లాడుతున్నాడు.
దేవుడు మనలను పరిశుద్ధులుగా, నిర్దోషులుగా ఉండటానికి ఏర్పరచుకున్నాడు. కాబట్టి ఎన్నిక గర్వానికి కాదు; వినయం, కృతజ్ఞత, ఆరాధన, పరిశుద్ధ జీవితానికి దారితీయాలి.
**ఇంకా అడగండి:**
"దేవుడు మనలను మార్చాలనే ఉద్దేశంతో ఏర్పరచుకున్నట్లయితే, మన జీవితంలో ఎలాంటి మార్పు కనిపించాలి?"

### 3. దత్తపుత్రత్వం అంటే ఏమిటి?

దేవుడు మనలను క్షమించడమే కాదు. క్రీస్తు ద్వారా తన కుటుంబంలోకి చేర్చుకున్నాడు.
కాబట్టి దేవుని అంగీకారాన్ని సంపాదించడానికి ప్రయత్నించే బయటి వ్యక్తులుగా కాక, కృపచేత స్వీకరించబడిన పిల్లలుగా ఆయన దగ్గరకు వస్తాము.
**ఇంకా అడగండి:**
"క్షమించబడిన నేరస్థుడిగా ఉండటానికి, కుటుంబంలోకి స్వీకరించబడిన బిడ్డగా ఉండటానికి తేడా ఏమిటి?"

### 4. విమోచన మరియు క్షమాపణ ఎలా సాధ్యమయ్యాయి? క్రీస్తు రక్తం ద్వారా.

సిలువ రెండు విషయాలు చూపిస్తుంది: మన పాపం చాలా తీవ్రమైనది. దేవుని కృప చాలా గొప్పది.
క్షమాపణ మనకు ఉచితం. కానీ దాని మూల్యం క్రీస్తు తన ప్రాణంతో చెల్లించాడు.
**ఇంకా అడగండి:**
"సిలువ పాపాన్ని తేలికగా తీసుకోకుండా ఎలా చేస్తుంది? అదే సమయంలో నిరాశ చెందకుండా ఎలా కాపాడుతుంది?"

### 5. దేవుని గొప్ప ప్రణాళిక ఏమిటి? సమస్తాన్ని క్రీస్తులో ఏకం చేయడం.

కాబట్టి క్రీస్తును మన ప్రణాళికల్లో ఒక చిన్న భాగంగా పెట్టుకోవడం కాదు. క్రీస్తు కేంద్రంగా ఉన్న దేవుని ప్రణాళికకు మన జీవితాన్ని సరిపరచుకోవాలి.
**ఇంకా అడగండి:** "క్రీస్తు నా జీవితంలో ఒక భాగమా? లేక నా జీవితమంతటికీ కేంద్రమా?"

### 6. మనకు ఉన్న నిరీక్షణ ఏమిటి?

క్రీస్తులో మనకు స్వాస్థ్యం ఉంది. దేవుడు తన ఉద్దేశం ప్రకారం కార్యం చేస్తున్నాడు.
కాబట్టి ఈ రోజు మన పరిస్థితులు ఎంత కష్టంగా ఉన్నా, అవే మన కథకు ముగింపు కాదు.
మరింతగా అడగండి:
"ప్రస్తుత పరిస్థితులే మన కథ మొత్తం కాదని తెలుసుకోవడం కష్టకాలంలో మన దృక్పథాన్ని ఎలా మార్చగలదు?"

### 7. పరిశుద్ధాత్మతో ముద్రించబడటం అంటే ఏమిటి?

**క్రమాన్ని మళ్లీ గమనించండి:** సువార్త విన్నారు → విశ్వసించారు → పరిశుద్ధాత్మతో ముద్రించబడ్డారు.

పరిశుద్ధాత్మ దేవునికి చెందినవారమనే గుర్తు. అంతేకాదు, రాబోయే స్వాస్థ్యానికి దేవుడు ఇచ్చిన హామీ.
**ఇంకా అడగండి:**
"మన రక్షణ గురించి నిశ్చయానికి ఆధారం మన భావాలా? లేక దేవుని వాగ్దానం మరియు పరిశుద్ధాత్మ కార్యమా?"

## 8. నిజంగా ఆశీర్వదించబడటం అంటే ఏమిటి?

ఆశీర్వాదం అంటే కేవలం ఆరోగ్యం, డబ్బు, విజయం లేదా సౌకర్యం కాదు.
మన గొప్ప సంపద క్రీస్తులో దేవుడు మనకు ఇచ్చినదే.
మరింతగా అడగండి:
"ఈ ఆత్మీయ ఆశీర్వాదాలలో మీరు ఎక్కువగా మరిచిపోయేది ఏది? దానిని ప్రతిరోజూ గుర్తుంచుకుంటే మీ ప్రార్థన, ఆలోచన, ఆరాధన లేదా జీవితం ఎలా మారుతుంది?"
నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

## చర్చ చివరికి ఈ ఒక్క సత్యం స్పష్టంగా ఉండేలా చూడండి:

ప్రతి ఆత్మీయ ఆశీర్వాదం మనకు క్రీస్తులోనే లభిస్తుంది.
పౌలు ఎక్కడ ఉన్నాడు? చెరసాలలో.
అయినా అతను దేవుని స్తుతిస్తున్నాడు. ఎందుకు?
అతని పరిస్థితులు మంచిగా ఉన్నందుకా? కాదు.
పరిస్థితులు మారినా, క్రీస్తులో అతనికి ఉన్న సంపద మారలేదు.
అదే మనకు కూడా నిజం.

## చివరిగా ఆలోచించాల్సిన ప్రశ్న

క్రీస్తులో ఇన్ని ఆత్మీయ సంపదలు ఇప్పటికే మనకు ఉంటే, ఏమీ లేని ఆత్మీయ పేదలవలె జీవిస్తున్నామా? లేక తన కుమారునిలో దేవుడు మనలను ఎంత గొప్పగా ఆశీర్వదించాడో తెలుసుకొని, కృతజ్ఞతతో, నమ్మకంతో, ఆరాధనతో జీవిస్తున్నామా?

బైబిల్ అధ్యయన పాఠం 3 - ఎఫెసీయులకు 1:15-23

# దేవునిని మరింతగా తెలుసుకోవడానికి ఒక ప్రార్థన

## సందర్భం

ఎఫెసీయులకు 1:3-14లో పౌలు ఏమి చెప్పాడో గుర్తుందా?
విశ్వాసులు క్రీస్తులో ఇప్పటికే ఎంతో గొప్పగా ఆశీర్వదించబడ్డారు. వారు ఏర్పరచబడ్డారు. దేవుని కుటుంబంలోకి తీసుకోబడ్డారు. విమోచించబడ్డారు. క్షమించబడ్డారు. స్వాస్థ్యం పొందారు. పరిశుద్ధాత్మతో ముద్రించబడ్డారు.
ఇప్పుడు 15వ వచనం నుండి పౌలు ఏమి చేస్తున్నాడు? వారి కోసం ప్రార్థిస్తున్నాడు.
అయితే అతను దేనికోసం ప్రార్థిస్తున్నాడో గమనించండి.
“ప్రభువా, వారికి ఇంకా ఎక్కువ డబ్బు ఇవ్వు” అని ప్రార్థిస్తున్నాడా? లేదు.
“వారి సమస్యలన్నీ తీసివేయి” అంటున్నాడా? లేదు.
“వారి పరిస్థితులన్నీ సులభంగా చేయి” అంటున్నాడా? లేదు.
అయితే ఏమి కోరుతున్నాడు?
దేవుడు ఇప్పటికే వారికి క్రీస్తులో ఇచ్చినదానిని వారు మరింత లోతుగా తెలుసుకోవాలని.
మన దగ్గర ఎంతో విలువైనది ఉండి కూడా దాని విలువ తెలియకుండా ఉండవచ్చు కదా? అలాగే క్రీస్తులో మనకు గొప్ప ఆత్మీయ సంపద ఉన్నా, దాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా జీవించవచ్చు.
అందుకే పౌలు ప్రార్థనను ఒక చిన్న వాక్యంలో ఇలా చెప్పవచ్చు: “ప్రభువా, వారి హృదయ నేత్రాలను తెరువు.”

**ఈ భాగంలో ఆలోచన ఎలా ముందుకు సాగుతుందో చూడండి:**
విశ్వాసం & ప్రేమ → దేవునిని తెలుసుకోవడం → తెరవబడిన కళ్ళు → నిరీక్షణ → స్వాస్థ్యం → శక్తి → లేచిన క్రీస్తు → పరిపాలిస్తున్న క్రీస్తు → సంఘానికి శిరస్సైన క్రీస్తు

## 1. క్రీస్తుపై విశ్వాసం - దేవుని ప్రజలపట్ల ప్రేమ  ఎఫెసీయులకు 1:15-16

పౌలు ఎఫెసీయుల గురించి ఏమి విన్నాడు?
**రెండు విషయాలు:** ప్రభువైన యేసుపై విశ్వాసం.  పరిశుద్ధులందరిపట్ల ప్రేమ
ఇవి విని పౌలు దేవునికి కృతజ్ఞతలు చెబుతున్నాడు.
ఇక్కడ ఒక నిజమైన క్రైస్తవ జీవితానికి రెండు ముఖ్యమైన గుర్తులు కనిపిస్తున్నాయా?
క్రీస్తుపై విశ్వాసం → దేవుని ప్రజలపట్ల ప్రేమ.
విశ్వాసం అంటే కేవలం యేసు గురించి కొన్ని విషయాలు తెలుసుకోవడం కాదు. “యేసు నిజమే” అని చెప్పడం మాత్రమే కాదు.
నిజమైన విశ్వాసం మన జీవితంలో, ముఖ్యంగా మన సంబంధాల్లో కనిపించాలి.
అయితే ఒక ప్రశ్న:
“నేను యేసును ప్రేమిస్తున్నాను” అని చెబుతూ, ఆయన ప్రజలను నిర్లక్ష్యం చేయగలనా?
మరొక ప్రశ్న:
ఇతరులు మన క్రైస్తవ జీవితాన్ని చూసినప్పుడు ఏమి గమనిస్తారు?
మన బైబిల్ జ్ఞానమా?
మన ప్రార్థనల పొడవా?
మన కార్యక్రమాలా?
లేక ఇతరులపట్ల ప్రేమలో కనిపించే మన విశ్వాసమా?

## 2. విశ్వాసం, ప్రేమ ఉన్నా - ఇంకా దేవునిని తెలుసుకోవాలి  ఎఫెసీయులకు 1:17

ఎఫెసీయులలో విశ్వాసం ఉంది. ప్రేమ ఉంది.
అయితే పౌలు, “చాలు. ఇప్పుడు మీరు పూర్తిగా ఎదిగారు” అని అన్నాడా?  లేదు.
అతను ఏమి ప్రార్థించాడు? వారు దేవునిని మరింతగా తెలుసుకోవాలని.
ఇక్కడ ఒక ముఖ్యమైన తేడా ఉంది.

దేవుని గురించి తెలుసుకోవడం ఒకటి. దేవునిని తెలుసుకోవడం ఇంకొకటి.
ఒక వ్యక్తి పేరు, పని, కుటుంబం, ఊరు గురించి చాలా తెలుసు అనుకుందాం. దానివల్ల ఆ వ్యక్తిని మనం నిజంగా దగ్గరగా తెలుసుకున్నామా? తప్పనిసరిగా కాదు.
అలాగే మనకు చాలా బైబిల్ కథలు తెలిసి ఉండవచ్చు. చాలా వచనాలు కంఠస్థం చేసి ఉండవచ్చు. చాలా సిద్ధాంతాలు తెలిసి ఉండవచ్చు.
అయితే ప్రశ్న ఏమిటి? ఆ జ్ఞానం మనలను దేవునికి దగ్గర చేస్తున్నదా?
బైబిల్ జ్ఞానం చాలా అవసరం. కానీ అది మనలను ఎక్కడికి తీసుకెళ్లాలి?
దేవునిని నమ్మడానికి. ప్రేమించడానికి. విధేయత చూపడానికి. ఆరాధించడానికి. అయితే మనం మనలను మనం అడుగుదాం:
నా బైబిల్ అధ్యయనం నాకు సమాచారం మాత్రమే పెంచుతోందా? లేక దేవునిని మరింతగా తెలుసుకునేలా చేస్తున్నదా?

## 3. దేవునిని మరింతగా తెలుసుకోవాలంటే – హృదయ నేత్రాలు తెరవబడాలి ఎఫెసీయులకు 1:18

పౌలు ఒక ఆసక్తికరమైన మాట ఉపయోగిస్తున్నాడు.
వారి "హృదయ నేత్రాలు వెలిగింపబడాలని" ప్రార్థిస్తున్నాడు.
అయితే వారు విశ్వాసులు కాదా? అవును.
మరి వారికి ఇంకా కళ్ళు ఎందుకు తెరవాలి?
ఎందుకంటే దేవుని సత్యం చదవడం ఒకటి. దాని గొప్పతనాన్ని నిజంగా గ్రహించడం మరోటి.
మన భౌతిక కళ్ళతో అక్షరాలు చదవగలం. కానీ ఆత్మీయ సత్యాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి దేవుని సహాయం అవసరం.
పౌలు ముఖ్యంగా మూడు విషయాలు వారు తెలుసుకోవాలని కోరుతున్నాడు:
నిరీక్షణ → స్వాస్థ్యం → శక్తి
ఇక్కడ ఒక ముఖ్యమైన ఆలోచన ఉంది:
కొన్నిసార్లు మన సమస్య ఏమిటంటే దేవుడు మనకు తక్కువ ఇచ్చాడని కాదు.
ఆయన ఇప్పటికే ఇచ్చినదాన్ని మనం తక్కువగా అర్థం చేసుకున్నాం.
అందుకే బైబిల్ చదివేటప్పుడు ఇలా ప్రార్థించవచ్చు:
"ప్రభువా, నా హృదయ నేత్రాలను తెరువు. నీ వాక్యాన్ని చదవడమే కాదు, దాన్ని అర్థం చేసుకొని దాని ప్రకారం జీవించడానికి సహాయం చేయి."

## 4. తెరవబడిన కళ్ళతో – మన నిరీక్షణను చూడాలి ఎఫెసీయులకు 1:18

మొదట పౌలు వారు ఏమి తెలుసుకోవాలని కోరుతున్నాడు?
"ఆయన పిలుపువలన కలిగిన నిరీక్షణ."
బైబిల్‌లో "నిరీక్షణ" అంటే ఏమిటి?
"ఏదో మంచి జరుగుతుందేమో" అనే ఆశా? కాదు.
బైబిల్ నిరీక్షణ దేవుని స్వభావం మరియు ఆయన వాగ్దానాలపై ఆధారపడిన నమ్మకం.
దేవుడు మనలను పాపం నుండి క్రీస్తులోకి పిలిచాడు. ఇప్పుడు తన ప్రజలను మహిమగల భవిష్యత్తు వైపు తీసుకెళ్తున్నాడు.
అయితే విశ్వాసికి కష్టాలు ఉండవా?
ఉంటాయి.
అనారోగ్యం రావచ్చు. ఆర్థిక సమస్యలు రావచ్చు. కుటుంబ సమస్యలు రావచ్చు. మనుషులు నిరాశపరచవచ్చు. మన ప్రణాళికలు విఫలమవచ్చు.

**కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి:**
ఈ రోజు మనం ఎదుర్కొంటున్న కష్టం మన కథకు చివరి అధ్యాయం కాదు.
దేవుని పిలుపు మారదు. ఆయన వాగ్దానం మారదు. ఆయన సిద్ధం చేసిన భవిష్యత్తు మారదు.
అయితే కష్టాలు వచ్చినప్పుడు మన ఆలోచనలను ఏది నియంత్రిస్తోంది?
మన ముందు కనిపిస్తున్న సమస్యా? లేక దేవుడు మనలను పిలిచిన నిరీక్షణా?

## 5. తెరవబడిన కళ్ళతో – మన స్వాస్థ్యాన్ని చూడాలి ఎఫెసీయులకు 1:18

తర్వాత పౌలు ఏమి చెబుతున్నాడు?

“పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యముయొక్క మహిమైశ్వర్యమెట్టిదో” తెలుసుకోవాలని కోరుతున్నాడు.
నిరీక్షణ మనలను భవిష్యత్తు వైపు చూడమంటుంది. ఆ భవిష్యత్తులో దేవుడు తన ప్రజల కోసం గొప్ప స్వాస్థ్యం ఉంచాడు.

కానీ మనం సాధారణంగా మన సంపదను ఎలా కొలుస్తాం?
ఎంత డబ్బు ఉంది? ఎంత ఆస్తి ఉంది? ఆరోగ్యం ఎలా ఉంది? ఎంత హోదా ఉంది? ఇతరులు మన గురించి ఏమనుకుంటున్నారు?

పౌలు మనలను మరో ప్రశ్న అడగమంటున్నాడు:
“క్రీస్తులో నాకు ఏమి ఉంది?” ఇల్లు పోవచ్చు. డబ్బు పోవచ్చు. ఆరోగ్యం మారవచ్చు. ఉద్యోగం పోవచ్చు. హోదా పోవచ్చు. మనుషుల గుర్తింపు కూడా పోవచ్చు.
కానీ దేవుడు తన ప్రజలకు వాగ్దానం చేసినది పోదు.

అయితే మనం మనల్ని మనం అడుగుదాం: నేను ఎంత ధనవంతుడినో దేనితో కొలుస్తున్నాను? నా దగ్గర ఈ రోజు కనిపించే వాటితోనా? లేక క్రీస్తులో నాకు ఉన్నదానితోనా?

## 6. తెరవబడిన కళ్ళతో – దేవుని అపారమైన శక్తిని చూడాలి  ఎఫెసీయులకు 1:19–20

ఇప్పుడు పౌలు మూడవ విషయానికి వస్తున్నాడు:  నిరీక్షణ → స్వాస్థ్యం → శక్తి.
విశ్వసించే మనలో దేవుని శక్తి ఎంత గొప్పదో తెలుసుకోవాలని అతను కోరుతున్నాడు.
అయితే ఆ శక్తి ఎంత గొప్పది?
పౌలు ఒక ఉదాహరణ ఇస్తున్నాడు.
క్రీస్తు పునరుత్థానం. యేసు నిజంగా మరణించాడు. మరణం కంటే ఆశలేని స్థితి ఇంకేముంటుంది?
అయినా దేవుడు ఏమి చేశాడు?  ఆయనను మృతులలోనుండి లేపాడు.
అదే శక్తి విశ్వాసులలో పని చేస్తుందని పౌలు చెబుతున్నాడు.
మన బలహీనతలను చూసినప్పుడు మనం సాధారణంగా ఏమి అడుగుతాం?
“నేను ఏమి చేయగలను?” “నేను మారగలనా?” “ఈ అలవాటు ఎప్పటికైనా పోతుందా?” “ఈ పరిచర్యలో ఏమైనా ఫలితం వస్తుందా?” “ఈ పరిస్థితి మారుతుందా?”

ఈ ప్రశ్నలతో పాటు ఇంకొక ప్రశ్న కూడా అడగాలి:
“దేవుడు తన శక్తితో ఏమి చేయగలడు?” అయితే ఇక్కడ జాగ్రత్త అవసరం.

దేవుని శక్తి మనలో పని చేస్తోంది అంటే: ప్రతి సమస్య వెంటనే పోతుందని కాదు. ప్రతి వ్యాధి తప్పకుండా నయమవుతుందని కాదు. మనకు కావలసినంత డబ్బు వస్తుందని కాదు. అయితే ఆ శక్తి ఏమి చేస్తుంది? నమ్మడానికి బలం ఇస్తుంది. సహించడానికి బలం ఇస్తుంది. విధేయత చూపడానికి బలం ఇస్తుంది. మారడానికి బలం ఇస్తుంది.సేవ చేయడానికి బలం ఇస్తుంది. విశ్వాసంగా నిలబడడానికి బలం ఇస్తుంది.

## 7. పునరుత్థాన శక్తి – ఇప్పుడు పరిపాలిస్తున్న క్రీస్తు ఎఫెసీయులకు 1:20–21

దేవుడు యేసును మృతులలోనుండి లేపి అక్కడితో ఆగిపోయాడా? లేదు.
ఆయనను పరలోకమందు తన కుడిపార్శ్వమున కూర్చుండబెట్టాడు.
అంటే ఇప్పుడు క్రీస్తు ఎక్కడ ఉన్నాడు? ప్రతి అధికారానికి, శక్తికి, ఆధిపత్యానికి పైగా.

**ఈ క్రమాన్ని గమనించండి:**

→  క్రీస్తు మరణించాడు → దేవుడు ఆయనను లేపాడు → ఆయనను హెచ్చించాడు → ఇప్పుడు ఆయన పరిపాలిస్తున్నాడు.

మనుషుల ప్రభుత్వాలు మారుతాయి. రాజ్యాలు వస్తాయి, పోతాయి. నాయకులు కొంతకాలం ఉంటారు.
ఆత్మీయ శక్తులు మనుషులను భయపెట్టవచ్చు. కానీ క్రీస్తు గురించి పౌలు ఏమి చెబుతున్నాడు?
ఆయన వాటన్నిటికంటే పైగా ఉన్నాడు.
యేసు సింహాసనం కోసం ఇతర శక్తులతో పోటీ పడుతున్నాడా? లేదు.  ఆయన ఇప్పటికే పరిపాలిస్తున్నాడు.

**అయితే మనం ఒక ప్రశ్న అడగాలి:** క్రీస్తు అన్నిటికంటే పైగా ఉన్నాడని నమ్ముతున్నాం కదా? అయితే ఏదో భౌతిక లేదా ఆత్మీయ శక్తి ఆయనకంటే గొప్పదన్నట్లుగా ఎందుకు భయపడాలి?

## 8. పరిపాలిస్తున్న క్రీస్తు – సంఘానికి శిరస్సు ఎఫెసీయులకు 1:22-23

ఇప్పుడు పౌలు క్రీస్తు అధికారాన్ని సంఘంతో కలుపుతున్నాడు. దేవుడు క్రీస్తును "సమస్తముపైని శిరస్సుగా సంఘమునకు అనుగ్రహించెను." అయితే సంఘానికి శిరస్సు ఎవరు?
పాస్టరా? కాదు. పెద్దలా? కాదు. డినామినేషనా? కాదు. ధనవంతమైన కుటుంబమా? కాదు. ప్రభావశీలమైన నాయకుడా? కాదు.
**క్రీస్తే సంఘానికి శిరస్సు.**
అయితే పాస్టర్లు, పెద్దలు అవసరం లేదా? అవసరం. వారు దేవుడు ఇచ్చిన నాయకులు.
కానీ వారు ఎవరి అధికారంలో సేవ చేయాలి? క్రీస్తు అధికారంలో.
సంఘం వారి సొంతం కాదు. సంఘం క్రీస్తుకు చెందింది. అందుకే సంఘ బోధ, నాయకత్వం, ఆరాధన, కార్యక్రమాలు, నిర్ణయాలు అన్నీ దేనికి లోబడాలి? క్రీస్తుకు మరియు ఆయన వాక్యానికి.

**ఇక్కడ ప్రతి సంఘం ఒక ప్రశ్న వేసుకోవాలి:** మన సంఘం క్రీస్తు మరియు ఆయన వాక్యం చుట్టూ తిరుగుతోందా? లేక వ్యక్తులు, సంప్రదాయాలు, కార్యక్రమాలు, డబ్బు, మనుషుల అభిరుచుల చుట్టూ తిరుగుతోందా?

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం భాగాన్ని ఒకసారి కలిపి చూద్దాం.
ఎఫెసీయులలో ఏమి కనిపించింది? విశ్వాసం మరియు ప్రేమ. అందుకే పౌలు దేవునికి కృతజ్ఞత చెబుతున్నాడు.
అయితే వారు అక్కడే ఆగిపోవాలా? లేదు. వారు ఏమి చేయాలి? దేవునిని మరింతగా తెలుసుకోవాలి.
దానికోసం ఏమి కావాలి? హృదయ నేత్రాలు తెరవబడాలి.
కళ్ళు తెరవబడినప్పుడు వారు మూడు విషయాలు చూడాలి: నిరీక్షణ → స్వాస్థ్యం → దేవుని శక్తి
దేవుని శక్తికి గొప్ప నిదర్శనం ఏమిటి? క్రీస్తు పునరుత్థానం. లేచిన క్రీస్తు ఇప్పుడు ఏమి చేస్తున్నాడు?
పరిపాలిస్తున్నాడు. ఆ పరిపాలిస్తున్న క్రీస్తు ఎవరు? సంఘానికి శిరస్సు.

**అందుకే మొత్తం భాగాన్ని ఇలా గుర్తుంచుకోవచ్చు:**
విశ్వాసం & ప్రేమ → దేవునిని తెలుసుకోవడం → తెరవబడిన కళ్ళు → నిరీక్షణ → స్వాస్థ్యం → శక్తి → లేచిన క్రీస్తు → పరిపాలిస్తున్న క్రీస్తు → సంఘానికి శిరస్సు

## అన్వయం

ఇప్పుడు మన ప్రార్థనలను ఒకసారి పరిశీలిద్దాం.
మన ప్రార్థనల్లో ఎక్కువగా ఏమి ఉంటుంది? "ప్రభువా, నా సమస్యను పరిష్కరించు." "నా ఆరోగ్యాన్ని బాగుచేయి." "నా కుటుంబ పరిస్థితిని మార్చు." "నా ఆర్థిక అవసరాన్ని తీర్చు." "ఈ కష్టాన్ని తొలగించు."
ఇలాంటి ప్రార్థనలు తప్పా? లేదు.
మన అవసరాలను దేవుని దగ్గరకు తీసుకురావచ్చు.
కానీ పౌలు ప్రార్థన మనలను ఇంకాస్త లోతుగా తీసుకువెళ్తుంది.
మనము ఇలా కూడా ప్రార్థిస్తున్నామా? "ప్రభువా, నా పరిస్థితిని మార్చడమే కాదు – నిన్ను మరింతగా తెలుసుకునేలా నన్ను మార్చు." "నా హృదయ నేత్రాలను తెరువు." "నీవు నన్ను పిలిచిన నిరీక్షణను నాకు చూపించు." "క్రీస్తులో నాకు ఉన్న స్వాస్థ్యం ఎంత గొప్పదో అర్థం చేసుకునేలా చేయి." "నా బలహీనతనే కాకుండా నీ గొప్ప శక్తిని చూడటానికి సహాయం చేయి."
కొన్నిసార్లు దేవుడు మన కష్టాన్ని వెంటనే తీసివేయకపోవచ్చు. అయితే ఏమి చేయవచ్చు?
ఆ కష్టం మధ్యలోనే ఆయనను కొత్తగా చూడటానికి మన కళ్ళు తెరవవచ్చు.

## సువార్త సంబంధం

ఈ భాగం మనలను సువార్త హృదయానికి తీసుకువెళ్తుంది.
సువార్త అంటే కేవలం: "యేసు మన పాపాల కోసం మరణించాడు" అన్నది మాత్రమేనా? లేదు.
అది నిజమే. కానీ సువార్త అక్కడితో ఆగదు. యేసు మరణించాడు
→ దేవుడు ఆయనను మృతులలోనుండి లేపాడు → ఆయనను హెచ్చించాడు → ఆయన ప్రతి అధికారానికి పైగా పరిపాలిస్తున్నాడు → ఆయనే సంఘానికి శిరస్సు.

మన రక్షణ చనిపోయిన ఒక మత బోధకునిపై ఆధారపడిందా? లేదు. మన రక్షణ సజీవుడై, పరిపాలిస్తున్న యేసుక్రీస్తుపై ఆధారపడి ఉంది.

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు – 8

1. ఎఫెసీయులకు 1:15–17 చదవండి. పౌలు ఎఫెసీయులలో ఏ రెండు విషయాలు చూసి దేవునికి కృతజ్ఞత చెబుతున్నాడు? వారి కోసం అతను ముఖ్యంగా ఏమి ప్రార్థిస్తున్నాడు?
2. 1:17 ప్రకారం పౌలు వారు ఏమి పొందాలని కోరుతున్నాడు? దేవుని గురించి తెలుసుకోవడం మరియు దేవునిని తెలుసుకోవడం మధ్య తేడా ఏమిటి? మన బైబిల్ అధ్యయనం మనలను ఎక్కడికి తీసుకెళ్లాలి?
3. 1:18లో "హృదయ నేత్రాలు వెలిగింపబడటం" అంటే ఏమిటి? ఇప్పటికే విశ్వాసులైన వారికి కూడా ఇది ఎందుకు అవసరం? పౌలు వారు తెలుసుకోవాలని కోరిన మూడు విషయాలు ఏమిటి?
4. 1:18లోని నిరీక్షణ మరియు స్వాస్థ్యం గురించి ఆలోచించండి. బైబిల్ నిరీక్షణ సాధారణ ఆశకు ఎలా భిన్నంగా ఉంది? క్రీస్తులో మన స్వాస్థ్యం మన డబ్బు, ఆరోగ్యం, హోదా, కష్టాలను చూసే విధానాన్ని ఎలా మార్చాలి?
5. 1:19–20 ప్రకారం దేవుని శక్తికి పౌలు ఇచ్చిన గొప్ప ఉదాహరణ ఏమిటి? దేవుని పునరుత్థాన శక్తిని తెలుసుకోవడం మన బలహీనతలు, మారని పరిస్థితులు, పరిచర్యలోని కష్టాలను ఎదుర్కొనే విధానాన్ని ఎలా మార్చాలి?
6. 1:20–21 ప్రకారం క్రీస్తు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు? మానవ అధికారాలు, ఆత్మీయ శక్తులతో పోలిస్తే ఆయన స్థానం ఏమిటి? ఈ సత్యం మన భయాలను ఎలా మార్చాలి?
7. 1:22–23 ప్రకారం సంఘానికి శిరస్సు ఎవరు? ఈ సత్యం పాస్టర్లు, పెద్దలు, సంప్రదాయాలు, కార్యక్రమాలు, సంఘ నిర్ణయాలను ఎలా ప్రభావితం చేయాలి?
8. ఈ భాగాన్ని మీ జీవితానికి అన్వయించుకోండి. మీ ప్రార్థనలు ఎక్కువగా పరిస్థితులు మారాలని మాత్రమే కోరుతున్నాయా? లేక దేవునిని మరింతగా తెలుసుకోవడానికి, హృదయ నేత్రాలు తెరవబడడానికి, నిరీక్షణ, స్వాస్థ్యం, దేవుని శక్తిని అర్థం చేసుకోవడానికి కూడా ప్రార్థిస్తున్నారా?

## నాయకులకు – బైబిల్ అధ్యయన ప్రశ్నలపై సహాయం

ముందుగా సభ్యులు వాక్యభాగాన్ని జాగ్రత్తగా చదివి, వారే సమాధానం కనుగొనేలా చేయండి. వెంటనే జవాబు చెప్పకండి. చిన్న చిన్న ప్రశ్నలతో చర్చను ముందుకు తీసుకెళ్లండి: "ఈ సమాధానం ఏ వచనంలో ఉంది?" "ఈ మాట మనకు ఏమి చెబుతోంది?" "ఇంకెవరైనా ఏమనుకుంటున్నారు?" "ఇది మన జీవితానికి ఎలా వర్తిస్తుంది?"

**ప్రశ్న 1** – విశ్వాసం మరియు ప్రేమ

1:15–16లో రెండు విషయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి: క్రీస్తుపై విశ్వాసం → దేవుని ప్రజలపట్ల ప్రేమ.
నిజమైన విశ్వాసం కేవలం జ్ఞానంలో ఉండదు. సంబంధాల్లో కూడా కనిపిస్తుంది.
**ఇంకా అడగండి:**
"మన విశ్వాసం నిజంగా మన సంబంధాలలో కనిపిస్తున్నదా?"

**ప్రశ్న 2** – దేవునిని మరింతగా తెలుసుకోవడం

పౌలు మరింత సమాచారం కోసం మాత్రమే ప్రార్థించడం లేదు.
బైబిల్ జ్ఞానం మనలను: నమ్మడానికి, ప్రేమించడానికి, విధేయత చూపడానికి, ఆరాధించడానికి నడిపించాలి.
**ఇంకా అడగండి:** "మనకు దేవుని గురించి చాలా తెలుసా? లేక దేవునినే మరింతగా తెలుసుకుంటున్నామా?"

**ప్రశ్న 3** – హృదయ నేత్రాలు

ఇది ఆత్మీయ అవగాహనను సూచిస్తుంది. విశ్వాసులకు కూడా దేవుని సత్యాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ఆయన సహాయం అవసరం. మూడు మాటలను సభ్యులతో కలిసి చెప్పించండి: నిరీక్షణ → స్వాస్థ్యం → శక్తి

**ఇంకా అడగండి:** "ఈ మూడు విషయాల్లో మనం ఎక్కువగా మరిచిపోయేది ఏది?"

**ప్రశ్న 4** – నిరీక్షణ మరియు స్వాస్థ్యం

బైబిల్ నిరీక్షణ అనిశ్చితమైన కోరిక కాదు. అది దేవుని వాగ్దానాలపై ఆధారపడిన నమ్మకమైన ఎదురుచూపు.
మన సంపదను కేవలం డబ్బు, ఆరోగ్యం, హోదా, గుర్తింపుతో కొలవకూడదు.
**ఇంకా అడగండి:** "ఈ రోజు మన దగ్గర ఉన్నది పోయినా, క్రీస్తులో మనకు ఏమి మిగులుతుంది?"

**ప్రశ్న 5** – దేవుని శక్తి

దేవుని శక్తికి పౌలు ఇచ్చిన గొప్ప నిదర్శనం:
క్రీస్తు పునరుత్థానం.
అయితే ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పండి.
దేవుని శక్తి మనలో ఉంది అంటే:
ప్రతి సమస్య వెంటనే పోతుందని కాదు.
ప్రతి వ్యాధి తప్పకుండా నయమవుతుందని కాదు.
మన కోరికలన్నీ నెరవేరతాయని కాదు.
దేవుని శక్తి మనలను నమ్మడానికి, సహించడానికి, విధేయత చూపడానికి, మారడానికి, సేవ చేయడానికి, నిలబడడానికి బలపరుస్తుంది.
**ఇంకా అడగండి:**
"మన బలహీనతను మాత్రమే చూస్తున్నామా? లేక మనలో కార్యం చేస్తున్న దేవుని శక్తిని కూడా చూస్తున్నామా?"

**ప్రశ్న 6** – ప్రతి శక్తికంటే పైగా క్రీస్తు

క్రీస్తు: లేపబడ్డాడు → హెచ్చించబడ్డాడు → ప్రతి అధికారానికి పైగా కూర్చుండబెట్టబడ్డాడు.
అందువల్ల భౌతికమైనా, ఆత్మీయమైనా ఏ శక్తినీ క్రీస్తుతో సమానంగా చూడకూడదు.
**ఇంకా అడగండి:** "క్రీస్తు నిజంగా అన్నిటికంటే పైగా ఉన్నాడని నమ్మితే, అది మన భయాలను ఎలా మార్చాలి?"

**ప్రశ్న 7** – సంఘానికి శిరస్సు క్రీస్తు

సంఘం ఎవరిది? క్రీస్తుది. పాస్టర్లు, పెద్దలు ఆయన అధికారానికి లోబడి సేవ చేస్తారు.
వ్యక్తులు, సంప్రదాయాలు, డబ్బు, కార్యక్రమాలు లేదా మనుషుల అభిరుచులు సంఘాన్ని నియంత్రించకూడదు.
క్రీస్తు మరియు ఆయన వాక్యమే సంఘాన్ని నడిపించాలి.
**ఇంకా అడగండి:** "మన సంఘ నిర్ణయాల్లో చివరి అధికారం ఎవరిది – మనుషులదా, క్రీస్తు వాక్యమా?"

**ప్రశ్న 8** – మన ప్రార్థనలను పరిశీలించడం

ఈ ప్రశ్నను తొందరగా ముగించకండి.
మన ప్రార్థనలు పరిస్థితుల చుట్టూ తిరగడం తప్పు కాదు.
కానీ పౌలు మనకు ఇంకొక ముఖ్యమైన ప్రార్థన నేర్పుతున్నాడు:
"ప్రభువా, పరిస్థితులు మారడమే కాదు – నేను నిన్ను మరింతగా తెలుసుకునేలా నన్ను మార్చు."
**ఇంకా అడగండి:** "మీ ప్రార్థనల్లో ఈ వారం ఏ కొత్త ప్రార్థనను చేర్చుకోవచ్చు?"

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చ చివరికి ఈ ప్రార్థన స్పష్టంగా ఉండేలా చేయండి:
"ప్రభువా, వారు నిన్ను మరింతగా తెలుసుకొని, క్రీస్తులో నీవు ఇప్పటికే వారికి ఇచ్చినదానిని అర్థం చేసుకునేలా వారి హృదయ నేత్రాలను తెరువు."

**ఈ క్రమాన్ని సభ్యులతో మళ్లీ చెప్పించండి:**

తెరవబడిన కళ్ళు → నిరీక్షణను చూడటం → స్వాస్థ్యం విలువను తెలుసుకోవడం → దేవుని శక్తిని అర్థం చేసుకోవడం → లేచి పరిపాలిస్తున్న క్రీస్తును చూడటం → సంఘానికి శిరస్సైన ఆయనకు లోబడటం

## చివరి ప్రశ్న

మనకు చాలా బైబిల్ వచనాలు తెలిసి ఉండవచ్చు. చాలా క్రైస్తవ విషయాలు తెలిసి ఉండవచ్చు. సంవత్సరాలుగా సంఘానికి వెళ్తూ ఉండవచ్చు. పరిచర్య కూడా చేస్తూ ఉండవచ్చు.

కానీ పౌలు ప్రార్థన మనలను ఇంకా లోతైన ప్రశ్న అడగమంటోంది:
మన హృదయ నేత్రాలు నిజంగా తెరవబడుతున్నాయా?
దేవునిని మరింతగా తెలుసుకుంటున్నామా?
మన నిరీక్షణను మరింత స్పష్టంగా చూస్తున్నామా?
క్రీస్తులో మనకు ఉన్న స్వాస్థ్యం విలువను గుర్తిస్తున్నామా?
మన బలహీనతలో దేవుని పునరుత్థాన శక్తిపై ఆధారపడుతున్నామా?
పరిపాలిస్తున్న క్రీస్తు అధికారానికి లోబడి జీవిస్తున్నామా?
తెలుసుకోవడమే కాదు – చూస్తున్నామా? నమ్ముతున్నామా? దాని ప్రకారం జీవిస్తున్నామా?

# కృపచేత మరణం నుండి జీవానికి

## సందర్భం

ఎఫెసీయులకు 1వ అధ్యాయం చివరలో పౌలు దేవుని గొప్ప శక్తి గురించి చెప్పాడు - క్రీస్తును మృతులలో నుండి లేపిన శక్తి (1:19–20). ఇప్పుడు 2వ అధ్యాయంలో అదే శక్తి పాపుల జీవితాల్లో ఎలా పనిచేస్తుందో చూపిస్తున్నాడు.
మన పరిస్థితి ఏమిటి? మనం కొంచెం బలహీనంగా ఉన్నామని, కొంత మెరుగుపడాల్సిన అవసరం మాత్రమే ఉందని పౌలు చెప్పడం లేదు. "మీ అపరాధములచేతను పాపములచేతను మీరు చచ్చినవారై యుండగా" అని చెబుతున్నాడు (2:1).

అయితే 4వ వచనంలో పరిస్థితి పూర్తిగా మారుతుంది: "అయినను దేవుడు..."

మనం చనిపోయినవారమై ఉన్నాము - కానీ దేవుడు మనలను బ్రతికించాడు. దేవుని ఉగ్రతకు పాత్రులమై ఉన్నాము - కానీ దేవుడు కనికరించాడు. ఈ లోక విధానాన్ని అనుసరిస్తున్నాము - కానీ దేవుడు క్రీస్తులో కొత్త జీవితం ఇచ్చాడు. మనలను మనమే రక్షించుకోలేకపోయాము - కానీ దేవుడు కృపచేత రక్షించాడు.

### ఈ భాగంలోని క్రమాన్ని గమనించండి:

పాపంలో మృతి → లోకం, సాతాను, పాప స్వభావపు కోరికలు → దేవుని ఉగ్రతకు పాత్రులు → అయినను దేవుడు → కనికరం, గొప్ప ప్రేమ → క్రీస్తుతో జీవం → కృపచేత రక్షణ → విశ్వాసం → క్రియల వల్ల కాదు → దేవుని పనితనం → మంచి క్రియలు.

ఈ భాగం సువార్తను చాలా స్పష్టంగా చూపిస్తుంది. మనం ఎలా ఉన్నాము? మనలను ఏవి నడిపించాయి? మనం దేనికి పాత్రులమయ్యాము? దేవుడు ఏమి చేశాడు? మనం ఎలా రక్షించబడ్డాము? దేనికోసం రక్షించబడ్డాము?

### 1. అపరాధాలు మరియు పాపాలలో చనిపోయినవారు – ఎఫెసీయులకు 2:1

పౌలు, "మీ అపరాధములచేతను పాపములచేతను మీరు చచ్చినవారై యుండగా" అని ప్రారంభిస్తున్నాడు.
పాపం అంటే దేవుని ప్రమాణానికి తగకుండా ఉండటం. దేవునిని తెలుసుకోవడానికి, ప్రేమించడానికి, ఆయనకు విధేయత చూపడానికి, ఆయన మహిమ కోసం జీవించడానికి మనం సృష్టించబడ్డాము. కానీ మనం దేవుని నుండి తొలగిపోయి మన సొంత మార్గాన్ని ఎంచుకున్నాము (రోమా 3:23).

**పాపం** అంటే పెద్ద నేరాలు లేదా చెడ్డ పనులు మాత్రమే కాదు. మన ఆలోచనలు, కోరికలు, ఉద్దేశాలు, వైఖరులు, మాటలు, పనులు, అలాగే చేయవలసిన మంచిని చేయకపోవడం కూడా పాపంలో భాగమే.
**అపరాధం** అంటే దేవుడు పెట్టిన హద్దును దాటడం. ఏది సరైనదో దేవుడు చెప్పినా, ఆయన హద్దును దాటి మన సొంత మార్గాన్ని ఎంచుకోవడం. ఆదికాండము 3లో దీనికి స్పష్టమైన ఉదాహరణ కనిపిస్తుంది. దేవుడు ఆదాము హవ్వలకు ఒక హద్దు పెట్టాడు. వారు ఆ హద్దును తెలిసికూడా దాటారు.
కాబట్టి మన సమస్య అప్పుడప్పుడు కొన్ని తప్పులు చేయడం మాత్రమే కాదు. పాపం దేవునితో మన సంబంధాన్ని ప్రభావితం చేసింది. అందుకే పౌలు మన పరిస్థితిని ఆత్మీయ మరణంగా వర్ణిస్తున్నాడు.
చనిపోయిన వ్యక్తి తనకు తానే జీవం ఇచ్చుకోలేడు. అలాగే మనలను మనమే ఆత్మీయంగా బ్రతికించుకోలేం. దేవుడే జీవం ఇవ్వాలి. క్రైస్తవ విశ్వాసం అంటే చెడ్డవారు కొంచెం మంచివారవడం కాదు; ఆత్మీయంగా చనిపోయినవారు క్రీస్తులో జీవింపజేయబడటం.
**ఆలోచించండి**: పాపం అంటే ఇతరులు చేసే పెద్ద తప్పులు మాత్రమే అని అనుకుంటున్నానా? లేక నా ఆలోచనలు, కోరికలు, ఉద్దేశాలు, మాటలు, పనులు, అవిధేయతలో కూడా పాపాన్ని గుర్తిస్తున్నానా?

### 2. చనిపోయినవారే – అయినా నడుస్తున్నారు – ఎఫెసీయులకు 2:2–3

ఇక్కడ పౌలు ఒక ఆసక్తికరమైన విషయం చెబుతున్నాడు. వారు ఆత్మీయంగా చనిపోయినవారే, అయినా ఒక విధమైన జీవితాన్ని "నడుస్తున్నారు." ఆ జీవితాన్ని ఏవి ప్రభావితం చేస్తున్నాయి?

**పౌలు మూడు ప్రభావాలను చూపిస్తున్నాడు:**
*మన చుట్టూ ఉన్న లోకం → మనకు విరోధిగా పనిచేసే సాతాను → మనలో ఉన్న పాప స్వభావపు కోరికలు.*

## లోకం

వారు ఒకప్పుడు "ఈ లోక ధర్మము చొప్పున" నడిచారని పౌలు చెబుతున్నాడు (2:2).
ఇక్కడ "లోకం" అంటే దేవుడు సృష్టించిన భూమి లేదా ప్రకృతి కాదు. దేవుని నుండి స్వతంత్రంగా జీవించే మానవ సమాజంలోని విలువలు, ఆలోచనలు, ప్రాధాన్యతలు, జీవన విధానాలు.
లోకం ఇలా చెప్పవచ్చు: "డబ్బే నీకు భద్రత ఇస్తుంది." "విజయమే నీ విలువను నిర్ణయిస్తుంది." "నీకు నచ్చినది చేసుకో."
"ముందుగా నీ గురించే ఆలోచించు." "అందరూ చేస్తున్నారు కాబట్టి అది తప్పు కాదు."
ఇలాంటి ఆలోచనలు సాధారణమైపోతే, అవి దేవుని వాక్యానికి సరిపోతున్నాయా అని కూడా మనం ప్రశ్నించకుండా ఉండవచ్చు.
**ఆలోచించండి**: నా ఆలోచనలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నది నా చుట్టూ ఉన్న సమాజమా, లేక దేవుని వాక్యమా?

## సాతాను

పౌలు "వాయుమండల సంబంధమైన అధికారానికి అధిపతి" గురించి చెబుతున్నాడు (2:2). ఇది సాతానును సూచిస్తుంది. సాతాను నిజమైనవాడు. కానీ అతడు దేవునితో సమానుడు కాదు. అతడు సృష్టించబడినవాడు; దేవుని సంపూర్ణ అధికారానికి లోబడి ఉన్నాడు. అతడు మోసం చేస్తాడు, శోధిస్తాడు, నిందిస్తాడు, దేవుని సత్యాన్ని వ్యతిరేకిస్తాడు. యేసు అతనిని "అబద్ధికుడును అబద్ధమునకు జనకుడును" అని చెప్పాడు (యోహాను 8:44). ఆదికాండము 3లో అతని పద్ధతిని చూస్తాము. మొదట దేవుని వాక్యంపై సందేహం కలిగించాడు. తరువాత దేవుని మంచితనంపైనే సందేహం కలిగించాడు.

అయితే విశ్వాసులు సాతానును నిర్లక్ష్యం చేయకూడదు; అదే సమయంలో అతని గురించి అతిగా భయపడకూడదు. ఎందుకంటే క్రీస్తు ప్రతి అధికారానికి, శక్తికి, ఆధిపత్యానికి ఎంతో పైగా ఉన్నాడు (ఎఫెసీయులకు 1:21).

### పాప స్వభావపు కోరికలు

పౌలు తరువాత శరీరాశలు, మనస్సు కోరిన వాటిని చేయడం గురించి చెబుతున్నాడు (2:3).
మన సమస్య బయట మాత్రమే లేదు.  "లోకం నన్ను ఇలా చేసింది," లేదా "సాతాను నన్ను ఇలా చేయించాడు" అని మన పాపానికి బాధ్యతను పూర్తిగా బయటకు నెట్టలేం. మనలో కూడా దేవునికి విరుద్ధమైన కోరికలు ఉన్నాయి.

**అందుకే ఈ మూడు ప్రభావాలను గుర్తుంచుకోండి:**
లోకం మన చుట్టూ నుండి ఒత్తిడి చేస్తుంది → సాతాను మోసం చేస్తాడు → పాప స్వభావపు కోరికలు మనలో నుండి లాగుతాయి.
ఆలోచించండి: నా నిర్ణయాలను ఏది నడిపిస్తోంది - దేవుని వాక్యమా, లోకపు ఆలోచనా, సాతాను అబద్ధాలా, లేక నా సొంత పాప కోరికలా?

## 3. దేవుని ఉగ్రతకు పాత్రులు – ఎఫెసీయులకు 2:3

పాపం మనలను నియంత్రించడం మాత్రమే సమస్య కాదు. అది మనలను దేవుని న్యాయమైన తీర్పుకు పాత్రులుగా చేసింది.
పౌలు మనం "స్వభావసిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి" అని చెబుతున్నాడు (2:3).
దేవుని ఉగ్రత అంటే అదుపులేని కోపం కాదు. అది పాపం పట్ల పరిశుద్ధుడైన దేవుని న్యాయమైన స్పందన.
ఈ సత్యం వినడానికి కష్టంగా ఉండవచ్చు. కానీ పాపం ఎంత తీవ్రమైనదో అర్థం కాకపోతే, కృప ఎంత గొప్పదో కూడా అర్థం కాదు.

**1–3 వచనాల చివరికి మన పరిస్థితి ఇలా కనిపిస్తుంది:**
పాపంలో మృతి → లోక ప్రభావం → సాతాను మోసం → మనలో పాప కోరికలు → దేవుని న్యాయమైన తీర్పుకు పాత్రులు.
చనిపోయినవారు తమను తాము బ్రతికించుకోగలరా? అపరాధులు తమ అపరాధాన్ని తామే తొలగించుకోగలరా?
ఇక్కడే ఈ భాగంలోని గొప్ప మలుపు వస్తుంది.

## 4. గొప్ప మలుపు – "అయినను దేవుడు" – ఎఫెసీయులకు 2:4

మన నిరీక్షణలేని పరిస్థితిని వివరించిన తరువాత పౌలు:
"కానీ మీరు మరింత ప్రయత్నించారు" అని చెప్పలేదు. "కానీ మీరు మతపరులయ్యారు" అని చెప్పలేదు.
"కానీ మీ జీవితాన్ని మీరు మార్చుకున్నారు" అని చెప్పలేదు.
అతను చెప్పింది: "అయినను దేవుడు..."
ఎఫెసీయుల పత్రికలో అత్యంత అందమైన మాటలలో ఇవి రెండు. రక్షణ మనం దేవుని కోసం చేసినదానితో ప్రారంభం కాదు. దేవుడు మన కోసం చేసినదానితో ప్రారంభమవుతుంది.

దేవుడు ఎందుకు కార్యం చేశాడు? ఆయన కనికర సంపన్నుడు.
ఆయన మనయెడల గొప్ప ప్రేమ కలిగినవాడు.
**కనికరం** అంటే మన పాపాలకు తగిన విధంగా దేవుడు మనతో వ్యవహరించకపోవడం. మనలను మనమే రక్షించుకోలేని స్థితిలో ఉన్నప్పటికీ ఆయన ప్రేమ మనవైపు వచ్చింది.
**ఆలోచించండి**: నా రక్షణ కథలో ప్రధాన వ్యక్తి ఎవరు—నేనా, నా నిర్ణయాలా, నా ప్రయత్నాలా? లేక దేవుడు, ఆయన కనికరం, ఆయన ప్రేమా?

## 5. మరణం నుండి జీవానికి – ఎఫెసీయులకు 2:5

కనికరం, ప్రేమ కలిగిన దేవుడు ఏమి చేశాడు? "మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను."
దేవుడు ఎప్పుడు కార్యం చేశాడో గమనించండి. మనం మంచివారైన తరువాత కాదు.
మన జీవితాన్ని శుభ్రం చేసుకున్న తరువాత కాదు. మతపరులైన తరువాత కాదు.
"అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు."
అందుకే పౌలు వెంటనే, "కృపచేత మీరు రక్షింపబడియున్నారు" అంటున్నాడు.
కృప అంటే అర్హత లేని మనకు దేవుడు చూపించిన అనుగ్రహం. రక్షణ మంచి ప్రవర్తనకు ఇచ్చే జీతం కాదు. మనం సంపాదించలేని దేవుని బహుమానం.

1వ అధ్యాయంతో ఉన్న సంబంధాన్ని కూడా గమనించండి:
దేవుడు చనిపోయిన క్రీస్తును లేపాడు (1:20) → ఆత్మీయంగా చనిపోయిన మనలను క్రీస్తుతో జీవింపజేశాడు (2:5).

## 6. క్రీస్తుతో జీవింపజేసి, లేపి, కూర్చుండబెట్టాడు – ఎఫెసీయులకు 2:6–7

దేవుడు మనలను బ్రతికించడంతో ఆగిపోలేదు. క్రీస్తుతో కూడ లేపి, పరలోకమందు ఆయనతో కూడ కూర్చుండబెట్టాడు.
ఈ క్రమాన్ని గమనించండి:
క్రీస్తుతో జీవింపజేశాడు → క్రీస్తుతో లేపాడు → క్రీస్తుతో కూర్చుండబెట్టాడు.
మన కొత్త గుర్తింపు పూర్తిగా క్రీస్తుతో ముడిపడి ఉంది.
దేవుడు ఇదంతా ఎందుకు చేశాడు? రాబోయే యుగాలలో క్రీస్తుయేసునందు మనయెడల చూపిన దయ ద్వారా తన కృప యొక్క అపారమైన ఐశ్వర్యాన్ని చూపించడానికి (2:7).
అంటే మన రక్షణ మన ఆనందం, సమాధానం, భవిష్యత్తు మాత్రమే కాదు. దేవుని కృప ఎంత గొప్పదో చూపించే సాక్ష్యం కూడా.

## 7. విశ్వాసం ద్వారా కృపచేత రక్షణ – ఎఫెసీయులకు 2:8

పౌలు ఇప్పుడు రక్షణ గురించి చాలా స్పష్టంగా చెబుతున్నాడు:
"మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు."
మూడు విషయాలు గుర్తుంచుకోండి:
**కృప** – రక్షణకు మూలం దేవుని అనర్హమైన అనుగ్రహం.
**రక్షణ** – పాపం మరియు తీర్పు నుండి దేవుడు మనలను విడిపించడం.
**విశ్వాసం** – దేవుడు ఇచ్చిన బహుమానాన్ని క్రీస్తుపై నమ్మకంతో స్వీకరించడం.
విశ్వాసం రక్షణను సంపాదించే మరో మంచి పని కాదు. అది దేవుని బహుమానాన్ని స్వీకరించే ఖాళీ చేయి వంటిది.

**ఆలోచించండి:** నా నమ్మకం దేనిపై ఉంది—నా మంచితనం, మతపరమైన జీవితం, సేవపైనా? లేక క్రీస్తు మరియు ఆయన చేసిన కార్యంపైనా?

## 8. క్రియల వల్ల కాదు – గొప్పలు చెప్పుకోవడానికి అవకాశం లేదు – ఎఫెసీయులకు 2:8–9

పౌలు ఇంకా స్పష్టంగా చెబుతున్నాడు:
"ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనక ఎవడును అతిశయపడ వీలులేదు."
రక్షణ మన అర్హతపై ఆధారపడితే మనకు గొప్పలు చెప్పుకోవడానికి కారణం ఉండేది.
ఒకరు, "నేను ఎక్కువ ప్రార్థించాను" అనవచ్చు. మరొకరు, "నేను ఎక్కువ ఇచ్చాను" అనవచ్చు. ఇంకొకరు, "నేను మంచి జీవితం జీవించాను" అనవచ్చు. కానీ సిలువ దగ్గర ఎవరూ గొప్పలు చెప్పుకోలేరు. మనమందరం కృప అవసరమైన పాపులమే.
అయితే మంచి క్రియలు అవసరం లేదా?
10వ వచనం దానికి సమాధానం ఇస్తుంది.

## 9. దేవుని పనితనం – ఎఫెసీయులకు 2:10

పౌలు, "మనము దేవుని పనితనమై, సత్క్రియలు చేయుటకై క్రీస్తుయేసునందు సృష్టింపబడినవారము" అని చెబుతున్నాడు. "**పనితనం**" అనే మాట దేవుడు తయారుచేసినది, ఆయన చేతిలో రూపుదిద్దుకుంటున్నది అనే భావాన్ని ఇస్తుంది. కొన్ని అనువాదాలు దీనిని "God's masterpiece" – దేవుని కళాఖండం అని కూడా చెబుతాయి.

**1వ వచనాన్ని 10వ వచనంతో పోల్చండి:**

2:1 – పాపంలో చనిపోయినవారు. 2:10 – క్రీస్తులో కొత్తగా సృష్టించబడిన దేవుని పనితనం.

ఈ గొప్ప మార్పు ఎవరు చేశారు? దేవుడే.

రక్షణ అంటే దేవుడు మన పాత జీవితానికి కొంచెం మరమ్మతు చేయడం మాత్రమే కాదు. క్రీస్తులో మనం నూతన సృష్టి (2 కొరింథీయులకు 5:17). ఒక కళాఖండం దానిని చేసిన కళాకారుని ప్రతిభను చూపిస్తుంది. అలాగే మారుతున్న విశ్వాసి జీవితం దేవుని కృప, మంచితనం, జ్ఞానం, మార్చే శక్తిని చూపించాలి. ఈ సత్యం మనలను గర్వం నుండి, నిరాశ నుండి కూడా కాపాడుతుంది. "నా జీవితాన్ని నేనే ఇంత గొప్పగా మార్చుకున్నాను" అని గొప్పలు చెప్పుకోలేం.

అలాగే, "దేవుడు నన్ను మార్చలేడు" అని నిరాశపడాల్సిన అవసరం లేదు.

మనం ఆయన పనితనం. ఆయన ఇంకా మనలో పని చేస్తున్నాడు.

## 10. మంచి క్రియల కోసం రక్షించబడ్డాము – ఎఫెసీయులకు 2:10

దేవుడు మనలను క్రీస్తులో కొత్తగా ఎందుకు సృష్టించాడు? "సత్క్రియలు చేయుటకై."

అంతేకాదు, మనం వాటిలో నడుచుకోవాలని దేవుడు ముందుగానే వాటిని సిద్ధపరచాడు.

మంచి క్రియలు మనలను దేవుని పిల్లలుగా చేయవు. దేవుని కృప మనలను కొత్తవారిగా చేస్తుంది; ఆ కొత్త జీవితం మంచి క్రియలను ఉత్పత్తి చేస్తుంది.

అందుకే మంచి క్రియలు రక్షణకు వేరు (root) కాదు; అవి రక్షణ యొక్క ఫలం (fruit). మనం మంచి క్రియల వల్ల రక్షించబడము; మంచి క్రియల కోసం రక్షించబడ్డాము.

**క్రమం ఇలా ఉంటుంది:**

మంచి క్రియలు → రక్షణ కాదు. కృప → విశ్వాసం → రక్షణ → నూతన సృష్టి → మంచి క్రియలు.

**ఆలోచించండి**: నేను దేవుని పనితనమైతే, దేవుడు ప్రస్తుతం నాలో ఏమి మారుస్తున్నాడు? నేను చేయాలని ఆయన సిద్ధపరచిన మంచి పనులు ఏమై ఉండవచ్చు?

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

పౌలు ఆలోచనల క్రమాన్ని గమనించండి:

పాపాలు, అపరాధాలలో చనిపోయాము → లోకం మనపై ఒత్తిడి చేసింది → సాతాను మోసం చేశాడు → మనలోని పాప కోరికలు మనలను లాగాయి → దేవుని న్యాయమైన తీర్పుకు పాత్రులమయ్యాము → అయినను దేవుడు తన కనికరం, గొప్ప ప్రేమవలన కార్యం చేశాడు → క్రీస్తుతో మనలను జీవింపజేశాడు → క్రీస్తుతో లేపాడు → విశ్వాసం ద్వారా కృపచేత రక్షించాడు → గొప్పలు చెప్పుకోవడానికి అవకాశం లేకుండా చేశాడు → క్రీస్తులో మనలను తన పనితనంగా కొత్తగా సృష్టించాడు → మంచి క్రియలతో జీవించడానికి సిద్ధపరచాడు.

## సులభంగా గుర్తుంచుకోవాలంటే:

మృతి → లోకం/సాతాను/పాప స్వభావం → ఉగ్రత → అయినను దేవుడు → జీవం → కృప → విశ్వాసం → దేవుని పనితనం → మంచి క్రియలు.

## అన్వయం

ఈ భాగం మన ఆలోచనలను అనేక విధాలుగా సవాలు చేస్తుంది.

పాపాన్ని తక్కువగా చూస్తున్నామా? పౌలు మనం కేవలం బలహీనులమని కాదు, పాపంలో చనిపోయినవారమని చెబుతున్నాడు.

ప్రతి పాపానికి సాతానునే కారణంగా చూపిస్తున్నామా? పౌలు లోకం, సాతాను, మనలోని పాప కోరికలు అనే మూడు ప్రభావాలను చూపిస్తున్నాడు.

మన సామర్థ్యాన్ని ఎక్కువగా అంచనా వేస్తున్నామా? రక్షణ మనవలన కలిగినది కాదు.
కృపను తక్కువగా అంచనా వేస్తున్నామా? దేవుని తీర్పుకు పాత్రులైన మనలను ఆయన ప్రేమించాడు.
మన క్రియలపై ఆధారపడుతున్నామా? రక్షణ క్రియల వల్ల కాదు; విశ్వాసం ద్వారా కృపచేత.
“నేను మారలేను” అని నిరాశపడుతున్నామా? మనం దేవుని పనితనం; ఆయన మనలో పనిచేస్తున్నాడు.
“కృపచేత రక్షించబడ్డాను కాబట్టి ఎలా జీవించినా పరవాలేదు” అనుకుంటున్నామా? మనం మంచి క్రియలు చేయడానికి క్రీస్తులో కొత్తగా సృష్టించబడ్డాము.

**కాబట్టి సువార్త క్రమాన్ని స్పష్టంగా ఉంచాలి:**
మనం విధేయత చూపితే దేవుడు మనలను రక్షిస్తాడు కాదు. దేవుడు కృపచేత మనలను రక్షించి, క్రీస్తులో కొత్తవారిగా చేసి, విధేయతతో జీవించేలా మనలను మారుస్తాడు.

## సువార్త సంబంధం

ఎఫెసీయులకు 2:1–10 మనలను సువార్త హృదయానికి తీసుకువెళ్తుంది.
మన పరిస్థితి నిరీక్షణలేనిది. మనం పాపంలో చనిపోయినవారము, మనలను మనమే రక్షించుకోలేనివారము, దేవుని న్యాయమైన తీర్పుకు పాత్రులము.
**“అయినను దేవుడు...”**
మనయెడల తన గొప్ప ప్రేమచేత, కనికరంతో ఆయన కార్యం చేశాడు. మనలను క్రీస్తుతో కూడ జీవింపజేశాడు.
అపరాధులైన మనకు క్షమాపణ ఎలా సాధ్యమైంది? ఎఫెసీయులకు 1:7లో పౌలు ఇప్పటికే చెప్పాడు – క్రీస్తు రక్తం ద్వారా మనకు విమోచన, పాప క్షమాపణ లభించింది.
క్రీస్తు మన పాపాల కోసం మరణించాడు. దేవుడు ఆయనను మృతులలో నుండి లేపాడు. క్రీస్తులో ఆత్మీయంగా చనిపోయిన పాపులు జీవింపజేయబడుతున్నారు.
కాబట్టి సువార్త మొదట మనం దేవుని కోసం ఏమి చేయాలి అనే సందేశం కాదు. దేవుడు క్రీస్తులో మన కోసం ఏమి చేశాడు అనే శుభవార్త.

**ఆ కృప మనలను మార్చకుండా వదిలిపెట్టదు:**
మంచి క్రియల వల్ల రక్షణ కాదు → విశ్వాసం ద్వారా కృపచేత రక్షణ → మంచి క్రియల కోసం నూతన సృష్టి.

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు

1. ఎఫెసీయులకు 2:1–10 చదవండి. 1–3 వచనాల నుండి 4–10 వచనాలకు వచ్చేటప్పుడు ఏ గొప్ప మార్పు కనిపిస్తుంది?
2. పౌలు మనలను కేవలం “బలహీనులు” అని కాకుండా “పాపాలలో చనిపోయినవారు” అని ఎందుకు వర్ణిస్తున్నాడు? (2:1)
3. 2–3 వచనాల ప్రకారం మన పాత జీవితాన్ని ప్రభావితం చేసిన మూడు విషయాలు ఏమిటి? లోకం, సాతాను, పాప స్వభావపు కోరికలు నేడు మనలను ఎలా ప్రభావితం చేస్తాయి?
4. “దైవోగ్రతకు పాత్రులు” (2:3) అంటే ఏమిటి? పాపం యొక్క తీవ్రతను అర్థం చేసుకోవడం దేవుని కృప గొప్పతనాన్ని అర్థం చేసుకోవడానికి ఎలా సహాయపడుతుంది?
5. 4వ వచనంలోని “అయినను దేవుడు” అనే మాటలు ఈ భాగంలోని గొప్ప మలుపు ఎందుకు? 4–5 వచనాల ప్రకారం దేవుడు మన పట్ల కార్యం చేయడానికి కారణం ఏమిటి?
6. 8–9 వచనాల ప్రకారం మనం ఎలా రక్షించబడ్డాము? కృప, విశ్వాసం, క్రియలు – వీటిలో ప్రతి దానికి ఉన్న స్థానం ఏమిటి?
7. “మనము దేవుని పనితనము” (2:10) అంటే ఏమిటి? మంచి క్రియల వల్ల రక్షించబడటం మరియు మంచి క్రియల కోసం రక్షించబడటం మధ్య తేడా ఏమిటి?
8. ఈ భాగంలో ఏ సత్యం మిమ్మల్ని ఎక్కువగా సవాలు చేసింది లేదా ప్రోత్సహించింది? ఈ వారం ఆ సత్యం మీ ఆలోచనలో లేదా జీవన విధానంలో ఏ మార్పు తీసుకురావాలి?

### నాయకులకు – ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులు బైబిల్ భాగాన్ని జాగ్రత్తగా చదివి, వాక్యం నుండే సమాధానాలు కనుగొనేలా ప్రోత్సహించండి. నాయకుడు

వెంటనే సమాధానం చెప్పకుండా, సభ్యులు గమనించేలా ప్రశ్నలు అడగాలి. అవసరమైనప్పుడు మాత్రమే ఈ సూచనలను ఉపయోగించండి.

## 9. ప్రశ్న 1కు సహాయం

1–3 వచనాల నుండి 4–10 వచనాలకు వచ్చేటప్పుడు ఏ గొప్ప మార్పు కనిపిస్తుంది?
1–3 వచనాలు క్రీస్తు లేకుండా మన పరిస్థితిని చూపిస్తాయి - పాపంలో చనిపోయినవారు, లోకం, సాతాను, పాప కోరికల ప్రభావంలో ఉన్నవారు, దేవుని ఉగ్రతకు పాత్రులు.
4వ వచనంలో “అయినను దేవుడు” అనే మాటలతో గొప్ప మలుపు వస్తుంది.
4–10 వచనాలు మన ప్రయత్నాలను కాకుండా దేవుని కార్యాన్ని చూపిస్తాయి - ఆయన కనికరం, ప్రేమ, కృప, జీవం, రక్షణ, కొత్త సృష్టి.

**చర్చలో ఈ రెండు భాగాలను పక్కపక్కన పెట్టండి:**
మనం ఏమై ఉన్నాము? → దేవుడు ఏమి చేశాడు?
నాయకుడు అడగవచ్చు: “ఈ భాగంలో ఎక్కువ క్రియలు చేస్తున్నది మనమా, దేవుడా?”

## ప్రశ్న 2కు సహాయం

పౌలు మనలను ‘బలహీనులు’ అని కాకుండా ‘పాపాలలో చనిపోయినవారు’ అని ఎందుకు వర్ణిస్తున్నాడు?
బలహీనుడైన వ్యక్తికి కొంత సహాయం అవసరం. కానీ చనిపోయిన వ్యక్తి తనకు తానే జీవం ఇవ్వలేడు.
పౌలు మన ఆత్మీయ సమస్య ఎంత లోతైనదో చూపిస్తున్నాడు. మనకు కేవలం మంచి సలహా, విద్య, మతపరమైన కార్యక్రమాలు లేదా స్వీయ అభివృద్ధి అవసరం కాదు. దేవుడు జీవం ఇవ్వాలి.
క్రైస్తవ రక్షణ అంటే చెడ్డవారు కొంచెం మంచివారవడం కాదు; ఆత్మీయంగా చనిపోయినవారు క్రీస్తులో జీవింపజేయబడటం.

నాయకుడు అడగవచ్చు: “చనిపోయిన మనిషి తనకు తానే జీవం ఇవ్వగలడా? అయితే ఆత్మీయ జీవం ఎవరు ఇవ్వాలి?”

## ప్రశ్న 3కు సహాయం

మన పాత జీవితాన్ని ప్రభావితం చేసిన మూడు విషయాలు ఏమిటి?
మూడు ప్రభావాలను సులభంగా గుర్తుంచుకోండి:
చుట్టూ —— లోకం
విరోధిగా —— సాతాను
లోపల —— పాప స్వభావం
లోకం దేవునికి విరుద్ధమైన విలువలను సాధారణమైనవిగా చూపిస్తుంది.
సాతాను దేవుని సత్యాన్ని వక్రీకరించి, దేవుని వాక్యం మరియు మంచితనంపై సందేహం కలిగిస్తాడు.
మనలోని పాప కోరికలు దేవునికి విరుద్ధమైన వాటివైపు మనలను లాగుతాయి.
అయితే మన పాపానికి బాధ్యతను పూర్తిగా లోకం లేదా సాతాను మీద నెట్టకూడదు. మనలోని పాప కోరికలు కూడా సమస్యలో భాగమే.
నాయకుడు అడగవచ్చు: “నేటి సమాజంలో దేవుని వాక్యానికి విరుద్ధంగా ఉన్నా సాధారణంగా అంగీకరించబడుతున్న ఆలోచనలు ఏమిటి?”

## ప్రశ్న 4కు సహాయం

“దైవోగ్రతకు పాత్రులు” అంటే ఏమిటి?
దేవుని ఉగ్రత అంటే మనుషులలో కనిపించే అదుపులేని కోపం కాదు. అది పాపం పట్ల పరిశుద్ధుడైన దేవుని న్యాయమైన స్పందన. దేవుడు పరిశుద్ధుడు కాబట్టి పాపాన్ని నిర్లక్ష్యం చేయడు.
పాపం కేవలం మన జీవితానికి ఇబ్బంది కలిగించే విషయం మాత్రమే కాదు; అది దేవుని తీర్పుకు మనలను పాత్రులుగా చేస్తుంది.
ఈ విషయాన్ని భయపెట్టడానికి మాత్రమే ఉపయోగించకండి. దీని ఉద్దేశం కృప గొప్పతనాన్ని చూపించడం కూడా.
పాపం ఎంత తీవ్రమైనదో అర్థమైనప్పుడు, “అయినను దేవుడు” అనే మాటలు మరింత అద్భుతంగా కనిపిస్తాయి.
నాయకుడు అడగవచ్చు:
“దేవుని తీర్పు గురించి తెలియకపోతే ఆయన కృప గొప్పతనం పూర్తిగా అర్థమవుతుందా?”

## ప్రశ్న 5కు సహాయం

“అయినను దేవుడు” ఎందుకు గొప్ప మలుపు? పౌలు “అయినను మీరు మారిపోయారు” అని చెప్పడం లేదు.
అతను “అయినను దేవుడు” అంటున్నాడు. రక్షణలో ప్రధాన కార్యం మనది కాదు – దేవునిదే.

4–5 వచనాల్లో దేవుని కార్యానికి కారణాలను సభ్యులతోనే కనుగొనించండి:
ఆయన కనికర సంపన్నుడు. ఆయన మనలను గొప్ప ప్రేమతో ప్రేమించాడు. ఆయన కృపచేత మనలను రక్షించాడు.
దేవుడు మనలో ఏదో మంచి చూసి మనలను రక్షించాడని ఈ భాగం చెప్పడం లేదు. ఆయన స్వభావంలోని కనికరం, ప్రేమ, కృప వల్ల కార్యం చేశాడు.
నాయకుడు అడగవచ్చు: “మన రక్షణ కథలో హీరో ఎవరు – మనమా, దేవుడా?”

## ప్రశ్న 6కు సహాయం

కృప, విశ్వాసం, క్రియలకు ఏ స్థానం ఉంది?

ఈ క్రమాన్ని బోర్డుపై రాయవచ్చు:
కృప → విశ్వాసం → రక్షణ → మంచి క్రియలు
కృప – రక్షణకు మూలం దేవుడు.
విశ్వాసం – దేవుని బహుమానాన్ని క్రీస్తుపై నమ్మకంతో స్వీకరించే మార్గం.
రక్షణ – దేవుని వరం.
క్రియలు – రక్షణకు ఆధారం కావు.
విశ్వాసం కూడా రక్షణను సంపాదించే ఒక మంచి పని కాదు. అది బహుమానాన్ని స్వీకరించే ఖాళీ చేయి వంటిది.
అందుకే ఎవరికీ గొప్పలు చెప్పుకునే అవకాశం లేదు.

నాయకుడు అడగవచ్చు: “ప్రార్థన, దానం, బాప్తిస్మం, సంఘ హాజరు, సేవ – ఇవి మన రక్షణకు ధర చెల్లించగలవా?”

## ప్రశ్న 7కు సహాయం

“మనము దేవుని పనితనము” అంటే ఏమిటి?
1వ వచనం, 10వ వచనాన్ని పోల్చండి: 2:1 – పాపంలో చనిపోయినవారు. 2:10 – క్రీస్తులో కొత్తగా సృష్టించబడిన దేవుని పనితనం.
ఈ మార్పును చేసినవాడు దేవుడు.

మంచి క్రియల విషయంలో రెండు చిన్న మాటలను గుర్తుంచుకోండి:
BY – మంచి క్రియల వల్ల రక్షణ కాదు.
FOR – మంచి క్రియల కోసం రక్షించబడ్డాము.
మంచి క్రియలు రక్షణకు వేరు (root) కాదు. అవి రక్షణ యొక్క ఫలం (fruit).
అంటే మంచి క్రియలు అవసరం లేవని కాదు. అవి చాలా ముఖ్యమైనవి. కానీ అవి దేవుని అంగీకారాన్ని సంపాదించడానికి కాదు;
దేవుడు మనలను రక్షించి మార్చుతున్నాడనే ఫలంగా వస్తాయి.
నాయకుడు అడగవచ్చు: “చెట్టు మొదట ఫలం ఇచ్చి తరువాత వేర్లు పెంచుకుంటుందా? లేక వేర్లు ఉన్నందువల్ల ఫలం వస్తుందా?”

## ప్రశ్న 8కు సహాయం

ఈ భాగంలో ఏ సత్యం మీ జీవితాన్ని సవాలు చేసింది లేదా ప్రోత్సహించింది?
ఈ ప్రశ్నకు ఒకే సరైన సమాధానం లేదు. సభ్యులు వ్యక్తిగతంగా స్పందించేలా సమయం ఇవ్వండి.

**అవసరమైతే ఇలా అడగవచ్చు:** “నేను ఇంకా నా మంచి పనుల ద్వారా దేవుని అంగీకారాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తున్నానా?”
“లోకపు విలువలు నా నిర్ణయాలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయా?”
“నా పాపానికి ఎప్పుడూ ఇతరులను లేదా సాతానునే కారణంగా చూపిస్తున్నానా?”
“దేవుడు నన్ను మార్చలేడు అని నిరాశపడుతున్నానా?”
“మంచి క్రియల కోసం దేవుడు నన్ను రక్షించాడనే విషయం నా రోజువారీ జీవితాన్ని ఎలా మార్చాలి?”
చర్చ చివర సాధారణ సమాధానంతో ఆగిపోకుండా అడగండి: “ఈ వారం మీరు చేయబోయే ఒక స్పష్టమైన మార్పు ఏమిటి?”

## నాయకులు గమనించవలసిన ముఖ్యమైన విషయం

ఈ భాగాన్ని బోధించేటప్పుడు రెండు విరుద్ధమైన తప్పులను నివారించాలి.

1. **నియమవాదం** : "నేను తగినన్ని మంచి పనులు చేస్తే దేవుడు నన్ను అంగీకరిస్తాడు."
   ఇది ఎఫెసీయులకు 2:8–9కు విరుద్ధం. రక్షణ దేవుని వరం; క్రియల వల్ల కాదు.

2. **నిర్లక్ష్య జీవితం :** "నేను కృపచేత రక్షించబడ్డాను కాబట్టి ఎలా జీవించినా పరవాలేదు." ఇది ఎఫెసీయులకు 2:10కు విరుద్ధం. మనం సత్క్రియలు చేయుటకై క్రీస్తులో కొత్తగా సృష్టించబడ్డాము. పౌలు ఈ రెండింటినీ బోధించడం లేదు.

**అతని క్రమం:**

పాపంలో మృతి → అయినను దేవుడు → క్రీస్తుతో జీవం → విశ్వాసం ద్వారా కృపచేత రక్షణ → దేవుని పనితనం → మంచి క్రియలు. మంచి క్రియలు రక్షణకు ధర కాదు. మంచి క్రియలు రక్షణకు వేరు కాదు. అవి రక్షణ యొక్క ఫలం.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

ఈ గొప్ప వ్యత్యాసాన్ని చర్చ చివర మళ్లీ గుర్తుచేయండి:
"మీరు చచ్చినవారై యుండగా..." (2:1)
↓
"అయినను దేవుడు..." (2:4)
↓
"మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను" (2:5)
↓
"మనము దేవుని పనితనమై..." (2:10)

మనలను మనమే రక్షించుకోలేదు. దేవుడు తన కనికరం, గొప్ప ప్రేమతో కార్యం చేశాడు. కృపచేత మనలను రక్షించి, క్రీస్తులో జీవింపజేసి, మంచి క్రియలతో జీవించడానికి తన పనితనంగా మనలను రూపొందిస్తున్నాడు.

## చివరి ప్రశ్న

నేను చేసే పనుల ద్వారా దేవుని అంగీకారాన్ని ఇంకా సంపాదించడానికి ప్రయత్నిస్తున్నానా? లేక క్రీస్తులో దేవుడు చేసిన కార్యంపై ఆధారపడి, ఆయన కృప నన్ను మార్చడానికి అనుమతిస్తున్నానా?

## బైబిల్ స్టడీ పాఠం 5   ఎఫెసీయులకు 2:11-22

# దూరంగా ఉన్నవారిని ఒకే కుటుంబంగా చేసిన క్రీస్తు

**సందర్భం**

ఎఫెసీయులకు 2:1-10లో మనం ఏమి చూశాం?
మనము పాపాలలో చనిపోయినవారము. మనలను మనమే రక్షించుకోలేకపోయాము. అయినను దేవుడు తన గొప్ప ప్రేమ, కనికరం, కృపచేత మనలను క్రీస్తుతో జీవింపజేశాడు.
మనము ఎలా రక్షించబడ్డాము? మన క్రియల వల్ల కాదు. విశ్వాసం ద్వారా కృపచేత.
అయితే ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది: దేవుడు ఒక్కొక్కరిని విడివిడిగా రక్షించి, "ఇప్పుడు ఎవరి క్రైస్తవ జీవితం వారు ఒంటరిగా జీవించండి" అని వదిలేస్తాడా? లేదు.

ఇప్పుడు 2:11-22లో పౌలు మనలను వ్యక్తిగత రక్షణ నుండి సంఘ జీవితం వైపు తీసుకువెళ్తున్నాడు.

క్రీస్తు మనలను దేవునితో మాత్రమే సమాధానపరుస్తాడా? లేదు.
ఒకరితో ఒకరినీ సమాధానపరుస్తాడు.  దేవుని దగ్గరకు తీసుకురావడమే కాదు, దేవుని ప్రజలతో కూడా కలుపుతాడు.
కాబట్టి సువార్త మన దేవునితో ఉన్న సంబంధాన్ని మాత్రమే కాదు. ఇతర విశ్వాసులతో మన సంబంధాన్ని కూడా మారుస్తుంది.

**ఈ భాగాన్ని సులభంగా ఇలా గుర్తుంచుకోవచ్చు:**

దూరం - దగ్గర - సమాధానం - ఒకటిగా - కుటుంబం - మూలరాయి - కలిసి కట్టబడటం - దేవుని నివాసం

## 1.  "మీరు ఒకప్పుడు ఎలా ఉన్నారో గుర్తుంచుకోండి"  ఎఫెసీయులకు 2:11-12

పౌలు మొదట ఏమంటున్నాడు? "జ్ఞాపకం చేసుకోండి."
ఎందుకు గతాన్ని గుర్తుచేసుకోవాలి? పాత పాపాల్లో మునిగిపోవడానికా?
ఎప్పుడూ అపరాధభావంతో ఉండటానికా? లేదు.
దేవుని కృప ఎంత గొప్పదో గుర్తించడానికి. క్రీస్తు లేకముందు అన్యజనుల పరిస్థితిని పౌలు చాలా గంభీరంగా వివరిస్తున్నాడు.

**వారు:**  - క్రీస్తుకు వేరైనవారు - దేవుని నిబంధన ప్రజలకు వెలుపల ఉన్నవారు - వాగ్దానాలకు పరదేశులు  - నిరీక్షణ లేనివారు - లోకంలో దేవుడు లేనివారు

### సులభంగా చెప్పాలంటే:

క్రీస్తు లేకుండా - నిరీక్షణ లేకుండా - దేవుడు లేకుండా.
ఒక వ్యక్తికి మంచి కుటుంబం ఉండవచ్చు.  విద్య ఉండవచ్చు.  మంచి ఉద్యోగం ఉండవచ్చు.  డబ్బు, పేరు, గౌరవం ఉండవచ్చు. మతపరమైన ఆచారాలు కూడా ఉండవచ్చు.  అయినా క్రీస్తు లేకుండా దేవునికి దూరంగా ఉండటం సాధ్యమే.

**అయితే మన గతాన్ని గుర్తుచేసుకుంటే మనలో ఏమి పెరగాలి?**

గర్వమా?  లేదు.  వినయం.  కృతజ్ఞత.  ఇతరుల పట్ల కనికరం.  మనం కూడా ఒకప్పుడు కృప అవసరమైనవారమే కదా?

**అయితే ప్రశ్న:**  నేను ఈ రోజు దేవుని కృపను ఎక్కువగా గుర్తుంచుకుంటున్నానా? లేక నా మంచితనాన్ని ఎక్కువగా గుర్తుంచుకుంటున్నానా?

## 2. "అయితే ఇప్పుడు క్రీస్తుయేసులో..." ఎఫెసీయులకు 2:13

2:4లో ఏ గొప్ప మాటలు చూశాం? "అయినను దేవుడు..."
ఇప్పుడు 2:13లో పౌలు మరో గొప్ప మలుపు చూపిస్తున్నాడు:
"అయితే ఇప్పుడు క్రీస్తుయేసులో..."
ఒకప్పుడు ఏమి? దూరంగా. ఇప్పుడు? దగ్గరకు తీసుకురాబడ్డారు. ఎలా?
మతపరమైన ఆచారాల వల్లా? లేదు. మంచి పనుల వల్లా? లేదు. మన నీతి వల్లా? లేదు. మన ప్రయత్నం వల్లా? లేదు.

పౌలు స్పష్టంగా చెబుతున్నాడు: "క్రీస్తు రక్తమువలన."

మన పాపం మనలను దేవుని నుండి దూరం చేసింది.
అయితే మనమే దేవుని దగ్గరకు తిరిగి వెళ్లే మార్గం నిర్మించుకోగలిగామా? లేదు.
అందుకే క్రీస్తు మన దగ్గరకు వచ్చాడు. సిలువపై తన రక్తాన్ని చిందించి, మన పాపానికి మూల్యం చెల్లించి, మనలను దేవుని దగ్గరకు తీసుకువచ్చాడు.
**అయితే ముఖ్యమైన ప్రశ్న ఏమిటి?** "ఈ రోజు దేవుడు నాకు దగ్గరగా అనిపిస్తున్నాడా?" అనేదా?
మన భావాలు మారుతుంటాయి.
**అసలు ప్రశ్న:** "క్రీస్తు నన్ను దేవుని దగ్గరకు తీసుకురావడానికి ఏమి చేశాడు?"

## 3. క్రీస్తే మన సమాధానం ఎఫెసీయులకు 2:14

పౌలు ఏమి చెప్పడం లేదు గమనించండి.
"యేసు నీకు కొంత సమాధానం ఇస్తాడు" అని మాత్రమే చెప్పడం లేదు.
అతను ఏమంటున్నాడు? "ఆయనే మన సమాధానము."
ఇది చాలా ముఖ్యమైన మాట. బైబిలు చెప్పే సమాధానం అంటే కేవలం మనసులో ప్రశాంతంగా అనిపించడమా?
కాదు. నిజమైన సమాధానం ఒక వ్యక్తిలో ఉంది – యేసుక్రీస్తులో.

పౌలు కాలంలో యూదులు, అన్యజనుల మధ్య పెద్ద గోడలు ఉండేవి.
మతపరమైన గోడలు. సామాజిక గోడలు. సాంస్కృతిక గోడలు. ఒకరు మరొకరిని తక్కువగా చూసే పరిస్థితి కూడా ఉండేది.
అయితే క్రీస్తు ఏమి చేశాడు? "రెండింటిని ఒకటిగా చేసి" శత్రుత్వపు గోడను కూల్చాడు.
సువార్త మనతో కేవలం: "కొంచెం మంచిగా కలిసి ఉండండి" అని చెబుతుందా? లేదు.
అది అంతకంటే లోతైన పని చేస్తుంది. క్రీస్తులో మనందరికీ ఒక కొత్త గుర్తింపును ఇస్తుంది.
**అయితే ప్రశ్న:** మన పాత భేదాలు బలమైనవా? లేక క్రీస్తులో మన కొత్త గుర్తింపు బలమైనదా?

## 4. సిలువ – దేవునితోనూ, ఒకరితో ఒకరినీ సమాధానపరుస్తుంది ఎఫెసీయులకు 2:15-18

ఇప్పుడు పౌలు ఈ సమాధానం ఎలా వచ్చింది అని వివరిస్తున్నాడు.
సిలువ ద్వారా యూదులు, అన్యజనులు అనే రెండు వర్గాలను క్రీస్తు "ఒక నూతన మనుష్యునిగా" చేశాడు.
అంతేకాదు, వారిని ఒకే శరీరంలో దేవునితో సమాధానపరిచాడు.
ఇక్కడ క్రమాన్ని గమనించండి. మనుషుల మధ్య విభేదమే మన అసలు సమస్యా? లేదు.
అంతకంటే లోతైన సమస్య ఏమిటి? పాపం వల్ల దేవునితో మనకు ఏర్పడిన విరోధం.
కాబట్టి క్రీస్తు మొదట ఏమి చేస్తాడు? మనలను దేవునితో సమాధానపరుస్తాడు.
అప్పుడు ఏమవుతుంది? ఒకే దేవునితో సమాధానం పొందిన మనం ఒకరితో ఒకరం కూడా కొత్త సంబంధంలోకి వస్తాం.
సిలువ దగ్గర ఎవరికైనా గొప్పలు చెప్పుకునే స్థలం ఉందా? లేదు.

ఎందుకంటే: – మనమందరం పాపులమే. – మనందరికీ ఒకే రక్షకుడు అవసరం. – మనందరం ఒకే కృపచేత రక్షించబడతాం.
– మనందరం ఒకే క్రీస్తు ద్వారా దేవుని దగ్గరకు వస్తాం. 18వ వచనంలో ఒక అందమైన సత్యం కనిపిస్తున్నదా?
కుమారుని ద్వారా – ఒకే ఆత్మచేత – తండ్రి దగ్గరకు ఇక్కడ త్రియేక దేవుని కార్యం కనిపిస్తోంది.
అయితే ఒకే తండ్రి దగ్గరకు వచ్చిన మనం మళ్లీ గోడలు కట్టడం సరైనదా? ఏ గోడలు?
*కులం. జాతి. భాష. డబ్బు. విద్య. కుటుంబ నేపథ్యం. సామాజిక స్థానం. డినామినేషన్.*

**అయితే ఒక ప్రశ్న:** క్రీస్తు కూల్చిన గోడలను మనం మళ్లీ ఎందుకు కట్టాలి?

## 5. ఇక పరదేశులు కాదు – దేవుని కుటుంబ సభ్యులు ఎఫెసీయులకు 2:19

ఇప్పుడు పౌలు మరో అందమైన చిత్రం ఉపయోగిస్తున్నాడు.
అతను ఏమంటున్నాడు?
"ఇకమీదట మీరు పరదేశులును అన్యులును కారు; పరిశుద్ధులతో సహపౌరులును దేవుని ఇంటివారునై యున్నారు."
మార్పును గమనించండి: అన్యులు – సహపౌరులు బయటివారు – ఇంటివారు దూరంగా ఉన్నవారు – దగ్గరకు వచ్చినవారు
సువార్త మన పాపాలను క్షమించి పరలోకానికి వెళ్లే అవకాశం మాత్రమే ఇస్తుందా? లేదు.
సువార్త మనకు ఒక కొత్త కుటుంబాన్ని కూడా ఇస్తుంది. దేవుడు మనలను వ్యక్తులుగా రక్షిస్తాడు.
కానీ వ్యక్తులుగా ఒంటరిగా వదిలేస్తాడా? లేదు. తన ఇంటివారిగా చేర్చుకుంటాడు.

అయితే ఒకరు ఇలా చెప్పవచ్చా? "నేను యేసును ప్రేమిస్తాను. కానీ సంఘం నాకు అవసరం లేదు."
ఈ భాగం దానికి సరిపోతుందా? లేదు. సంఘానికి వెళ్లడం మనలను రక్షించదు.
అయితే క్రీస్తు రక్షించినవారిని ఎక్కడికి తీసుకువస్తాడు? తన ప్రజల మధ్యకు.

క్రీస్తుకు చెందడం అంటే ఆయన ప్రజలతో కలిసి: – జీవించడం – ప్రేమించడం – సేవ చేయడం – క్షమించడం
నేర్చుకోవడం – ఎదగడం

**అయితే ప్రశ్న:** నేను సంఘాన్ని కేవలం ఆదివారం వెళ్లే స్థలంగా చూస్తున్నానా? లేక దేవుడు ఇచ్చిన కుటుంబంగా చూస్తున్నానా?

## 6. క్రీస్తే మూలరాయి ఎఫెసీయులకు 2:20

ఇప్పుడు పౌలు కుటుంబం అనే చిత్రం నుండి భవనం అనే చిత్రానికి మారుతున్నాడు.
దేవుని ప్రజలు అపొస్తలులు, ప్రవక్తలు వేసిన పునాదిపై కట్టబడుతున్నారు.
అయితే అత్యంత ముఖ్యమైన రాయి ఎవరు? క్రీస్తుయేసే మూలరాయి.
పాతకాల భవనాల్లో మూలరాయి ఎందుకు ముఖ్యమైనది? భవనం ఏ దిశలో ఉండాలి?
ఎలా సరళంగా కట్టాలి? ఇతర రాళ్లు ఎలా అమరాలి? వీటన్నిటికీ మూలరాయి ఒక ప్రమాణంలా ఉండేది.
అయితే సంఘం దిశను ఎవరు నిర్ణయించాలి? సంస్కృతా? లేదా

ప్రజల అభిప్రాయమా? లేదు. సంప్రదాయమా? లేదు. ధనవంతుడా? లేదు. ప్రభావశీలమైన కుటుంబమా? లేదు. ప్రతిభావంతమైన పాస్టరా? అతడూ కాదు. క్రీస్తే మూలరాయి.

అయితే పునాది ఏమిటి? అపొస్తలులు, ప్రవక్తల ద్వారా వెల్లడించబడిన క్రీస్తు సంబంధమైన సత్యం.
ఆ సత్యం ఇప్పుడు మనకు ఎక్కడ ఉంది? లేఖనాలలో.
అయితే ప్రతి సంఘం ఒక ప్రశ్న అడగాలి: మన సంప్రదాయాలకు సరిపోయేలా లేఖనాలను మార్చుకుంటున్నామా?
లేక, లేఖనాలకు సరిపోయేలా మన సంప్రదాయాలు, అభిరుచులు, ఆచారాలను మార్చుకుంటున్నామా?

## 7. మనమందరం కలిసి కట్టబడుతున్నాము ఎఫెసీయులకు 2:21–22

చివరగా పౌలు విశ్వాసులను ఒకే భవనంలోని రాళ్లుగా చూపిస్తున్నాడు.
ఆయనలో భవనమంతా చక్కగా అమర్చబడి, ప్రభువులో పరిశుద్ధమైన ఆలయంగా పెరుగుతోంది.
తర్వాత పౌలు ఏమంటున్నాడు? "ఆయనలో మీరు కూడ ఆత్మవలన దేవునికి నివాసస్థలముగా కలిసి కట్టబడుచున్నారు."
ఇక్కడ ఒక మాటను ప్రత్యేకంగా గమనించండి: "కలిసి."
క్రైస్తవ విశ్వాసం కేవలం: "యేసు మరియు నేను" అనే వ్యక్తిగత అనుభవమా? లేదు.
దేవుడు ఒక ప్రజను నిర్మిస్తున్నాడు.
ఒక రాయి ఒంటరిగా భవనం అవుతుందా? లేదు.

అలాగే ఒక విశ్వాసి ఎప్పటికీ ఇతర విశ్వాసుల నుండి వేరుగా ఉండటం దేవుని సాధారణ నమూనా కాదు.
పాత నిబంధనలో దేవుని సన్నిధి ప్రత్యేకంగా దేనితో సంబంధం కలిగి ఉండేది? మందిరంతో.
ఇప్పుడు పౌలు ఏ గొప్ప సత్యం చెబుతున్నాడు?
దేవుని ప్రజలే కలిసి పరిశుద్ధాత్మ ద్వారా దేవుని నివాసంగా కట్టబడుతున్నారు.

**అయితే సంఘం అంటే ఏమిటి?**
క్రైస్తవులు సమావేశమయ్యే ఒక భవనమా? అది సమావేశ స్థలం మాత్రమే. దేవుని ప్రజలే దేవుని భవనం.
అయితే మనం ఒకరినొకరు ఎలా చూడాలి? "నాకు నచ్చినవారు, నచ్చని వారు" అని మాత్రమేనా?
లేక, "దేవుడు తన భవనంలో నాతో కలిసి కడుతున్న సహోదరులు, సహోదరీలు" అని చూడాలా?

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం భాగాన్ని కలిపి చూద్దాం.
మనం మొదట ఎక్కడ ఉన్నాము? దేవునికి దూరంగా. అయితే ఏమైంది? క్రీస్తు రక్తం ద్వారా దగ్గరకు తీసుకురాబడ్డాము.
క్రీస్తు ఏమయ్యాడు? మన సమాధానం.
సిలువ ఏమి చేసింది? మనలను దేవునితో సమాధానపరిచింది. ఒకరితో ఒకరినీ సమాధానపరిచింది.
ఇప్పుడు మనం ఏమయ్యాం? ఒక కొత్త ప్రజ. దేవుని కుటుంబ సభ్యులు. మన పునాది ఏమిటి?
అపొస్తల సత్యం.
మూలరాయి ఎవరు? క్రీస్తు.
దేవుడు ఇప్పుడు ఏమి చేస్తున్నాడు? మనందరినీ కలిసి తన నివాసంగా కడుతున్నాడు.

**కాబట్టి సులభంగా గుర్తుంచుకోండి:**

దూరం – దగ్గర – సమాధానం – ఒకటిగా – కుటుంబం – మూలరాయి – కలిసి కట్టబడటం – దేవుని నివాసం

**అన్వయం**

ఈ భాగం కేవలం:
"దేవునితో నా సంబంధం ఎలా ఉంది?" అనే ప్రశ్న మాత్రమే అడగదు.
మరో ప్రశ్న కూడా అడుగుతుంది: "దేవుని ప్రజలతో నా సంబంధం ఎలా ఉంది?"
మొదట మన గతాన్ని గుర్తుచేసుకుందాం.
ఒకప్పుడు మనం కూడా దేవునికి దూరంగా ఉన్నామనే విషయం గుర్తుందా?
అది మనలో ఏమి కలిగించాలి? వినయం.
అయితే ఇతరులను తక్కువగా చూడటానికి మనకు స్థలం ఉందా? లేదు.
ఇప్పుడు మన సంబంధాలను పరిశీలిద్దాం.
ఇతర విశ్వాసుల పట్ల మన హృదయంలో గోడలు ఉన్నాయా?
కులం వల్లా? భాష వల్లా? విద్య వల్లా? డబ్బు వల్లా? ప్రాంతం వల్లా? కుటుంబ నేపథ్యం వల్లా? డినామినేషన్ వల్లా? సామాజిక స్థానం వల్లా?
మనకు నచ్చిన నేపథ్యంలోని విశ్వాసులను దగ్గరగా తీసుకుని, మిగతావారిని దూరంగా ఉంచుతున్నామా?
సిలువ దగ్గర మనందరం ఎక్కడ నిలబడతాం? ఒకే స్థాయిలో. నందరికీ ఒకే రక్షకుడు అవసరం.
అయితే సంఘం గురించి మన ఆలోచన ఏమిటి? సౌకర్యం ఉన్నప్పుడు వెళ్లే స్థలమా?

ఆదివారం కార్యక్రమమా? ఒక ప్రసంగం వినే స్థలమా? లేక, దేవుడు నన్ను తన కుటుంబంలో సభ్యునిగా చేసి, తాను నిర్మిస్తున్న భవనంలో ఒక భాగంగా చేశాడు అని చూస్తున్నామా? ఆరోగ్యకరమైన సంఘం ఒక వ్యక్తి చుట్టూ కట్టబడదు.
దేనిచుట్టూ కట్టబడాలి? క్రీస్తు - ఆయన వాక్యం - సువార్త - ఒకరినొకరు ప్రేమించే దేవుని ప్రజలు

## సువార్త సంబంధం

ఈ భాగమంతా ఏ ఒక్క గొప్ప సత్యం చుట్టూ తిరుగుతోంది?
"క్రీస్తు రక్తమువలన దగ్గరకు తీసుకురాబడ్డారు." - ఎఫెసీయులకు 2:13
పాపం మనలను దేవుని నుండి వేరు చేసింది.
మనమే తిరిగి దేవుని దగ్గరకు వెళ్లే మార్గాన్ని తయారు చేసుకోగలిగామా? లేదు. క్రీస్తే మన దగ్గరకు వచ్చాడు.
సిలువపై తన మరణం ద్వారా మన పాపానికి మూల్యం చెల్లించాడు. మనలను దేవునితో సమాధానపరిచాడు.
అక్కడితో ఆగిపోయాడా? లేదు.

తన రక్తం ద్వారా రక్షించబడినవారిని: - ఒక కొత్త ప్రజగా - ఒక శరీరంగా - ఒక కుటుంబంగా చేశాడు
కాబట్టి సువార్త మనలను: దూరం నుండి - దగ్గరకు అన్యుల నుండి - దేవుని కుటుంబానికి
శత్రుత్వం నుండి - సమాధానానికి వేరుపాటు నుండి - ఒకే శరీరానికి బయటివారిగా ఉండటం నుండి - దేవుని నివాసంగా ఉండటానికి తీసుకువస్తుంది.
ఈ అన్నింటి మధ్యలో ఎవరు ఉన్నారు? యేసుక్రీస్తు. ఆయనే మన సమాధానం. ఆయనే మన మూలరాయి.

## బైబిల్ స్టడీ ప్రశ్నలు - 8

1. ఎఫెసీయులకు 2:11-12 చదవండి. క్రీస్తు లేకముందు అన్యజనుల పరిస్థితిని పౌలు ఎలా వివరిస్తున్నాడు? వారి గతాన్ని ఎందుకు గుర్తుచేసుకోమంటున్నాడు?
2. 2:13లో ఏ గొప్ప మార్పు జరిగింది? "దూరంగా" ఉన్నవారు ఎలా "దగ్గరకు" తీసుకురాబడ్డారు? ఇందులో మన మంచి పనులకు ఏమైనా స్థానం ఉందా?
3. "ఆయనే మన సమాధానము" (2:14) అంటే ఏమిటి? బైబిల్ సమాధానం కేవలం ప్రశాంతంగా అనిపించడం కంటే ఎలా ఎక్కువ?
4. 2:15-18 ప్రకారం సిలువ మనలను ఎవరితో సమాధానపరుస్తుంది? దేవునితో సమాధానం మరియు ఒకరితో ఒకరికి సమాధానం ఎలా కలుస్తాయి?
5. 2:19 ప్రకారం విశ్వాసులకు ఏ కొత్త గుర్తింపు వచ్చింది? "దేవుని ఇంటివారు" కావడం మన స్థానిక సంఘ జీవితాన్ని ఎలా మార్చాలి?
6. 2:20లో క్రీస్తు "మూలరాయి" కావడం అంటే ఏమిటి? సంఘం యొక్క దిశ, బోధ, నిర్ణయాలను చివరికి ఎవరు నిర్ణయించాలి?
7. 2:21-22లో "కలిసి కట్టబడటం" అంటే ఏమిటి? "యేసు నాకు చాలు; సంఘం అవసరం లేదు" అనే ఆలోచనను ఈ వచనాలు ఎలా సవాలు చేస్తున్నాయి?
8. క్రీస్తు కూల్చిన గోడలను మనం నేడు ఏ విధాలుగా మళ్లీ కట్టే ప్రమాదం ఉంది? ఈ భాగానికి స్పందనగా మన జీవితంలో ఒక స్పష్టమైన మార్పు ఏమి కావాలి?

## నాయకులకు - ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులను వాక్యాన్ని చదవనివ్వండి. వెంటనే సమాధానం చెప్పకండి. ఇలాంటి చిన్న ప్రశ్నలతో వారికి సహాయం చేయండి: "ఈ సమాధానం ఏ వచనంలో కనిపిస్తోంది?" "ఈ మాట ఎందుకు ముఖ్యమైనది?" "ఇక్కడ ఏ మార్పు కనిపిస్తోంది?" "ఇది మన సంఘ జీవితానికి ఎలా వర్తిస్తుంది?" "ఇంకెవరైనా వేరే విషయం గమనించారా?"

**ప్రశ్న 1** - గతాన్ని ఎందుకు గుర్తుంచుకోవాలి?

**అన్యజనులు:** - క్రీస్తుకు వేరైనవారు - నిబంధన ప్రజలకు వెలుపల ఉన్నవారు - వాగ్దానాలకు పరదేశులు
నిరీక్షణ లేనివారు - దేవుడు లేనివారు
గతాన్ని గుర్తుంచుకోవడం అపరాధభావంలో మునిగిపోవడానికి కాదు. ఎందుకు?
దేవుని కృప గొప్పతనాన్ని చూడటానికి.
అది మనలో వినయం, కృతజ్ఞత, ఇతరుల పట్ల కనికరం కలిగించాలి.
**ఇంకా అడగండి:** "మనమూ కృపవల్లే వచ్చామని గుర్తుంటే, ఇతరులను తక్కువగా చూడగలమా?"

**ప్రశ్న 2** - దూరం నుండి దగ్గరకు

2:13లో రెండు మాటలను పోల్చండి: ఒకప్పుడు - దూరంగా ఇప్పుడు - దగ్గరగా ఎలా?
క్రీస్తు రక్తమువలన. మన మంచి పనులు, ఆచారాలు, నీతి దేవుని దగ్గరకు మనలను తీసుకురాలేదు.
క్రీస్తు చేసిన కార్యమే ఆధారం.

**ఇంకా అడగండి:** "దేవుని దగ్గరకు రావడానికి నా ఆధారం ఏమిటి - నా పనులా, క్రీస్తు రక్తమా?"

**ప్రశ్న 3** – "ఆయనే మన సమాధానం" సమాధానం ఒక భావం మాత్రమే కాదు.

క్రీస్తే మన సమాధానం. ఆయన దేవునితో ఉన్న విరోధాన్ని తొలగించాడు.
యూదు-అన్యజనుల మధ్య ఉన్న శత్రుత్వ గోడను కూడా కూల్చాడు.

**ఇంకా అడగండి:** "బయట పరిస్థితులు ప్రశాంతంగా ఉండటం మరియు క్రీస్తులో నిజమైన సమాధానం ఉండటం మధ్య తేడా ఏమిటి?"

**ప్రశ్న 4** – సిలువ రెండు దిశల్లో పనిచేస్తుంది

ముందుగా మన సమస్య దేవునితో ఉంది. పాపం వల్ల మనం దేవునికి విరోధులమయ్యాము.
క్రీస్తు సిలువ ద్వారా మనలను దేవునితో సమాధానపరచాడు. ఆ తర్వాత ఒకే దేవునితో సమాధానపరచబడిన వారిని ఒకే శరీరంగా కలిపాడు.

**18వ వచనంలో ఈ క్రమాన్ని సభ్యులతో చెప్పించండి:** కుమారుని ద్వారా - ఒకే ఆత్మచేత - తండ్రి దగ్గరకు
**ఇంకా అడగండి:** "ఒకే తండ్రి దగ్గరకు వచ్చిన మనం ఒకరినొకరు పరాయివారిగా చూడగలమా?"

**ప్రశ్న 5** – దేవుని కుటుంబం

2:19లో మార్పు ఏమిటి? పరదేశులు కాదు - సహపౌరులు అన్యులు కాదు - దేవుని ఇంటివారు
రక్షణ కేవలం వ్యక్తిగత అనుభవం కాదు. దేవుడు మనలను తన ప్రజలతో కలుపుతాడు.

అందుకే సంఘంలో: - ప్రేమ - సేవ - సహవాసం - క్షమాపణ - బాధ్యత - పరస్పర ఎదుగుదల అవసరం

**ఇంకా అడగండి:** "కుటుంబంలో సభ్యుడిగా ఉండటం కేవలం వారానికి ఒకసారి రావడమేనా? అయితే దేవుని కుటుంబంలో సభ్యుడిగా ఉండటం ఏమి కలిగి ఉండాలి?"

**ప్రశ్న 6** – క్రీస్తు మూలరాయి

మూలరాయి భవనం యొక్క దిశను, సరళిని నిర్ణయిస్తుంది.
అలాగే సంఘాన్ని ఎవరు నియంత్రించకూడదు? పాస్టర్. ధనవంతుడు.ఒక కుటుంబం. సంప్రదాయం. ప్రజాభిప్రాయం.
వీరిలో ఎవ్వరూ చివరి అధికారం కాదు. క్రీస్తే మూలరాయి.
అపొస్తలుల ద్వారా వెల్లడించబడిన సత్యం ఇప్పుడు మనకు లేఖనాలలో ఉంది.

**ఇంకా అడగండి:** "మన అభిరుచులకు సరిపడేలా బైబిల్‌ను మార్చుకుంటామా? లేక బైబిల్‌కు సరిపడేలా మన అభిరుచులను మార్చుకుంటామా?"

**ప్రశ్న 7** – కలిసి కట్టబడటం

ఒక రాయి ఒంటరిగా భవనం కాదు.
అలాగే దేవుడు విశ్వాసులను ఒంటరిగా మాత్రమే ఎదగనివ్వడం లేదు.
తన ప్రజలను కలిసి నిర్మిస్తున్నాడు.
ఇక్కడ ఆలయం అంటే ప్రధానంగా భౌతిక భవనం కాదు.
దేవుని ప్రజలే కలిసి పరిశుద్ధాత్మ ద్వారా ఆయన నివాసం.
అందుకే "యేసు నాకు చాలు; ఆయన ప్రజలు అవసరం లేదు" అనే మాట ఈ భాగానికి సరిపోదు.

**ఇంకా అడగండి:** "దేవుడు నన్ను ఇతర విశ్వాసులతో కలిసి కడుతున్నాడంటే, నేను వారితో ఎలాంటి సంబంధం పెంచుకోవాలి?"

**ప్రశ్న 8** – మనం మళ్లీ కట్టే గోడలు

ఈ చర్చను కేవలం సమాజాన్ని విమర్శించేలా తీసుకెళ్లకండి.
వ్యక్తిగతంగా అడగండి: "క్రీస్తు శరీరంలో నేను దూరంగా ఉంచే లేదా తక్కువగా చూసే వారు ఎవరైనా ఉన్నారా?"
గోడలు ఏ రూపంలో రావచ్చు?
- కులం - భాష - డబ్బు - విద్య - ప్రాంతం - సామాజిక స్థానం - కుటుంబ నేపథ్యం - డినామినేషన్ గర్వం
ప్రాక్టికల్ స్పందనలు ఏమై ఉండవచ్చు? - భిన్న నేపథ్యాల విశ్వాసులను స్వాగతించడం - సమాధానం కోరడం
- క్షమించడం- స్థానిక సంఘంలో సేవ చేయడం- గర్వాన్ని విడిచిపెట్టడం

**ఇంకా అడగండి:** "క్రీస్తు కూల్చిన ఏ గోడను నేను నా హృదయంలో మళ్లీ కడుతున్నాను?"

## నాయకులు గమనించవలసిన ముఖ్యమైన విషయం

ఈ భాగంలో చెప్పే ఐక్యత అంటే అన్ని తేడాలు మాయమవడం కాదు.
అలాగే: "సిద్ధాంతం ముఖ్యం కాదు. ఎలాగైనా కలిసి ఉండండి" అని కూడా పౌలు చెప్పడం లేదు.
నిజమైన క్రైస్తవ ఐక్యత ఎక్కడ నిర్మించబడుతుంది? క్రీస్తులో - సిలువ ద్వారా - అపొస్తల సత్యపు పునాదిపై - క్రీస్తు మూలరాయిగా
కాబట్టి క్రైస్తవ ఐక్యత సత్యాన్ని పక్కనపెట్టి సాధించేది కాదు.

అది సువార్త సత్యం మరియు క్రీస్తులో మన ఉమ్మడి గుర్తింపు చుట్టూ నిర్మించబడుతుంది.
అలాగే "సమాధానం" అంటే తీవ్రమైన పాపం, అన్యాయం లేదా దుర్వినియోగాన్ని పట్టించుకోకపోవడం కాదు.
బైబిలు సమాధానంలో: - సత్యం - పశ్చాత్తాపం - క్షమాపణ - న్యాయం - పరిశుద్ధత కూడా ఉంటాయి

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చ చివర ఈ క్రమాన్ని సభ్యులతో మళ్లీ చెప్పించండి: "ఒకప్పుడు మీరు దూరంగా ఉన్నారు"
"అయితే ఇప్పుడు క్రీస్తులో..." "క్రీస్తు రక్తమువలన దగ్గరకు తీసుకురాబడ్డారు" "ఆయనే మన సమాధానం"
"దేవుని ఇంటివారు" "కలిసి కట్టబడుతున్నారు."
క్రీస్తు విడివిడిగా ఉన్న వ్యక్తులను మాత్రమే రక్షించడు. తన రక్తం ద్వారా పాపులను దేవుని దగ్గరకు తీసుకువస్తాడు.
తర్వాత వారిని ఒకరితో ఒకరిని సమాధానపరుస్తాడు. ఒక కుటుంబంగా చేస్తాడు. ఒక భవనంగా కలిసి కడతాడు.
పరిశుద్ధాత్మ ద్వారా వారిని దేవుని నివాసంగా చేస్తున్నాడు.

## చివరి ప్రశ్న

క్రీస్తు రక్తం మనందరినీ ఒకే తండ్రి దగ్గరకు తీసుకువచ్చినప్పుడు, క్రీస్తు కూల్చిన గోడలను మనం మళ్లీ కట్టడానికి మనకు ఏ హక్కు ఉంది?

బైబిల్ అధ్యయన పాఠం 6 ఎఫెసీయులకు 3:1-13

# క్రీస్తు మరియు సంఘం అనే మర్మం

## సందర్భం

ఎఫెసీయులకు 2వ అధ్యాయంలో మనం ఏమి చూశాం?
ఒకప్పుడు అన్యజనులు దేవునికి దూరంగా ఉన్నారు. కానీ క్రీస్తు తన రక్తం ద్వారా వారిని దగ్గరకు తీసుకొచ్చాడు.
యూదులు, అన్యజనులు ఇక రెండు వేర్వేరు ప్రజలుగా ఉండాల్సిన అవసరం ఉందా? లేదు.
క్రీస్తు ఇద్దరినీ ఏమి చేశాడు? ఒకే శరీరంగా, ఒకే కుటుంబంగా, దేవుడు నివసించే ఒకే మందిరంగా.

ఇప్పుడు 3వ అధ్యాయంలో పౌలు ఈ గొప్ప సత్యాన్ని మరింత వివరంగా చెబుతున్నాడు.
అతను దీనిని ఒక ప్రత్యేకమైన మాటతో పిలుస్తున్నాడు: "మర్మం."
"మర్మం" అంటే ఎవరికీ అర్థం కాని రహస్యమా? కాదు.
ఈ సందర్భంలో "మర్మం" అంటే, గతంలో పూర్తిగా తెలియజేయబడకుండా ఉండి, ఇప్పుడు దేవుడు స్పష్టంగా బయలుపరచిన సత్యం. అయితే ఆ మర్మం ఏమిటి?
సువార్త ద్వారా యూదులు, అన్యజనులు క్రీస్తులో సమానంగా దేవుని ప్రజలలో చేర్చబడ్డారు.
వారు: సహవారసులు, ఒకే శరీరంలోని సభ్యులు, ఒకే వాగ్దానంలో భాగస్వాములు.

ఈ గొప్ప సువార్తను అన్యజనులకు ప్రకటించే బాధ్యత దేవుడు పౌలుకు ఇచ్చాడు.

**ఈ భాగాన్ని సులభంగా ఇలా గుర్తుంచుకోవచ్చు:**
ఖైదీ - మర్మం - కలిసి - కృప - ఐశ్వర్యం - సంఘం - జ్ఞానం - సంకల్పం - ప్రవేశం - శ్రమ

## 1. "క్రీస్తుయేసు ఖైదీ" ఎఫెసీయులకు 3:1

పౌలు ఎలా ప్రారంభిస్తున్నాడో గమనించండి: "అన్యజనులైన మీ నిమిత్తము క్రీస్తుయేసు ఖైదీనైన పౌలను నేను..."
పౌలు నిజంగా ఎవరి ఖైదీ? రోమా ప్రభుత్వానికి.
అయితే అతను తనను మొదట "రోమా ఖైదీ" అని ఎందుకు పిలవలేదు? అతను తనను "క్రీస్తుయేసు ఖైదీ" అని పిలుస్తున్నాడు.
ఇది మనకు ఏమి చూపిస్తుంది? పౌలు తన పరిస్థితిని దేవుని నియంత్రణకు బయట జరిగిన ప్రమాదంలా చూడలేదు.
చెరసాలలో ఉండటం సులభమా? లేదు. అది బాధాకరమైనదే. కానీ పౌలు ఇలా అనుకోలేదు: "ఇప్పుడు దేవుని ప్రణాళిక ఆగిపోయింది."
అతను ఏమి నమ్మాడు? ఈ కష్టమైన పరిస్థితిలో కూడా దేవుడు తన ఉద్దేశాన్ని నెరవేర్చగలడు.
మనకు కష్టం వచ్చినప్పుడు మొదట ఏ ప్రశ్న వస్తుంది? "ఇది నాకు ఎందుకు జరిగింది?"
అది సహజమైన ప్రశ్న. కానీ మరో ప్రశ్న కూడా అడగవచ్చా? "ఈ పరిస్థితిలో కూడా దేవుడు నన్ను ఎలా ఉపయోగించగలడు?"
దీని అర్థం ప్రతి కష్టానికి వెంటనే కారణం కనుక్కోవాలని కాదు. ప్రతి శ్రమను తేలికగా తీసుకోవాలని కూడా కాదు.
**కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి:** కష్టం వచ్చిందంటే దేవుడు తన నియంత్రణను కోల్పోయాడని కాదు.

## 1. 2. ఇప్పుడు బయలుపరచబడిన మర్మం ఎఫెసీయులకు 3:2-6

పౌలు ఏమి చెబుతున్నాడు? దేవుడు తనకు "క్రీస్తు మర్మం" బయలుపరిచాడని.
అయితే ఆ మర్మం ఏమిటో ఊహించాల్సిన అవసరం ఉందా? లేదు.
6వ వచనంలో పౌలే స్పష్టంగా చెబుతున్నాడు.
సువార్త ద్వారా అన్యజనులు: సహవారసులు, ఒకే శరీరంలోని సభ్యులు, క్రీస్తుయేసులో వాగ్దానంలో భాగస్వాములు.
ఇక్కడ ఒక భావం మళ్లీ మళ్లీ వస్తున్నదా? అది ఏమిటి?
"కలిసి." కలిసి వారసులు. కలిసి ఒకే శరీరంలోని సభ్యులు. కలిసి దేవుని వాగ్దానంలో భాగస్వాములు.
అయితే అన్యజన విశ్వాసులు రెండో తరగతి క్రైస్తవులా? లేదు.
క్రీస్తులో వారికి కూడా: అదే వారసత్వం, అదే శరీరంలో స్థానం, అదే వాగ్దానం. ఇది చాలా ముఖ్యమైన విషయం.
సువార్త కేవలం ఒక వ్యక్తిని దేవునితో సమాధానపరుస్తుందా? అక్కడితో ఆగిపోదు.
సువార్త ఒక కొత్త ప్రజను కూడా సృష్టిస్తుంది.

అయితే మన సంఘాలకు ఇది ఏమి చెబుతుంది? కులం ఆధారంగా ఎవ్వరినైనా తక్కువగా చూడవచ్చా? భాష ఆధారంగా? డబ్బు ఆధారంగా? విద్య ఆధారంగా? సామాజిక స్థానం ఆధారంగా? ప్రాంతం లేదా జాతి ఆధారంగా?
క్రీస్తు ఒకే శరీరంగా చేసిన వారిలో కొందరిని మనం "తక్కువ స్థాయి" వారిగా చూడగలమా?
లేదు.
**సులభంగా గుర్తుంచుకోండి:** ఒకే రక్షకుడు. ఒకే సువార్త. ఒకే శరీరం. ఒకే వారసత్వం. క్రీస్తులో ఆత్మీయ ఉన్నత-నిమ్న భావాలకు స్థానం లేదు.

## 3. కృపచేత సువార్త సేవకుడు ఎఫెసీయులకు 3:7-8

పౌలు తన పరిచర్య గురించి ఏమి చెబుతున్నాడు? "దేవుని కృపావరము ప్రకారము నేను ఈ సువార్తకు పరిచారకుడనైతిని." ఇది గమనించారా?
పౌలు ఇలా చెప్పడం లేదు: "నేను చాలా గొప్పవాడిని, అందుకే దేవుడు నన్ను ఉపయోగించాడు." "నా ప్రతిభ వల్ల నాకు ఈ పరిచర్య వచ్చింది." "ఇది నా హోదా."
అతను ఏమంటున్నాడు? "ఇది కృప." అతను పరిచర్యను తన సాధనగా కాకుండా దేవుడు ఇచ్చిన వరంగా చూస్తున్నాడు.
అందుకే తన గురించి వినయంగా మాట్లాడుతున్నాడు.
కానీ అదే సమయంలో దేవుడు అతనికి ఒక గొప్ప బాధ్యత ఇచ్చాడు. అది ఏమిటి?
అన్యజనులకు క్రీస్తు యొక్క అపారమైన ఐశ్వర్యాన్ని ప్రకటించడం. "క్రీస్తు యొక్క అపారమైన ఐశ్వర్యం" - ఎంత అందమైన మాట!
క్రీస్తు గురించి ఎంత నేర్చుకున్నా, ఒక రోజు: "ఇక ఆయన గురించి తెలుసుకోవడానికి ఏమీ లేదు" అని చెప్పగలమా? లేదు.
ఆయన కృప. ఆయన ప్రేమ. ఆయన జ్ఞానం. ఆయన మహిమ. ఆయన సమృద్ధి. ఆయన సరిపడినతనం. ఇవన్నీ పూర్తిగా కొలవగలమా? లేదు.
**అందుకే ప్రతి పరిచారకుడు ఒక ప్రశ్న అడగాలి:**
"నేను పరిచర్యను నా హోదాగా చూస్తున్నానా? లేక దేవుడు కృపచేత ఇచ్చిన భాగ్యంగా చూస్తున్నానా?"

## 4. పరిచర్య క్రీస్తు గురించి - పరిచారకుని గురించి కాదు

పౌలుకు గొప్ప పిలుపు ఉంది. గొప్ప బాధ్యత ఉంది.
అయితే అతను పరిచర్యను తన చుట్టూ తిరిగేలా చేశాడా? లేదు.
అతని పని ఏమిటి? క్రీస్తు యొక్క అపారమైన ఐశ్వర్యాన్ని ప్రకటించడం. ఇది ప్రతి క్రైస్తవ నాయకుడికి ఒక ముఖ్యమైన హెచ్చరిక.
పరిచర్య నెమ్మదిగా దేనిచుట్టూ తిరగవచ్చు? హోదా. గుర్తింపు. వేదిక. ప్రభావం. అనుచరులు. నియంత్రణ.
అప్పుడు ప్రమాదం ఏమిటి? ప్రజలు క్రీస్తును చూడాల్సింది పోయి నాయకుడినే ఎక్కువగా చూడడం మొదలుపెడతారు.
కానీ పౌలు ఏమి చేశాడు? తనను సందేశానికి యజమానిగా చూడలేదు.
దేవుడు అప్పగించిన సందేశాన్ని విశ్వాసంగా అందించే సేవకుడిగా చూశాడు.
**అందుకే ప్రతి బోధకుడు తనను తాను అడగాలి:**
"నేను బోధించిన తరువాత ప్రజలు నా గొప్పతనాన్ని ఎక్కువగా చూస్తున్నారా? లేక క్రీస్తు యొక్క అపారమైన ఐశ్వర్యాన్ని ఎక్కువగా చూస్తున్నారా?"

## 5. సంఘం ద్వారా దేవుని జ్ఞానం కనిపిస్తుంది ఎఫెసీయులకు 3:9-10

ఇప్పుడు పౌలు సంఘం గురించి ఆశ్చర్యకరమైన విషయం చెబుతున్నాడు.
దేవుని ఉద్దేశం ఏమిటి? "సంఘము ద్వారా దేవుని నానావిధమైన జ్ఞానం తెలియజేయబడుట."
అయితే సంఘం అంటే ఏమిటి? ఆదివారం వచ్చి పాటలు పాడి, ప్రసంగం విని, ఇంటికి వెళ్లే స్థలం మాత్రమేనా? లేదు.
పౌలు ఇంకా గొప్ప చిత్రం చూపిస్తున్నాడు. సహజంగా కలిసి ఉండని ప్రజలను దేవుడు క్రీస్తులో ఒకటిగా చేస్తున్నాడు.
యూదులు, అన్యజనులు. ధనవంతులు, పేదలు. వేర్వేరు భాషలవారు. వేర్వేరు సంస్కృతులవారు. వేర్వేరు వయస్సులవారు.
వేర్వేరు వృత్తులవారు. వేర్వేరు సామాజిక నేపథ్యాలవారు.
ఇవన్నీ ఒకే సంఘంలో ఉండవచ్చు. అయితే వారు ఒకరినొకరు ఎలా చూడాలి?
పోటీగా? శత్రువులుగా? కాదు. వారు: ప్రేమించాలి, సేవ చేయాలి, కలిసి ఆరాధించాలి, కలిసి ప్రార్థించాలి, భోజనం పంచుకోవాలి, క్షమించాలి, ఒకరి అవసరాన్ని మరొకరు చూడాలి.
ఇలా జరిగితే అది ఏమి చూపిస్తుంది? సువార్త శక్తిని.
అందుకే సంఘం కేవలం సువార్త గురించి మాట్లాడకూడదు. సువార్త ఏమి చేయగలదో జీవించి చూపాలి.

## 6. దేవుని నానావిధమైన జ్ఞానం

"నానావిధమైన జ్ఞానం" అంటే ఏమిటి? దేవుని జ్ఞానానికి ఎన్నో కోణాలు ఉన్నాయని.
అయితే దేవుని జ్ఞానం అందరినీ ఒకేలా చేయడంలో కనిపిస్తుందా? కాదు.
దేవుడు భిన్నమైన ప్రజలను క్రీస్తులో ఒకటిగా చేస్తున్నాడు.
వారి భాషలు ఒకేలా ఉండాల్సిన అవసరం ఉందా? లేదు. సంస్కృతులు? లేదు. వయస్సులు? లేదు. వృత్తులు? లేదు. వ్యక్తిత్వాలు? అవి కూడా కాదు. అయితే ఏమి పోవాలి? శత్రుత్వం. గర్వం. ఉన్నత-నిమ్న భావం.
క్రైస్తవ ఐక్యత అంటే అందరూ ఒకేలా మారిపోవడం కాదు. భిన్నమైన ప్రజలు ఒకే క్రీస్తులో, ఒకే సువార్తచేత ఐక్యమవడం.
అయితే మన స్థానిక సంఘాన్ని చూసినప్పుడు ఇది కనిపిస్తున్నదా? మన సంఘంలో దేవుని నానావిధమైన జ్ఞానం కనిపిస్తున్నదా?

## 7. సంఘం దేవుని నిత్య సంకల్పంలో భాగం ఎఫెసీయులకు 3:11

పౌలు ఏమి చెబుతున్నాడు? ఇదంతా "మన ప్రభువైన క్రీస్తుయేసునందు ఆయన చేసిన నిత్య సంకల్పము ప్రకారం" జరిగిందని.
అయితే సంఘం దేవుని తరువాత వచ్చిన ఆలోచనా?

మానవులు పాపం చేసిన తరువాత దేవుడు తొందరగా చేసిన రెండో ప్రణాళికా? లేదు.
సంఘం దేవుని నిత్య సంకల్పంలో భాగం. ఇది సంఘానికి ఎంత గొప్ప గౌరవం ఇస్తుందో ఆలోచించండి.
లోకపు ప్రమాణాల ప్రకారం ఒక స్థానిక సంఘం చిన్నదిగా కనిపించవచ్చు. బలహీనంగా కనిపించవచ్చు. పేరు, ప్రభావం లేకపోవచ్చు. సమస్యలు కూడా ఉండవచ్చు.
అయితే దేవుని దృష్టిలో? సంఘానికి గొప్ప స్థానం ఉంది. అందుకే సంఘాన్ని కేవలం వారానికి ఒకసారి సమావేశం పెట్టే సంస్థగా చూడకూడదు. క్రీస్తు ద్వారా దేవుని జ్ఞానం, మహిమ కనిపించే ప్రజల సమూహంగా చూడాలి.

## 8. దేవుని దగ్గరకు ధైర్యంగా రావడం  ఎఫెసీయులకు 3:12

ఇప్పుడు పౌలు సువార్త యొక్క మరో గొప్ప ఫలితాన్ని చెబుతున్నాడు.
క్రీస్తులో విశ్వాసం ద్వారా మనం ఏమి చేయగలము? ధైర్యంతో, నమ్మకంతో దేవుని దగ్గరకు రాగలము.
**ఈ మాటలను ఆలోచించండి**: స్వేచ్ఛ. ధైర్యం. ప్రవేశం. అయితే మనం దేవుని దగ్గరకు ఎందుకు రాగలము?
ఈ వారం బాగా జీవించాం కాబట్టా? ఎక్కువగా ప్రార్థించాం కాబట్టా? బైబిల్ ఎక్కువగా చదివాం కాబట్టా?
ఎక్కువ సేవ చేశాం కాబట్టా? లేదు. మనం క్రీస్తు ద్వారా వస్తాము.
మన ధైర్యం మన ఆత్మీయ పనితీరులో లేదు. ఎక్కడ ఉంది? క్రీస్తులో.
కొన్నిసార్లు మనకు ఇలా అనిపించవచ్చు: "నేను ఇంత బలహీనుడిని." "నేను విఫలమయ్యాను." "నా లాంటి వ్యక్తిని దేవుడు తన దగ్గరకు అనుమతిస్తాడా?" సువార్త ఏమి చెబుతుంది? క్రీస్తు ద్వారా నీకు తండ్రి దగ్గరకు ప్రవేశం ఉంది.
అందుకే మనం మన పనులను చూసి ధైర్యం పొందడం కాదు. క్రీస్తును చూసి ధైర్యంగా దేవుని దగ్గరకు రావాలి.

## 9. శ్రమల వల్ల నిరుత్సాహపడవద్దు ఎఫెసీయులకు 3:13

పౌలు ఇప్పుడు ఏమంటున్నాడు?
"మీ నిమిత్తము నాకు కలిగిన శ్రమలను బట్టి మీరు నిరుత్సాహపడవద్దని వేడుకొనుచున్నాను."
ఎఫెసీయులు పౌలును చూసి ఏమనుకుని ఉండవచ్చు?
"పౌలు దేవుని సేవకుడు కదా. అయితే అతను ఎందుకు చెరసాలలో ఉన్నాడు?"
"దేవుడు అతనితో ఉంటే ఇన్ని కష్టాలు ఎందుకు?" మనమూ ఎప్పుడైనా ఇలానే ఆలోచిస్తామా? "దేవుడు నాతో ఉంటే అన్నీ సాఫీగా జరగాలి." కానీ పౌలు జీవితం ఏమి చెబుతోంది?
అది తప్పనిసరి కాదు. పౌలు శ్రమపడుతున్నాడు. అయినా దేవుడు అతన్ని ఉపయోగిస్తున్నాడు.
అయితే శ్రమ దేవుని ప్రణాళిక విఫలమైందని చూపుతుందా? లేదు.
శ్రమ మరియు విశ్వాసమైన సేవ ఒకేసారి ఉండవచ్చు.
పౌలు చెరసాలలో ఉన్నప్పటికీ సువార్త ముందుకు వెళ్తోంది.
ప్రతి శ్రమకు కారణం మనకు వెంటనే తెలుసా? లేదు. అందుకే ఊహించి కారణాలు చెప్పకూడదు.
కానీ ఒక విషయం తెలుసు: శ్రమ వచ్చిందంటే దేవుని ప్రణాళిక విఫలమైందని కాదు.

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం ప్రవాహాన్ని ఒకసారి చూద్దాం.
పౌలు తనను ఏమని పిలుస్తున్నాడు? క్రీస్తు ఖైదీ.
దేవుడు అతనికి ఏమి బయలుపరిచాడు? మర్మం.
ఆ మర్మం ఏమిటి? యూదులు, అన్యజనులు కలిసి ఒకే శరీరమవడం.
పౌలు పరిచర్యను ఎలా పొందాడు? కృపచేత.
అతను ఏమి ప్రకటిస్తున్నాడు? క్రీస్తు యొక్క అపారమైన ఐశ్వర్యాన్ని.
దేవుడు సంఘం ద్వారా ఏమి చూపిస్తున్నాడు? తన నానావిధమైన జ్ఞానాన్ని.
ఇది ఎప్పటి ప్రణాళిక? దేవుని నిత్య సంకల్పం.
క్రీస్తు ద్వారా మనకు ఏమి లభించింది? దేవుని దగ్గరకు ప్రవేశం.
అయితే శ్రమ వచ్చినప్పుడు? నిరుత్సాహపడకూడదు.

**సులభంగా గుర్తుంచుకోండి:**
ఖైదీ – మర్మం – కలిసి – కృప – ఐశ్వర్యం – సంఘం – జ్ఞానం – సంకల్పం – ప్రవేశం – శ్రమ

## అన్వయం

ఇప్పుడు మన జీవితాన్ని పరిశీలిద్దాం. మనం ఇతర విశ్వాసులను ఎలా చూస్తున్నాం?
దేవుడు మనలను ఒకే శరీరంగా చేశాడంటే, మనం ఇంకా: కులం వల్ల, భాష వల్ల, విద్య వల్ల, డబ్బు వల్ల, వృత్తి వల్ల, సామాజిక స్థానం వల్ల కొంతమందిని తక్కువగా చూస్తున్నామా? క్రీస్తులో రెండో తరగతి విశ్వాసులు ఉన్నారా? లేదు.
మనం పరిచర్యను ఎలా చూస్తున్నాం? నా హోదా? నా పేరు? నా వేదిక? నా ప్రభావం? లేక దేవుడు కృపచేత ఇచ్చిన సేవా?

పరిచర్య ద్వారా ప్రజలు ఎవరిని ఎక్కువగా చూడాలి? క్రీస్తును.
మనం సంఘాన్ని ఎలా చూస్తున్నాం? సమావేశాలు నిర్వహించే సంస్థగా మాత్రమేనా?
లేక భిన్నమైన ప్రజలను క్రీస్తులో ఒకటిగా చేసి, తన జ్ఞానాన్ని చూపించే దేవుని ప్రజలుగా చూస్తున్నామా?
మనం ప్రార్థనను ఎలా చూస్తున్నాం? దేవుని దగ్గరకు రావడానికి ముందు మనం అర్హులుగా మారాలి అనుకుంటున్నామా?
లేక: "క్రీస్తు ద్వారా నాకు ప్రవేశం ఉంది" అని నమ్ముతున్నామా? మనం శ్రమను ఎలా చూస్తున్నాం? కష్టం వచ్చిన వెంటనే:
"ఏదో తప్పు జరిగింది" అని అనుకుంటున్నామా? లేక: "ఈ కష్టంలో కూడా దేవుడు తన ఉద్దేశాన్ని నెరవేర్చగలడు"
అని నమ్ముతున్నామా?

## సువార్త సంబంధం

ఈ భాగానికి కేంద్రం ఎవరు? యేసుక్రీస్తు.
సువార్త ద్వారా వేరుపడిన ప్రజలు ఏమయ్యారు? ఒకే శరీరం.
క్రీస్తు ద్వారా బయటివారు ఏమయ్యారు? సహవారసులు.
క్రీస్తు ద్వారా మనం దేనిలో భాగం పొందాము? దేవుని వాగ్దానంలో.
క్రీస్తు ద్వారా సంఘం ఏమి చూపిస్తోంది? దేవుని జ్ఞానం.
క్రీస్తుపై విశ్వాసం ద్వారా మనం ఎక్కడికి రాగలం? తండ్రి దగ్గరకు.
అందుకే సువార్త కేవలం ఈ ప్రశ్నకు సమాధానం కాదు: "నేను ఎలా రక్షించబడగలను?" మరో ప్రశ్నకు కూడా సమాధానం ఇస్తుంది: "ఇప్పుడు నా ప్రజలు ఎవరు?"
సమాధానం ఏమిటి? క్రీస్తుకు చెందిన ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబానికి, ఒకే శరీరానికి చెందినవారు.

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు – 8

1. ఎఫెసీయులకు 3:1–6 చదవండి. పౌలు తనను "క్రీస్తుయేసు ఖైదీ" అని ఎందుకు పిలుస్తున్నాడు? ఈ భాగంలో "మర్మం" అంటే ఏమిటి?
2. 6వ వచనం ప్రకారం దేవుడు బయలుపరచిన మర్మం ఏమిటి? "సహవారసులు, ఒకే శరీరంలోని సభ్యులు, వాగ్దానంలో భాగస్వాములు" అనే మాటలు మనకు ఏమి నేర్పుతున్నాయి?
3. 7–8 వచనాలలో పౌలు తన పరిచర్యను ఎలా చూస్తున్నాడు? "క్రీస్తు యొక్క అపారమైన ఐశ్వర్యం" అనే మాట మనకు క్రీస్తు గురించి ఏమి చెబుతోంది?
4. క్రైస్తవ పరిచర్య క్రీస్తు కేంద్రంగా కాకుండా నాయకుడు కేంద్రంగా ఎలా మారవచ్చు? పౌలు ఉదాహరణ నుండి నాయకులు ఏమి నేర్చుకోవాలి?
5. ఎఫెసీయులకు 3:9–11 ప్రకారం దేవుడు సంఘం ద్వారా ఏమి చూపిస్తున్నాడు? భిన్నమైన ప్రజలతో కూడిన సంఘం దేవుని నానావిధమైన జ్ఞానాన్ని ఎలా చూపించగలదు?
6. 12వ వచనం ప్రకారం మనం దేవుని దగ్గరకు ధైర్యంగా ఎలా రాగలము? మన ధైర్యానికి ఆధారం మన మంచి జీవితం లేదా క్రీస్తా?
7. 13వ వచనం ప్రకారం పౌలు తన శ్రమలను ఎలా చూస్తున్నాడు? కష్టాలు వచ్చినప్పుడు దేవుని ప్రణాళిక విఫలమైందని అనుకోవాలా?
8. ఈ భాగం మన సంఘ జీవితం, పరిచర్య, ఇతర విశ్వాసులతో సంబంధాలు, ప్రార్థన మరియు శ్రమలను చూసే విధానాన్ని ఎలా మార్చాలి?

## నాయకులకు – ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులు వాక్యాన్ని చదివి, తమ మాటల్లో సమాధానం చెప్పేలా చేయండి. వెంటనే సమాధానం చెప్పకండి.
ఇలాంటి చిన్న ప్రశ్నలతో సహాయం చేయండి: "ఈ సమాధానం ఏ వచనంలో కనిపిస్తోంది?" "ఈ మాట ఎందుకు ముఖ్యమైనది?" "ఇక్కడ పౌలు తన గురించి ఏమి చెబుతున్నాడు?" "ఇది మన సంఘానికి ఎలా వర్తిస్తుంది?" "ఇది మన జీవితాన్ని ఎలా మార్చాలి?"

**ప్రశ్న 1** – ఖైదీ మరియు మర్మం

పౌలు రోమా ఖైదీ అయినప్పటికీ తన పరిస్థితిని క్రీస్తు సార్వభౌమత్వం కింద చూస్తున్నాడు.
అతను తన శ్రమను దేవుని నియంత్రణకు బయట జరిగిన సంఘటనగా చూడలేదు.
"మర్మం" అంటే ఎప్పటికీ అర్థంకాని రహస్యం కాదు.
గతంలో పూర్తిగా తెలియజేయబడకుండా ఉండి, ఇప్పుడు దేవుడు బయలుపరచిన సత్యం.

**ఇంకా అడగండి:** "కష్టం వచ్చినప్పుడు దేవుడు తన నియంత్రణ కోల్పోయాడని మనం ఎందుకు త్వరగా అనుకుంటాం?"

**ప్రశ్న 2** – సహవారసులు, ఒకే శరీరం, భాగస్వాములు

మూడు మాటలను సభ్యులతో మళ్లీ చెప్పించండి:

సహవారసులు – ఒకే శరీరంలోని సభ్యులు – వాగ్దానంలో భాగస్వాములు
అన్యజన విశ్వాసులు రెండో తరగతి క్రైస్తవులు కాదు.
క్రీస్తులో వారికి కూడా: అదే వారసత్వం, అదే శరీరంలో స్థానం, అదే వాగ్దానం.
ఇది నేటి కులం, భాష, జాతి, డబ్బు, విద్య, సామాజిక స్థానం వంటి విభజనలకు అన్వయించండి.

**ఇంకా అడగండి**: "క్రీస్తులో మనం సమానంగా ఉంటే, సంఘంలో ఉన్నత–నిమ్న భావానికి స్థానం ఉందా?"

**ప్రశ్న 3** – పరిచర్య కృప

పౌలు పరిచర్యను ఏమిగా చూస్తున్నాడు? కృపావరంగా.
అతను దాన్ని తన సాధనగా లేదా హోదాగా చూడలేదు. అందుకే నిజమైన పరిచర్య ఏమి కలిగించాలి? వినయం. కృతజ్ఞత. దేవునిపై ఆధారపడటం. "క్రీస్తు యొక్క అపారమైన ఐశ్వర్యం" అంటే ఆయనలోని కృప, ప్రేమ, మహిమ, జ్ఞానం, సమృద్ధి పూర్తిగా కొలవలేనివని.

**ఇంకా అడగండి:** "బైబిల్ అధ్యయనం మనకు సమాచారం మాత్రమే ఇస్తుందా? లేక క్రీస్తుపై ఆశ్చర్యాన్ని పెంచుతుందా?"

**ప్రశ్న 4** – నాయకుడు కేంద్రంగా మారే ప్రమాదం

పరిచర్యలో కొన్ని శోధనలు ఉంటాయి:
హోదా, వేదిక, గుర్తింపు, ప్రభావం, అనుచరులు, నియంత్రణ. నాయకుడు ప్రజల దృష్టిని తనవైపు కాకుండా ఎటువైపు తీసుకెళ్లాలి? క్రీస్తువైపు.

**ఇంకా అడగండి:** "నా పరిచర్య ద్వారా ప్రజలు నన్ను ఎక్కువగా చూస్తున్నారా? లేక క్రీస్తును ఎక్కువగా చూస్తున్నారా?"

**ప్రశ్న 5** – సంఘం ద్వారా దేవుని జ్ఞానం

సంఘం కేవలం సమావేశ స్థలం కాదు.
సహజంగా వేరుగా ఉండే ప్రజలను దేవుడు క్రీస్తులో ఒకటిగా చేస్తున్నాడు.
వారు ఒకరినొకరు ప్రేమిస్తే, సేవ చేస్తే, క్షమిస్తే, కలిసి ఆరాధిస్తే – ఏమి కనిపిస్తుంది?
దేవుని జ్ఞానం మరియు సువార్త శక్తి. ఐక్యత అంటే అందరూ ఒకేలా మారడం కాదు.
ఐక్యతకు పునాది ఒకే భాష, కులం లేదా సంస్కృతి కాదు.
క్రీస్తు మరియు సువార్త. అలాగే సంఘం దేవుని అత్యవసర ప్రణాళిక కాదు. అది ఆయన నిత్య సంకల్పంలో భాగం.

**ఇంకా అడగండి:** "మన సంఘ జీవితాన్ని చూసినప్పుడు సువార్త ఏమి చేయగలదో ఇతరులు చూడగలరా?"

**ప్రశ్న 6** – దేవుని దగ్గరకు ప్రవేశం

మనకు దేవుని దగ్గరకు ప్రవేశం ఎవరితో ఉంది? క్రీస్తు ద్వారా.
మన ప్రార్థనలు, బైబిల్ పఠనం, సేవ, మంచి క్రియలు ముఖ్యమైనవే.
కాని అవి దేవుని అంగీకారాన్ని సంపాదిస్తాయా? లేదు. క్రీస్తే మన ప్రవేశానికి ఆధారం.

**ఇంకా అడగండి:** "ప్రార్థించేటప్పుడు నా ధైర్యం నా గత వారం పనితీరుపైనా? లేక క్రీస్తుపైనా?"

**ప్రశ్న 7** – శ్రమ మరియు దేవుని ప్రణాళిక

పౌలు తన చెరసాల జీవితాన్ని వైఫల్యంగా చూడలేదు.
అతని జీవితంలో రెండు విషయాలు ఒకేసారి ఉన్నాయి:
శ్రమ మరియు విశ్వాసమైన సేవ. ప్రతి శ్రమకు ప్రత్యేక కారణాన్ని ఊహించి చెప్పకండి.
**ఈ ప్రధాన సత్యాన్ని గుర్తుంచుకోండి:** శ్రమ దేవుని ప్రణాళిక విఫలమైందని నిరూపించదు.

**ఇంకా అడగండి:** "కష్టంలో కూడా దేవుడు తన ఉద్దేశాన్ని నెరవేర్చగలడని నమ్మితే, మన దృక్పథం ఎలా మారుతుంది?"

**ప్రశ్న 8** – వ్యక్తిగత అన్వయం

చర్చను వ్యక్తిగతంగా తీసుకురండి.
అడగవచ్చు: "మన సంఘంలో కులం, భాష, డబ్బు లేదా సామాజిక స్థానం వల్ల కనిపించని గోడలు ఉన్నాయా?"
"నా పరిచర్య ప్రజలను క్రీస్తువైపు తీసుకెళ్తుందా? లేక నా వైపు?" "ప్రార్థనలో నా ధైర్యం నా పనితీరుపైనా? లేక క్రీస్తుపైనా?"
"శ్రమ వచ్చినప్పుడు దేవుడు నన్ను విడిచిపెట్టాడని అనుకుంటున్నానా?"

**చివరగా అడగండి:** "ఈ భాగానికి స్పందనగా నేను మార్చుకోవాల్సిన ఒక విషయం ఏమిటి?"

## నాయకులు ప్రత్యేకంగా గమనించవలసిన విషయం

పౌలు చెప్పే ఐక్యత ఏ రకమైన ఐక్యత? సువార్త ఐక్యత.
అది: "ఎలాగైనా కలిసి ఉండండి" అనే ఐక్యత కాదు. "సిద్ధాంతం ముఖ్యం కాదు" అని కూడా కాదు. పాపాన్ని పట్టించుకోకపోవడం

కాదు. ప్రతి మత గుంపు స్వయంగా క్రీస్తు శరీరంలో భాగమని కూడా కాదు.
పౌలు చాలా స్పష్టంగా చెబుతున్నాడు: "క్రీస్తుయేసులో"మరియు "సువార్త ద్వారా."
అందుకే క్రైస్తవ ఐక్యతకు కేంద్రం: క్రీస్తు మరియు సువార్త సత్యం. అలాగే పరిచర్యలో వినయం అంటే ఏమిటి?
బాధ్యత నుండి తప్పుకోవడమా? కాదు. దేవుడు ఇచ్చిన వరాలను ఉపయోగించకపోవడమా? కాదు.

పౌలు వినయంగా ఉన్నాడు. అదే సమయంలో తన పిలుపు విషయంలో స్పష్టంగా ఉన్నాడు.
బైబిల్ వినయం అంటే దేవుడు ఇచ్చిన వరాలను విశ్వాసంగా ఉపయోగిస్తూ, పరిచర్యను మన గురించి కాకుండా క్రీస్తు గురించి చేయడం.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చ చివర 6వ వచనానికి తిరిగి రండి. సభ్యులతో కలిసి ఇలా చెప్పించండి:
సువార్త ద్వారా - సహవారసులు - ఒకే శరీరంలోని సభ్యులు - వాగ్దానంలో భాగస్వాములు - క్రీస్తుయేసులో.
తర్వాత 10వ వచనంతో కలపండి: వేరుపడిన ప్రజలను దేవుడు క్రీస్తులో ఒకటిగా చేసి, ఆ సంఘం ద్వారా తన నానావిధమైన జ్ఞానాన్ని చూపిస్తున్నాడు. సువార్త వ్యక్తులను రక్షిస్తుందా? అవును.
అయితే వారిని ఒంటరిగా వదిలేస్తుందా? లేదు. క్రీస్తులో ఒక కొత్త ప్రజను సృష్టిస్తుంది.

## చివరి ప్రశ్న

సువార్త మనలను నిజంగా: సహవారసులుగా, ఒకే శరీరంలోని సభ్యులుగా, వాగ్దానంలో భాగస్వాములుగా చేసిందంటే -
ఆ ఐక్యత మన సంఘంలో ఎలా కనిపిస్తోంది? మన స్వాగతంలోనా? మన ఆరాధనలోనా? మన నాయకత్వంలోనా?
కలిసి భోజనం చేయడంలోనా? ఒకరి కోసం ఒకరు ప్రార్థించడంలోనా? ఒకరి అవసరాలను మరొకరు చూసుకోవడంలోనా?
మన సంఘ జీవితం నిజంగా సువార్త శక్తిని చూపిస్తున్నదా?

## బైబిల్ అధ్యయన పాఠం 7 ఎఫెసీయులకు 3:14-21

# అంతరంగంలో బలపడి, క్రీస్తు ప్రేమలో వేరూరటం

## సందర్భం

ఎఫెసీయులకు 3:1-13లో పౌలు ఏమి వివరించాడు? సువార్త ద్వారా యూదులు, అన్యజనులు క్రీస్తులో ఒకే శరీరంగా చేయబడ్డారు. సంఘం దేవుని నిత్య సంకల్పంలో భాగం. భిన్నమైన ప్రజలను క్రీస్తులో ఒకటిగా చేసి, సంఘం ద్వారా దేవుడు తన నానావిధమైన జ్ఞానాన్ని చూపిస్తున్నాడు. ఇంత గొప్ప సత్యాన్ని చెప్పిన తరువాత పౌలు ఏమి చేస్తున్నాడు? ప్రార్థిస్తున్నాడు. ఎందుకు? సరైన సిద్ధాంతం తెలుసుకోవడం మాత్రమే సరిపోతుందా? లేదు. మనకు తెలిసిన సత్యం మన హృదయంలోకి దిగాలి. మనల్ని మార్చాలి. మన జీవితం ద్వారా కనిపించాలి.

అందుకే పౌలు ఇలా అంటున్నాడు: "ఈ హేతువుచేత నేను తండ్రి యెదుట మోకాళ్లూనుచున్నాను" (3:14). అయితే పౌలు మొదట దేనికోసం ప్రార్థిస్తున్నాడు? వారి ఆరోగ్యమా? వారి డబ్బా? వారి సమస్యలు వెంటనే పోవాలా? అవి కాదు. అతను ప్రార్థిస్తున్నది ఇంకా లోతైన విషయాల కోసం: పరిశుద్ధాత్మ ద్వారా అంతరంగంలో బలపడాలి. క్రీస్తు వారి జీవితంలో స్థిరంగా నివసించాలి. క్రీస్తు ప్రేమలో వేరూరాలి. ఆ ప్రేమ ఎంత గొప్పదో గ్రహించాలి. దేవుని సంపూర్ణత వైపు ఎదగాలి.

**ఈ భాగాన్ని సులభంగా ఇలా గుర్తుంచుకోవచ్చు:** తండ్రి - అంతరంగ బలం - క్రీస్తు నివాసం - ప్రేమలో వేర్లు - క్రీస్తు ప్రేమ - దేవుని సంపూర్ణత - దేవుని శక్తి - దేవుని మహిమ

## 1. తండ్రి యెదుట మోకాళ్లూనే ప్రార్థన ఎఫెసీయులకు 3:14-15

పౌలు ఏమంటున్నాడు? "ఈ హేతువుచేత నేను తండ్రి యెదుట మోకాళ్లూనుచున్నాను." పౌలు ఎక్కడ ఉన్నాడు? చెరసాలలో. అయితే అతని ప్రార్థన మొదట తన గురించి ఉందా? "ప్రభువా, నన్ను వెంటనే విడుదల చేయి" అని మొదలుపెడుతున్నాడా? లేదు. అతని హృదయం దేవుని ప్రజల ఆత్మీయ ఎదుగుదల కోసం ఉంది. ఇంకో విషయం గమనించండి. పౌలు దేవునిని ఎలా సంబోధిస్తున్నాడు? "తండ్రి." ఇది ఎందుకు ముఖ్యమైనది? ఎఫెసీయులకు 2:18లో పౌలు ఇప్పటికే ఏమి చెప్పాడు? కుమారుని ద్వారా, ఒకే ఆత్మచేత, తండ్రి సన్నిధికి చేరగలుగుతున్నాము. అంటే ప్రార్థన అంటే మన మాట వినడానికి ఇష్టంలేని దేవునిని ఒప్పించడానికి ప్రయత్నమా? లేదు. క్రీస్తు ద్వారా మనం ఎవరి దగ్గరకు వస్తున్నాం? మన తండ్రి దగ్గరకు. మనం బయటివారిగా వస్తున్నామా? లేదు. కృపచేత కుటుంబంలోకి తీసుకోబడిన పిల్లలుగా వస్తున్నాం.

**అయితే మనల్ని మనం అడుగుదాం:** నేను ప్రార్థించేటప్పుడు దేవునిని దూరంగా ఉన్నవానిగా చూస్తున్నానా? లేక క్రీస్తు ద్వారా నన్ను స్వీకరించిన తండ్రిగా చూస్తున్నానా?

## 2. అంతరంగ మనుష్యునిలో బలపడటం ఎఫెసీయులకు 3:16

పౌలు ఇప్పుడు ఏమి ప్రార్థిస్తున్నాడు? "తన ఆత్మవలన మీ అంతరంగ పురుషుడు శక్తితో బలపడునట్లు..." మన ప్రార్థనలు సాధారణంగా ఎలా ఉంటాయి? "ప్రభువా, ఈ సమస్యను తీసివేయి." "నా ఆరోగ్యాన్ని బాగుచేయి." "ఈ కష్టాన్ని మార్చు." "ఈ తలుపు తెరువు." ఇలాంటి ప్రార్థనలు తప్పా? లేదు. కానీ పౌలు మనకు ఇంకొక ప్రార్థన నేర్పుతున్నాడు: "ప్రభువా, పరిస్థితి మారకపోయినా నన్ను లోపల బలపరచు." కొన్నిసార్లు దేవుడు పరిస్థితిని మారుస్తాడు. మరికొన్నిసార్లు పరిస్థితి అలాగే ఉండవచ్చు. అప్పుడు దేవుడు ఏమి చేయగలడు? ఆ పరిస్థితిలో విశ్వాసంగా నిలబడటానికి మనలను బలపరచగలడు. శారీరక బలం తగ్గవచ్చు. డబ్బు పోవచ్చు. ఆరోగ్యం మారవచ్చు. మనుషులు నిరాశపరచవచ్చు. పరిస్థితులు కఠినమవచ్చు. కానీ మనలో ఏమి జరగాలి? అంతరంగ మనిషి పరిశుద్ధాత్మ ద్వారా బలపడాలి. ఇది కేవలం: "నేను బలంగా ఉండాలి." "నేను పాజిటివ్‌గా ఆలోచించాలి." అనే మనోధైర్యం కాదు. ఇది దేవుని ఆత్మ ఇచ్చే బలం.

**అయితే ప్రశ్న:** నేను దేవునిని నా జీవితం సులభం చేయమని మాత్రమే అడుగుతున్నానా? లేక కష్టాల మధ్య నన్ను ఆత్మీయంగా బలపరచమని కూడా అడుగుతున్నానా?

## 3. విశ్వాసం ద్వారా క్రీస్తు హృదయాల్లో నివసించడం ఎఫెసీయులకు 3:17

పౌలు కొనసాగిస్తూ ఇలా ప్రార్థిస్తున్నాడు: "విశ్వాసముచేత క్రీస్తు మీ హృదయములలో నివసించునట్లు..." ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. పౌలు ఎవరికి రాస్తున్నాడు? ఇప్పటికే విశ్వాసులైన వారికి. అయితే వారికి క్రీస్తు లేడని చెబుతున్నాడా? లేదు. అయితే "నివసించుట" అంటే ఏమిటి? స్థిరంగా ఉండటం. ఇంటివాడిలా ఉండటం. క్రీస్తు వారి జీవితంలోని ప్రతి ప్రాంతంలో తనకు తగిన స్థానం పొందాలని పౌలు కోరుతున్నాడు. ఒక గౌరవనీయ అతిథిని ఇంటికి ఆహ్వానించి ఇలా అంటే ఎలా ఉంటుంది? "మీరు హాల్లో ఉండవచ్చు. కానీ ఈ గది మాత్రం తెరవకండి." మనము క్రీస్తుతో కూడా అలాగే ప్రవర్తిస్తున్నామా? "ప్రభువా, ఆదివారం నీది - కానీ నా డబ్బు కాదు." "నా ప్రార్థన నీది - కానీ నా సంబంధాలు కాదు." "నా సంఘ జీవితం నీది - కానీ నా రహస్య ఆలోచనలు కాదు." "నా పాటలు నీకే - కానీ నా కోపం, నా గర్వం, నా ఆశలు మాత్రం నా విషయాలు."

అయితే అసలు ప్రశ్న కేవలం: "క్రీస్తు నా జీవితంలో ఉన్నాడా?" అనేది మాత్రమే కాదు.

**మరింత లోతైన ప్రశ్న:** "నా జీవితమంతటిలో క్రీస్తు నిజంగా ప్రభువుగా, ఇంటివాడిలా ఉన్నాడా?"

## 4. ప్రేమలో వేరూరి, పునాది కలిగి ఉండటం ఎఫెసీయులకు 3:17

ఇప్పుడు పౌలు రెండు అందమైన చిత్రాలు ఉపయోగిస్తున్నాడు. "ప్రేమలో వేరుపారి, పునాది కలిగి..." మొదటి చిత్రం ఏమిటి? చెట్టు. చెట్టుకు లోతైన వేర్లు ఉంటే ఏమవుతుంది? పోషణ పొందుతుంది. స్థిరంగా ఉంటుంది. ఎండ, గాలి వచ్చినా నిలబడుతుంది. రెండవ చిత్రం? భవనం. భవనానికి బలమైన పునాది ఉంటే తుఫాను వచ్చినా నిలబడగలదు. అయితే మన జీవితానికి వేర్లు, పునాది ఏమై ఉండాలి? క్రీస్తు ప్రేమ. మన భద్రత మనుషుల అంగీకారంలో ఉంటే ఏమవుతుంది? వారు తిరస్కరించినప్పుడు మనం కూలిపోవచ్చు. మన పునాది డబ్బు అయితే? డబ్బు పోయినప్పుడు? మన గుర్తింపు విజయమైతే? విఫలమైనప్పుడు? మన భద్రత ఆరోగ్యం అయితే? ఆరోగ్యం తగ్గినప్పుడు? కానీ మన వేర్లు ఎక్కడ లోతుగా ఉంటే మనం నిలబడగలం? క్రీస్తు ప్రేమలో. పరిస్థితులు మనలను కదిలించవచ్చు. కానీ పూర్తిగా కూల్చివేయలేవు.

**అయితే మనం మనలను మనం అడగాలి:** నా భద్రత, గుర్తింపు, ఆనందం నిజంగా దేనిలో వేరూరి ఉన్నాయి?

## 5. క్రీస్తు ప్రేమ ఎంత గొప్పది? ఎఫెసీయులకు 3:18–19

పౌలు ఇప్పుడు విశ్వాసులు ఏమి గ్రహించాలని ప్రార్థిస్తున్నాడు? "దాని వెడల్పు, పొడవు, ఎత్తు, లోతు ఎంతయో..." ఇక్కడ ప్రతి కొలతకు ఒక ప్రత్యేకమైన రహస్య అర్థం వెదకాల్సిన అవసరం ఉందా? లేదు. పౌలు ప్రధానంగా ఏమి చెబుతున్నాడు? క్రీస్తు ప్రేమ అపారమైనది. ఎంత విశాలమైనది? వేర్వేరు జాతులు, భాషలు, నేపథ్యాల నుండి పాపులను తన కుటుంబంలోకి చేర్చుకునేంత విశాలమైనది. ఎంత లోతైనది? మన విరిగిపోయిన లోకంలోకి దిగివచ్చి, పాపులైన మన కోసం సిలువపై తనను తాను అర్పించుకునేంత లోతైనది. తర్వాత పౌలు ఒక ఆశ్చర్యకరమైన మాట చెబుతున్నాడు: "జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకు." ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది: జ్ఞానానికి మించినదాన్ని ఎలా తెలుసుకోగలం? అర్థం ఏమిటంటే: క్రీస్తు ప్రేమను నిజంగా తెలుసుకోవచ్చు. అనుభవించవచ్చు. కానీ దాని సంపూర్ణతను పూర్తిగా కొలవలేం. అది ఒక గొప్ప సముద్రంలాంటిది. దానిలోకి దిగవచ్చు. దాని నీటిని అనుభవించవచ్చు. ఇంకా లోతుగా వెళ్లవచ్చు. కానీ మొత్తం సముద్రాన్ని చేతిలో పట్టుకోగలమా? లేదు. అలాగే క్రీస్తు ప్రేమను మనం నిజంగా తెలుసుకుంటాము. కానీ: "ఇప్పుడంతా తెలుసుకున్నాను" అని ఎప్పుడూ చెప్పలేం. అయితే ప్రశ్న: "యేసు నన్ను ప్రేమిస్తున్నాడు" అనే మాట నాకు తెలిసిన సిద్ధాంతమా? లేక ఆ ప్రేమ ఎంత గొప్పది, ఖరీదైనది, స్థిరమైనది, జీవితాన్ని మార్చేదో మరింత లోతుగా తెలుసుకుంటున్నానా?

## 6. దేవుని సంపూర్ణత వరకు నింపబడటం ఎఫెసీయులకు 3:19

పౌలు ప్రార్థన ఇప్పుడు ఇంకా గొప్ప స్థాయికి వెళ్తుంది: "దేవుని సంపూర్ణత అంతటివరకు మీరు నింపబడునట్లు." దీని అర్థం ఏమిటి? మనుషులు దేవుళ్లుగా మారతారా? లేదు. అయితే పౌలు ఏమి కోరుతున్నాడు? దేవుని సన్నిధి, స్వభావం మన జీవితాలను మరింతగా నింపి, మనం క్రీస్తులా మారాలని. ఆత్మీయ పరిపక్వత అంటే కేవలం ఎక్కువ బైబిల్ జ్ఞానమా? లేదు. జ్ఞానం చాలా ముఖ్యం. సరైన సిద్ధాంతం చాలా ముఖ్యం. కానీ ఆ జ్ఞానం జీవితం మార్చాలి. మనలో ఏమి పెరగాలి? ప్రేమ. పరిశుద్ధత. ఓర్పు. క్షమించే స్వభావం. వినయం. సత్యవంతత. దయ. ఆత్మనిగ్రహం. అయితే మనం మనలను ఎలా పరీక్షించుకోవాలి? "ఐదు సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు నాకు ఎక్కువ బైబిల్ విషయాలు తెలుసా?" అని మాత్రమేనా? లేదు. ఇలా కూడా అడగాలి: "ఐదు సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు నా మాటల్లో, ప్రతిస్పందనల్లో, సంబంధాల్లో, నిర్ణయాల్లో క్రీస్తు స్వభావం ఎక్కువగా కనిపిస్తున్నదా?"

## 7. మనం అడిగినదానికంటే, ఊహించినదానికంటే ఎక్కువ చేయగల దేవుడు ఎఫెసీయులకు 3:20

ఇప్పుడు పౌలు ప్రార్థన నుండి స్తుతికి వెళ్తున్నాడు. అతను ఏమంటున్నాడు? "మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయగల శక్తిగలవానికి..." దేవుని శక్తి ఎంత గొప్పది? మన ఊహలకు మించినది. అయితే ఈ వచనాన్ని ఎలా ఉపయోగించకూడదు? "నేను ఏదైనా కోరుకుంటే దేవుడు తప్పకుండా ఇస్తాడు." "నాకు పెద్ద ఇల్లు కావాలి." "వ్యాపారం చాలా పెద్దదవాలి." "ప్రతి వ్యాధి తప్పకుండా పోవాలి." "నా ప్రతి కల నెరవేరాలి." పౌలు ఇక్కడ అలాంటి ఖాళీ చెక్కు ఇస్తున్నాడా? లేదు. సందర్భం ఏమిటి? పౌలు దేనికోసం ప్రార్థించాడు? అంతరంగ బలం. క్రీస్తు నివాసం. ప్రేమలో వేర్లు. క్రీస్తు ప్రేమను గ్రహించడం. దేవుని సంపూర్ణత వైపు ఎదగడం. ఇంకా ఒక మాట గమనించండి: "మనలో కార్యము చేయు తన శక్తి చొప్పున." అంటే దేవుడు మన కోసం బయట ఏమి చేస్తాడనే విషయం మాత్రమే కాదు. మనలో ఏమి చేస్తున్నాడన్నది కూడా చాలా ముఖ్యం. మనము ఇలా ప్రార్థించవచ్చు: "ప్రభువా, ఈ పరిస్థితిని మార్చు." కానీ దేవుడు కొన్నిసార్లు ఏమి చేయవచ్చు? మనము ఊహించినదానికంటే గొప్పగా మనల్ని మార్చవచ్చు. అది చిన్న విషయం కాదు.

## 8. చివరి లక్ష్యం – దేవునికి మహిమ ఎఫెసీయులకు 3:21

పౌలు చివర ఏమి చెబుతున్నాడు? "సంఘములోను క్రీస్తుయేసునందును తరతరములకు యుగయుగములకు ఆయనకు మహిమ కలుగుగాక." అయితే ఈ ప్రార్థన చివరి లక్ష్యం ఏమిటి? మన సౌకర్యమా? లేదు. మన పేరు? లేదు. మన విజయం? లేదు. మన పరిచర్య ఖ్యాతి? అది కూడా కాదు. దేవుని మహిమ. ఆ మహిమ ఎక్కడ కనిపించాలి? సంఘములోను క్రీస్తుయేసునందును. దేవుడు ఏమి చేస్తున్నాడు? భిన్నమైన ప్రజలను క్రీస్తులో ఒకటిగా చేస్తున్నాడు. పరిశుద్ధాత్మ ద్వారా వారిని బలపరుస్తున్నాడు. క్రీస్తు ప్రేమలో వేరూరుస్తున్నాడు. వారిని మారుస్తున్నాడు. ఎందుకు? తన మహిమ కోసం. అందుకే ఈ ప్రార్థన ఎక్కడ మొదలైంది? తండ్రి యెదుట మోకాళ్లని. ఎక్కడ ముగిసింది? దేవునికి మహిమతో.

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం ప్రార్థనను ఒకసారి కలిపి చూద్దాం. పౌలు ఎవరి దగ్గరకు వస్తున్నాడు? తండ్రి దగ్గరకు. ఏం కోరుతున్నాడు? పరిశుద్ధాత్మ ద్వారా అంతరంగ బలం. దాని ఫలితం? క్రీస్తు జీవితంలో స్థిరంగా నివసించడం. అప్పుడు? ప్రేమలో వేర్లు, పునాది. ఏ ప్రేమ? క్రీస్తు అపారమైన ప్రేమ. ఆ ప్రేమను గ్రహిస్తూ మనం ఎటు ఎదగాలి? దేవుని సంపూర్ణత వైపు. ఇది ఎలా సాధ్యం? మనలో పనిచేసే దేవుని శక్తి ద్వారా. చివరి లక్ష్యం? దేవుని మహిమ.

**సులభంగా గుర్తుంచుకోండి:** తండ్రి – ఆత్మ ఇచ్చే బలం – క్రీస్తు నివాసం – ప్రేమలో వేర్లు – క్రీస్తు ప్రేమ – దేవుని సంపూర్ణత – దేవుని శక్తి – దేవుని మహిమ

## అన్వయం

ఈ ప్రార్థన మన ప్రార్థనలను మార్చాలి. మనం ఇలా ప్రార్థిస్తాం: "ప్రభువా, నా సమస్యను తొలగించు." అది మంచిదే. కానీ ఇలా కూడా ప్రార్థిద్దామా? "ప్రభువా, ఈ సమస్య మధ్య నీ ఆత్మ ద్వారా నన్ను బలపరచు." మనం ఇలా ప్రార్థిస్తాం: "ప్రభువా, ఆ వ్యక్తిని మార్చు." కానీ ఇలా కూడా ప్రార్థిద్దామా? "క్రీస్తు ప్రేమను మరింత లోతుగా తెలుసుకొని, అదే ప్రేమతో స్పందించడానికి నన్ను మార్చు." మనం సులభమైన పరిస్థితుల కోసం ప్రార్థిస్తాం. అయితే దీనికోసం కూడా ప్రార్థిస్తున్నామా? లోతైన విశ్వాసం. బలమైన అంతరంగ జీవితం. పరిశుద్ధత. ఓర్పు. వినయం. క్షమించే హృదయం. క్రీస్తు ప్రేమలో లోతైన వేర్లు. మరింత క్రీస్తు స్వభావం.

**అందుకే ఒక ముఖ్యమైన ప్రశ్న:** "యేసు నన్ను ప్రేమిస్తున్నాడు" అని నాకు తెలుసు మాత్రమేనా? లేక నా జీవితం నిజంగా ఆ ప్రేమలో వేరూరి, పునాది పొందుతోందా?

## సువార్త సంబంధం

క్రీస్తు ప్రేమ యొక్క వెడల్పు, పొడవు, ఎత్తు, లోతు ఎక్కడ అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది? సిలువ దగ్గర. క్రీస్తు ప్రేమ కేవలం భావోద్వేగం కాదు. ఆయన ప్రేమను ఎలా చూపించాడు? పాపులైన మన కోసం తనను తాను అర్పించుకోవడం ద్వారా. మనము అర్హులమై ఉన్నప్పుడు ఆయన మనలను ప్రేమించాడా? లేదు. మన పాపంలో ఉన్నప్పుడు మనలను ప్రేమించాడు. మన కోసం మరణించాడు. మృతులలో నుండి లేచాడు. ఇప్పుడు తన ప్రజలలో నివసిస్తున్నాడు. పరిశుద్ధాత్మ ద్వారా వారిని బలపరుస్తున్నాడు. తన స్వరూపానికి వారిని మారుస్తున్నాడు.

అందుకే క్రైస్తవ ఎదుగుదల అంటే కేవలం: "ఇంకా బాగా ప్రయత్నించు." అనేది కాదు. ఇది ఇలా ఉంటుంది: క్రీస్తును మరింతగా తెలుసుకో – పరిశుద్ధాత్మ ద్వారా బలపడు – క్రీస్తు ప్రేమలో లోతుగా వేరూరు – ఆ ప్రేమ నీ జీవితాన్ని మార్చనివ్వు – దేవుని మహిమ కోసం జీవించు.

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు – 8

1. ఎఫెసీయులకు 3:14–21 చదవండి. పౌలు ప్రధానంగా ఏ విషయాల కోసం ప్రార్థిస్తున్నాడు? అతని ప్రార్థన బయటి పరిస్థితులకంటే లోపలి ఆత్మీయ జీవితంపై ఎందుకు ఎక్కువ దృష్టి పెడుతోంది?
2. 3:14–15లో పౌలు దేవునిని "తండ్రి"గా సమీపిస్తున్నాడు. ఇది ప్రార్థన గురించి మనకు ఏమి నేర్పుతుంది? క్రీస్తు ద్వారా తండ్రి దగ్గరకు రావడం మన ప్రార్థనా ధైర్యాన్ని ఎలా మార్చాలి?
3. 3:16లో "అంతరంగ పురుషుడు శక్తితో బలపడటం" అంటే ఏమిటి? పరిస్థితులు మారాలని ప్రార్థించడం మరియు మనలో బలం కోసం ప్రార్థించడం మధ్య సంబంధం ఏమిటి?
4. 3:17లో "విశ్వాసముచేత క్రీస్తు మీ హృదయములలో నివసించుట" అంటే ఏమిటి? మన జీవితంలోని ఏ ప్రాంతాలను క్రీస్తుకు పూర్తిగా అప్పగించకుండా ఉంచే ప్రమాదం ఉంది?
5. "ప్రేమలో వేరుపారి, పునాది కలిగి" అనే రెండు చిత్రాలు ఏమి నేర్పుతున్నాయి? మనుషుల అంగీకారం, డబ్బు, ఆరోగ్యం, విజయం, హోదా వంటి వాటిలో వేర్లు పెడితే ఏమవుతుంది?
6. 3:18–19లోని "వెడల్పు, పొడవు, ఎత్తు, లోతు" మరియు "జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ" అనే మాటలను ఎలా అర్థం చేసుకోవాలి? ఆ ప్రేమ ఎక్కడ అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది?

5. 3:19లో "దేవుని సంపూర్ణత అంతటివరకు నింపబడటం" అంటే ఏమిటి? ఆత్మీయ ఎదుగుదల మన మాటలు, సంబంధాలు, నిర్ణయాలు, స్వభావంలో ఎలా కనిపించాలి?

8. 3:20-21 ప్రకారం దేవుడు తన శక్తితో ఏమి చేయగలడు? ఈ వచనాన్ని మన ప్రతి వ్యక్తిగత కోరిక నెరవేరుతుందనే వాగ్దానంగా ఎందుకు తీసుకోకూడదు? చివరి లక్ష్యం ఏమిటి?

## నాయకులకు – ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులు వాక్యాన్ని జాగ్రత్తగా చదవనివ్వండి. వెంటనే సమాధానం చెప్పకండి. ఇలాంటి చిన్న ప్రశ్నలతో వారికి సహాయం చేయండి: "ఈ సమాధానం ఏ వచనంలో ఉంది?" "పౌలు ఇక్కడ దేనికోసం ప్రార్థిస్తున్నాడు?" "బయటి పరిస్థితి గురించి మాట్లాడుతున్నాడా? లోపలి జీవితమా?" "ఈ మాట మన జీవితానికి ఎలా వర్తిస్తుంది?" "ఇది మన ప్రార్థనలను ఎలా మార్చాలి?"

**ప్రశ్న 1** – పౌలు ప్రధాన ప్రార్థన ఏమిటి?

నాలుగు ముఖ్య విషయాలను సభ్యులతో గుర్తించండి: అంతరంగ బలం – క్రీస్తు స్థిరమైన నివాసం – క్రీస్తు ప్రేమను లోతుగా గ్రహించడం – దేవుని సంపూర్ణత వైపు ఎదగడం చివరికి ఇవన్నీ ఎటు దారితీస్తాయి? దేవుని మహిమకు.

**ఇంకా అడగండి:** "మన ప్రార్థనల్లో ఈ విషయాల్లో ఏది చాలా అరుదుగా కనిపిస్తుంది?"

**ప్రశ్న 2** – దేవుడు మన తండ్రి

క్రీస్తు ద్వారా విశ్వాసులకు తండ్రి సన్నిధికి ప్రవేశం ఉంది (2:18). ప్రార్థన అంటే మన మాట వినడానికి ఇష్టంలేని దేవునిని ఒప్పించడం కాదు. మనలను క్రీస్తులో స్వీకరించిన తండ్రిని సమీపించడం.

**ఇంకా అడగండి:** "దేవుడు నిజంగా నా తండ్రి అని తెలుసుకుంటే నా ప్రార్థనలో భయం, నమ్మకం ఎలా మారుతాయి?"

**ప్రశ్న 3** – అంతరంగ బలం

పరిస్థితి మారాలని ప్రార్థించడం తప్పు కాదు. కానీ పౌలు ఇంకా లోతైన ప్రార్థన చేస్తున్నాడు: "వారిని లోపల బలపరచు." బయటి పరిస్థితి అలాగే ఉన్నా అంతరంగ మనిషి బలపడవచ్చు. ఇది కేవలం మనోధైర్యం కాదు. పరిశుద్ధాత్మ ఇచ్చే బలం.

**ఇంకా అడగండి:** "దేవుడు నా పరిస్థితిని మార్చకపోతే, ఆ పరిస్థితిలో నాలో ఏమి మార్చాలని ప్రార్థించవచ్చు?"

**ప్రశ్న 4** – క్రీస్తు స్థిరంగా నివసించడం

వీరు ఇప్పటికే విశ్వాసులు. అందుకే ఇది మొదటిసారి క్రీస్తును స్వీకరించడం గురించి కాదు. క్రీస్తు జీవితంలోని ప్రతి ప్రాంతంలో తనకు తగిన స్థానం పొందడం. చర్చించవచ్చు: డబ్బు, సమయం, సంబంధాలు, అలవాట్లు, ఆశలు, కోపం, క్షమించని మనస్సు, రహస్య ఆలోచనలు.

**ఇంకా అడగండి:** "నా జీవితంలో 'ప్రభువా, ఈ గదిలోకి మాత్రం రావద్దు' అని చెప్పే ప్రాంతం ఏదైనా ఉందా?"

**ప్రశ్న 5** – ప్రేమలో వేర్లు, పునాది

మొదటి చిత్రం: చెట్టు – వేర్లు – పోషణ, స్థిరత్వం. రెండవ చిత్రం: భవనం – పునాది – స్థిరత్వం. మన నిజమైన భద్రత ఎక్కడ ఉండాలి? క్రీస్తు ప్రేమలో. మనుషుల అంగీకారం, డబ్బు, ఆరోగ్యం, విజయం, హోదా, కుటుంబ ప్రతిష్ఠ, పరిచర్య విజయం మారవచ్చు. క్రీస్తు ప్రేమ స్థిరమైనది.

**ఇంకా అడగండి:** "నేను కోల్పోతే పూర్తిగా కూలిపోతానని భయపడే విషయం ఏమిటి? అది నా అసలు పునాది అయిపోయిందా?"

**ప్రశ్న 6** – అపారమైన ప్రేమ

ప్రతి కొలతకు ఒక ప్రత్యేకమైన సిద్ధాంత అర్థాన్ని బలవంతంగా ఇవ్వవద్దు. ప్రధాన భావం: క్రీస్తు ప్రేమ అపారమైనది. మనము ఆ ప్రేమను తెలుసుకోవచ్చు. అనుభవించవచ్చు. దానిలో ఎదగవచ్చు. కానీ దాని సంపూర్ణతను పూర్తిగా కొలవలేం. ఆ ప్రేమకు అత్యంత స్పష్టమైన నిదర్శనం? సిలువ.

**ఇంకా అడగండి:** "క్రీస్తు ప్రేమ గురించి తెలిసిన సమాచారం మరియు ఆ ప్రేమలో భద్రంగా జీవించడం మధ్య తేడా ఏమిటి?"

**ప్రశ్న 7** – దేవుని సంపూర్ణత

మనుషులు దేవుళ్లుగా మారతారని చెప్పకండి. ప్రధాన భావం: దేవుని సన్నిధి, స్వభావం మన జీవితాలను మరింతగా నింపి, మనం క్రీస్తులా రూపుదిద్దుకోవడం. అది ఎలా కనిపిస్తుంది? ప్రేమ. పరిశుద్ధత. ఓర్పు. క్షమాపణ. వినయం. సత్యవంతత. దయ. ఆత్మనిగ్రహం.

**ఇంకా అడగండి:** "నా బైబిల్ జ్ఞానం పెరుగుతున్నంతగా నా స్వభావం కూడా మారుతున్నదా?"

**ప్రశ్న 8** – అడిగినదానికంటే ఎక్కువ

3:20ను సందర్భం నుండి వేరు చేయకండి. ఇది: "మన ప్రతి వ్యక్తిగత కోరికను దేవుడు తప్పకుండా నెరవేర్చుతాడు" అనే వాగ్దానం

కాదు. సందర్భంలో దేవుడు ఏ పని చేస్తున్నాడు? అంతరంగ బలం, క్రీస్తు ప్రేమలో వేర్లు, ఆత్మీయ మార్పు, సంఘంలో తన కార్యం. చివరి లక్ష్యం 3:21లో స్పష్టంగా ఉంది: దేవునికి మహిమ.
**ఇంకా అడగండి:** "నేను దేవుని శక్తిని ఎక్కువగా నా పరిస్థితులను మార్చడంలోనే చూడాలనుకుంటున్నానా? లేక నన్ను మార్చడంలో కూడా చూడగలనా?"

## నాయకులు ప్రత్యేకంగా గమనించవలసిన మూడు విషయాలు

1. "క్రీస్తు మీ హృదయములలో నివసించాలి"

   దీని అర్థం వారికి అప్పటివరకు క్రీస్తు లేడని కాదు. వారు ఇప్పటికే విశ్వాసులు. పౌలు కోరేది: క్రీస్తు వారి జీవితమంతటిలో స్థిరంగా ప్రభువుగా ఉండాలి.

2. "దేవుని సంపూర్ణతతో నింపబడటం" దీని అర్థం మనుషులు దేవుళ్లుగా మారడం కాదు. ప్రధాన భావం: దేవుని స్వభావం మన జీవితంలో మరింత స్పష్టంగా కనిపించేలా మనం రూపుదిద్దుకోవడం.

3. "అడిగినదానికంటే, ఊహించినదానికంటే ఎక్కువ"

   3:20ను మన ప్రతి కల, సంపద, ఆరోగ్యం, ఉద్యోగం లేదా పరిచర్య విజయం కోసం ఖాళీ వాగ్దానంగా ఉపయోగించకండి. సందర్భం ఏమిటి? ఆత్మీయ బలం. క్రీస్తు ప్రేమ. మారిన జీవితం. సంఘంలో దేవుని కార్యం. దేవుని మహిమ.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చను చివరికి పౌలు ప్రార్థన దగ్గరకు తీసుకురండి. సభ్యులతో కలిసి ఇలా చెప్పించండి: సులభమైన జీవితం కోసం మాత్రమే ప్రార్థించవద్దు; బలమైన అంతరంగ జీవితం కోసం కూడా ప్రార్థించండి. ఈ క్రమాన్ని మళ్లీ చెప్పండి: పరిశుద్ధాత్మ ద్వారా బలం – క్రీస్తు మనలో స్థిరంగా నివసించడం – ఆయన ప్రేమలో వేరూరటం – ఆయన ప్రేమను లోతుగా గ్రహించడం – మరింత క్రీస్తులా మారడం – దేవుని శక్తి మనలో పనిచేయడం – సంఘం ద్వారా దేవునికి మహిమ

## చివరి ప్రశ్న

మన ప్రార్థనలు కేవలం: ఆరోగ్యం, ఉద్యోగం, డబ్బు, పరీక్షలు, సమస్యలు తొలగిపోవడం గురించి మాత్రమే కాకుండా, అంతరంగ బలం, క్రీస్తు ప్రేమలో లోతైన వేర్లు, పరిశుద్ధత, ఆత్మీయ పరిపక్వత, మరింత క్రీస్తు స్వభావం, సంఘం ద్వారా దేవునికి మహిమ కోసం కూడా ఉంటే – మన ప్రార్థనా జీవితం ఎంతగా మారుతుంది?

## బైబిల్ అధ్యయన పాఠం 8 ఎఫెసీయులకు 4:1–16

# పొందిన పిలుపుకు తగినట్లుగా నడుచుకోండి

## సందర్భం

ఎఫెసీయులకు మొదటి మూడు అధ్యాయాలలో పౌలు ప్రధానంగా ఏమి చెప్పాడు? క్రీస్తులో దేవుడు మనకొరకు ఏమి చేశాడో. మనము పాపాలలో చనిపోయినవారము – దేవుడు మనలను క్రీస్తుతో జీవింపజేశాడు. మనము దేవునికి దూరంగా ఉన్నాము – క్రీస్తు మనలను దగ్గరకు తీసుకొచ్చాడు. మనము పరదేశులము – ఇప్పుడు దేవుని కుటుంబ సభ్యులమయ్యాము. మనము విడిపోయిన ప్రజలము – క్రీస్తు మనలను ఒకే శరీరంగా చేశాడు. 3వ అధ్యాయం చివరలో పౌలు ఏమి చేశాడు? విశ్వాసులు పరిశుద్ధాత్మ ద్వారా అంతరంగంలో బలపడాలని, క్రీస్తు ప్రేమలో వేరూరాలని ప్రార్థించాడు.

ఇప్పుడు 4:1లో ఒక ముఖ్యమైన మాట వస్తుంది: "కాబట్టి..." ఎందుకు "కాబట్టి"? అంటే: దేవుడు మీకొరకు ఇంత గొప్ప కార్యం చేశాడు కాబట్టి, ఇప్పుడు మీరు ఎలా జీవించాలి? పౌలు ఇలా చెప్పడం లేదు: "మంచిగా జీవించండి. అప్పుడు దేవుడు మిమ్మల్ని రక్షిస్తాడు." అతను చెప్పేది: "దేవుడు కృపచేత మిమ్మల్ని పిలిచి రక్షించాడు. కాబట్టి ఆ పిలుపుకు తగినట్లుగా జీవించండి." క్రమం చాలా ముఖ్యం: మొదట కృప – తరువాత విధేయత. మొదట రక్షణ – తరువాత మారిన జీవితం.

**ఈ భాగాన్ని సులభంగా ఇలా గుర్తుంచుకోవచ్చు:** పిలుపు – స్వభావం – ఐక్యత – వరాలు – సిద్ధపరచడం – సేవ – పరిపక్వత – వివేచన – ప్రేమతో సత్యం – ప్రతి సభ్యుని పాత్ర – క్రీస్తులో ఎదుగుదల

## 1. పొందిన పిలుపుకు తగినట్లుగా నడుచుకోండి ఎఫెసీయులకు 4:1

పౌలు ఏమంటున్నాడు? "మీరు పొందిన పిలుపుకు తగినట్లుగా నడుచుకొనుడి." "తగినట్లుగా" అంటే ఏమిటి? మన మంచి జీవితం ద్వారా దేవుని కృపకు అర్హులమవ్వాలా? లేదు. కృపను సంపాదించగలమా? లేదు. అయితే పౌలు ఉద్దేశం ఏమిటి? దేవుడు మనలను రక్షించినందువల్ల, మన జీవితం ఆ రక్షణకు తగినట్లుగా ఉండాలి. మనం క్రీస్తుకు చెందినవారమని చెబుతున్నాం. అయితే అది ఎక్కడ కనిపించాలి? కేవలం ఆదివారం సంఘంలోనా? లేదు. మన మాటల్లో. మన కోపంలో. డబ్బును ఉపయోగించే విధానంలో. పనిలో. కుటుంబంలో. సంబంధాల్లో. క్షమించే విధానంలో. సమయాన్ని ఉపయోగించే విధానంలో. అంటే సువార్త మన జీవితంలోని ప్రతి భాగాన్ని తాకాలి. అందుకే ప్రశ్న కేవలం: "నేను ఏమి నమ్ముతున్నాను?" అనేది కాదు. మరో ప్రశ్న కూడా అవసరం: "నేను నమ్ముతున్నానని చెప్పేది నా జీవన విధానంలో కనిపిస్తున్నదా?"

## 2. పిలుపుకు తగిన జీవితం ఎలా కనిపిస్తుంది? ఎఫెసీయులకు 4:2–3

పౌలు మొదట ఏమి చెప్పాడు? గొప్ప వరాల గురించి? బోధ చేసే సామర్థ్యం గురించి? పరిచర్య విజయాల గురించి? లేదు. ముందుగా స్వభావం గురించి మాట్లాడుతున్నాడు. ఏ లక్షణాలు? వినయం. సాత్వికం. దీర్ఘశాంతి. ప్రేమతో ఒకరినొకరు సహించడం.

### వినయం

వినయం అంటే: "నేను ఇతరులకంటే గొప్పవాడినని నిరూపించుకోవాలి" అనే అవసరం లేకపోవడం. నేను ఎప్పుడూ గెలవాలా? నా అభిప్రాయమే చివరి మాట కావాలా? నా పేరు ముందుకు రావాలా? వినయం దీనికి విరుద్ధం.

### సాత్వికం

సాత్వికం బలహీనతా? లేదు. అదుపులో ఉన్న బలం. మనకు బలం ఉన్నా, దానిని ఇతరులను నొక్కివేయడానికి ఉపయోగించకపోవడం.

### దీర్ఘశాంతి

దీర్ఘశాంతి అంటే ఇతరులు మనకు నచ్చినంత వేగంగా మారకపోయినా ఓర్పుగా ఉండటం. మనము ఒక్కరోజులో పరిపూర్ణులమయ్యామా? లేదు. అయితే ఇతరులు ఎదగడానికి సమయం ఇవ్వగలమా?

### ప్రేమతో సహించడం

సంఘంలోని ప్రతి విశ్వాసి పరిపూర్ణుడా? లేదు. అయితే ఒకరితో ఒకరు జీవించాలంటే ఏమి కావాలి? ప్రేమ. ఓర్పు. క్షమాపణ. తర్వాత పౌలు ఏమంటున్నాడు? "ఆత్మ కలిగించే ఐక్యతను సమాధాన బంధముచేత కాపాడుటకు శ్రద్ధ చూపండి." ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించండి. మనమే ఐక్యతను తయారు చేస్తున్నామా? లేదు. పరిశుద్ధాత్మ ఇప్పటికే క్రీస్తులో విశ్వాసులను ఒకటిగా చేశాడు. మన బాధ్యత ఏమిటి? ఆ ఐక్యతను కాపాడటం. సంఘాన్ని విభజించేది ఎప్పుడూ పెద్ద సిద్ధాంత సమస్యలేనా? లేదు. చిన్న విషయాలు కూడా విభజనకు కారణమవుతాయి: గర్వం. అసూయ. కఠినమైన మాటలు. క్షమించకపోవడం. వ్యక్తిగత అభిరుచులు. నియంత్రించాలనే కోరిక. "నా మాటే జరగాలి" అనే పట్టుదల. అందుకే అడుగుదాం: నేను క్రీస్తు ఇచ్చిన ఐక్యతను కాపాడుతున్నానా? లేక నా మాటలు, నా గర్వం, నా అభిరుచుల వల్ల దానిని దెబ్బతీస్తున్నానా?

## 3. ఒకే శరీరం, ఒకే ఆత్మ, ఒకే ప్రభువు ఎఫెసీయులకు 4:4-6

ఈ వచనాలను చదివితే ఏ మాట మళ్లీ మళ్లీ వినిపిస్తోంది? "ఒకే..." పౌలు ఏడు విషయాలు చెబుతున్నాడు: ఒకే శరీరం. ఒకే ఆత్మ. ఒకే నిరీక్షణ. ఒకే ప్రభువు. ఒకే విశ్వాసం. ఒకే బాప్తిస్మం. ఒకే దేవుడు మరియు తండ్రి. ఇంతసార్లు "ఒకే" అని ఎందుకు చెబుతున్నాడు? ఎందుకంటే మన ఐక్యత మన ఇష్టంపై ఆధారపడలేదు. దేవుడు చేసిన కార్యంపై ఆధారపడింది. విశ్వాసులు అన్ని విషయాల్లో ఒకేలా ఉంటారా? లేదు. మన భాషలు వేరు కావచ్చు. సంస్కృతులు వేరు కావచ్చు. కులం, ప్రాంతం, వయస్సు, విద్య, ఆర్థిక స్థితి, వ్యక్తిత్వం వేరు కావచ్చు. కానీ మన అత్యంత లోతైన గుర్తింపు ఎక్కడ ఉంది? క్రీస్తులో. అందుకే: కులం. భాష. ప్రాంతం. హోదా. డినామినేషన్. వ్యక్తిగత అభిరుచులు. ఇవేవీ క్రీస్తులో మన ఐక్యతకంటే పెద్దవిగా మారకూడదు. అయితే ప్రశ్న: "నేను మొదట ఎవరు?" - నా కులానికి చెందినవాడా? నా ప్రాంతానికి చెందినవాడా? లేక క్రీస్తుకు చెందినవాడా?

## 4. ఐక్యత అంటే అందరూ ఒకేలా ఉండటం కాదు ఎఫెసీయులకు 4:7-10

ఇప్పుడు పౌలు ఒక ఆసక్తికరమైన మార్పు చేస్తున్నాడు. 4-6 వచనాల్లో ఏమి చెప్పాడు? ఒకటి. ఒకటి. ఒకటి. ఇప్పుడు 7వ వచనంలో? ప్రతివానికి వేర్వేరు కృప, వరాలు. అంటే నిజమైన ఐక్యత అంటే అందరూ ఒకేలా ఉండాలని కాదు. మన శరీరాన్ని ఆలోచించండి. కన్ను ఏమి చేస్తుంది? చూస్తుంది. చెవి? వింటుంది. కాలు? నడుస్తుంది. చేయి? పని చేస్తుంది. అన్నీ ఒకే పని చేస్తే శరీరం బాగా పనిచేస్తుందా? లేదు. అలాగే సంఘంలో కూడా. క్రీస్తు ప్రతివానికి వేర్వేరు వరాలు ఇస్తాడు. అయితే సమస్య ఎప్పుడు వస్తుంది? మనము పోల్చుకోవడం మొదలుపెట్టినప్పుడు. "నాకు అతనిలాంటి వరం ఎందుకు లేదు?" "ఆమెకు ఎక్కువ గుర్తింపు ఎందుకు?" "నన్నెందుకు ఎవరూ గమనించరు?" ఇలా అడగడం కంటే ఏమి అడగాలి? "క్రీస్తు నాకు ఏమి ఇచ్చాడు? దానిని ఆయన శరీరాన్ని సేవించడానికి ఎలా ఉపయోగించగలను?" వరాలు పోటీ కోసం ఇచ్చారా? లేదు. సేవ కోసం ఇచ్చారు.

## 5. క్రీస్తు సంఘానికి నాయకులను ఎందుకు ఇచ్చాడు?

**ఎఫెసీయులకు 4:11-12** పౌలు ఇప్పుడు అపొస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు, కాపరులు, బోధకుల గురించి చెబుతున్నాడు. అయితే వారిని ఎందుకు ఇచ్చాడు? వాళ్లే అన్ని పరిచర్యలు చేయడానికి? సభ్యులు కూర్చొని చూడటానికా? లేదు. పౌలు స్పష్టంగా చెబుతున్నాడు: "పరిశుద్ధులను పరిచర్య కార్యమునకు సిద్ధపరచుటకు." ఈ మాట చాలా ముఖ్యమైనది: "సిద్ధపరచుట." క్రమాన్ని గమనించండి: క్రీస్తు నాయకులను ఇస్తాడు - నాయకులు విశ్వాసులను సిద్ధపరుస్తారు - విశ్వాసులు సేవ చేస్తారు - క్రీస్తు శరీరం అభివృద్ధి చెందుతుంది. అయితే ఆరోగ్యకరమైన సంఘం ఏ ప్రశ్న మాత్రమే అడగకూడదు? "మన పాస్టర్ ఎంత బాగా బోధిస్తున్నారు?" అది ముఖ్యమే. కానీ ఇంకో ప్రశ్న కూడా అవసరం: సభ్యులు ఎదుగుతున్నారా? వాక్యాన్ని అర్థం చేసుకోవడం నేర్చుకుంటున్నారా? ప్రార్థించడం? సువార్త పంచుకోవడం? ఇతరులను శిష్యులుగా తీర్చిదిద్దడం? తమ వరాలను ఉపయోగించడం? సేవ చేయడం? అయితే సంఘం ఏమిటి? కొంతమంది వేదికపై ప్రదర్శన చేసి, మిగతావారు చూసే స్థలమా? లేదు. ప్రతి విశ్వాసికి ఒక పాత్ర ఉంది.

## 6. లక్ష్యం - ఆత్మీయ పరిపక్వత ఎఫెసీయులకు 4:13-14

విశ్వాసులను ఎందుకు సిద్ధపరచాలి? ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించడానికా? కాదు. లక్ష్యం ఏమిటి? ఆత్మీయ పరిపక్వత. విశ్వాసంలో ఎదగాలి. దేవుని కుమారుని జ్ఞానంలో ఎదగాలి. క్రీస్తు పోలికలో ఎదగాలి. దేవుడు తన పిల్లలు ఎప్పటికీ ఆత్మీయ శిశువులుగానే ఉండాలని కోరుతున్నాడా? లేదు. ఆత్మీయ బాల్యానికి ఒక గుర్తు ఏమిటి? "ప్రతి బోధగాలికి కొట్టుకుపోవడం." ఇది నేడు ఎలా కనిపించవచ్చు? ఒక ప్రసంగికుడు చాలా ఆత్మవిశ్వాసంతో చెప్పాడు - వెంటనే నమ్మడం. ఒక వీడియో వైరల్ అయింది - నిజమే అనుకోవడం. ఎవరైనా "దేవుడు నాకు చెప్పాడు" అన్నారు - పరీక్షించకుండా అంగీకరించడం. ఎవరైనా ఒక వచనం చెప్పారు - సందర్భం చూడకుండా నమ్మడం. ఇవి పరిపక్వతకు గుర్తులా? లేదు. పరిపక్వ విశ్వాసి ఏమి అడుగుతాడు? "ఇది లేఖనంలో ఎక్కడ ఉంది?" "ఈ వచనం సందర్భంలో ఏమి చెబుతోంది?" "ఇది సువార్తకు సరిపోతుందా?" "మొత్తం లేఖన సత్యానికి ఇది సరిపోతుందా?" ఆత్మీయ పరిపక్వతకు కేవలం ఉత్సాహం కాదు. వివేచన కూడా అవసరం.

## 7. ఆత్మీయ బాల్యం నుండి వివేచనకు ఎఫెసీయులకు 4:14

మనకు బైబిల్ సత్యంలో స్థిరత్వం లేకపోతే ఏమవుతుంది? కొత్త బోధ వచ్చిన ప్రతిసారీ కదిలిపోతాం. ఆత్మవిశ్వాసంతో మాట్లాడే వ్యక్తి మనలను సులభంగా ప్రభావితం చేయవచ్చు. భావోద్వేగ అనుభవాన్ని సత్యంగా భావించవచ్చు. ప్రజాదరణ పొందిన బోధను పరీక్షించకుండా స్వీకరించవచ్చు. అయితే పరిపక్వత అంటే ఏమిటి? క్రీస్తులో, దేవుని వాక్యంలో స్థిరపడటం. అందుకే విశ్వాసమైన బైబిల్ బోధ ఎంత ముఖ్యమో చూడండి. దాని లక్ష్యం ప్రజలను బోధకునిపై ఆధారపడేలా చేయడమా? లేదు. దేవుని వాక్యంపై ఆధారపడేలా చేయాలి. అందుకే కొత్త బోధ విన్నప్పుడు కేవలం: "ఎవరు చెప్పారు?" అని అడగడం సరిపోదు. ముఖ్యమైన ప్రశ్న: "ఇది లేఖనానికి నమ్మకంగా ఉందా?"

## 8. ప్రేమతో సత్యం చెప్పండి ఎఫెసీయులకు 4:15

ఇప్పుడు పౌలు ఎంతో అందమైన సమతుల్యత చూపిస్తున్నాడు: "ప్రేమతో సత్యము పలుకుచు..." కొంతమంది సత్యం చెబుతారు.

కానీ ఎలా చెబుతారు? కఠినంగా. గాయపరిచేలా. అవమానించేలా. "నేను నిజం చెబుతున్నాను కదా!" అంటారు. సత్యం సరైనదే కావచ్చు. కానీ ప్రేమ లేకపోతే? గాయపరచవచ్చు. మరికొందరు ప్రేమ గురించి మాట్లాడతారు. కానీ అసౌకర్యమైన సత్యం చెప్పడానికి భయపడతారు. "అతనికి బాధ కలగకూడదు." "ఆమెకు నచ్చకపోవచ్చు." అని సత్యాన్ని దాచేస్తారు. అది ప్రేమా? అది కూడా పూర్తి ప్రేమ కాదు. అందుకే రెండూ అవసరం: సత్యం + ప్రేమ. సులభంగా గుర్తుంచుకోండి: ప్రేమలేని సత్యం గాయపరచవచ్చు.

సత్యంలేని ప్రేమ తప్పుదోవ పట్టించవచ్చు. ఎవరినైనా సరిదిద్దే ముందు రెండు ప్రశ్నలు అడగండి: "నేను చెప్పేది నిజమా?" "నేను ఈ మాట అతని లేదా ఆమె మేలుకోసమే చెబుతున్నానా?" లక్ష్యం ఏమిటి? వాదన గెలవడమా? వ్యక్తిని అవమానించడమా? లేదు. ఆ వ్యక్తి క్రీస్తులో ఎదగడానికి సహాయం చేయడం.

## 9. క్రీస్తే సంఘానికి శిరస్సు ఎఫెసీయులకు 4:15-16

మనము ఎవరినో పోలి ఎదగాలా? ఒక గొప్ప నాయకుడినా? ఒక ప్రసిద్ధ ప్రసంగికుడినా? పౌలు ఏమంటున్నాడు? "శిరస్సైన క్రీస్తులోనికి అన్ని విషయాలలో ఎదగాలి." సంఘానికి శిరస్సు ఎవరు? క్రీస్తు. పాస్టర్? కాదు. పెద్దలు? కాదు. ఒక ప్రభావశీలమైన కుటుంబం? కాదు. డినామినేషన్? కాదు. క్రీస్తే శిరస్సు. ఒక గొప్ప పాస్టర్ ఉపయోగకరుడు. మంచి కార్యక్రమాలు ఉపయోగకరమైనవి. బడ్జెట్ అవసరం. సంస్థ అవసరం. కానీ నిజమైన ఆత్మీయ జీవం ఎక్కడి నుండి వస్తుంది? క్రీస్తు నుండి. ఇది సంఘాన్ని ఏ ప్రమాదం నుండి కాపాడుతుంది? వ్యక్తి-కేంద్రిత పరిచర్య నుండి. నాయకుడు వెళ్లిపోయినా సంఘం కూలిపోతే, మనం ఎవరిపై ఎక్కువగా ఆధారపడ్డాము అని ప్రశ్నించుకోవాలి.

## 10. ప్రతి సభ్యుడు తన పని చేసినప్పుడు శరీరం ఎదుగుతుంది ఎఫెసీయులకు 4:16

పౌలు ఈ భాగాన్ని శరీరం అనే చిత్రంతో ముగిస్తున్నాడు. ఏ మాట ముఖ్యమైనది? "ప్రతి భాగము తన తన కార్యము చేయగా..." ఎవరు పని చేయాలి? పాస్టర్ మాత్రమేనా? లేదు. పెద్దలు మాత్రమేనా? లేదు. ప్రసంగించే వారు మాత్రమేనా? లేదు. ప్రతి భాగము. అంటే ప్రతి విశ్వాసికి ఒక పాత్ర ఉంది. ఎవరో ప్రార్థిస్తారు. ఎవరో ప్రోత్సహిస్తారు. ఎవరో ఆతిథ్యం చూపిస్తారు. ఎవరో ఇస్తారు. ఎవరో సువార్త పంచుకుంటారు. ఎవరో బోధిస్తారు. ఎవరో బలహీనులను చూసుకుంటారు. ఎవరో పిల్లలను నేర్పుతారు. ఎవరో కొత్త విశ్వాసిని శిష్యుడిగా తీర్చిదిద్దుతారు. ఎవరో బాధపడుతున్నవారిని పరామర్శిస్తారు. ఇలా ప్రతి సభ్యుడు తన పని చేస్తే ఏమవుతుంది? శరీరమంతా ప్రేమలో అభివృద్ధి చెందుతుంది.

అయితే సంఘం గురించి మన ప్రశ్న ఏమిటి? "ఈ సంఘం నాకు ఏమి ఇస్తుంది?" అనేది మాత్రమేనా? మరో ప్రశ్న కూడా అడగాలి: "క్రీస్తు తన సంఘాన్ని నిర్మించడానికి నన్ను ఎలా ఉపయోగించగలడు?"

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం ప్రవాహాన్ని ఒకసారి చూద్దాం. దేవుడు ఏమి చేశాడు? మనలను పిలిచాడు. అందువల్ల? పిలుపుకు తగినట్లుగా నడవాలి. ఆ జీవితం ఎలా కనిపిస్తుంది? వినయం, సాత్వికం, దీర్ఘశాంతి, ప్రేమ. అది ఏమి కాపాడుతుంది? ఐక్యతను. మనము ఎవరము? ఒకే శరీరం. అయితే అందరూ ఒకేలా ఉన్నారా? లేదు. క్రీస్తు వేర్వేరు వరాలు ఇస్తాడు. నాయకులు ఏమి చేస్తారు? సభ్యులను సిద్ధపరుస్తారు. సభ్యులు? సేవ చేస్తారు. ఫలితం? పరిపక్వత. పరిపక్వత ఏమి తెస్తుంది? వివేచన. అప్పుడు మనం ఎలా మాట్లాడాలి? ప్రేమతో సత్యం. ఎవరిలో ఎదగాలి? క్రీస్తులో. ఎవరెవరు తమ పాత్ర చేయాలి? ప్రతి సభ్యుడు. ఫలితం? సంఘమంతా క్రీస్తులో ప్రేమతో ఎదుగుతుంది. సులభంగా గుర్తుంచుకోండి: పిలుపు - స్వభావం - ఐక్యత - వరాలు - సిద్ధపరచడం - సేవ - పరిపక్వత - వివేచన - ప్రేమతో సత్యం - ప్రతి సభ్యుని పాత్ర - క్రీస్తులో ఎదుగుదల

## అన్వయం

ఈ భాగం మన విశ్వాసాన్ని రోజువారీ జీవితంతో కలుపుతోంది. నా స్వభావం ఎలా ఉంది? నేను క్రీస్తుకు చెందినవాడినని చెబుతున్నాను. అయితే నా సంబంధాల్లో ఏమి కనిపిస్తోంది? గర్వమా? కోపమా? అసూయా? క్షమించకపోవడమా? కఠినమైన మాటలా? లేక: వినయం, సాత్వికం, దీర్ఘశాంతి, ప్రేమ? నేను ఐక్యతను కాపాడుతున్నానా? నా అభిప్రాయం గెలవడమే నాకు ముఖ్యమా? లేక క్రీస్తు శరీరం యొక్క ఐక్యత ముఖ్యమా? నేను బోధను పరీక్షిస్తున్నానా? ప్రతి ప్రసిద్ధ సందేశాన్ని నమ్ముతున్నానా? ప్రతి వైరల్ వీడియోను పంచుకుంటున్నానా? లేక: "ఇది లేఖనానికి సరిపోతుందా?" అని అడుగుతున్నానా? నేను సత్యాన్ని ఎలా చెబుతున్నాను? నిజం చెప్పడం పేరుతో గాయపరుస్తున్నానా? లేక ప్రేమ పేరుతో అవసరమైన సత్యాన్ని దాచుతున్నానా? సంఘంలో నా పాత్ర ఏమిటి? నేను ప్రధానంగా ప్రేక్షకుడా? వచ్చి, విని, వెళ్లిపోతున్నానా? లేక సేవ చేస్తున్నానా? ఆత్మీయ పరిపక్వతను కేవలం: "ఎన్ని సంవత్సరాలుగా సంఘానికి వెళ్తున్నాను?" "ఎన్ని ప్రసంగాలు విన్నాను?" "ఎన్ని వచనాలు తెలుసు?" అనే వాటితో కొలవలేం. మరేం చూడాలి? వినయం. ప్రేమ. సత్యం. వివేచన. సేవ. ఐక్యత. క్రీస్తు పోలిక.

## సువార్త సంబంధం

ఎఫెసీయుల పత్రికలోని గొప్ప క్రమాన్ని మళ్లీ గుర్తుంచుకుందాం: 1-3 అధ్యాయాలు - క్రీస్తులో దేవుడు మనకొరకు ఏమి చేశాడు. 4-6 అధ్యాయాలు - ఆయన చేసిన దాని కారణంగా మనం ఎలా జీవించాలి. అయితే సువార్త ఏమి చెప్పదు? "మంచిగా జీవించు, అప్పుడు దేవుడు నిన్ను రక్షిస్తాడు." సువార్త ఏమి చెబుతుంది? "దేవుడు కృపచేత నిన్ను రక్షించాడు; ఇప్పుడు ఆ కృపకు తగినట్లుగా

జీవించు." మనమే సంఘ ఐక్యతను తయారు చేస్తున్నామా? లేదు. సువార్త ద్వారా క్రీస్తు మనలను ఒకే శరీరంగా చేశాడు. మనము రక్షణ సంపాదించడానికి సేవ చేస్తున్నామా? లేదు. క్రీస్తు మనలను రక్షించి, తన శరీరాన్ని సేవించడానికి వరాలు ఇచ్చాడు. మన స్వశక్తితో ఆత్మీయంగా ఎదుగుతున్నామా? లేదు. క్రీస్తే శిరస్సు. ఆయన నుండే శరీరానికి జీవం, బలం, ఎదుగుదల వస్తాయి.

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు – 8

1. ఎఫెసీయులకు 4:1లోని "కాబట్టి" అనే మాట పత్రికలో ఏ ముఖ్యమైన మార్పును చూపిస్తోంది? 1-3 అధ్యాయాలలో దేవుడు చేసిన కార్యానికి, 4-6 అధ్యాయాలలో మన జీవన విధానానికి ఏ సంబంధం ఉంది?
2. 4:1-3 ప్రకారం "పిలుపుకు తగినట్లుగా నడుచుకోవడం" ఎలా కనిపిస్తుంది? వినయం, సాత్వికం, దీర్ఘశాంతి, ప్రేమతో సహించడం మన కుటుంబం మరియు సంఘ సంబంధాలలో ఎలా కనిపించాలి?
3. 4:4-6లో చెప్పబడిన ఏడు "ఒకటి"లు ఏమిటి? అవి సంఘ ఐక్యత గురించి ఏమి నేర్పుతున్నాయి? కులం, భాష, ప్రాంతం, హోదా లేదా డినామినేషన్ క్రీస్తులో మన ఐక్యతకంటే పెద్దవిగా మారితే ఏమవుతుంది?
4. 4:7-12 ప్రకారం క్రీస్తు భిన్నమైన వరాలు మరియు నాయకులను ఎందుకు ఇచ్చాడు? సంఘంలో పరిచర్య పాస్టర్ లేదా కొందరు నాయకులు మాత్రమే చేయాల్సిన పని కాదని ఈ వచనాలు ఎలా చూపిస్తున్నాయి?
5. 4:13-14 ప్రకారం ఆత్మీయ పరిపక్వత ఎలా కనిపిస్తుంది? "ప్రతి బోధగాలికి కొట్టుకుపోవడం" నేటి పరిస్థితుల్లో ఎలా జరగవచ్చు?
3. కొత్త బోధ, ప్రవచనం, ప్రసంగం లేదా ఆత్మీయ వాదన విన్నప్పుడు దానిని ఎలా పరీక్షించాలి? "ఎవరు చెప్పారు?" అనే ప్రశ్నకంటే "లేఖనం ఏమి చెబుతోంది?" అనే ప్రశ్న ఎందుకు ముఖ్యమైనది?
4. 4:15లో "ప్రేమతో సత్యం పలకడం" అంటే ఏమిటి? ప్రేమలేని సత్యం వల్ల ఏమవుతుంది? సత్యంలేని ప్రేమ వల్ల ఏమవుతుంది?
5. 4:15-16 ప్రకారం సంఘానికి శిరస్సు ఎవరు? "ప్రతి భాగము తన పని చేయగా" అనే మాట ప్రతి విశ్వాసికి ఏమి చెబుతోంది? మీరు ప్రధానంగా ప్రేక్షకుడిగా ఉన్నారా, లేక క్రీస్తు శరీరాన్ని నిర్మించడానికి సేవ చేస్తున్నారా?

## నాయకులకు – ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులు వాక్యాన్ని చదవనివ్వండి. వెంటనే సమాధానం చెప్పకండి. ఇలాంటి చిన్న ప్రశ్నలతో చర్చను ముందుకు తీసుకెళ్లండి: "ఈ సమాధానం ఏ వచనంలో ఉంది?" "'కాబట్టి' ఎందుకు ముఖ్యమైనది?" "ఇది రోజువారీ జీవితంలో ఎలా కనిపిస్తుంది?" "ఇక్కడ క్రీస్తు పాత్ర ఏమిటి?" "ప్రతి సభ్యుని పాత్ర ఏమిటి?"

**ప్రశ్న 1** – మొదట కృప, తరువాత విధేయత

ఎఫెసీయులకు మొదటి మూడు అధ్యాయాలు ప్రధానంగా: దేవుడు ఏమి చేశాడు? అనే ప్రశ్నకు సమాధానం ఇస్తాయి. 4వ అధ్యాయం నుండి: మనము ఎలా జీవించాలి? అనే ప్రశ్న ముందుకు వస్తుంది. క్రమం: మొదట కృప – తరువాత విధేయత. మంచి జీవితం ద్వారా రక్షణ సంపాదించడం కాదు. పొందిన రక్షణకు తగిన జీవితం జీవించడం. మరింతగా అడగండి: "మన విధేయత రక్షణకు కారణమా? లేక రక్షణకు ఫలమా?"

**ప్రశ్న 2** – పిలుపుకు తగిన స్వభావం

నాలుగు మాటలను గుర్తుంచుకోండి: వినయం – సాత్వికం – దీర్ఘశాంతి – ప్రేమతో సహించడం చర్చను రోజువారీ జీవితానికి తీసుకురండి. కోపం వచ్చినప్పుడు? ఎవరైనా మనల్ని విమర్శించినప్పుడు? కుటుంబంలో అభిప్రాయం కలవకపోతే? సంఘంలో మనకు నచ్చని నిర్ణయం వచ్చినప్పుడు? ఎవరైనా మనల్ని నిరాశపరిచినప్పుడు? మరింతగా అడగండి: "ఐక్యతను ఎక్కువగా దెబ్బతీసేది ఎప్పుడూ సిద్ధాంత సమస్యలేనా? లేక మన స్వభావం కూడా కారణమవుతుందా?"

**ప్రశ్న 3** – ఏడు "ఒకటి"లు

సభ్యులతో కలిసి చెప్పించండి: ఒకే శరీరం. ఒకే ఆత్మ. ఒకే నిరీక్షణ. ఒకే ప్రభువు. ఒకే విశ్వాసం. ఒకే బాప్తిస్మం. ఒకే దేవుడు మరియు తండ్రి. ఇవి మన ఐక్యత దేవుడు చేసిన కార్యంపై ఆధారపడిందని చూపిస్తున్నాయి. క్రైస్తవ ఐక్యత అంటే సిద్ధాంతాన్ని వదిలేయడం కాదు. అది క్రీస్తులోని సత్యంపై ఆధారపడిన ఐక్యత. మరింతగా అడగండి: "మన సంఘంలో 'ఒకే ప్రభువు' కంటే కులం, భాష లేదా ప్రాంతం ముఖ్యంగా మారే ప్రమాదం ఉందా?"

**ప్రశ్న 4** – నాయకులు ఎందుకు?

ముఖ్యమైన మాట: "సిద్ధపరచుట." క్రమాన్ని బోర్డుపై రాయవచ్చు: క్రీస్తు నాయకులను ఇస్తాడు – నాయకులు సభ్యులను సిద్ధపరుస్తారు – సభ్యులు సేవ చేస్తారు – శరీరం ఎదుగుతుంది వరాలు హోదా కోసం కాదు. పోటీ కోసం కాదు. సేవ కోసం. మరింతగా అడగండి: "మన సంఘంలో సభ్యులు సేవకు సిద్ధమవుతున్నారా? లేక నాయకులపై మాత్రమే ఆధారపడుతున్నారా?"

**ప్రశ్న 5** – పరిపక్వత మరియు ఆత్మీయ బాల్యం

ఆత్మీయ బాల్యానికి ఒక గుర్తు: ప్రతి కొత్త బోధకు కదిలిపోవడం. నేటి ఉదాహరణలు: వైరల్ వీడియో. ప్రసిద్ధ ప్రసంగికుడు. "దేవుడు

నాకు చెప్పాడు." సందర్భం లేకుండా చెప్పిన వచనం. భావోద్వేగ అనుభవం. వీటిని వెంటనే నమ్మకూడదు. లేఖనంతో పరీక్షించాలి. మరింతగా అడగండి: "ఒక వ్యక్తి చాలా ఆత్మవిశ్వాసంగా మాట్లాడటం అతని బోధ నిజమని నిరూపిస్తుందా?"

**ప్రశ్న 6** – బోధను ఎలా పరీక్షించాలి?

**ఈ నాలుగు ప్రశ్నలను గుర్తుంచుకోవడానికి సహాయం చేయండి:**

1. వచనం నిజంగా ఏమి చెబుతోంది?
2. సందర్భం ఏమిటి?
3. ఈ బోధ సువార్తకు సరిపోతుందా?
4. మిగతా లేఖనాలు దీనిని సమర్థిస్తున్నాయా? బోధకుడు ప్రసిద్ధుడా అనే దానికంటే బోధ బైబిలుకు నమ్మకంగా ఉందా అనేది ముఖ్యమైనది. మరింతగా అడగండి: "'ఎవరు చెప్పారు?' కంటే 'దేవుని వాక్యం ఏమి చెబుతోంది?' ఎందుకు ముఖ్యమైనది?"

**ప్రశ్న 7** – ప్రేమతో సత్యం

రెండూ అవసరం: సత్యం + ప్రేమ సత్యం మాత్రమే ఉంటే? కఠినత్వం రావచ్చు. ప్రేమ మాత్రమే ఉంటే? తప్పును సరిదిద్దకపోవచ్చు. లక్ష్యం ఎదుటివారిని ఓడించడం కాదు. క్రీస్తులో ఎదగడానికి సహాయం చేయడం. మరింతగా అడగండి: "నేను ఒకరిని సరిదిద్దేటప్పుడు వారి మేలు కోరుతున్నానా? లేక నా మాటే నిజమని నిరూపించుకోవాలనుకుంటున్నానా?"

**ప్రశ్న 8** – శిరస్సు మరియు ప్రతి సభ్యుని పని

సంఘానికి శిరస్సు: క్రీస్తు. ప్రతి సభ్యునికి: ఒక పాత్ర. పరిచర్య అంటే ప్రసంగం మాత్రమే కాదు. ఇది కూడా పరిచర్యే: ప్రార్థన. ప్రోత్సాహం. ఆతిథ్యం. దానం. సువార్త పంచుకోవడం. బోధించడం. శిష్యులను తయారుచేయడం. బాధపడేవారిని పరామర్శించడం. అవసరంలో ఉన్నవారిని చూసుకోవడం. మరింతగా అడగండి: "ఈ వారం క్రీస్తు శరీరాన్ని నిర్మించడానికి నేను చేయగల ఒక పని ఏమిటి?"

## నాయకులు గమనించవలసిన ముఖ్యమైన విషయాలు

1. ఐక్యత అంటే సత్యాన్ని వదిలేయడం కాదు

పౌలు ఐక్యత గురించి చెబుతున్నాడు. అదే సమయంలో ప్రతి బోధగాలికి కొట్టుకుపోకూడదని హెచ్చరిస్తున్నాడు. కాబట్టి నిజమైన ఐక్యత: క్రీస్తులో మరియు సత్యంలో ఉండాలి.

2. భిన్నమైన వరాలు వేర్వేరు స్థాయి క్రైస్తవులను సృష్టించవు

వరాలు వేరు. పాత్రలు వేరు. కానీ అందరూ? ఒకే శరీరానికి చెందినవారు. ఎవరికి కనిపించే వరం ఉందో వారు గొప్పవారు, కనిపించని సేవ చేసే వారు తక్కువవారు అని కాదు.

3. నాయకులు అవసరం – కానీ పరిచర్య అంతా నాయకుల పని కాదు

నాయకుల ముఖ్యమైన బాధ్యతలలో ఒకటి: ఇతర విశ్వాసులను సేవకు సిద్ధపరచడం. ఆరోగ్యకరమైన నాయకత్వం సభ్యులను మరింత ఆధారపడేలా చేయదు. మరింతగా వాక్యంలో నిలబడి, సేవ చేయగలవారిగా తీర్చిదిద్దుతుంది.

4. పరిపక్వత అంటే బైబిల్ జ్ఞానం మాత్రమే కాదు

బైబిల్ జ్ఞానం అవసరం. కానీ దానితో పాటు ఏమి కనిపించాలి? సత్యం. ప్రేమ. వివేచన. సేవ. వినయం. ఐక్యత. క్రీస్తు పోలిక. జ్ఞానం పెరుగుతూ స్వభావం మారకపోతే ఏదో లోపం ఉంది.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన ప్రవాహం

చర్చ చివర ఈ క్రమాన్ని సభ్యులతో కలిసి చెప్పించండి: కృప పొందాము – పిలుపుకు తగినట్లుగా నడుస్తాము – క్రీస్తుకు తగిన స్వభావం పెరుగుతుంది – ఐక్యతను కాపాడుతాము – వరాలను ఉపయోగిస్తాము – నాయకులు సభ్యులను సిద్ధపరుస్తారు – సభ్యులు సేవ చేస్తారు – విశ్వాసులు పరిపక్వులవుతారు – సత్యాన్ని వివేచిస్తారు – ప్రేమతో సత్యం చెబుతారు – ప్రతి సభ్యుడు తన పాత్రను నిర్వర్తిస్తాడు – సంఘమంతా క్రీస్తులో ఎదుగుతుంది.

## చివరి ప్రశ్న

మన సంఘం ఎలా ఉంది? వచ్చి – విని – వెళ్లిపోయే ప్రజల సమూహమా? లేక, ప్రతి విశ్వాసి దేవుని వాక్యంలో ఎదిగి, సత్యాన్ని వివేచించి, ప్రేమతో సేవ చేసి, తన వరాలను ఉపయోగిస్తూ, క్రీస్తు శరీరమంతా పరిపక్వతలో ఎదగడానికి సిద్ధపరచబడుతున్న సంఘమా?

## బైబిల్ అధ్యయన పాఠం 9   ఎఫెసీయులకు 4:17-32

# పాత స్వభావాన్ని విడిచిపెట్టి, కొత్త స్వభావాన్ని ధరించండి

## సందర్భం

ఎఫెసీయులకు 4:1-16లో పౌలు ఏమి చెప్పాడో గుర్తుందా? విశ్వాసులు తమకు వచ్చిన పిలుపుకు తగినట్లుగా నడవాలి అని చెప్పాడు. వినయం, సాత్వికం, దీర్ఘశాంతి, ఐక్యత, ఆత్మీయ వరాలు, సంఘ పరిపక్వత, ప్రేమతో సత్యం చెప్పడం గురించి వివరించాడు. ఇప్పుడు 4:17-32లో పౌలు ఇంకా ఆచరణాత్మకంగా మాట్లాడుతున్నాడు. ఒక ప్రశ్న అడుగుదాం: క్రీస్తు మనకు కొత్త జీవితం ఇచ్చాడంటే మన రోజువారీ జీవితంలో ఏమైనా మార్పు కనిపించాలా? "నేను యేసును నమ్ముతున్నాను" అని చెప్పి, మునుపటిలాగే ఆలోచిస్తూ, మాట్లాడుతూ, కోపపడుతూ, మోసం చేస్తూ, క్షమించకుండా జీవించగలమా? పౌలు సమాధానం స్పష్టంగా ఉంది: లేదు. సువార్త మనం చనిపోయిన తరువాత ఎక్కడికి వెళ్తామో మాత్రమే మార్చదు. ఇప్పుడే మన: ఆలోచనలను, కోరికలను, మాటలను, సంబంధాలను, ప్రవర్తనను మార్చడం మొదలుపెడుతుంది. ఈ భాగంలోని ప్రధాన నమూనాను మొదటే గుర్తుంచుకుందాం: పాతదాన్ని విడిచిపెట్టు - మనస్సును నూతనపరచు - కొత్తదాన్ని ధరించు.

## 1. ముందులా ఇక జీవించవద్దు  ఎఫెసీయులకు 4:17-19

పౌలు విశ్వాసులతో ఏమంటున్నాడు? అన్యజనులు తమ వ్యర్థమైన ఆలోచనల ప్రకారం నడిచినట్లు మీరు ఇక నడవకండి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించారా? పౌలు మొదట ప్రవర్తనతో ప్రారంభించాడా? లేదు. ఆలోచనతో ప్రారంభించాడు. ఎందుకు? ఎందుకంటే తప్పు జీవితం చాలాసార్లు తప్పు ఆలోచన నుండి వస్తుంది. మనము దేవుని గురించి ఏమి నమ్ముతున్నాం? మన గురించి ఏమి నమ్ముతున్నాం? ఆనందం ఎక్కడ దొరుకుతుందని నమ్ముతున్నాం? పాపం నిజంగా ఏమి చేస్తుందని అనుకుంటున్నాం? ఈ విషయాలు మన కోరికలను, నిర్ణయాలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. పౌలు చెప్పే క్రమాన్ని చూడండి: చీకటి పట్టిన ఆలోచన - కఠినమైన హృదయం - అదుపులేని కోరికలు - పాప ప్రవర్తన అయితే పాపంతో పోరాడేటప్పుడు కేవలం: "నేను ఏమి చేశాను?" అని అడగడం సరిపోతుందా? లేదు. ఇంకా లోతుగా అడగాలి: "నేను ఏమి నమ్మాను?" "నా హృదయం ఏమి కోరుకుంది?" "ఈ పని చేయడానికి నన్ను నడిపించిన ఆలోచన ఏమిటి?" ఉదాహరణకు, నేను అబద్ధం చెప్పాను అనుకుందాం. ఎందుకు చెప్పాను? శిక్ష తప్పించుకోవాలని? ఇతరులు నన్ను గొప్పగా చూడాలని? నిజం చెబితే నేను నష్టపోతానని నమ్మానా? అప్పుడు సమస్య అబద్ధం మాత్రమే కాదు. దాని వెనుక ఒక అబద్ధమైన నమ్మకం కూడా ఉంది. అందుకే బైబిలు మార్పు బయట ప్రవర్తనతో మొదలై అక్కడే ఆగిపోదు. మనస్సు, హృదయం, కోరికల వరకు వెళ్తుంది.

## 2. "మీరు క్రీస్తును అలా నేర్చుకోలేదు" ఎఫెసీయులకు 4:20-21

ఇప్పుడు పౌలు ఒక గొప్ప వ్యత్యాసాన్ని చూపిస్తున్నాడు: "అయితే మీరు క్రీస్తును అలా నేర్చుకోలేదు." ఇది ఎంత అందమైన మాట! అతను "మీరు కొన్ని కొత్త నియమాలు నేర్చుకున్నారు" అని చెప్పడం లేదు. ఏమంటున్నాడు? "మీరు క్రీస్తును నేర్చుకున్నారు." క్రైస్తవ విశ్వాసం అంటే కేవలం కొత్త మత నియమాలు నేర్చుకోవడమా? లేదు. మనము క్రీస్తును తెలుసుకుంటాము. క్రీస్తును నేర్చుకుంటాము. క్రీస్తును అనుసరిస్తాము. యేసు క్రైస్తవ సందేశంలో ఒక భాగమా? లేదు. ఆయనే కేంద్రం. తర్వాత పౌలు ఏమంటున్నాడు? "సత్యము యేసునందున్నది." అయితే జీవితంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు మనం ఏ ప్రశ్నలు మాత్రమే అడగకూడదు? "సంస్కృతి ఏమి చెబుతోంది?" "అందరూ ఏమి చేస్తున్నారు?" "నాకు ఏది సరైనట్లు అనిపిస్తోంది?" "మెజారిటీ ఏమి అంగీకరిస్తోంది?" ఈ ప్రశ్నలకంటే ముఖ్యమైన ప్రశ్న: "యేసు ప్రకారం సత్యం ఏమిటి? దేవుని వాక్యం ఏమి చెబుతోంది?" మన భావాలు మారుతాయి. సమాజపు విలువలు మారుతాయి. ప్రజల అభిప్రాయాలు మారుతాయి. కానీ మన చివరి ప్రమాణం ఎవరు? క్రీస్తు మరియు ఆయన వాక్యం.

## 1. 3. పాత స్వభావాన్ని విడిచిపెట్టండి  ఎఫెసీయులకు 4:22

ఇప్పుడు పౌలు ఒక సులభమైన చిత్రం ఉపయోగిస్తున్నాడు. ఏ చిత్రం? బట్టలు మార్చుకోవడం. పాత, మురికైన బట్టలు వేసుకుని స్నానం చేసిన తరువాత వాటినే మళ్లీ వేసుకుంటామా? సాధారణంగా కాదు. పాత బట్టలు తీసివేసి కొత్త బట్టలు వేసుకుంటాం. అలాగే పౌలు ఏమంటున్నాడు? పూర్వ జీవన విధానానికి చెందిన "పాత మనుష్యత్వాన్ని" విడిచిపెట్టండి. పాత స్వభావం అంటే ఏమిటి? క్రీస్తును తెలుసుకోకముందు మనలను నడిపించిన పాపపు జీవన విధానం. పౌలు పాపపు కోరికలను ఎలా వర్ణిస్తున్నాడు? "మోసపూరితమైన దురాశలు." ఎందుకు "మోసపూరితమైనవి"? ఎందుకంటే పాపం ముందుగానే పూర్తి నిజం చెబుతుందా? లేదు. పాపం ఇలా చెబుతుంది: "ఇది నిన్ను సంతోషపరుస్తుంది." "ఒక్కసారి చేస్తే ఏమవుతుంది?" "ఎవరికీ తెలియదు." "నీకు ఇది అవసరం." "నీకు అన్యాయం జరిగింది; ప్రతీకారం తీర్చుకోవాలి." కానీ పాపం తరువాత ఏమి వస్తుందో చెబుతుందా? చాలాసార్లు కాదు. స్వేచ్ఛ ఇస్తానని చెప్పి బానిసత్వానికి నడిపిస్తుంది. ఆనందం ఇస్తానని చెప్పి అపరాధభావాన్ని మిగులుస్తుంది. తృప్తి ఇస్తానని చెప్పి ఇంకా ఎక్కువ కోరికను పెంచుతుంది. అందుకే శోధన వచ్చినప్పుడు ఒక మంచి ప్రశ్న: "ఈ కోరిక నాకు ఏమి వాగ్దానం చేస్తోంది? అది నిజమేనా?"

## 4. మీ మనస్సులో నూతనపరచబడండి ఎఫెసీయులకు 4:23

పాత స్వభావాన్ని విడిచిపెట్టు. తర్వాత? వెంటనే కొత్తదాన్ని ధరించమా? మధ్యలో పౌలు ఒక ముఖ్యమైన విషయం పెడుతున్నాడు: "మీ మనస్సులో నూతనపరచబడండి." ఎందుకు? ఎందుకంటే క్రైస్తవ మార్పు కేవలం బయట ప్రవర్తనను అదుపు చేయడం కాదు. "అబద్ధం చెప్పవద్దు." "కోపపడవద్దు." "దొంగతనం చేయవద్దు." ఇలా "చేయవద్దు, చేయవద్దు" అని చెప్పడం మాత్రమే మార్పు తీసుకురాగలదా? లేదు. మన ఆలోచన మారాలి. దేవుని సత్యం మనం ఎలా చూస్తామో మార్చాలి: దేవుణ్ణి, మనలను, పాపాన్ని, డబ్బును, పనిని, సంబంధాలను, క్షమను, ఆనందాన్ని, విజయాన్ని. మన మనస్సును ఏదో ఒకటి ప్రతిరోజూ మలుస్తూనే ఉంది. ఏవి? సోషల్ మీడియా. సినిమాలు. ప్రకటనలు. స్నేహితులు. కుటుంబ అంచనాలు. సంస్కృతి. మన కోరికలు. లేక దేవుని వాక్యం. అయితే ప్రశ్న: "నా ఆలోచనలను ఎక్కువగా మలుస్తున్నది ఏది?" మనస్సు నూతనపరచబడటం అంటే: "నేను positiveగా ఆలోచించాలి" అనేది కాదు. దేవుని సత్యం నా ఆలోచనా విధానాన్ని మార్చడం.

## 5. కొత్త స్వభావాన్ని ధరించండి ఎఫెసీయులకు 4:24

పౌలు పాతదాన్ని తీసివేయమని మాత్రమే చెబుతున్నాడా? లేదు. దాని స్థానంలో ఏమి చేయాలి? కొత్తదాన్ని ధరించాలి. క్రైస్తవ జీవితం అంటే: "చెడు పనులు చేయకూడదు" అనే దానితో ముగియదు. అయితే ఏమి రావాలి? క్రీస్తువంటి కొత్త జీవన విధానం. అందుకే ఈ మూడు మాటలు గుర్తుంచుకోండి: విడిచిపెట్టు – నూతనపరచు – ధరించు ఇప్పుడు పౌలు దీనికి చాలా స్పష్టమైన ఉదాహరణలు ఇస్తున్నాడు.

## 6. అబద్ధం స్థానంలో సత్యం ఎఫెసీయులకు 4:25

పౌలు మొదటి ఉదాహరణ ఏమిటి? అబద్ధం. ఏం చేయాలి? అబద్ధాన్ని విడిచిపెట్టాలి. దాని స్థానంలో? సత్యం మాట్లాడాలి. ఎందుకు? "మనము ఒకరికొకరం అవయవములము." మనము క్రీస్తు శరీరం. ఒక శరీరంలోని కళ్ళు మెదడుకు తప్పుడు సమాచారం పంపితే ఏమవుతుంది? శరీరం సరిగా పనిచేయదు. అలాగే సంఘంలో అబద్ధం ఏమి చేస్తుంది? నమ్మకాన్ని నాశనం చేస్తుంది. సంబంధాలను పాడుచేస్తుంది. అయితే అబద్ధం అంటే కేవలం నేరుగా తప్పుడు మాట చెప్పడమేనా? అవసరం లేదు. ఇందులో ఇవి కూడా ఉండవచ్చు: అతిశయోక్తులు, అర్ధసత్యాలు, నిజాన్ని ఉద్దేశపూర్వకంగా దాచడం, తప్పుదారి పట్టించే మాటలు, నిలబెట్టుకోలేని వాగ్దానాలు. అయితే ఒక సాధారణ ప్రశ్న: "నా మాటను ఇతరులు నమ్మగలరా?"

## 7. కోపాన్ని పాపంగా మారనివ్వవద్దు ఎఫెసీయులకు 4:26–27

పౌలు ఏమంటున్నాడు? "కోపపడుడి, అయితే పాపము చేయకుడి." అంటే ప్రతి కోపం పాపమేనా? లేదు. అన్యాయం చూసి కోపం రావచ్చు. దుష్టత్వం పట్ల సరైన కోపం ఉండవచ్చు. కానీ మనుష్య కోపం ఎటు వెళ్లే ప్రమాదం ఉంది? కక్ష – ద్వేషం – ప్రతీకారం – కఠినమైన మాటలు – గాయపరచడం మనము బయట అరవకపోయినా కోపంగా ఉండగలమా? అవును. మౌనంగా శిక్షించవచ్చు. మాట్లాడకుండా ఉండవచ్చు. హృదయంలో సంవత్సరాలుగా పట్టుకుని ఉండవచ్చు. అందుకే పౌలు ఏమంటున్నాడు? "మీ కోపముమీద సూర్యుడు అస్తమింపనియ్యకుడి." దీని ప్రధాన భావం: కోపాన్ని పోషించవద్దు. దానికి హృదయంలో శాశ్వత స్థానం ఇవ్వవద్దు. తర్వాత: "అపవాదికి చోటియ్యకుడి." అంటే పరిష్కరించని కోపం మరిన్ని పాపాలకు తలుపు తెరవగలదు. అందుకే ఒక కఠినమైన కానీ అవసరమైన ప్రశ్న: "చాలా కాలం క్రితం జరిగిన విషయానికి నేను ఇప్పటికీ ఎవరినైనా నా హృదయంలో శిక్షిస్తున్నానా?"

## 8. దొంగతనం స్థానంలో నిజాయితీ పని మరియు ఉదారత ఎఫెసీయులకు 4:28

ఇక్కడ సువార్త మార్పు ఎంత లోతైనదో చూడండి. పౌలు దొంగతో ఏమంటున్నాడు? దొంగతనం ఆపు. అక్కడితో ఆగిపోయాడా? లేదు. నిజాయితీగా పని చేయు. అంతేనా? లేదు. సంపాదించి అవసరంలో ఉన్నవారితో పంచుకో. క్రమం చూడండి: దొంగతనం – నిజాయితీ పని – ఉదారంగా పంచుకోవడం ఇది ఎంత గొప్ప మార్పు! పాత ప్రశ్న: "ఇతరుల నుండి నేను ఏమి తీసుకోగలను?" కొత్త ప్రశ్న: "ఇతరులకు నేను ఏమి ఇవ్వగలను?" సువార్త ఒక తీసుకునే వ్యక్తిని ఎలా మారుస్తుంది? ఇచ్చే వ్యక్తిగా. పని అంటే కేవలం మన అవసరాల కోసం డబ్బు సంపాదించడమా? లేదు. ఇతరులకు సహాయం చేయడానికి కూడా దేవుడు ఇచ్చిన అవకాశం. అయితే మనం సంపాదిస్తున్నది కేవలం: "ఇంకా నాకు, ఇంకా నా కుటుంబానికి" అనే ఉద్దేశంతోనా? లేక: "దేవుడు నాకు ఇచ్చినదానిలో నేను ఎవరిని ఆశీర్వదించగలను?" అని కూడా అడుగుతున్నామా?

## 9. హానికరమైన మాటల స్థానంలో నిర్మించే మాటలు ఎఫెసీయులకు 4:29

ఇప్పుడు పౌలు మన నోటి గురించి మాట్లాడుతున్నాడు. "చెడ్డ మాటలు మాట్లాడవద్దు" అని మాత్రమే చెబుతున్నాడా? లేదు. దాని స్థానంలో ఏమి చేయాలి? వినేవారి అవసరానికి తగినట్లుగా వారిని అభివృద్ధి చేసి, కృప కలిగించే మాటలు మాట్లాడాలి. ఇది ఎంత ఆచరణాత్మకమైనది! మాట్లాడే ముందు కొన్ని ప్రశ్నలు అడగవచ్చు: ఇది నిజమా? ఇది అవసరమా? ఇది ఉపయోగకరమా? ఇది ఎదుటివారిని నిర్మిస్తుందా? ఇప్పుడు చెప్పడం సరైన సమయమా? నేను ప్రేమతో చెబుతున్నానా? మన మాటలు ఏమి చేయగలవు? గాయపరచగలవు. లేక స్వస్థపరచగలవు. నిరుత్సాహపరచగలవు. లేక బలపరచగలవు. విభజించగలవు. లేక కలపగలవు. అయితే ఒక ప్రశ్న: "నాతో మాట్లాడిన తరువాత ప్రజలు సాధారణంగా బలపడుతున్నారా? లేక బలహీనపడుతున్నారా?" ఇది ఇంట్లో కూడా వర్తిస్తుంది. సంఘంలో కూడా. ఫోన్‌లో కూడా. WhatsAppలో కూడా. సోషల్ మీడియాలో కూడా.

## 10. పరిశుద్ధాత్మను దుఃఖపరచవద్దు ఎఫెసీయులకు 4:30

పౌలు ఇప్పుడు ఎంతో వ్యక్తిగతమైన మాట చెబుతున్నాడు: "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచవద్దు." పరిశుద్ధాత్మ అంటే కేవలం ఒక శక్తి మాత్రమేనా? లేదు. ఆయన వ్యక్తిగతుడైన దేవుడు. అందుకే పాపం అంటే కేవలం: "ఒక నియమం ఉల్లంఘించాను" అనే విషయం మాత్రమే కాదు. మనం ఎవరిని దుఃఖపరుస్తున్నాం? మనలను ప్రేమించి, తనవారిగా చేసుకొని, తన ఆత్మతో ముద్రించిన దేవుణ్ణి. అయితే ఈ వచనంలో హెచ్చరిక మాత్రమే ఉందా? లేదు. భరోసా కూడా ఉంది. పౌలు ఏమి గుర్తుచేస్తున్నాడు? "విమోచన దినము వరకు మీరు పరిశుద్ధాత్మచేత ముద్రించబడ్డారు." అందుకే విధేయతకు ఆధారం ఏమిటి? "దేవుడు నన్ను అంగీకరించాలంటే నేను బాగా జీవించాలి" అనేదా? లేదు. "నేను ఇప్పటికే దేవునికి చెందినవాడిని. నాలో నివసించే ఆయన ఆత్మను ఎందుకు దుఃఖపరచాలి?"

## 11. కక్ష నుండి దయ, కరుణ, క్షమ వరకు  ఎఫెసీయులకు 4:31–32

చివరగా పౌలు పాత జీవితం, కొత్త జీవితం మధ్య బలమైన వ్యత్యాసం చూపిస్తున్నాడు. ఏవి విడిచిపెట్టాలి? కక్ష. రోషం. కోపం. అరుపులు. దూషణ. దుష్టత్వం. వాటి స్థానంలో ఏమి ధరించాలి? దయ. కరుణ. క్షమ. కానీ ఒక ముఖ్యమైన ప్రశ్న: మనం ఎందుకు క్షమించాలి? ఎందుకంటే క్షమించడం మంచి అలవాటా? అది నిజమే. కానీ పౌలు ఇంకా లోతైన కారణం ఇస్తున్నాడు: "క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి." అయితే ఎవరినైనా క్షమించడం కష్టంగా ఉన్నప్పుడు మన మొదటి ప్రశ్న ఏమిటి? "అతను క్షమకు అర్హుడా?" అనే దానికంటే ముందు: "క్రీస్తులో దేవుడు నన్ను ఎంతగా క్షమించాడు?" అని అడగాలి. క్షమించడం అంటే ఏమి కాదు? తప్పును సరైనదిగా పిలవడం కాదు. జరిగినదాన్ని లేనట్లుగా నటించడం కాదు. అవసరమైన హద్దులు పెట్టకూడదని కాదు. న్యాయం అవసరం లేదని కాదు. సంఘ క్రమశిక్షణ ఉండకూడదని కాదు. అయితే క్రైస్తవ క్షమలో ఏమి ఉంది? వ్యక్తిగత ప్రతీకారాన్ని విడిచిపెట్టి, మనం పొందిన కృపను ఇతరులకు చూపించడం.

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం భాగాన్ని ఒకసారి చూద్దాం. పాత జీవితం ఎక్కడ మొదలైంది? తప్పు ఆలోచనలో. అయితే మార్పు ఎలా వస్తుంది? పాత స్వభావాన్ని విడిచిపెట్టు – దేవుని సత్యంతో మనస్సును నూతనపరచు – కొత్త స్వభావాన్ని ధరించు.
తర్వాత పౌలు కొన్ని ఉదాహరణలు ఇస్తున్నాడు: అబద్ధం – సత్యం పాపపు కోపం – సమాధానం కోరడం దొంగతనం – నిజాయితీ పని – ఉదారత చెడ్డ మాటలు – నిర్మించే మాటలు కక్ష – దయ – కరుణ – క్షమ గమనించండి: లక్ష్యం కేవలం పాపాన్ని ఆపడం కాదు. దాని స్థానంలో క్రీస్తువంటి జీవన విధానాన్ని ధరించడం.

## అన్వయం

ఈ భాగం క్రైస్తవ మార్పుకు చాలా ఉపయోగకరమైన నమూనా ఇస్తుంది: విడిచిపెట్టు – నూతనపరచు – ధరించు ఇది మన జీవితంలో ఎలా కనిపిస్తుంది? అబద్ధం చెప్పడం ఆపడం మాత్రమే కాదు. సత్యం మాట్లాడండి. దొంగతనం ఆపడం మాత్రమే కాదు. నిజాయితీగా పనిచేసి ఉదారంగా ఉండండి. కోపపు మాటలు ఆపడం మాత్రమే కాదు. హృదయంలోని కోపాన్ని పరిష్కరించండి. చెడ్డ మాటలు మానడం మాత్రమే కాదు. ఇతరులను నిర్మించే మాటలు మాట్లాడండి. కక్షను లోపల దాచుకోవడం కాదు. దయ, కరుణ, క్షమను ధరించండి. క్రైస్తవ ఎదుగుదల అంటే మన పాత ప్రవర్తనను బాగా దాచడం కాదు. క్రీస్తు మనలను లోపలి నుండి బయటికి మార్చడం. అందుకే రెండు ప్రశ్నలు అడగండి: "నేను ఇంకా ధరించి ఉన్న పాత వస్త్రం ఏది?" తర్వాత: "దాని స్థానంలో ఏ క్రీస్తువంటి గుణాన్ని ధరించాలి?"

## సువార్త సంబంధం

ఈ భాగానికి కీలకమైన మాట ఎక్కడ ఉంది? చివర్లో: "క్రీస్తులో దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము..." మనం ఎందుకు క్షమించాలి? ఎందుకంటే మనం క్షమించబడ్డాము. ఎందుకు సత్యం మాట్లాడాలి? ఎందుకంటే మనం క్రీస్తుకు, ఆయన శరీరానికి చెందినవారము. ఎందుకు మన జీవితం మారాలి? దేవుడు చివరకు మనలను అంగీకరించడానికి? లేదు. క్రీస్తులో ఆయన ఇప్పటికే మనలను తనవారిగా చేసుకొని కొత్త జీవితం ఇచ్చాడు కాబట్టి. సువార్త ఏమి చెప్పదు? "మారిపో; అప్పుడు దేవుడు నిన్ను అంగీకరిస్తాడు." సువార్త ఏమి చెబుతుంది? "క్రీస్తులో దేవుడు నిన్ను క్షమించి కొత్తవాడిగా చేశాడు. ఇప్పుడు ఆ కొత్త గుర్తింపుకు తగినట్లుగా జీవించు." ఇది చాలా ముఖ్యమైన క్రమం: క్షమించబడటం – మారిన జీవితం మారిన జీవితం – క్షమించబడటం కాదు.

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు – 8

1. ఎఫెసీయులకు 4:17–19లో పాత జీవితం గురించి పౌలు ఏమి చెబుతున్నాడు? తప్పు ఆలోచన, కఠినమైన హృదయం, పాప కోరికలు, ప్రవర్తన ఒకదానితో ఒకటి ఎలా సంబంధం కలిగి ఉన్నాయి?
2. మీరు క్రీస్తును అలా నేర్చుకోలేదు" మరియు "సత్యం యేసులో ఉంది" (4:20–21) అనే మాటలు క్రైస్తవ జీవితానికి ఏమి నేర్పుతున్నాయి? మన జీవితానికి చివరి ప్రమాణం ఎవరు?
3. 4:22–24లో పౌలు చెప్పే మూడు దశలు ఏమిటి? విడిచిపెట్టు – నూతనపరచు – ధరించు అనే నమూనాను మీ మాటల్లో వివరించండి.

4. 4:25-28లో అబద్ధం, కోపం, దొంగతనం స్థానంలో ఏ కొత్త జీవన విధానాన్ని పౌలు కోరుతున్నాడు? ప్రత్యేకంగా దొంగతనం చేసే వ్యక్తిలో మార్పు ఎంత లోతుగా వెళ్తోంది?
5. 5. 4:29 ప్రకారం మన మాటలు ఎలా మారాలి? మాట్లాడే ముందు మనం ఏ ప్రశ్నలు అడగవచ్చు?
6. 6. 4:30లో "పరిశుద్ధాత్మను దుఃఖపరచవద్దు" అనే మాట మన పాపం మరియు దేవునితో మన సంబంధం గురించి ఏమి నేర్పుతోంది? అదే వచనం మనకు ఏ భరోసా ఇస్తుంది?
7. 4:31-32లో ఏవి విడిచిపెట్టాలి? వాటి స్థానంలో ఏ గుణాలు ధరించాలి? మనము ఇతరులను ఎందుకు క్షమించాలి?
8. ఈ భాగాన్ని మీ జీవితానికి అన్వయించుకోండి. మీరు విడిచిపెట్టవలసిన ఒక పాత ఆలోచన, అలవాటు లేదా ప్రవర్తన ఏమిటి? దాని వెనుక ఉన్న ఏ అబద్ధాన్ని తిరస్కరించి, దేవుని ఏ సత్యాన్ని నమ్మి, ఏ క్రీస్తువంటి గుణాన్ని ధరించాలి?

## నాయకులకు – ప్రతి ప్రశ్నకు సహాయం

ఈ జవాబులను ముందుగానే సభ్యులకు చెప్పకండి. ముందుగా వాక్యాన్ని చదవనివ్వండి. వారు గమనించి, తమ మాటల్లో సమాధానం చెప్పేలా చేయండి. అవసరమైనప్పుడు మాత్రమే ఈ సూచనలు ఉపయోగించండి.

**ప్రశ్న 1** – పాత జీవితం ఎలా పనిచేస్తుంది?

పౌలు మొదట ప్రవర్తనతో కాకుండా దేనితో ప్రారంభిస్తున్నాడు? మనస్సుతో. ఈ క్రమాన్ని సభ్యులతో చెప్పించండి: చీకటి పట్టిన ఆలోచన – కఠినమైన హృదయం – పాప కోరికలు – పాప ప్రవర్తన పాపంతో పోరాడేటప్పుడు: "నేను ఏమి చేశాను?" అనే ప్రశ్నతో ఆగిపోకండి. ఇవి కూడా అడగండి: "నేను ఏమి నమ్మాను?" "నేను ఏమి కోరుకున్నాను?" "ఈ పాపం నాకు ఏమి ఇస్తుందని నమ్మాను?"
**ఇంకా అడగండి:** "మన ప్రవర్తన మారాలంటే మన ఆలోచన కూడా ఎందుకు మారాలి?"

**ప్రశ్న 2** – క్రీస్తును నేర్చుకోవడం

క్రైస్తవ విశ్వాసం కేవలం నియమాల సమాహారం కాదు. దాని కేంద్రం ఎవరు? యేసుక్రీస్తు. సత్యానికి చివరి ప్రమాణం ఏమి కాదు? మన భావాలు కాదు. సంస్కృతి కాదు. మెజారిటీ అభిప్రాయం కాదు. ప్రజాదరణ కాదు. క్రీస్తు మరియు దేవుని వాక్యం.
**ఇంకా అడగండి:** "సమాజం ఒకటి చెబుతూ, దేవుని వాక్యం మరొకటి చెబితే మనం దేనిని అనుసరించాలి?"

**ప్రశ్న 3** – విడిచిపెట్టు, నూతనపరచు, ధరించు

ఈ పాఠంలోని ప్రధాన శిష్యత్వ నమూనా: విడిచిపెట్టు – నూతనపరచు – ధరించు ఉదాహరణ: అబద్ధం విడిచిపెట్టు
దేవుడు సత్యవంతుడు; నేను క్రీస్తు శరీరంలో భాగం అనే సత్యంతో మనస్సును నూతనపరచు
సత్యం మాట్లాడడం ప్రారంభించు. మార్పు "ఇది చేయవద్దు" దగ్గర ఆగదు. దాని స్థానంలో కొత్తదాన్ని ధరించాలి.
**ఇంకా అడగండి:** "పాపాన్ని కేవలం ఆపి, దాని స్థానంలో కొత్త అలవాటు పెంచకపోతే ఏమవుతుంది?"

**ప్రశ్న 4** – పాతదాని స్థానంలో కొత్తది

సభ్యులతో ఈ వ్యత్యాసాలను కనుగొనించండి: అబద్ధం – సత్యం పాపపు కోపం – త్వరగా పరిష్కరించడం దొంగతనం – నిజాయితీ పని – అవసరంలో ఉన్నవారితో పంచుకోవడం ప్రత్యేకంగా 4:28లో మార్పును గమనించండి: తీసుకునే వ్యక్తి – పనిచేసే వ్యక్తి – ఇచ్చే వ్యక్తి ఇది కేవలం చెడు ఆపడం కాదు. హృదయ దిశ మారుతోంది.
**ఇంకా అడగండి:** "సువార్త మన 'నేను ఏమి పొందగలను?' అనే ప్రశ్నను 'నేను ఎవరికి ఇవ్వగలను?'గా ఎలా మార్చుతుంది?"

**ప్రశ్న 5** – నిర్మించే మాటలు

లక్ష్యం కేవలం చెడ్డ పదాలు వాడకపోవడం కాదు. మన మాటలు ఏమి చేయాలి? వినేవారిని నిర్మించాలి. ఈ ప్రశ్నలు గుర్తుంచుకోండి: ఇది నిజమా? ఇది అవసరమా? ఇది ఉపయోగకరమా? ఇది ప్రేమతో ఉందా? ఇప్పుడు చెప్పడం సరైన సమయమా? ఇంట్లో, సంఘంలో, WhatsAppలో, సోషల్ మీడియాలో ఉదాహరణలు అడగవచ్చు.
**ఇంకా అడగండి:** "నిజమైన మాట కూడా తప్పు సమయంలో లేదా తప్పు విధంగా చెప్పితే గాయపరచగలదా?"

**ప్రశ్న 6** – పరిశుద్ధాత్మను దుఃఖపరచడం

పరిశుద్ధాత్మ కేవలం ఒక శక్తి కాదు. ఆయన వ్యక్తిగతుడైన దేవుడు. అందుకే పాపం కేవలం నియమాన్ని అతిక్రమించడం కాదు. మనలను తనవారిగా చేసుకున్న దేవుణ్ణి దుఃఖపరచడం. అదే సమయంలో భరోసా కూడా ఉంది: "విమోచన దినము వరకు ముద్రించబడ్డారు." విధేయత దేవుని అంగీకారం సంపాదించడానికి కాదు. మనము ఇప్పటికే ఆయనకు చెందినవారము కాబట్టి.
**ఇంకా అడగండి:** "పాపాన్ని కేవలం 'తప్పు పని'గా కాకుండా, దేవునితో సంబంధంలో జరిగే విషయంగా చూస్తే మన దృక్పథం ఎలా మారుతుంది?"

**ప్రశ్న 7** – కక్ష నుండి క్షమ వరకు

రెండు జాబితాలను పక్కపక్కన పెట్టండి: విడిచిపెట్టు కక్ష. రోషం. కోపం. అరుపులు. దూషణ. దుష్టత్వం. ధరించు దయ. కరుణ. క్షమ. క్షమకు పౌలు ఇచ్చే కారణం ఏమిటి? "క్రీస్తులో దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము." మనం క్షమను సంపాదించామా?

లేదు. కృపచేత పొందాము. అందుకే: పొందిన కృప - ఇచ్చే కృప క్షమ అంటే తప్పును సమర్థించడం కాదు. అవసరమైనప్పుడు హద్దులు, న్యాయం, సంఘ క్రమశిక్షణ ఉండవచ్చు.
**ఇంకా అడగండి:** "క్షమించడానికి ముందు ఎదుటివాడు అర్హుడా అని మాత్రమే చూస్తే, సువార్తను ఎక్కడ మర్చిపోతున్నాం?"

**ప్రశ్న 8** – వ్యక్తిగత అన్వయం

సాధారణమైన: "నేను ఇంకా బాగా జీవించాలి" అనే సమాధానంతో ఆగిపోకండి. ఈ మూడు ప్రశ్నలు ఉపయోగించండి:

1. నేను ఏ పాతదాన్ని విడిచిపెట్టాలి?

2. దాని వెనుక ఉన్న ఏ అబద్ధాన్ని తిరస్కరించి, దేవుని ఏ సత్యాన్ని నమ్మాలి?

3. దాని స్థానంలో ఏ క్రీస్తువంటి కొత్త గుణాన్ని లేదా అలవాటును ధరించాలి? ఉదాహరణ: కక్ష విడిచిపెట్టు

క్రీస్తులో దేవుడు నన్ను ఎంతో క్షమించాడనే సత్యాన్ని గుర్తుచేసుకో. దయ, కరుణ, క్షమను ధరించు. మరొక ఉదాహరణ: అబద్ధం విడిచిపెట్టు. నా భద్రత నిజాన్ని దాచడంలో కాదు, దేవునిలో ఉందని గుర్తుచేసుకో. సత్యం మాట్లాడటం ప్రారంభించు.

**నాయకులు గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయాలు**

1. మనస్సు నూతనపరచడం అంటే positive thinking కాదు. ఇది: "అన్నీ బాగుంటాయి" అని మనకు మనమే చెప్పుకోవడం కాదు. దేవుని సత్యం ద్వారా మన ఆలోచన మారడం.

2. క్షమించడం అంటే చెడును మంచిదని పిలవడం కాదు. జరిగినదాన్ని లేనట్లుగా నటించడం కాదు. అవసరమైన హద్దులను తీసివేయడం కాదు. న్యాయాన్ని తిరస్కరించడం కాదు. కానీ వ్యక్తిగత ప్రతీకారాన్ని పట్టుకుని ఉండకూడదు.

3. ప్రతి కోపం పాపం కాదు. కానీ మన కోపం దేనికి లోబడి ఉండాలి? సత్యం, ప్రేమ, ఆత్మనిగ్రహం. కోపాన్ని పోషించడం, కక్షగా మార్చుకోవడం పాపానికి దారి తీస్తుంది.

4. క్రైస్తవ మార్పు కేవలం అణచివేయడం కాదు – భర్తీ చేయడం ఇది ఈ పాఠంలోని ప్రధాన విషయం. అబద్ధం ఆపు – సత్యం మాట్లాడు దొంగతనం ఆపు – పని చేసి పంచుకో చెడ్డ మాటలు ఆపు – నిర్మించే మాటలు మాట్లాడు కక్ష విడిచిపెట్టు – దయ, కరుణ, క్షమ ధరించు అందుకే మళ్లీ మళ్లీ గుర్తుచేయండి: పాతదాన్ని విడిచిపెట్టు – దేవుని సత్యంతో మనస్సును నూతనపరచు – కొత్తదాన్ని ధరించు

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

సువార్త మనం ఏమి చేస్తున్నామో మాత్రమే మార్చదు. మనము ఎలా ఆలోచిస్తున్నామో, ఏమి కోరుకుంటున్నామో, ఎలాంటి వ్యక్తులుగా మారుతున్నామో కూడా మార్చుతుంది. క్రీస్తులో దేవుడు మనలను క్షమించాడు. కొత్త జీవితం ఇచ్చాడు. తన ఆత్మతో ముద్రించాడు. అందుకే ఇప్పుడు మనం పాత జీవితం మళ్లీ ధరించకుండా, కొత్త జీవితం ధరించాలి. సభ్యులతో చివరికి ఈ మూడు మాటలు చెప్పించండి: విడిచిపెట్టు – నూతనపరచు – ధరించు

## చివరి ప్రశ్న

దేవుడు క్రీస్తులో నన్ను క్షమించి కొత్తవాడిగా చేశాడు కాబట్టి, నా ఆలోచనలో లేదా జీవన విధానంలో నేను ఇంకా పట్టుకుని ఉన్న పాతది ఏది? దాని వెనుక ఉన్న ఏ అబద్ధాన్ని నేను విడిచిపెట్టాలి? దాని స్థానంలో ఏ క్రీస్తువంటి కొత్త జీవన విధానాన్ని ధరించాలి?

## బైబిల్ అధ్యయన పాఠం 10 ఎఫెసీయులకు 5:1-21

# ప్రేమలో, వెలుగులో, జ్ఞానంతో నడవండి

## సందర్భం

4వ అధ్యాయం చివరలో పౌలు ఏమి చెప్పాడో గుర్తుందా? "క్రీస్తులో దేవుడు మిమ్మల్ని క్షమించిన ప్రకారం, మీరు ఒకరిపట్ల ఒకరు దయగలవారై, కరుణగలవారై, ఒకరినొకరు క్షమించండి" (ఎఫెసీ 4:32). ఇప్పుడు 5వ అధ్యాయంలో అదే ఆలోచనను కొనసాగిస్తున్నాడు. దేవుడు క్రీస్తులో మనలను ప్రేమించాడు. క్షమించాడు. తన పిల్లలుగా చేసుకున్నాడు. అయితే ఇప్పుడు ప్రశ్న ఏమిటి? దేవుని పిల్లలమని చెప్పుకునే మన రోజువారీ జీవితం ఎలా ఉండాలి? పౌలు ఈ భాగంలో క్రైస్తవ జీవితాన్ని ఒక "నడక"తో పోలుస్తున్నాడు. నడక అంటే ఒక్కసారి చేసే పని కాదు కదా? ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్తాం. అలాగే క్రైస్తవ జీవితం కూడా ఆదివారం కొన్ని గంటల అనుభవం మాత్రమే కాదు. మన రోజువారీ: మాటలు, కోరికలు, సంబంధాలు, సమయం, ఎంపికలు, ఆరాధన, ప్రవర్తన అన్నింటిలో కనిపించాలి. ఈ భాగాన్ని నాలుగు మాటలతో సులభంగా గుర్తుంచుకోవచ్చు: ప్రేమ - వెలుగు - జ్ఞానం - ఆత్మతో నింపబడిన జీవితం

## 1. ప్రియమైన పిల్లలుగా దేవునిని అనుకరించండి ఎఫెసీయులకు 5:1-2

పౌలు మొదట ఏమంటున్నాడు? "ప్రియమైన పిల్లలవలె దేవునిని అనుకరించండి." ఇక్కడ క్రమాన్ని గమనించండి. "దేవుడు మిమ్మల్ని ప్రేమించాలంటే ఆయనను అనుకరించండి" అంటున్నాడా? లేదు. వారు ఇప్పటికే ఏమిటి? "ప్రియమైన పిల్లలు." అందుకే ఇప్పుడు తమ పరలోక తండ్రిని పోలి ఉండాలి. పిల్లలు తమ తల్లిదండ్రులను గమనించి అనుకరించరా? వారి మాటలు, అలవాట్లు, ప్రవర్తన కూడా కొంతవరకు తీసుకుంటారు. అయితే దేవుని పిల్లలమైన మనలో ఏమి కనిపించాలి? ప్రేమ. దయ. క్షమ. పరిశుద్ధత. ఈ ప్రేమకు గొప్ప ఉదాహరణ ఎవరు? క్రీస్తు. పౌలు ఏమంటున్నాడు? "క్రీస్తు మనలను ప్రేమించి మనకొరకు తన్నుతాను అప్పగించుకొనిన ప్రకారము ప్రేమలో నడుచుకొనుడి." అయితే బైబిల్ ప్రేమ అంటే కేవలం ఒక మంచి భావమా? లేదు. ప్రేమ ఇస్తుంది. ప్రేమ త్యాగం చేస్తుంది. ప్రేమ ఇతరుల మేలు కోరుతుంది. యేసు కేవలం: "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అని అన్నాడా? లేదు. మనకొరకు తనను తాను ఇచ్చాడు. అయితే మన ప్రేమ ఎలా కనిపించాలి? మాటల్లో మాత్రమేనా? లేదు. కార్యాల్లో కూడా. అందుకే అడుగుదాం: నేను ఎవరినైనా ప్రేమిస్తున్నానని చెబితే, వారి మేలు కోసం నేను ఏమి ఇవ్వడానికి లేదా త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను?

## 2. ప్రేమ అంటే కామం కాదు ఎఫెసీయులకు 5:3-7

క్రీస్తు త్యాగప్రేమ గురించి చెప్పిన వెంటనే పౌలు ఏ విషయాలకు వస్తున్నాడు? లైంగిక అపవిత్రత, అశుద్ధత, లోభం. ఎందుకు? ఎందుకంటే నిజమైన ప్రేమకు, స్వార్థపూరితమైన కామానికి చాలా తేడా ఉంది. సులభంగా ఇలా గుర్తుంచుకోండి: ప్రేమ అడుగుతుంది: "నీ మేలు కోసం నేను ఏమి చేయగలను?" కామం అడుగుతుంది: "నిన్ను ఉపయోగించి నేను ఏమి పొందగలను?" ప్రేమ ఇస్తుంది. కామం తీసుకోవాలని చూస్తుంది. లోభం కూడా ఏమంటుంది? "నాకు ఇంకా కావాలి." అయితే పౌలు శరీర ప్రవర్తన గురించి మాత్రమే మాట్లాడుతున్నాడా? లేదు. మన మాటల గురించి కూడా మాట్లాడుతున్నాడు. అసభ్యమైన మాటలు. మూర్ఖమైన మాటలు. నీచమైన హాస్యం. ఇవి క్రీస్తుకు చెందినవారికి తగవని చెబుతున్నాడు. వాటి స్థానంలో ఏమి రావాలి? కృతజ్ఞత. అంటే సువార్త దేనిని మార్చాలి? మన ఆదివారం ఆరాధనను మాత్రమేనా? లేదు. మన శరీరాన్ని. మన కోరికలను. మన మాటలను. మన హాస్యాన్ని. మన డబ్బు పట్ల వైఖరిని. మన సంబంధాలను. అందుకే ఒక ప్రశ్న: సమాజం ఏదైనా అంగీకరిస్తోంది కాబట్టి అది దేవుని దృష్టిలో కూడా సరైనదేనా? లేక క్రీస్తుకు చెందినవారిగా మనకు వేరే ప్రమాణం ఉందా?

## 3. ఒకప్పుడు చీకటి - ఇప్పుడు ప్రభువులో వెలుగు ఎఫెసీయులకు 5:8-10

పౌలు చాలా బలమైన మాట చెబుతున్నాడు: "ఒకప్పుడు మీరు చీకటిగా ఉండిరి; ఇప్పుడైతే ప్రభువునందు వెలుగై ఉన్నారు." గమనించండి. అతను: "మీరు చీకటిలో నడిచారు" అని మాత్రమే చెప్పడం లేదు. ఏమంటున్నాడు? "మీరు చీకటిగా ఉండిరి." ఇప్పుడు? "ప్రభువులో వెలుగు." ఇక్కడ మళ్లీ అదే క్రమం: గుర్తింపు ముందు - ప్రవర్తన తరువాత మన మంచి పనుల వల్ల దేవుడు మనలను వెలుగుగా చేశాడా? లేదు. ప్రభువులో మన గుర్తింపు మారింది. అందుకే ఇప్పుడు ఎలా జీవించాలి? వెలుగు పిల్లలుగా. వెలుగు ఫలం ఏమిటి? పౌలు మూడు విషయాలు చెబుతున్నాడు: మంచితనం. నీతి. సత్యం. తర్వాత ఒక చాలా ఉపయోగకరమైన మాట చెబుతున్నాడు: "ప్రభువుకు ఇష్టమైనదేదో పరీక్షించండి." మన నిర్ణయాల్లో సాధారణంగా ఏమి అడుగుతాం? "ఇది చేయవచ్చా?" "అందరూ చేస్తున్నారా?" "ఎవరికీ తెలియకుండా చేయగలనా?" "ఇది చట్టవిరుద్ధమా?" ఇవన్నీ మాత్రమే అడగడం సరిపోతుందా? లేదు. ఇంకా మంచి ప్రశ్న: "ఇది ప్రభువును సంతోషపరుస్తుందా?" మన జీవితం: "ఎంత వరకు తప్పు చేయకుండా ఉండగలను?" అనే ప్రశ్నతో కాకుండా, "నా ప్రభువును ఎలా సంతోషపరచగలను?" అనే ప్రశ్నతో నడవాలి.

## 4. వెలుగు చీకటిని బయటపెడుతుంది ఎఫెసీయులకు 5:11-14

పౌలు ఏమంటున్నాడు? "చీకటి యొక్క ఫలహీనమైన క్రియలతో సహవాసం చేయకండి; వాటిని బయటపెట్టండి." వెలుగు ఏమి చేస్తుంది? దాచబడినది కనిపించేలా చేస్తుంది. చీకట్లో గది మురికిగా ఉందో లేదో స్పష్టంగా కనిపించకపోవచ్చు. లైట్ వేసినప్పుడు? అన్నీ కనిపిస్తాయి. అలాగే దేవుని వెలుగు మన జీవితాన్ని బయటపెడుతుంది. అయితే దీని అర్థం: "ఇప్పుడు ఇతరుల తప్పుల కోసం వెతకండి" అనా? లేదు. ముందుగా ఎక్కడ వెలుగు రావాలి? మన సొంత జీవితంలో. అందుకే మొదటి ప్రశ్న: "ఇతరులలో ఏ చీకటిని బయటపెట్టాలి?" అనేది కాదు. ముందుగా: "నా జీవితంలో దేవుని వెలుగులోకి తీసుకురావడానికి నేను ఇష్టపడని విషయం ఏదైనా ఉందా?" మనకు దాచుకోవాలనిపించే ప్రాంతం ఏదైనా ఉందా? మన ఫోన్‌లో? మన సంబంధాల్లో? మన డబ్బు వ్యవహారాల్లో? మన ఆలోచనల్లో? మన మాటల్లో? 5:14లో పౌలు ఒక మేల్కొలుపు పిలుపు ఇస్తున్నాడు. విశ్వాసి కూడా ఆత్మీయంగా నిద్రపోగలడా? అవును. నిర్లక్ష్యంగా మారవచ్చు. అలవాటుగా జీవించవచ్చు. పాపంపై సున్నితత్వం తగ్గవచ్చు. అందుకే పిలుపు: మేల్కొను. క్రీస్తు వెలుగులో జీవించు.

## 5. జాగ్రత్తగా, జ్ఞానంతో నడవండి ఎఫెసీయులకు 5:15-17

ఇప్పుడు పౌలు ప్రేమ, వెలుగు నుండి దేనికి వస్తున్నాడు? జ్ఞానం. అతను ఏమంటున్నాడు? "మీరు ఎలా నడుచుకొనుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి; జ్ఞానము లేనివారివలె కాక జ్ఞానులవలె నడుచుకొనుడి." బైబిల్ ప్రకారం జ్ఞానం అంటే ఏమిటి? చాలా సమాచారం తెలుసుకోవడమా? డిగ్రీలు ఉండడమా? తెలివిగా మాట్లాడడమా? అవి జ్ఞానం కావచ్చు. కానీ బైబిల్ జ్ఞానం అంతకంటే ఎక్కువ. దేవుని సత్యం తెలుసుకొని, దానికి తగినట్లుగా జీవించడం. అందుకే పౌలు వెంటనే ఏమంటున్నాడు? "కాలమును సద్వినియోగము చేసికొనుడి." సమయం ఎందుకు ముఖ్యమైనది? పోయిన డబ్బు తిరిగి సంపాదించవచ్చు. పోయిన వస్తువు తిరిగి కొనవచ్చు. కానీ నిన్నటి ఒక గంట తిరిగి వస్తుందా? లేదు. అయితే మన సమయం ఎక్కడికి పోతోంది? మనకు తెలుసా? లేక ఫోన్, వీడియోలు, నిరర్థక సంభాషణలు, నిర్లక్ష్యపు అలవాట్లు మన సమయాన్ని తీసుకుపోతున్నాయా? అయితే సమయాన్ని సద్వినియోగం చేయడం అంటే ప్రతి నిమిషం బైబిల్ చదవాలా? లేదు. విశ్రాంతి అవసరం. నిద్ర అవసరం. కుటుంబ సమయం అవసరం. పని అవసరం. ఆరోగ్యకరమైన వినోదం కూడా అవసరం. ప్రశ్న: నేను నా సమయాన్ని ఉద్దేశ్యంతో ఉపయోగిస్తున్నానా? లేక అది తెలియకుండానే జారిపోతోందా?

## 6. ప్రభువు చిత్తాన్ని అర్థం చేసుకోండి ఎఫెసీయులకు 5:17

పౌలు ఏమంటున్నాడు? "అవివేకులు కాక ప్రభువు చిత్తమేమిటో గ్రహించండి." "దేవుని చిత్తం" అని విన్నప్పుడు మనకు మొదట ఏవి గుర్తుకు వస్తాయి? "ఏ ఉద్యోగం తీసుకోవాలి?" "ఎవరిని వివాహం చేసుకోవాలి?" "ఏ నగరంలో ఉండాలి?" "ఈ పని చేయాలా వద్దా?" ఇవి ముఖ్యమైన ప్రశ్నలే. కానీ దేవుని చిత్తం అంతటితో ముగుస్తుందా? లేదు. దేవుడు తన వాక్యంలో ఇప్పటికే చాలా విషయాలు స్పష్టంగా చెప్పాడు: పరిశుద్ధత. ప్రేమ. సత్యం. కృతజ్ఞత. క్షమ. సేవ. జ్ఞానం. క్రీస్తువంటి స్వభావం. అయితే మనం కొన్నిసార్లు ఏమి చేస్తాం? దేవుని దాచబడిన చిత్తం తెలుసుకోవడానికి చాలా ఆసక్తి చూపుతాం. కానీ ఆయన ఇప్పటికే చెప్పిన చిత్తానికి? విధేయత చూపకపోవచ్చు. అందుకే ఒక మంచి ప్రశ్న: "దేవుడు నాకు ఇంకా ఏమి చెప్పాలి?" అని అడగకముందు, "ఆయన ఇప్పటికే చెప్పిన దేనికి నేను విధేయత చూపడం లేదు?" అని అడుగుతున్నానా?

## 7. మద్యం చేత మత్తెక్కకండి – ఆత్మతో నింపబడండి ఎఫెసీయులకు 5:18

ఇప్పుడు పౌలు ఒక బలమైన వ్యత్యాసం చూపిస్తున్నాడు: "ద్రాక్షారసముచేత మత్తులై యుండకుడి... అయితే ఆత్మపూర్ణులై యుండుడి." ఎందుకు ఈ రెండింటిని పోలుస్తున్నాడు? ముఖ్యమైన విషయం ఏమిటి? ప్రభావం మరియు నియంత్రణ. మద్యం ఒక వ్యక్తిని ప్రభావితం చేయగలదా? అవును. ఆలోచనను. మాటలను. తీర్పును. ప్రవర్తనను. అయితే విశ్వాసిని ఎవరు ప్రభావితం చేయాలి? పరిశుద్ధాత్మ. ఆత్మతో నింపబడటం అంటే కేవలం ఒక ప్రత్యేకమైన భావోద్వేగ అనుభవమా? లేదు. అది జీవితంలో ఎలా కనిపించాలి? మన ఆలోచనలు మారాలి. మాటలు మారాలి. నిర్ణయాలు మారాలి. వైఖరి మారాలి. సంబంధాలు మారాలి. ప్రవర్తన మారాలి. అంటే పరిశుద్ధాత్మ ప్రభావం మన జీవితమంతటిలో కనిపించాలి. అందుకే ఒక ముఖ్యమైన ప్రశ్న: నన్ను ఏది నియంత్రిస్తోంది? నా కోపమా? నా కోరికలా? నా భయమా? ఇతరుల అభిప్రాయాలా? నా అలవాట్లా? డబ్బా? ప్రజల ప్రశంసా? లేక, దేవుని ఆత్మ ప్రభావంలో నేను జీవిస్తున్నానా?

## 8. ఆత్మతో నింపబడిన జీవితం ఎలా కనిపిస్తుంది? ఎఫెసీయులకు 5:19-21

పౌలు "ఆత్మతో నింపబడండి" అని చెప్పి అక్కడే ఆగిపోయాడా? లేదు. వెంటనే దాని ఫలితాలను చూపిస్తున్నాడు.
ఆరాధన కీర్తనలు, స్తుతిగీతాలు, ఆత్మీయ గీతాలతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం. అంటే ఆత్మతో నింపబడిన జీవితం దేవుని సత్యంతో నిండిన ఆరాధనలో కనిపిస్తుంది.

### హృదయపూర్వక స్తుతి

హృదయంతో ప్రభువుకు పాడటం. కేవలం నోరు పాడుతుందా? హృదయం కూడా పాల్గొనాలి.

### కృతజ్ఞత

తండ్రియైన దేవునికి కృతజ్ఞత చెప్పడం. ఎప్పుడప్పుడు మాత్రమేనా? కాదు. కృతజ్ఞత మన జీవిత వైఖరై ఉండాలి.

### సంబంధాలలో వినయం

క్రీస్తుపట్ల భయభక్తులచేత ఒకరికొకరు లోబడటం. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఉంది. ఆత్మతో నింపబడిన వ్యక్తిని ఎలా గుర్తించాలి? అతను ఎంత భావోద్వేగంగా మాట్లాడాడో చూసినా? అది ఒకటే ప్రమాణమా? లేదు. పౌలు ఫలాన్ని చూడమంటున్నాడు. అతను మరింత కృతజ్ఞుడవుతున్నాడా? మరింత వినయంగా ఉన్నాడా? మరింత ప్రేమగా ప్రవర్తిస్తున్నాడా? మరింత క్రీస్తు కేంద్రంగా ఉన్నాడా? ఇతరులను గౌరవిస్తున్నాడా? అందుకే అడుగుదాం: నేను ఆత్మతో నింపబడ్డానని చెబితే, నా మాటలు, వైఖరి, సంబంధాలు, నిర్ణయాలలో పరిశుద్ధాత్మ ప్రభావం ఇతరులకు కనిపిస్తున్నదా?

## 9. క్రీస్తుపట్ల భయభక్తులతో ఒకరికొకరు లోబడండి ఎఫెసీయులకు 5:21

పౌలు ఈ భాగాన్ని ఏ మాటతో ముగిస్తున్నాడు? "క్రీస్తుపట్ల భయభక్తులతో ఒకరికొకరు లోబడండి." ఇది తరువాత వచ్చే వివాహం, కుటుంబం, ఇతర సంబంధాలపై బోధకు ప్రవేశద్వారం. క్రైస్తవ సంబంధాలు ఎలా నడవకూడదు? "నా హక్కులు." "నా మాటే జరగాలి." "నేనే గెలవాలి." "నన్ను ఎవరూ ప్రశ్నించకూడదు." ఇలాంటి అహంకారంతో కాదు. ఎందుకు? ఎందుకంటే మన అందరికీ ప్రభువు ఎవరు? క్రీస్తు. అందుకే మనం ఒకరినొకరు: గౌరవించాలి. సేవించాలి. ఇతరుల మేలు కోరాలి. అయితే దీని అర్థం ప్రతి సంబంధంలో అందరికీ ఒకే పాత్ర ఉందా? లేదు. తర్వాతి వచనాల్లో పౌలు వేర్వేరు బాధ్యతలను వివరిస్తాడు. కానీ అన్ని క్రైస్తవ సంబంధాల వెనుక ఉండవలసిన హృదయం ఏమిటి? క్రీస్తుపట్ల భయభక్తి – ఒకరిపట్ల ఒకరికి వినయం మరియు సేవ

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం ప్రవాహాన్ని ఒకసారి చూద్దాం. మనం ఎవరం? దేవుని ప్రియమైన పిల్లలు. అందుకే? తండ్రిని అనుకరించాలి. ఎలా? క్రీస్తువంటి ప్రేమలో నడవాలి. అప్పుడు ఏమి విడిచిపెట్టాలి? అపవిత్రత, కామం, లోభం, చెడ్డ మాటలు. మన కొత్త గుర్తింపు ఏమిటి? ప్రభువులో వెలుగు. కాబట్టి? వెలుగు పిల్లలుగా జీవించాలి. ఎలా? మంచితనం, నీతి, సత్యంలో. తర్వాత? జ్ఞానంతో నడవాలి. అంటే? సమయాన్ని సద్వినియోగం చేయాలి. ప్రభువు చిత్తాన్ని గ్రహించాలి. మనల్ని ఎవరు నియంత్రించాలి? పరిశుద్ధాత్మ. దాని ఫలం? ఆరాధన. స్తుతి. కృతజ్ఞత. వినయం. మంచి సంబంధాలు. సులభంగా గుర్తుంచుకోండి: ప్రేమ – వెలుగు – జ్ఞానం – ఆత్మతో నింపబడిన జీవితం లేక ఇలా: నేను ఎవరు? – నేను ఎలా నడుస్తున్నాను? – నన్ను ఏది నియంత్రిస్తోంది? – నా జీవితంలో ఏ ఫలం కనిపిస్తోంది?

## అన్వయం

ఈ భాగం మన రోజువారీ జీవితాన్ని పరిశీలించడానికి సహాయం చేస్తుంది. నేను ప్రేమలో నడుస్తున్నానా? నా ప్రయోజనం మాత్రమే చూస్తున్నానా? లేక ఇతరుల మేలు కూడా కోరుతున్నానా? నేను వెలుగులో నడుస్తున్నానా? దేవుని వెలుగులోకి తీసుకురావడానికి నేను ఇష్టపడని ప్రాంతం ఏదైనా ఉందా? నేను జ్ఞానంతో నడుస్తున్నానా? నా సమయం ఎక్కడికి పోతోంది? దేవుడు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేస్తున్నానా? నేను దేవుని చిత్తాన్ని కోరుతున్నానా? అయితే ఆయన ఇప్పటికే చెప్పిన విషయాలకు విధేయత చూపుతున్నానా? నన్ను ఏది నియంత్రిస్తోంది? నా కోరికలా? కోపమా? భయమా? ఇతరుల అభిప్రాయాలా? లేక పరిశుద్ధాత్మ ప్రభావమా? క్రైస్తవ పరిపక్వత ఎక్కడ కనిపించాలి? మాటల్లో. హాస్యంలో. లైంగిక పరిశుద్ధతలో. సమయ వినియోగంలో. కృతజ్ఞతలో. ఆరాధనలో. నిర్ణయాల్లో. సంబంధాల్లో.

## సువార్త సంబంధం

ఈ భాగం మనం క్రీస్తును ఎంతగా ప్రేమిస్తున్నామనే విషయంతో మొదలవుతుందా? లేదు. ఎక్కడ మొదలవుతుంది? క్రీస్తు మనలను ఎంతగా ప్రేమించాడనే విషయంతో. "క్రీస్తు మనలను ప్రేమించి తనను తాను మనకొరకు అప్పగించాడు" (5:2). ఇదే పునాది. మనం ప్రేమలో నడిస్తే క్రీస్తు మనలను ప్రేమిస్తాడా? లేదు. ఆయన ముందుగా మనలను ప్రేమించాడు. అందుకే మనం ప్రేమిస్తాము. మనం మంచి పనులు చేసి వెలుగుగా మారాలా? లేదు. ప్రభువులో ఆయన ఇప్పటికే మనలను వెలుగుగా చేశాడు. అందుకే వెలుగు పిల్లలుగా జీవిస్తాము. మనం జ్ఞానంతో జీవిస్తే రక్షణ సంపాదిస్తామా? లేదు. మనం క్రీస్తుకు చెందినవారము కాబట్టి ఆయనకు ఇష్టమైన జీవితం కోరుకుంటాము. ఆత్మతో నింపబడిన జీవితాన్ని మన స్వశక్తితో ఉత్పత్తి చేయగలమా? లేదు. క్రీస్తు స్వభావంలోకి మనలను మార్చడానికి దేవుడు తన పరిశుద్ధాత్మను ఇచ్చాడు. కాబట్టి సువార్త ఏమి చెప్పదు? "మంచిగా జీవించు; అప్పుడు దేవుడు నిన్ను అంగీకరిస్తాడు." సువార్త ఏమి చెబుతుంది? "క్రీస్తు నిన్ను ప్రేమించి తనను తాను నీకొరకు ఇచ్చాడు. ఇప్పుడు దేవుని ప్రియమైన బిడ్డగా ప్రేమలో, వెలుగులో, జ్ఞానంతో నడుచుకో; పరిశుద్ధాత్మ ప్రభావంలో జీవించు."

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు – 8

1. ఎఫెసీయులకు 5:1-2 ప్రకారం మనం దేవునిని ఎందుకు అనుకరించాలి? "ప్రియమైన పిల్లలు" అనే మాట ఎందుకు ముఖ్యమైనది? క్రీస్తు చూపించిన ప్రేమకు ప్రత్యేకత ఏమిటి?

2. 5:3-7లో ప్రేమకు విరుద్ధంగా పౌలు ఏ విషయాలను చూపిస్తున్నాడు? ప్రేమ మరియు కామం మధ్య తేడా ఏమిటి? మన శరీరం,

కోరికలు, మాటలు, హాస్యంలో పరిశుద్ధత ఎందుకు అవసరం?

3. 5:8-14 ప్రకారం "ఒకప్పుడు చీకటి, ఇప్పుడు ప్రభువులో వెలుగు" అంటే ఏమిటి? వెలుగు పిల్లల జీవితం ఎలా కనిపించాలి? ఇతరుల చీకటిని చూడకముందు మనం ఏ ప్రశ్న అడగాలి?

4. "ప్రభువుకు ఇష్టమైనది ఏమిటో పరీక్షించండి" (5:10) అనే సూత్రం మన రోజువారీ నిర్ణయాలకు ఎలా సహాయం చేస్తుంది? "ఇది చేయవచ్చా?" అనే ప్రశ్నకంటే ఇది ఎలా లోతైనది?

5. 5:15-17 ప్రకారం జ్ఞానంతో నడవడం, సమయాన్ని సద్వినియోగం చేయడం, ప్రభువు చిత్తాన్ని అర్థం చేసుకోవడం అంటే ఏమిటి? దేవుని చిత్తాన్ని తెలుసుకోవడంలో లేఖనానికి ఏ స్థానం ఉంది?

6. 5:18లో పౌలు మద్యం చేత మత్తెక్కడం మరియు ఆత్మతో నింపబడటాన్ని ఎందుకు పోలుస్తున్నాడు? ఆత్మతో నింపబడటం అంటే ఏమిటి? నన్ను ఏది నియంత్రిస్తోంది?

7. 5:19-21 ప్రకారం ఆత్మతో నింపబడిన జీవితంలో ఏ ఫలాలు కనిపించాలి? ఆరాధన, కృతజ్ఞత, వినయం, సంబంధాలు మన ఆత్మీయ పరిపక్వతను ఎలా చూపిస్తాయి?

8. ఈ భాగాన్ని ప్రేమ - వెలుగు - జ్ఞానం - ఆత్మతో నింపబడిన జీవితం అనే క్రమంలో వివరించండి. ప్రస్తుతం మీ జీవితంలో ఏ ప్రాంతం ఎక్కువ శ్రద్ధ కోరుతోంది? ఈ వారం మీరు తీసుకోగల ఒక స్పష్టమైన అడుగు ఏమిటి?

## నాయకులకు - ప్రతి ప్రశ్నకు సహాయం

సమాధానాలను ముందుగానే చెప్పకండి. ముందుగా సభ్యులు వాక్యాన్ని చదివి, గమనించి, తమ మాటల్లో సమాధానం చెప్పేలా ప్రోత్సహించండి. ఇలాంటి చిన్న ప్రశ్నలు ఉపయోగించవచ్చు: "ఈ మాట ఏ వచనంలో ఉంది?" "ఇక్కడ గుర్తింపు ముందా, ప్రవర్తన ముందా?" "పౌలు దేని స్థానంలో దేనిని పెడుతున్నాడు?" "ఇది మన రోజువారీ జీవితంలో ఎలా కనిపిస్తుంది?" "ఈ వారంలో మనం ఏ మార్పు చేయవచ్చు?"

### ప్రశ్న 1 - ప్రియమైన పిల్లలు, త్యాగప్రేమ

మొదట ఈ మాటను గమనించమని చెప్పండి: "ప్రియమైన పిల్లలు." అంటే దేవుని ప్రేమ సంపాదించుకోవడానికి ఆయనను అనుకరించడం కాదు. ఇప్పటికే ప్రేమించబడిన పిల్లలుగా ఆయన స్వభావాన్ని ప్రతిబింబించడం. 5:2లో ప్రేమ ఎలా కనిపిస్తోంది? క్రీస్తు తనను తాను ఇచ్చాడు. అందుకే బైబిల్ ప్రేమ:కేవలం భావం కాదు. కేవలం మాట కాదు. త్యాగపూర్వకంగా ఇతరుల మేలు కోరే ప్రేమ.
**ఇంకా అడగండి:** "నా ప్రేమ నాకు ఏమి ఖర్చు చేస్తోంది?"

### ప్రశ్న 2 - ప్రేమ మరియు కామం

ఈ వ్యత్యాసాన్ని సులభంగా చెప్పండి: ప్రేమ - నీ మేలు కోరుతుంది. కామం - నా తృప్తి కోసం నిన్ను ఉపయోగిస్తుంది. లోభం కూడా ఇదే స్వార్థ దిశలో పనిచేస్తుంది: "నాకు ఇంకా కావాలి." పరిశుద్ధతను కేవలం శారీరక చర్యలకు పరిమితం చేయకండి. మన: కోరికలు, మాటలు, హాస్యం, సంబంధాలు కూడా ఇందులో ఉన్నాయి.
**ఇంకా అడగండి:** "మన సంస్కృతి ఏదైనా సాధారణం చేసింది కాబట్టి అది పరిశుద్ధమైపోతుందా?"

### ప్రశ్న 3 - చీకటి నుండి వెలుగుకు

క్రమాన్ని గమనించండి: మంచిగా జీవించు - వెలుగవుతావు కాదు. ప్రభువులో వెలుగు అయ్యావు - వెలుగు పిల్లలుగా జీవించు. వెలుగు ఫలం: మంచితనం - నీతి - సత్యం "చీకటిని బయటపెట్టండి" అనే మాటను ఇతరుల తప్పుల కోసం వెతకడానికి ఉపయోగించకండి. మొదట అడగాల్సిన ప్రశ్న: "నా జీవితంలో వెలుగులోకి రావడానికి నేను ఇష్టపడని విషయం ఏదైనా ఉందా?"
**ఇంకా అడగండి:** "మనం ఇతరుల పాపంపై చాలా స్పష్టంగా, మన పాపంపై మాత్రం అంధులుగా ఉండగలమా?"

### ప్రశ్న 4 - ప్రభువును సంతోషపరచడం

ప్రతి నిర్ణయానికి బైబిల్లో నేరుగా ఒక వచనం ఉండకపోవచ్చు. అప్పుడు కేవలం: "ఇది తప్పా?" "ఇది చేయవచ్చా?" అని మాత్రమే అడగకండి. ఇలా కూడా అడగండి: "ఇది ప్రభువును సంతోషపరుస్తుందా?" "ఇది మంచితనం, నీతి, సత్యానికి సరిపోతుందా?" ఈ ప్రశ్న రక్షణ సంపాదించడానికి కాదు. ప్రభువుకు చెందినవారిగా ఆయనను సంతోషపరచాలనే కోరిక
**ఇంకా అడగండి:** "'ఇది పాపమా కాదు?' అనే కనీస ప్రమాణం నుండి 'ఇది ప్రభువుకు ఇష్టమా?' అనే ప్రశ్నకు రావడం మన నిర్ణయాలను ఎలా మార్చుతుంది?"

### ప్రశ్న 5 - జ్ఞానం, సమయం, దేవుని చిత్తం

జ్ఞానం అంటే: దేవుని సత్యం తెలుసుకొని దానికి తగినట్లుగా జీవించడం. సమయాన్ని సద్వినియోగం చేయడం అంటే ప్రతి నిమిషాన్ని మతపరమైన పనులతో నింపడం కాదు. ఉద్దేశ్యపూర్వకంగా జీవించడం. విశ్రాంతి, పని, కుటుంబం, నిద్ర, సేవ అన్నింటికీ సరైన స్థానం ఉంది. దేవుని చిత్తాన్ని కేవలం: ఉద్యోగం, వివాహం, నివాసం వంటి నిర్ణయాలకు పరిమితం చేయకండి. లేఖనంలో

ఇప్పటికే స్పష్టంగా ఉన్న దేవుని చిత్తం: పరిశుద్ధత, ప్రేమ, సత్యం, కృతజ్ఞత, క్షమ, సేవ.
**ఇంకా అడగండి:** "దేవుడు ఇంకా ఏమి చెప్పాలి అని కోరుతున్నప్పుడు, ఆయన ఇప్పటికే చెప్పిన దేనికి నేను విధేయత చూపడం లేదు?"

### ప్రశ్న 6 – ఆత్మతో నింపబడటం

ముఖ్యమైన భావం: నియంత్రణ లేదా ప్రభావం. మద్యం ఒక వ్యక్తి ఆలోచన, మాట, తీర్పు, ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. అయితే విశ్వాసి ఎవరి ప్రభావంలో ఉండాలి? పరిశుద్ధాత్మ. ఆత్మతో నింపబడటం ఒకే భావోద్వేగ అనుభవం కాదు. అది మన: ఆలోచనలు, మాటలు, నిర్ణయాలు, వైఖరులు, సంబంధాలు, ప్రవర్తన లో కనిపించాలి.
**ఇంకా అడగండి:** "కష్టం వచ్చినప్పుడు నన్ను ఎక్కువగా నడిపించేది పరిశుద్ధాత్మా? లేక కోపం, భయం, కోరిక?"

### ప్రశ్న 7 – ఆత్మతో నింపబడిన జీవిత ఫలం

పౌలు వెంటనే నాలుగు విషయాలు చూపిస్తున్నాడు: ఆరాధన – హృదయపూర్వక స్తుతి – కృతజ్ఞత – వినయపూర్వక సంబంధాలు అందుకే ఆత్మీయతను కేవలం గొప్ప అనుభవాల ద్వారా కొలవకండి. ఫలాన్ని చూడండి. ఆ వ్యక్తి: మరింత కృతజ్ఞుడవుతున్నాడా? మరింత వినయంగా ఉన్నాడా? మరింత ప్రేమగా ఉన్నాడా? ఇతరులను గౌరవిస్తున్నాడా? క్రీస్తు కేంద్రంగా జీవిస్తున్నాడా?
**ఇంకా అడగండి:** "పరిశుద్ధాత్మ ప్రభావానికి మన సంబంధాలు ఎందుకు ఒక ముఖ్యమైన పరీక్ష?"

### ప్రశ్న 8 – వ్యక్తిగత అన్వయం

నాలుగు మాటలను సభ్యులతో మళ్లీ చెప్పించండి: ప్రేమ – వెలుగు – జ్ఞానం – ఆత్మతో నింపబడిన జీవితం తర్వాత ప్రతి ఒక్కరూ ఒక స్పష్టమైన ప్రాంతాన్ని గుర్తించేలా చేయండి. ఉదాహరణలు: మాటలు. హాస్యం. లైంగిక పరిశుద్ధత. సంబంధాలు. సమయ వినియోగం. కృతజ్ఞత. నిర్ణయాలు. ఫోన్ లేదా సోషల్ మీడియా అలవాట్లు.
**చివర అడగండి:** "ఈ వారం మీరు తీసుకోగల ఒక స్పష్టమైన అడుగు ఏమిటి?"

## నాయకులు ప్రత్యేకంగా గమనించవలసిన విషయాలు

1. "దేవునిని అనుకరించండి"
   దీని అర్థం దేవుని ప్రత్యేకమైన దైవ లక్షణాలను మనం అనుకరించగలమని కాదు. ఈ సందర్భంలో ముఖ్యంగా: ప్రేమ, దయ, క్షమ, పరిశుద్ధత మనలో ప్రతిబింబించాలి.
2. "చీకటిని బయటపెట్టండి"
   దీనిని కఠినమైన, స్వీయన్యాయమైన విమర్శకు అనుమతిగా ఉపయోగించవద్దు. ముందుగా: మన జీవితం దేవుని వెలుగులో ఉండాలి.
3. "ప్రభువు చిత్తాన్ని అర్థం చేసుకోండి"
   ప్రతి చిన్న నిర్ణయానికి ఒక రహస్యమైన సంకేతం కోసం వెతకడం కాదు. దేవుని చిత్తంలోని అనేక విషయాలు ఇప్పటికే లేఖనంలో స్పష్టంగా ఉన్నాయి. అందుకే: బయలుపరచబడిన చిత్తానికి విధేయత మొదట.
4. "ఆత్మతో నింపబడండి"
   దీనిని ఒకే భావోద్వేగ అనుభవానికి పరిమితం చేయవద్దు. పౌలు దానిని వెంటనే: ఆరాధన, కృతజ్ఞత, వినయం, సంబంధాలు తో కలుపుతున్నాడు.
5. "ప్రభువును సంతోషపరచడం"
   ఇది రక్షణ సంపాదించడానికి కాదు. మనం ఇప్పటికే క్రీస్తులో ఆయనకు చెందినవారము. అందుకే: అంగీకారం పొందడానికి కాదు – అంగీకరించబడినవారిగా జీవించడానికి.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చ చివర ఈ క్రమాన్ని సభ్యులతో కలిసి చెప్పించండి: క్రీస్తు చేత ప్రేమించబడ్డాము – ప్రేమలో నడుస్తాము – ప్రభువులో వెలుగుగా జీవిస్తాము – జ్ఞానంతో సమయాన్ని, జీవితాన్ని ఉపయోగిస్తాము – పరిశుద్ధాత్మ ప్రభావంలో జీవిస్తాము – ఆ ప్రభావం ఆరాధన, కృతజ్ఞత, మాటలు, సంబంధాలలో కనిపిస్తుంది. క్రైస్తవ జీవితం కేవలం: "కొన్ని పాపాలు చేయవద్దు" అనే జీవితం కాదు. అది: క్రీస్తు ప్రేమను, దేవుని వెలుగును, బైబిల్ జ్ఞానాన్ని, పరిశుద్ధాత్మ ప్రభావాన్ని ప్రతిబింబించే కొత్త జీవితం.

**చివరి ప్రశ్న :** ఎవరైనా ఒక వారం పాటు నా సాధారణ జీవితాన్ని గమనిస్తే – నా మాటలు, వ్యక్తిగత ఎంపికలు, సంబంధాలు, సమయ వినియోగం, హాస్యం, ప్రతిస్పందనలు, ప్రాధాన్యతలు చూసి – "ఈ వ్యక్తి ప్రేమలో, వెలుగులో, జ్ఞానంతో, పరిశుద్ధాత్మ ప్రభావంలో నడుస్తున్నాడు" అని చెప్పగలరా?

## బైబిల్ అధ్యయన పాఠం 11 ఎఫెసీయులకు 5:22-33

# క్రీస్తు మరియు సంఘాన్ని ప్రతిబింబించే వివాహం

### సందర్భం

ఎఫెసీయులకు 5:18లో పౌలు ఏమి చెప్పాడో గుర్తుందా? "ఆత్మతో నింపబడుడి." ఆత్మతో నింపబడిన జీవితం ఎలా కనిపిస్తుందో తరువాతి వచనాల్లో చెప్పాడు: ఆరాధనలో, కృతజ్ఞతలో, వినయంలో, సంబంధాలలో. ఇప్పుడు పౌలు మనకు అత్యంత దగ్గరైన సంబంధాలలో ఒకటైన వివాహం గురించి మాట్లాడుతున్నాడు. ఈ భాగాన్ని కొన్నిసార్లు ఏ ప్రశ్నల చుట్టూ మాత్రమే చర్చిస్తారు? "అధికారం ఎవరిది?" "ఎవరు ఎవరికి లోబడాలి?" కానీ పౌలు చూపిస్తున్న చిత్రం దానికంటే చాలా గొప్పది. ఈ భాగానికి అసలు కేంద్రం ఎవరు? భర్త కాదు. భార్య కాదు. క్రీస్తు. క్రైస్తవ వివాహం తనకంటే గొప్పదైన ఒక సత్యాన్ని చూపించే చిన్న చిత్రంలా ఉండాలి. భర్త యొక్క త్యాగపూర్వక ప్రేమ ఎవరి ప్రేమను చూపాలి? సంఘం పట్ల క్రీస్తు ప్రేమను. భార్య యొక్క ప్రేమతో కూడిన గౌరవం ఏమి చూపాలి? క్రీస్తు పట్ల సంఘం స్పందనను. అందుకే ఈ భాగాన్ని సులభంగా ఇలా గుర్తుంచుకోవచ్చు: కేంద్రంలో క్రీస్తు – గౌరవం – త్యాగప్రేమ – సంరక్షణ – ఒక శరీరం – క్రీస్తు మరియు సంఘం – సువార్త చిత్రం

### 1. వివాహం క్రీస్తు అధికారంలో ప్రారంభమవుతుంది ఎఫెసీయులకు 5:21-22

ఈ బోధను 22వ వచనం నుండే మొదలుపెట్టాలా? కాదు. ముందుగా 21వ వచనాన్ని గమనించాలి: "క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి." అంటే ఈ సంబంధాలన్నిటికి ముందు ఎవరు ఉన్నారు? క్రీస్తు. తర్వాత పౌలు భార్యలను ఉద్దేశించి తమ భర్తలకు ప్రభువునకు లోబడినట్లుగా లోబడాలని చెబుతున్నాడు. అయితే "లోబడటం" అంటే ఏమిటి? భార్యకు తక్కువ విలువ ఉందా? లేదు. తక్కువ తెలివి ఉందా? లేదు. ఆమె ఆత్మీయంగా తక్కువ స్థాయిలో ఉందా? లేదు. భర్త, భార్య ఇద్దరూ ఎవరి స్వరూపంలో సృష్టించబడ్డారు? దేవుని స్వరూపంలో. అందుకే ఇద్దరికీ మానవ విలువ, గౌరవం ఉంది. ఇక్కడ ముఖ్యమైన మాట ఏది? "ప్రభువునకు లోబడినట్లుగా." అంటే భార్య భర్తను గౌరవించడం చివరికి ఎవరి పట్ల విధేయతలో ఉండాలి? క్రీస్తు పట్ల. అలాగే భర్తకు కూడా స్వతంత్ర అధికారం ఉందా? లేదు. భర్త కూడా క్రీస్తు అధికారంలో ఉన్నాడు. అందుకే వివాహంలో మొదటి ప్రశ్న: "నా హక్కులు ఏమిటి?" అనేది కాదు. మరింత మంచి ప్రశ్న: "మా వివాహం క్రీస్తును ఎలా గౌరవించగలదు?"

### 2. భర్తకు క్రీస్తువంటి నాయకత్వపు పిలుపు ఎఫెసీయులకు 5:23

పౌలు భర్తను భార్యకు శిరస్సుగా పేర్కొంటున్నాడు. అయితే "శిరస్సు" అనే మాటను మన సంస్కృతి ప్రకారం అర్థం చేసుకోవాలా? లేదు. మన వ్యక్తిగత అభిప్రాయాల ప్రకారం? లేదు. అయితే ఎవరిని చూడాలి? క్రీస్తును. క్రీస్తు తన అధికారాన్ని ఎలా ఉపయోగిస్తాడు? తన ప్రజలను భయపెడతాడా? వారిని అవమానిస్తాడా? తన ప్రయోజనం కోసం బలవంతం చేస్తాడా? "నేను ప్రభువును; కాబట్టి నా మాటే జరగాలి" అని స్వార్థంగా వ్యవహరిస్తాడా? లేదు. పౌలు వెంటనే మనలను ఎటువైపు తీసుకువెళ్తున్నాడు? క్రీస్తు యొక్క త్యాగపూర్వక ప్రేమ వైపు. అందుకే బైబిల్ నాయకత్వం అంటే: "నేను భర్తను. కాబట్టి నేను చెప్పిందే జరగాలి." అనేది కాదు. క్రీస్తువంటి నాయకత్వం ఇలా అడుగుతుంది: "దేవుడు నాకు ఇచ్చిన బాధ్యతను నా భార్య మరియు కుటుంబం మేలు కోసం ఎలా ఉపయోగించగలను?" క్రీస్తు చేతిలో అధికారం ఎలా కనిపిస్తుంది? సేవగా. బాధ్యతగా. రక్షణగా. సంరక్షణగా. త్యాగంగా. స్వార్థపూర్వక నియంత్రణగా కాదు. అయితే భర్త తనను తాను అడగాలి: "నా నాయకత్వం నా కుటుంబాన్ని నొక్కివేస్తుందా? లేక వారి మేలుకోసం సేవ చేస్తున్నదా?"

### 3. భార్యలు – గౌరవంతో లోబడటం ఎఫెసీయులకు 5:22-24

పౌలు భార్యలు తమ భర్తకు దేవుడు ఇచ్చిన బాధ్యతను గౌరవించాలని చెబుతున్నాడు. కానీ ఈ లోబడటం ఎప్పుడూ ఎవరి అధికారానికి లోబడి ఉంటుంది? క్రీస్తు యొక్క ఉన్నత అధికారానికి. ఏ భర్త దేవుని స్థానాన్ని తీసుకోగలడా? లేదు. పాపం చేయమని చెప్పే హక్కు భర్తకు ఉందా? లేదు. అయితే "లోబడటం" అంటే భార్య: హింసను, బెదిరింపును, అవమానాన్ని, బలవంతాన్ని, తీవ్రమైన దుర్వినియోగాన్ని మౌనంగా భరించాలి అన్నమాటా? కాదు. ఈ భాగం భయంతో కూడిన బానిసత్వాన్ని బోధించడం లేదు. పౌలు చూపిస్తున్న చిత్రం ఏమిటి? క్రీస్తుకు సంఘం చూపే ప్రేమతో కూడిన స్పందన. అందుకే లోబడటం హీనత నుండి రావడం కాదు. భయం నుండి కూడా కాదు. అది: గౌరవం, క్రమం, విశ్వాసం, క్రీస్తు పట్ల విధేయత నుండి రావాలి. అయితే భార్య తనను తాను ఇలా అడగవచ్చు: "నా మాటలు, వైఖరి, స్పందనలో నా జీవిత భాగస్వామి పట్ల గౌరవం కనిపిస్తున్నదా?" మరింత లోతుగా: "నా వివాహ సంబంధం క్రీస్తుపట్ల నా గౌరవాన్ని ప్రతిబింబిస్తున్నదా?"

## 4. భర్తలు – క్రీస్తు సంఘాన్ని ప్రేమించినట్లుగా ప్రేమించండి ఎఫెసీయులకు 5:25

ఇప్పుడు పౌలు భర్తలకు ఎంత ఉన్నతమైన ప్రమాణం ఇస్తున్నాడో చూడండి: "భర్తలారా, క్రీస్తు సంఘమును ప్రేమించి, దానికొరకు తన్నుతాను అప్పగించుకొనిన ప్రకారము మీ భార్యలను ప్రేమించుడి." భర్త తన భార్యను ఎప్పుడు ప్రేమించాలి? ఆమె తనతో ఏకీభవించినప్పుడు మాత్రమేనా? లేదు. ఆమె తనను గౌరవించినప్పుడు మాత్రమేనా? లేదు. వివాహ జీవితం సులభంగా ఉన్నప్పుడు మాత్రమేనా? లేదు. ప్రమాణం ఏమిటి? "క్రీస్తు సంఘాన్ని ప్రేమించినట్లుగా." అయితే క్రీస్తు ఎలా ప్రేమించాడు? తన్నుతాను అప్పగించుకున్నాడు. అంటే క్రీస్తువంటి ప్రేమ సౌకర్యవంతమైన ప్రేమ కాదు. అది: ఖరీదైన ప్రేమ. త్యాగపూర్వక ప్రేమ. ఇచ్చే ప్రేమ. ఇతరుని మేలు కోరే ప్రేమ. అందుకే భర్త ముందుగా ఇలా అడగకూడదు: "నా భార్య నన్ను గౌరవిస్తున్నదా?" ముందుగా అడగాల్సింది: "నా ప్రేమ క్రీస్తు యొక్క త్యాగపూర్వక ప్రేమను పోలి ఉందా?" నా సమయం? నా మాటలు? నా నిర్ణయాలు? నా వినే మనసు? నా సేవ? నా త్యాగాలు? ఇవన్నీ ఏం చెబుతున్నాయి?

## 5. క్రీస్తు ప్రేమ మన నిజమైన మేలును కోరుతుంది ఎఫెసీయులకు 5:26-27

క్రీస్తు సంఘం కోసం తనను తాను ఎందుకు ఇచ్చాడు? కేవలం వెంటనే సౌకర్యంగా ఉండేలా చేయడానికా? లేదు. ఆయన తన సంఘాన్ని పరిశుద్ధపరచాలని కోరుతున్నాడు. అంటే క్రీస్తు ప్రేమ మన తాత్కాలిక సౌకర్యాన్ని మాత్రమే కాదు. మన నిజమైన, అంతిమ మేలును కోరుతుంది. ఇది వివాహానికి కూడా ఒక ముఖ్యమైన సూత్రం. నిజమైన ప్రేమ: "నా జీవిత భాగస్వామి ఎప్పుడూ నాతో సంతోషంగా ఉండాలి." అని మాత్రమే అడగదు. ఇంకా లోతైన ప్రశ్న అడుగుతుంది: "నా జీవిత భాగస్వామి క్రీస్తుకు మరింత దగ్గరవడానికి నేను ఎలా సహాయం చేయగలను?" భర్త, భార్య ఒకరినొకరు దేనిలో ఎదగడానికి సహాయం చేయాలి? ప్రార్థనలో. దేవుని వాక్యంలో. క్షమలో. పరిశుద్ధతలో. సేవలో. ఆత్మీయ పరిపక్వతలో. అంటే వివాహం కేవలం సహచర్యం కోసం మాత్రమేనా? లేదు. పరస్పర ఆత్మీయ ఎదుగుదలకు కూడా ఒక స్థలం. అయితే ఒక ముఖ్యమైన ప్రశ్న: "నా ప్రభావం నా జీవిత భాగస్వామిని క్రీస్తుకు దగ్గర చేస్తున్నదా? లేక ఆత్మీయ ఎదుగుదలను కష్టతరం చేస్తున్నదా?"

## 6. భార్యను తన శరీరంలా ప్రేమించాలి ఎఫెసీయులకు 5:28-30

పౌలు ఇప్పుడు మరో చిత్రం ఉపయోగిస్తున్నాడు. భర్త తన భార్యను ఎలా ప్రేమించాలి? తన సొంత శరీరంలా. ఎందుకు? వివాహంలో ఇద్దరి మధ్య లోతైన ఐక్యత ఉంది. మన శరీరాన్ని సాధారణంగా ఏమి చేస్తాం? పోషిస్తాం. సంరక్షిస్తాం. గాయమైతే చూసుకుంటాం. బలహీనమైతే విశ్రాంతి ఇస్తాం. అలాగే భర్త తన భార్యను ప్రేమతో పోషించి, సంరక్షించాలి. ఇందులో కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే ఉందా? లేదు. ఇందులో ఇవి కూడా ఉన్నాయి: వినడం. అర్థం చేసుకోవడం. ప్రోత్సహించడం. రక్షించడం. సేవ చేయడం. ప్రేమను వ్యక్తపరచడం. ప్రార్థించడం. బాధ్యతలు మోయడం. సంబంధ ఆరోగ్యాన్ని కాపాడటం. అయితే ఏవి క్రీస్తువంటి ప్రేమకు విరుద్ధం? నిర్లక్ష్యం. అవమానం. బెదిరింపు. నిరాసక్తత. స్వార్థం. భర్త తనను తాను ఇలా ప్రశ్నించవచ్చు: "నా సాన్నిధ్యం నా భార్యకు ప్రేమతో కూడిన సంరక్షణగా అనిపిస్తున్నదా?"

## 7. "ఇద్దరూ ఒక శరీరమగుదురు" ఎఫెసీయులకు 5:31

ఇప్పుడు పౌలు ఆదికాండము 2:24ను గుర్తుచేస్తున్నాడు: "ఇద్దరూ ఒక శరీరమగుదురు." అంటే వివాహం అంటే ఏమిటి? ఇద్దరూ ఒకే ఇంట్లో ఉండడమా? అంతే కాదు. పిల్లలను కలిసి పెంచడమా? అదొక్కటే కాదు. వివాహం దేవుడు ఏర్పాటు చేసిన ఒక లోతైన నిబంధన సంబంధ ఐక్యత. ఇద్దరి కుటుంబ నేపథ్యాలు వేరు కావచ్చు. వ్యక్తిత్వాలు వేరు. అలవాట్లు వేరు. బలాలు వేరు. బలహీనతలు వేరు. అయినా ఇద్దరూ కలిసి "మనము" అనే జీవితం నేర్చుకుంటారు. ఈ "ఒక శరీరం" ఐక్యత ఎక్కడ కనిపించాలి? సమయంలో. డబ్బులో. లైంగిక జీవితంలో. నిర్ణయాల్లో. కుటుంబ బాధ్యతల్లో. బాధల్లో. ఆనందాల్లో. ప్రాధాన్యతల్లో. భవిష్యత్తు ప్రణాళికల్లో. అందుకే వివాహం మన స్వార్థాన్ని సవాలు చేస్తుంది. పాత ప్రశ్న: "నాకు ఏమి కావాలి?" కొత్త ప్రశ్న: "మన ఇద్దరికీ మంచిది ఏమిటి?" అయితే "ఒక శరీరం" అంటే వ్యక్తిత్వం పోవడమా? లేదు. ఇది వ్యక్తిత్వం నాశనం కావడం కాదు. లోతైన, నిబద్ధతతో కూడిన సంబంధ ఐక్యత.

## 8. వివాహం తనకంటే గొప్పదైన దానిని చూపిస్తుంది ఎఫెసీయులకు 5:32

ఇప్పుడు పౌలు ఈ భాగంలోని అత్యంత ఆశ్చర్యకరమైన మాట చెబుతున్నాడు: "ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తును గూర్చియు సంఘమును గూర్చియు చెప్పుచున్నాను." అంటే పౌలు చివరికి కేవలం వివాహం గురించి మాట్లాడుతున్నాడా? లేదు. క్రీస్తు మరియు సంఘం గురించి. ఇదే ఈ భాగం యొక్క అసలు లోతు. క్రైస్తవ వివాహం ఏమి చూపాలి? భర్త యొక్క నమ్మకమైన, త్యాగపూర్వక ప్రేమ: క్రీస్తు తన సంఘాన్ని ఎలా ప్రేమించాడో చూపాలి. భార్య యొక్క ప్రేమతో కూడిన గౌరవ స్పందన: సంఘం క్రీస్తుకు ఎలా స్పందించాలో చూపాలి. అంటే వివాహానికి సువార్త ఉద్దేశం కూడా ఉందా? అవును. వివాహం కేవలం ఇద్దరి వ్యక్తిగత ఆనందం కోసం మాత్రమే కాదు. ఇది ఇతరులకు ఏమి చూపగలదు? నిబంధన విశ్వాస్యత. త్యాగపూర్వక ప్రేమ. క్షమ. పశ్చాత్తాపం.

కృప. విశ్వాస్యత. మన వివాహం పరిపూర్ణంగా ఉండాలా? లేదు. కానీ దాని ద్వారా పరిపూర్ణుడైన క్రీస్తు వైపు చూపించవచ్చు. అందుకే ప్రశ్న: "మనం ఒకరితో ఒకరు ప్రవర్తించే విధానాన్ని చూసినప్పుడు ఇతరులకు క్రీస్తు మరియు సంఘం గురించి ఏదైనా కనిపిస్తున్నదా?"

## 9. ప్రేమ మరియు గౌరవం ఎఫెసీయులకు 5:33

పౌలు చివరికి ఈ బోధను చాలా సరళంగా సంగ్రహిస్తున్నాడు. భర్త – ప్రేమ. భార్య – గౌరవం. అయితే ఈ వాక్యాన్ని ఎలా ఉపయోగించకూడదు? ఒకరిపై ఒకరు ఆయుధంగా. భర్త: "బైబిల్ చెబుతోంది కదా! నువ్వు నన్ను గౌరవించాలి." అని మాత్రమే చెప్పడం సరైనదా? లేదు. భార్య: "బైబిల్ చెబుతోంది కదా! నువ్వు నన్ను ప్రేమించాలి." అని మాత్రమే చెప్పడం సరైనదా? లేదు. ప్రతి ఒక్కరూ ముందుగా ఎవరిని పరిశీలించాలి? తమను తాము. అందుకే ప్రశ్న: "క్రీస్తు నన్ను ఏమి చేయమని పిలుస్తున్నాడు? నేను దాన్ని చేస్తున్నానా?" ఈ వాక్యం మన చేతిలో ఆయుధం కాకూడదు. అద్దం కావాలి. ముందుగా జీవిత భాగస్వామి వైఫల్యాలను కాకుండా, మన హృదయాన్ని మనం చూడాలి.

## 10. క్రీస్తువంటి నాయకత్వం అంటే నియంత్రణ కాదు

ఈ భాగంలో "శిరస్సు", "లోబడటం" వంటి మాటలు ఉన్నాయి. అందుకే ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. క్రీస్తువంటి నాయకత్వం ఎప్పుడూ దుర్వినియోగానికి అనుమతి కాదు. ఏవి క్రీస్తువంటి నాయకత్వం కావు? ఆధిపత్యం. బెదిరింపు. అవమానం. మానసిక ఒత్తిడి. హింస. ఆర్థిక నియంత్రణ. లైంగిక బలవంతం. ఆత్మీయ దుర్వినియోగం. ఎందుకు? క్రీస్తు తన సంఘాన్ని అలా నడిపించాడా? లేదు. లేఖనాన్ని ఉపయోగించి స్వార్థపూర్వక నియంత్రణను సమర్థించుకోవడం బైబిల్ నాయకత్వం కాదు. బైబిల్ నమూనా: "నాకు అధికారం ఉంది; కాబట్టి నా మాటే జరగాలి." అనేది కాదు. నమూనా: "దేవుడు నాకు ఇచ్చిన బాధ్యతను సేవ చేయడానికి, రక్షించడానికి, సంరక్షించడానికి, ఇతరుని మేలు కోరడానికి ఎలా ఉపయోగించగలను?" అదే క్రీస్తువంటి నాయకత్వం.

## ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు మొత్తం ప్రవాహాన్ని ఒకసారి చూద్దాం. ఎక్కడ మొదలైంది? ఆత్మతో నింపబడిన జీవితం. అది సంబంధాల్లో ఎలా కనిపిస్తుంది? క్రీస్తు పట్ల భయభక్తి. అప్పుడు? గౌరవంతో కూడిన సంబంధాలు. భర్తకు పిలుపు? క్రీస్తువంటి త్యాగపూర్వక ప్రేమ. ఆ ప్రేమ ఎలా కనిపిస్తుంది? సంరక్షణలో, సేవలో, ఇతరుని మేలును కోరడంలో. వివాహంలోని లోతైన ఐక్యత? ఒక శరీరం. ఈ మొత్తం చిత్రం చివరికి దేనిని చూపాలి? క్రీస్తు మరియు సంఘాన్ని. సులభంగా గుర్తుంచుకోండి: కేంద్రంలో క్రీస్తు – గౌరవం – త్యాగప్రేమ – సంరక్షణ – ఒక శరీరం – సువార్త చిత్రం

## అన్వయం

ఈ భాగాన్ని మన జీవిత భాగస్వామిపై ప్రయోగించడానికి ముందు ఏమి చేయాలి? మనలను మనం పరిశీలించుకోవాలి. ఇలా అడగకముందు: "నా జీవిత భాగస్వామి ఈ వాక్యాన్ని పాటిస్తున్నారా?" ముందుగా: "నేను పాటిస్తున్నానా?" అని అడగాలి. భర్తలు తమను తాము అడగవచ్చు: నా నాయకత్వం స్వార్థపూర్వకమా? లేక త్యాగపూర్వకమా? నా భార్య నా దగ్గర ఏమి అనుభవిస్తోంది? ప్రేమా? భద్రతా? గౌరవమా? వినే మనసా? సేవా? క్రీస్తువంటి సంరక్షణా? భార్యలు తమను తాము అడగవచ్చు: నా మాటల్లో గౌరవం ఉందా? నా వైఖరిలో ప్రోత్సాహం ఉందా? నా స్పందనలో జ్ఞానం ఉందా? నా వివాహ సంబంధంలో క్రీస్తు పట్ల విధేయత కనిపిస్తున్నదా? ఇద్దరూ అడగవచ్చు: "మా వివాహం మా ఇద్దరినీ మరింత క్రీస్తువంటి వారిగా మారుస్తున్నదా?" క్రైస్తవ వివాహం పరిపూర్ణమైనదా? లేదు. ఎందుకు? భర్త పాపి. భార్య కూడా పాపి. అందుకే వివాహానికి ప్రతిరోజూ ఏమి అవసరం? కృప – పశ్చాత్తాపం – క్షమ – సత్యం – సేవ – విశ్వాస్యత – ప్రేమ

## సువార్త సంబంధం

ఈ భాగంలోని లోతైన సందేశం కేవలం: "మంచి వివాహం ఎలా ఉండాలి?" అనేది కాదు. అయితే ప్రధాన విషయం ఏమిటి? క్రీస్తు మరియు సంఘం. పౌలు ఏమంటున్నాడు? "క్రీస్తు సంఘమును ప్రేమించి, దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను" (5:25). ఈ మాట మనలను ఎక్కడికి తీసుకువెళ్తుంది? సిలువ దగ్గరకు. సంఘం పరిపూర్ణంగా ఉన్నందుకే క్రీస్తు దానిని ప్రేమించాడా? లేదు. ఆయన ప్రజలు ఆయన ప్రేమకు అర్హులయ్యే వరకు వేచి చూశాడా? లేదు. ఆయన ఏమి చేశాడు? ప్రేమించాడు. తనను తాను ఇచ్చుకున్నాడు. ఇదే క్రైస్తవ వివాహానికి గొప్ప నమూనా. ఇది: డిమాండ్ చేయడం కాదు. నియంత్రించడం కాదు. "నేను ఎంత చేశాను? నువ్వు ఎంత చేశావు?" అని లెక్క పెట్టడం కాదు. అయితే ఏమిటి? ఇవ్వడం – సేవ చేయడం – క్షమించడం – ఇతరుని మేలు కోరడం – విశ్వాసంగా నిలవడం మన వివాహాలు ఎప్పుడూ అసంపూర్ణమైనవే. కానీ అవి ఎవరిని చూపగలవు? పరిపూర్ణమైన

వరుడైన యేసుక్రీస్తును. ఆయన తన ప్రజలను ప్రేమించాడు. వారి కోసం తనను తాను అప్పగించాడు. అందుకే ఈ భాగంలోని అసలు ప్రశ్న కేవలం: "అధికారం ఎవరిది?" అనేది కాదు. మరింత గొప్ప ప్రశ్న: "మనం కలిసి జీవించే విధానం ద్వారా క్రీస్తు తన సంఘాన్ని ఎలా ప్రేమించాడో, సంఘం క్రీస్తుకు ఎలా స్పందించాలో ఇతరులకు కొంతైనా కనిపిస్తున్నదా?"

## బైబిల్ అధ్యయన ప్రశ్నలు - 8

1. ఎఫెసీయులకు 5:21-33లో వివాహ బోధకు కేంద్రం ఎవరు? 5:21లోని "క్రీస్తుపట్ల భయభక్తి" ఈ మొత్తం భాగాన్ని అర్థం చేసుకోవడానికి ఎలా సహాయం చేస్తుంది?
2. 5:22-24లో భార్య "లోబడటం" అంటే ఏమిటి? అది తక్కువ విలువ, భయం, అంధ విధేయత లేదా దుర్వినియోగాన్ని భరించడం కాదని ఎలా అర్థం చేసుకోవాలి?
3. 5:23-25 ప్రకారం క్రీస్తువంటి నాయకత్వం ఎలా ఉంటుంది? "నేను చెప్పిందే జరగాలి" అనే స్వార్థపూర్వక నియంత్రణతో దానికి తేడా ఏమిటి?
4. 5:25లో భర్త ప్రేమకు పోలు ఏ ప్రమాణాన్ని ఇస్తున్నాడు? "తన్నుతాను అప్పగించుకొనెను" అనే మాట రోజువారీ వివాహ జీవితంలో ఎలా కనిపించాలి?
5. 5:26-30 ప్రకారం నిజమైన ప్రేమ జీవిత భాగస్వామి నిజమైన మేలును ఎలా కోరుతుంది? భర్త, భార్య ఒకరినొకరు క్రీస్తులో ఎదగడానికి ఎలా సహాయం చేయగలరు?
6. "ఇద్దరూ ఒక శరీరమగుదురు" (5:31) అంటే ఏమిటి? ఈ ఐక్యత డబ్బు, సమయం, నిర్ణయాలు, బాధ్యతలు, లైంగిక జీవితం, భవిష్యత్తు ప్రణాళికలను ఎలా ప్రభావితం చేయాలి?
7. 5:32-33 ప్రకారం క్రైస్తవ వివాహం ఏ గొప్ప సత్యాన్ని చూపించాలి? భర్త యొక్క ప్రేమ, భార్య యొక్క గౌరవం క్రీస్తు మరియు సంఘాన్ని ఎలా ప్రతిబింబించగలవు?
8. ఈ భాగాన్ని జీవిత భాగస్వామిని మార్చడానికి ఉపయోగించకుండా, మనలను మనం పరిశీలించుకోవడానికి ఎలా ఉపయోగించాలి? ఈ వారం మీ మాటల్లో, ప్రేమలో, గౌరవంలో, సేవలో లేదా క్షమలో మీరు చేయగల ఒక స్పష్టమైన మార్పు ఏమిటి?

## నాయకులకు - ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులు వాక్యాన్ని చదివి తమ మాటల్లో సమాధానం చెప్పేలా చేయండి. వెంటనే: "భర్త చేయాల్సింది ఇది." "భార్య చేయాల్సింది ఇది." అని చర్చను ఒకరిపై ఒకరు ప్రయోగించేలా చేయకండి. ఎప్పటికప్పుడు అడగండి: "ఈ వాక్యం మొదట నాతో ఏమి చెబుతోంది?"

### ప్రశ్న 1 - కేంద్రంలో క్రీస్తు

చర్చను కేవలం భర్త అధికారం లేదా భార్య లోబడటం దగ్గర ప్రారంభించకండి. 5:18-21 నేపథ్యాన్ని గుర్తుచేయండి: ఆత్మతో నింపబడిన జీవితం - క్రీస్తు పట్ల భయభక్తి - సంబంధాలలో వినయం భర్త, భార్య ఇద్దరూ మొదట ఎవరు? క్రీస్తు శిష్యులు. వివాహానికి చివరి అధికారం ఎవరు? క్రీస్తు.

**ఇంకా అడగండి:** "వివాహంలో ఇద్దరూ ముందుగా క్రీస్తుకు లోబడితే వారి మధ్య ఉన్న విభేదాలను చూసే విధానం ఎలా మారుతుంది?"

### ప్రశ్న 2 - లోబడటం అంటే ఏమిటి?

ముందుగా స్పష్టంగా చెప్పండి: లోబడటం అంటే: తక్కువ విలువ కాదు. తక్కువ తెలివి కాదు. తక్కువ ఆత్మీయ స్థాయి కాదు. భర్త, భార్య ఇద్దరూ దేవుని స్వరూపంలో సృష్టించబడ్డారు. అలాగే మానవ అధికారం ఎప్పుడూ ఎవరి అధికారానికి కింద ఉంటుంది? క్రీస్తు అధికారానికి. అందుకే: పాపం చేయమని చెప్పడం, హింస, దుర్వినియోగం, బలవంతం, బెదిరింపు వంటి వాటిని "లోబడటం" పేరుతో సమర్థించలేం.

**ఇంకా అడగండి:** "భయంతో చేసే విధేయతకు, క్రీస్తు పట్ల విధేయతలో గౌరవంగా స్పందించడానికి తేడా ఏమిటి?"

### ప్రశ్న 3 - క్రీస్తువంటి నాయకత్వం

"శిరస్సు" అనే మాటను క్రీస్తు ఉదాహరణ ద్వారా వివరించండి. క్రీస్తు ఏ విధమైన నాయకుడు? సేవ చేసే నాయకుడు - త్యాగం చేసే నాయకుడు - రక్షించే నాయకుడు - సంరక్షించే నాయకుడు అందుకే భర్త నాయకత్వం స్వార్థపూర్వక నియంత్రణ కాదు.

**ఇంకా అడగండి:** "క్రీస్తు తన అధికారాన్ని ఎలా ఉపయోగించాడు? అదే భర్త నాయకత్వాన్ని ఎలా మార్చాలి?"

### ప్రశ్న 4 - తన్నుతాను అప్పగించిన ప్రేమ

భర్త ప్రేమకు ప్రమాణం ఏమిటి? భార్య ప్రవర్తనా? లేదు. క్రీస్తు ప్రేమ. "తన్నుతాను అప్పగించుకోవడం" రోజువారీ జీవితంలో ఎలా కనిపించవచ్చు? సమయం ఇవ్వడం. వినడం. సేవ చేయడం. స్వార్థాన్ని విడిచిపెట్టడం. తప్పు ఒప్పుకోవడం. క్షమాపణ అడగడం. బాధ్యతలు మోయడం. కష్టకాలంలో విశ్వాసంగా ఉండడం.

**ఇంకా అడగండి:** "క్రీస్తువంటి ప్రేమ నాకు నిజంగా ఏమైనా ఖర్చు చేస్తున్నదా?"

### ప్రశ్న 5 - జీవిత భాగస్వామి నిజమైన మేలు

క్రీస్తు ప్రేమ కేవలం సంఘం సౌకర్యాన్ని మాత్రమే కోరలేదు. పరిశుద్ధత, ఆత్మీయ మేలు కోరింది. అలాగే వివాహంలో ఒకరిని ఒకరు ఎలా సహాయం చేయవచ్చు? కలిసి ప్రార్థించడం. వాక్యాన్ని ప్రోత్సహించడం. కృపతో సత్యం చెప్పడం. పాపం ఒప్పుకోవడం. క్షమించడం. సేవలో ప్రోత్సహించడం. కానీ ఆత్మీయ ఎదుగుదల పేరుతో ఒకరి మనస్సాక్షిని మరొకరు నియంత్రించడం సరైంది కాదు.

**ఇంకా అడగండి:** "నా జీవిత భాగస్వామి క్రీస్తులో ఎదగడానికి నా జీవితం సహాయం చేస్తున్నదా?"

### ప్రశ్న 6 - ఒక శరీరం

"ఒక శరీరం" అంటే కేవలం శారీరక ఐక్యత కాదు. ఇది మొత్తం జీవితాన్ని తాకే నిబంధన ఐక్యత. చర్చించవచ్చు: డబ్బు. సమయం. పిల్లలు. నిర్ణయాలు. లైంగిక జీవితం. కుటుంబ బాధ్యతలు. వృద్ధ తల్లిదండ్రులు. భవిష్యత్తు ప్రణాళికలు. ఇక్కడ స్వార్థం సవాలు చేయబడుతుంది.

**ఇంకా అడగండి:** "మా వివాహంలో 'నా' అనే ఆలోచనను 'మన'గా మార్చుకోవాల్సిన ప్రాంతం ఏది?"

### ప్రశ్న 7 - వివాహం ఒక సువార్త చిత్రం

ఈ పాఠంలోని ప్రధాన ప్రశ్న ఇదే. పౌలు స్పష్టంగా చెబుతున్నాడు: "నేను క్రీస్తును గూర్చియు సంఘమును గూర్చియు చెప్పుచున్నాను." భర్త ప్రేమ ఏమి చూపాలి? క్రీస్తు ప్రేమ. భార్య గౌరవ స్పందన? సంఘం క్రీస్తుకు స్పందించడం. వివాహం ద్వారా ఇంకేమి కనిపించవచ్చు? విశ్వాస్యత. క్షమ. పశ్చాత్తాపం. కృప. నిబద్ధత.

**ఇంకా అడగండి:** "మన వివాహాన్ని చూసినప్పుడు సువార్త గురించి ఏదైనా కనిపిస్తున్నదా?"

### ప్రశ్న 8 - అద్దం, ఆయుధం కాదు

ఈ ప్రశ్నను వ్యక్తిగత అన్వయానికి తీసుకురండి. భర్త: "నా ప్రేమ క్రీస్తువంటి త్యాగపూర్వక ప్రేమగా ఉందా?" అని అడగాలి. భార్య: "నా వైఖరిలో గౌరవం మరియు క్రీస్తు పట్ల విధేయత కనిపిస్తున్నదా?" అని అడగాలి. ఇద్దరూ: "మా వివాహం ఇతరులకు క్రీస్తును చూపిస్తున్నదా?" అని అడగాలి. ఒక స్పష్టమైన అడుగు ఎంచుకునేలా చేయండి: మరింత వినడం. గౌరవంగా మాట్లాడడం. క్షమాపణ అడగడం. క్షమించడం. అభినందించడం. సేవ చేయడం. కలిసి ప్రార్థించడం.

## నాయకులు ప్రత్యేకంగా గమనించవలసిన విషయాలు

1. లోబడటం అంటే హీనత కాదు

భర్త, భార్య ఇద్దరికీ దేవుని ఎదుట సమానమైన మానవ విలువ ఉంది. పాత్రలు భిన్నంగా ఉండవచ్చు. విలువ భిన్నంగా కాదు.

2. మానవ అధికారం సంపూర్ణమైనది కాదు

ప్రతి మానవ సంబంధానికి పైన ఎవరు ఉన్నారు? క్రీస్తు. అందుకే దేవునికి విరుద్ధమైన దానికి విధేయత చూపాల్సిన బాధ్యత ఎవరికీ లేదు.

3. శిరస్సుగా ఉండటం అంటే ఆధిపత్యం కాదు

భర్తకు నమూనా ఎవరు? తనను తాను అప్పగించుకున్న క్రీస్తు. అందుకే నాయకత్వం యొక్క గుర్తు: త్యాగం మరియు సేవ కేవలం ఆజ్ఞలు కాదు.

4. ప్రేమ అంటే దుర్వినియోగాన్ని కొనసాగనివ్వడం కాదు

నిజమైన ప్రేమ: సత్యం, పరిశుద్ధత, భద్రత, ఇతరుని నిజమైన మేలు కోరుతుంది.

5. క్షమ అన్నింటినీ రద్దు చేయదు

క్షమ అంటే: హద్దులు అవసరం లేదని కాదు. జవాబుదారీతనం అవసరం లేదని కాదు. న్యాయం అవసరం లేదని కాదు. అవసరమైన చర్యలు తీసుకోకూడదని కాదు.

6. తీవ్రమైన దుర్వినియోగాన్ని ఆధ్యాత్మిక భాషతో దాచకండి

హింస, బలవంతం, తీవ్రమైన దుర్వినియోగం లేదా ప్రమాదం ఉన్నప్పుడు: భద్రత, సత్యం, తగిన సహాయం ముఖ్యమైనవి. "లోబడాలి" అనే వచనాన్ని ఉపయోగించి ఎవరినైనా మౌనంగా బాధ భరించమని ఒత్తిడి చేయకండి.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చ చివరికి మళ్లీ ఈ వాక్యానికి రండి: "క్రీస్తు సంఘమును ప్రేమించి, దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను" - ఎఫెసీయులకు 5:25 ఈ భాగమంతా ఈ నమూనా చుట్టూ తిరుగుతోంది. భర్తకు పిలుపు: క్రీస్తువంటి త్యాగపూర్వక ప్రేమ మరియు బాధ్యతతో కూడిన సంరక్షణ భార్యకు పిలుపు: క్రీస్తు ప్రభుత్వం కింద ప్రేమతో, గౌరవంతో స్పందించడం ఇద్దరికీ పిలుపు: క్రీస్తు కింద ఒక శరీరంగా జీవించడం వారి వివాహం చివరికి ఎవరిని చూపాలి? తమను తామా? లేదు. క్రీస్తు మరియు సువార్తను.

## చివరి ప్రశ్న

మన వివాహాన్ని చూసినప్పుడు ఇతరులు కేవలం: "ఇద్దరూ బాగా కలిసిపోతున్నారు" అని మాత్రమే చెప్పాలా? లేక ఇంకా గొప్పగా: "ఇక్కడ త్యాగపూర్వక ప్రేమ ఉంది. గౌరవం ఉంది. క్షమ ఉంది. కృప ఉంది. విశ్వాస్యత ఉంది. ఇది క్రీస్తు తన ప్రజలను ప్రేమించిన ప్రేమను కొంతైనా చూపిస్తోంది" అని చెప్పగలరా?

## బైబిల్ స్టడీ పాఠం 12 ఎఫెసీయులకు 6:1-9

# ఇంటిలోను పనిలోను క్రీస్తు ప్రభావం

### సందర్భం

ఎఫెసీయులకు 5వ అధ్యాయంలో పౌలు ఏమి చెప్పాడో గుర్తుందా? "పరిశుద్ధాత్మతో నింపబడండి." ఆత్మతో నింపబడిన జీవితం కేవలం ప్రార్థనలో, పాటల్లో, సంఘ సమావేశంలో మాత్రమే కనిపిస్తుందా? లేదు. అది మనకు అత్యంత దగ్గరైన సంబంధాలలో కూడా కనిపించాలి. మొదట పౌలు భార్యాభర్తల గురించి మాట్లాడాడు. ఇప్పుడు పిల్లలు-తల్లిదండ్రులు, పనివారు-యజమానులు అనే రోజువారీ సంబంధాలకు వస్తున్నాడు. ఎందుకు? ఎందుకంటే మన క్రైస్తవ జీవితం నిజంగా ఎలా ఉందో తెలుసుకోవాలంటే కేవలం ఆదివారం సంఘంలో మన ప్రవర్తనను మాత్రమే చూడకూడదు. ఇంట్లో ఎలా మాట్లాడుతున్నాం? పిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నాం? తల్లిదండ్రులను ఎలా గౌరవిస్తున్నాం? పనిస్థలంలో ఎంత నిజాయితీగా ఉన్నాం? మన ఆధీనంలో ఉన్నవారితో ఎలా వ్యవహరిస్తున్నాం? ఇవన్నీ కూడా మన ఆత్మీయ జీవితాన్ని చూపిస్తాయి. ఈ భాగమంతటిలో ఒక గొప్ప సత్యం మళ్లీ మళ్లీ కనిపిస్తుంది: క్రీస్తు ప్రతి సంబంధానికి ప్రభువు. పిల్లలు ఆయనకు జవాబుదారులు. తల్లిదండ్రులు ఆయనకు జవాబుదారులు. పనివారు ఆయనకు జవాబుదారులు. యజమానులు, నాయకులు కూడా ఆయనకే జవాబుదారులు. సులభంగా గుర్తుంచుకోవాలంటే: ఇంటిలో క్రీస్తు - పిల్లల పెంపకంలో క్రీస్తు - పనిలో క్రీస్తు - అధికార వినియోగంలో క్రీస్తు

### 1. పిల్లలారా – ప్రభువులో మీ తల్లిదండ్రులకు విధేయులై ఉండండి ఎఫెసీయులకు 6:1-3

పౌలు ఎవరితో నేరుగా మాట్లాడుతున్నాడు? పిల్లలతో. అతను ఏమంటున్నాడు? "ప్రభువులో మీ తల్లిదండ్రులకు విధేయులై ఉండండి." ఇక్కడ ఏ మాట చాలా ముఖ్యమైనది? "ప్రభువులో." పిల్లలు తల్లిదండ్రులకు ఎందుకు విధేయత చూపాలి? వారు పెద్దవారు కాబట్టేనా? అదొక్కటే కాదు. వారి విధేయత చివరికి ఎవరితో సంబంధం కలిగి ఉంది? ప్రభువైన యేసుతో. తర్వాత పౌలు ఏ ఆజ్ఞను గుర్తుచేస్తున్నాడు? "నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము." ఇక్కడ "విధేయత" మరియు "గౌరవం" మధ్య చిన్న తేడా గమనించాలి. చిన్న పిల్లలు, తల్లిదండ్రుల సంరక్షణలో ఉన్న పిల్లలు వారికి విధేయత చూపాలి. కానీ మనం పెద్దవారైన తరువాత ప్రతి విషయానికి తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలా? అవసరం లేదు. కానీ గౌరవం ఆగిపోతుందా? లేదు. గౌరవం జీవితాంతం కొనసాగుతుంది. మన తల్లిదండ్రులు వృద్ధులవుతున్నప్పుడు గౌరవం ఎలా కనిపించవచ్చు? గౌరవంగా మాట్లాడటం. ఓపికగా వినడం. సమయం ఇవ్వడం. కృతజ్ఞత చెప్పడం. అవసరాల్లో సహాయం చేయడం. బలహీనత వచ్చినప్పుడు చూసుకోవడం. అయితే మనం మనలను మనం అడగాలి: "నా తల్లిదండ్రులు వృద్ధులవుతున్నప్పుడు, నా మాటలు, నా ఓర్పు, నా సమయం, నా శ్రద్ధ వారికి గౌరవం చూపుతున్నాయా?"

### 2. గౌరవం అంటే పాపానికి విధేయత కాదు

"ప్రభువులో" అనే మాట ఇంకో విషయం కూడా చెబుతోంది. తల్లిదండ్రుల అధికారం నిజమైనదే. కానీ అది సంపూర్ణమైనదా? లేదు. వారికంటే పైగా ఎవరు ఉన్నారు? క్రీస్తు. అయితే తల్లిదండ్రులు దేవుని వాక్యానికి స్పష్టంగా విరుద్ధమైన పని చేయమని చెప్పితే? మన మొదటి విధేయత ఎవరికి? దేవునికి. కానీ ఇక్కడ పిల్లలు ఒక ప్రమాదం కూడా గుర్తుంచుకోవాలి. తమకు నచ్చని ప్రతి విషయానికీ: "దేవుడు నాకు ఇలా చెప్పాడు" అని చెప్పి తల్లిదండ్రుల మాటను తిరస్కరించవచ్చా? లేదు. అది నిజమైన ఆత్మీయత కాదు. సాధారణ బైబిల్ నమూనా ఏమిటి? క్రీస్తు ప్రభుత్వం కింద గౌరవపూర్వకమైన విధేయత. అయితే ప్రశ్న: "నా విధేయత నిజంగా క్రీస్తుపట్ల గౌరవం నుండి వస్తున్నదా? లేక నాకు నచ్చినప్పుడు మాత్రమే తల్లిదండ్రుల మాట వింటున్నానా?"

### 3. తండ్రులారా – మీ పిల్లలను రెచ్చగొట్టవద్దు ఎఫెసీయులకు 6:4

పౌలు పిల్లలకే బాధ్యత చెప్పి ఆగిపోయాడా? లేదు. ఇప్పుడు ఎవరితో మాట్లాడుతున్నాడు? తల్లిదండ్రులతో, ప్రత్యేకంగా తండ్రులతో. అతను ఏమంటున్నాడు? "మీ పిల్లలకు కోపం రేపకండి." అంటే తల్లిదండ్రులకు అధికారం ఉంది కాబట్టి ఎలా కావాలంటే అలా ప్రవర్తించవచ్చా? లేదు. తల్లిదండ్రులు కూడా తమ అధికార వినియోగానికి దేవునికి జవాబు చెప్పాలి. పిల్లలను రెచ్చగొట్టే కొన్ని విషయాలు ఏమిటి? నిరంతర విమర్శ. ఇతర పిల్లలతో పోల్చడం. అసాధ్యమైన అంచనాలు. ఒకరోజు ఒక నియమం, మరొకరోజు ఇంకో నియమం. పక్షపాతం. అవమానించడం. ఎప్పుడూ అరవడం. అతిగా శిక్షించడం. పిల్లల మాట వినకపోవడం. వారు చేసిన మంచిని ఎప్పుడూ గుర్తించకపోవడం. పిల్లవాడు బయటకు విధేయంగా కనిపించవచ్చు. కానీ లోపల ఏమి పెరుగుతుండవచ్చు? కోపం. భయం. నిరుత్సాహం. దూరం. అందుకే తల్లిదండ్రుల అధికారం తమ కోపాన్ని పిల్లలపై కుమ్మరించడానికి దేవుడు ఇచ్చిన

అనుమతి కాదు. సరిదిద్దేటప్పుడు ఒక ప్రశ్న అడగాలి: "నేను నా బిడ్డను ఎదగడానికి సహాయం చేస్తున్నానా? లేక నా చిరాకును బయటపెడుతున్నానా?"

## 4. శిక్షణ మరియు కోపంతో శిక్షించడం ఒకటే కాదు

పౌలు: "పిల్లలను ఎప్పుడూ సరిదిద్దవద్దు" అంటున్నాడా? లేదు. ఏమంటున్నాడు? "ప్రభువు శిక్షణలోను బోధలోను వారిని పెంచండి." అయితే బైబిల్ శిక్షణ లక్ష్యం ఏమిటి? పిల్లను బాధపెట్టడమా? ప్రతీకారం తీర్చుకోవడమా? లేదు. మార్పు. పిల్లవాడు: "నేను ఏమి తప్పు చేశాను?" అది అర్థం చేసుకోవాలి. "ఎందుకు తప్పు?" అది తెలుసుకోవాలి. "తర్వాత ఎలా సరైన విధంగా స్పందించాలి?" అది నేర్చుకోవాలి. కోపంతో ఇచ్చే శిక్ష ఏమంటుంది? "నన్ను కోపపెట్టావు. ఇప్పుడు నిన్ను బాధపెడతాను." దేవుని ప్రకారం శిక్షణ ఏమి అడుగుతుంది? "ఇది ఎందుకు తప్పు? నా బిడ్డ దీనిని అర్థం చేసుకోవడానికి ఎలా సహాయం చేయగలను? తరువాత సరైనది ఎలా చేయాలో ఎలా నేర్పగలను?" అందుకే సరిదిద్దడం ఎలా ఉండాలి? స్పష్టంగా. తగినంతగా. స్థిరంగా. ప్రేమతో. అవమానం లేకుండా. లక్ష్యం కేవలం "నిశ్శబ్దంగా ఉండే పిల్లవాడు" కాదు. జ్ఞానంలోను భక్తిలోను ఎదిగే పిల్లవాడు.

## 5. ప్రభువు శిక్షణలోను బోధలోను వారిని పెంచండి ఎఫెసీయులకు 6:4

క్రైస్తవ పిల్లల పెంపకం అంటే కేవలం: "బాగా చదువు." "మంచి మార్కులు తెచ్చు." "మంచి ఉద్యోగం సంపాదించు." "చాలా సంపాదించు." "కుటుంబానికి మంచి పేరు తీసుకురా." అనే వాటితో ముగియాలా? లేదు. ఇవి ముఖ్యమైన విషయాలే. కానీ ఇంకా గొప్ప లక్ష్యం ఏమిటి? పిల్లలు దేవునిని తెలుసుకోవాలి. ఆయన వాక్యాన్ని అర్థం చేసుకోవాలి. సువార్తను స్పష్టంగా తెలుసుకోవాలి. తమకు క్రీస్తు అవసరమని గ్రహించాలి. ఆయనను అనుసరించడం నేర్చుకోవాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను రక్షించగలరా? లేదు. నూతన జన్మను దేవుడే ఇస్తాడు. అయితే తల్లిదండ్రులు ఏమి చేయగలరు? బోధించగలరు. ప్రార్థించగలరు. మంచి నమూనాగా ఉండగలరు. ప్రేమతో సరిదిద్దగలరు. ప్రోత్సహించగలరు. పదేపదే క్రీస్తువైపు చూపించగలరు. అయితే తల్లిదండ్రులుగా మనం అడగాలి: "నా పిల్లల భవిష్యత్తు గురించి నేను ఎక్కువగా ఆలోచిస్తున్నది వారి చదువు, ఉద్యోగం, సంపాదన గురించేనా? లేక వారి ఆత్మీయ జీవితం గురించి కూడా అంతే శ్రద్ధ చూపుతున్నానా?"

## 6. పిల్లలు మన మాటల ద్వారా మాత్రమే కాదు, మన జీవితాన్ని చూసి కూడా నేర్చుకుంటారు

పిల్లలు బైబిల్ పాఠం నుండి మాత్రమే నేర్చుకుంటారా? లేదు. వారు మన జీవితాన్ని ప్రతిరోజూ చూస్తారు. మనం కోపపడినప్పుడు ఎలా మాట్లాడుతున్నాం? భర్త లేదా భార్యతో ఎలా ప్రవర్తిస్తున్నాం? డబ్బును ఎలా ఉపయోగిస్తున్నాం? తప్పు చేసినప్పుడు: "క్షమించు, నేను తప్పు చేశాను" అని చెబుతున్నామా? ఇతరులను క్షమిస్తున్నామా? ఇతరుల గురించి వెనుక మాట్లాడుతున్నామా? కష్టం వచ్చినప్పుడు మాత్రమే ప్రార్థిస్తున్నామా? మనకంటే తక్కువ స్థాయిలో ఉన్నవారితో ఎలా మాట్లాడుతున్నాం? పిల్లలు ఏమి నేర్చుకుంటారు? మనము చెప్పింది మాత్రమేనా? లేదు. మనము జీవించినదాన్ని కూడా. అందుకే ఒక గంభీరమైన ప్రశ్న: "నా పిల్లలు నా రోజువారీ జీవితాన్ని చూసి మాత్రమే క్రైస్తవ విశ్వాసం నేర్చుకుంటే, వారు ఎలాంటి క్రైస్తవ జీవితాన్ని నేర్చుకుంటారు?"

## 7. పనివారు – క్రీస్తుకు సేవ చేసినట్లుగా నిజాయితీగా పనిచేయండి ఎఫెసీయులకు 6:5–7

ఇప్పుడు పౌలు ఎవరి గురించి మాట్లాడుతున్నాడు? ఆ కాలంలోని దాసులు మరియు యజమానుల గురించి. ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. రోమా కాలంలోని దాస్య వ్యవస్థను నేటి ఉద్యోగ వ్యవస్థతో పూర్తిగా సమానం చేయకూడదు. ఈ వాక్యాన్ని బానిసత్వాన్ని సమర్థించడానికి ఉపయోగించకూడదు. అయితే పని గురించి పౌలు చెప్పే కొన్ని గొప్ప సూత్రాలు నేటికీ వర్తిస్తాయా? అవును. అతను ఏమంటున్నాడు? "క్రీస్తుకు విధేయులైనట్లుగా..." "మనుష్యులకు కాదు, ప్రభువుకు చేసినట్లుగా..." అంటే క్రైస్తవుడు పని ఎందుకు చేస్తాడు? కేవలం జీతం కోసమా? ప్రమోషన్ కోసమా? బాస్‌ను మెప్పించడానికా? గుర్తింపు కోసం మాత్రమేనా? లేదు. సాధారణ పని కూడా క్రీస్తుకు చేసే సేవగా మారవచ్చు. ఆఫీసు పని. వంట. వ్యవసాయం. బోధన. వ్యాపారం. ఇంటి పని. పరిచర్య. ఏ పని అయినా నిజాయితీగా, విశ్వాసంగా చేస్తే ఎవరికి చేయవచ్చు? ప్రభువుకు. అయితే మనం అడగాలి: "నా పని గురించి నా దృష్టి కేవలం జీతం చుట్టూ తిరుగుతున్నదా? లేక ఇది కూడా క్రీస్తుకు సేవ అని చూస్తున్నానా?"

## 8. చూస్తున్నప్పుడు మాత్రమే పనిచేయడం మానండి

పౌలు ఒక ప్రత్యేకమైన సమస్యను చెబుతున్నాడు. ఏది? మనుష్యులు చూస్తున్నప్పుడు మాత్రమే బాగా పనిచేయడం. ఇది నేటి జీవితంలో ఎలా కనిపించవచ్చు? బాస్ ఉన్నప్పుడు చాలా బిజీగా కనిపించడం. అతను వెళ్లగానే పని తగ్గించడం. ఎవరైనా తనిఖీ చేస్తేనే శ్రద్ధగా చేయడం. ప్రశంస వస్తే మాత్రమే ఉత్సాహంగా పని చేయడం. ఎవరూ చూడకపోతే అలసత్వం. ఇది ఎందుకు సమస్య? ఎందుకంటే మన పని చివరికి ఎవరి ముందుంది? క్రీస్తు ముందు. మనుష్యులు చూడకపోవచ్చు. కానీ ప్రభువు

చూస్తున్నాడు. అందుకే ఒక గొప్ప ప్రశ్న: "ఎవరూ చూడనప్పుడు నేను ఎవరు?" ఇది ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుందా? లేదు. విద్యార్థులకు. గృహిణులకు. వ్యాపారులకు. ఉపాధ్యాయులకు. రైతులకు. పరిచర్యకులకు. వృత్తి నిపుణులకు. అందరికీ. నిజమైన విశ్వాస్యత ఎప్పుడు తెలుస్తుంది? ఎవరూ చూడనప్పుడు కూడా.

## 9. నిజంగా నా యజమాని ఎవరు? ఎఫెసీయులకు 6:7-8

ఒక రోజు పని ప్రారంభించే ముందు ఇలా అనుకుంటే ఎలా ఉంటుంది? "ఈ రోజు నేను చివరికి క్రీస్తు కోసం పని చేస్తున్నాను." పని సాధారణమైనదై ఉండవచ్చు. ఎవరూ గుర్తించకపోవచ్చు. యజమాని ప్రశంసించకపోవచ్చు. కస్టమర్ "ధన్యవాదాలు" చెప్పకపోవచ్చు. జీతం తక్కువగా అనిపించవచ్చు. అయినా ఎవరు చూస్తున్నారు? క్రీస్తు. పౌలు ప్రతి ఒక్కరూ చేసిన మంచికి ప్రభువుచేత ప్రతిఫలం పొందుతారని గుర్తుచేస్తున్నాడు. అంటే మనుష్యుల ప్రశంస అవసరం లేదని కాదు. కానీ అది మన ప్రధాన ప్రేరణ కావాల్సిన అవసరం లేదు. అందుకే పని ప్రారంభించే ముందు ఒక ప్రశ్న: "యేసుక్రీస్తు ఈ పనిని నా చేతుల నుండి స్వీకరిస్తే, నేను దీనిని ఎలా చేసేవాడిని?" ఆ ప్రశ్న మన శ్రద్ధను, నిజాయితీని, నాణ్యతను మార్చదా?

## 10. క్రీస్తుకు పని చేయడం అంటే దోపిడీని భరించాలి అని కాదు

ఇక్కడ ఒక ముఖ్యమైన సమతుల్యత అవసరం. "ప్రభువుకు చేసినట్లుగా పని చేయండి" అని పౌలు చెప్పాడు. అయితే యజమానులు పనివారిని ఎలా కావాలంటే అలా దోపిడీ చేయవచ్చా? లేదు. పౌలు పనివారితో మాత్రమే మాట్లాడి ఆగిపోయాడా? లేదు. వెంటనే అధికారంలో ఉన్నవారినీ ఉద్దేశిస్తున్నాడు. అందుకే సువార్త సంబంధంలోని ఒక వైపు మాత్రమే మార్చదు. పనివారినీ మారుస్తుంది. యజమానులనూ మారుస్తుంది. పనివాడు ఎలా ఉండాలి? నిజాయితీగా. శ్రద్ధగా. విశ్వాసంగా. యజమాని? న్యాయంగా. గౌరవంగా. మానవీయంగా. క్రీస్తు కోసం పనిచేయడం అంటే అన్యాయాన్ని ఎప్పటికీ నిశ్శబ్దంగా భరించాలా? లేదు. అవసరమైనప్పుడు హద్దులు, సరైన అప్పీలు, చట్టబద్ధమైన చర్యలు ఉండవచ్చు. కానీ మనం ఏ పరిస్థితిలో ఉన్నా మన స్వభావం క్రీస్తును ప్రతిబింబించాలి.

## 11. అధికారంలో ఉన్నవారికీ ఒక ప్రభువు ఉన్నాడు ఎఫెసీయులకు 6:9

ఇప్పుడు పౌలు యజమానులతో మాట్లాడుతున్నాడు. ఏమంటున్నాడు? "వారితో అలాగే ప్రవర్తించండి; బెదిరింపులను మానండి." తర్వాత ఒక గొప్ప సత్యం చెబుతున్నాడు: "వారికీ మీకీ ప్రభువు పరలోకంలో ఉన్నాడు." అంటే నీవు ఎవరికి యజమాని అయి ఉండవచ్చు. ఎవరికి మేనేజర్ అయి ఉండవచ్చు. ఎవరికి పాస్టర్ అయి ఉండవచ్చు. ఎవరికి ఉపాధ్యాయుడు అయి ఉండవచ్చు. ఎవరికి తల్లిదండ్రి అయి ఉండవచ్చు. కానీ నీకు కూడా ఒక ప్రభువు ఉన్నాడా? అవును - క్రీస్తు. అందుకే అధికారం మన సొంతం కాదు. దేవుడు అప్పగించిన బాధ్యత. అయితే అధికారాన్ని ఎలా ఉపయోగించాలి? ప్రజలను భయపెట్టి? మన ప్రయోజనానికి ఉపయోగించి? వారి గౌరవాన్ని తీసివేసి? లేదు. నాయకుడు ఇలా అడగాలి: "దేవుడు నా బాధ్యతలో పెట్టిన వారితో నేను ఎలా ప్రవర్తిస్తున్నానో ఒక రోజు క్రీస్తుకు జవాబు చెప్పాలి. అయితే నేను వారితో ఎలా ఉండాలి?" ఈ సత్యం నాయకత్వంలో ఏమి కలిగించాలి? వినయం. న్యాయం. జవాబుదారీతనం.

## 12. దేవునికి పక్షపాతం లేదు

పౌలు ఇంకో గొప్ప విషయం చెబుతున్నాడు: దేవునికి పక్షపాతం లేదు. మన సమాజం మనుషులను ఎలా కొలుస్తుంది? డబ్బుతో. హోదాతో. విద్యతో. కులంతో. సామాజిక స్థితితో. ప్రభావంతో. కానీ దేవుడు? అలా కాదు. ఆఫీసును శుభ్రం చేసే వ్యక్తి. కంపెనీ యజమాని. ఇద్దరూ ఎవరిముందు నిలబడాలి? ఒకే ప్రభువు ఎదుట. అందుకే సాధారణ పని తక్కువ పని కాదు. అలాగే మానవ అధికారం సంపూర్ణమైనది కాదు. అయితే మనం మనలను అడగాలి: "ఒక వ్యక్తి ఎంత ధనవంతుడు, చదువుకున్నవాడు, ప్రభావశీలుడు లేదా నాకు ఎంత ఉపయోగకరుడు అనే దాని ఆధారంగా నేను అతనితో వేరుగా ప్రవర్తిస్తున్నానా?" క్రీస్తు ఎదుట ప్రతి మనిషికీ విలువ ఉంది.

### ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

ఇప్పుడు పౌలు ఆలోచనలను ఒకసారి కలిపి చూద్దాం. పిల్లలు ప్రభువులో తల్లిదండ్రులను గౌరవించి విధేయత చూపాలి. తల్లిదండ్రులు పిల్లలను రెచ్చగొట్టకుండా, ప్రభువు బోధలో ప్రేమతో పెంచాలి. పనివారు మనుష్యులకు కాదు, క్రీస్తుకు చేసినట్లుగా నిజాయితీగా పని చేయాలి. అధికారంలో ఉన్నవారు బెదిరించకుండా, న్యాయంగా ప్రవర్తించాలి. ఎందుకు? అందరికీ ఒకే ప్రభువు ఉన్నాడు. సులభంగా గుర్తుంచుకోండి: ఇంటిలో క్రీస్తు - పిల్లల పెంపకంలో క్రీస్తు - పనిలో క్రీస్తు - అధికార వినియోగంలో క్రీస్తు

## అన్వయం

ఈ భాగం క్రైస్తవ విశ్వాసాన్ని ఎక్కడికి తీసుకువస్తోంది? కేవలం ప్రార్థనా మందిరానికా? లేదు. ఇంటికి. పాఠశాలకు. ఆఫీసుకు. వ్యాపారానికి. పొలానికి. వంటగదికి. దుకాణానికి. పరిచర్యకు. పిల్లలు అడగాలి: "నేను నా తల్లిదండ్రులను గౌరవిస్తున్నానా?" పెద్దవారైన పిల్లలు అడగాలి: "నా తల్లిదండ్రులు వృద్ధులవుతున్నప్పుడు ఓపికగా, కృతజ్ఞతతో, శ్రద్ధతో చూసుకుంటున్నానా?" తల్లిదండ్రులు అడగాలి: "నా పిల్లలను పరీక్షలు, ఉద్యోగం, సంపాదన కోసం మాత్రమే సిద్ధపరుస్తున్నానా? లేక దేవునిని తెలుసుకొని క్రీస్తును అనుసరించడానికి కూడా సహాయం చేస్తున్నానా?" పనివారు అడగాలి: "ఎవరైనా చూస్తున్నప్పుడు మాత్రమే నేను బాగా పనిచేస్తున్నానా?" యజమానులు, నాయకులు అడగాలి: "ప్రజలను ఫలితాలు ఇచ్చే సాధనాలుగా చూస్తున్నానా? లేక దేవుని స్వరూపంలో సృష్టించబడిన విలువైన మనుషులుగా చూస్తున్నానా?" మన ఆత్మీయత ఎక్కడ పరీక్షించబడుతుంది? ఆదివారం సంఘంలో మాత్రమేనా? లేదు. సోమవారం మన జీవితం కూడా మన విశ్వాసాన్ని చూపిస్తుంది.

## సువార్త సంబంధం

ఈ భాగమంతటిలో కొన్ని మాటలు మళ్లీ మళ్లీ కనిపిస్తున్నాయి: "ప్రభువులో." "క్రీస్తుకు విధేయులైనట్లుగా." "ప్రభువుకు చేసినట్లుగా." "వారికీ మీకీ ప్రభువు పరలోకంలో ఉన్నాడు." దీని అర్థం ఏమిటి? ప్రతి సంబంధానికి కేంద్రం క్రీస్తు. అయితే ఇలా జీవించడం ద్వారా మనం రక్షణ సంపాదిస్తున్నామా? లేదు. ఎఫెసీయులకు 1-3లో మనం ఇప్పటికే ఏమి చూశాం? విశ్వాసం ద్వారా కృపచేత రక్షించబడ్డాము. అందుకే విధేయత రక్షణకు ధర కాదు. రక్షించబడిన జీవితపు ఫలం. మనం పిల్లలను ప్రేమతో పెంచితే దేవుడు మనలను రక్షిస్తాడా? లేదు. మనం నిజాయితీగా పనిచేస్తే రక్షణ వస్తుందా? లేదు. మనం మంచి యజమానులమైతే దేవుని అంగీకారం సంపాదిస్తామా? లేదు. క్రమం ఏమిటి? క్రీస్తు మనలను రక్షించాడు - ఇప్పుడు మన సంబంధాలలో ఆయన స్వభావం కనిపించాలి. అందుకే ఇంటిలో కూడా క్రీస్తు. పనిలో కూడా క్రీస్తు. అధికారంలో కూడా క్రీస్తు.

## బైబిల్ స్టడీ ప్రశ్నలు - 8

1. ఎఫెసీయులకు 6:1-9 చదవండి. "ప్రభువు," "క్రీస్తు," "ప్రభువుకు" అనే మాటలు ఎక్కడెక్కడ కనిపిస్తున్నాయి? అవి ఈ మొత్తం భాగంలోని ప్రధాన సత్యాన్ని ఎలా చూపిస్తున్నాయి?
2. 6:1-3 ప్రకారం పిల్లలకు ఏ ఆజ్ఞ ఇవ్వబడింది? తల్లిదండ్రులకు విధేయత చూపడం మరియు జీవితాంతం వారిని గౌరవించడం మధ్య తేడా ఏమిటి?
3. 6:1లోని "ప్రభువులో" అనే మాట తల్లిదండ్రుల అధికారాన్ని గురించి ఏమి నేర్పుతుంది? తల్లిదండ్రులను గౌరవించడం అంటే వారు పాపం చేయమని చెప్పినా విధేయత చూపాలా?
4. 6:4 ప్రకారం తల్లిదండ్రులకు ఏ హెచ్చరిక, ఏ బాధ్యత ఇవ్వబడింది? పిల్లలను రెచ్చగొట్టే ప్రవర్తనలు ఏమిటి? "ప్రభువు శిక్షణలోను బోధలోను" పెంచడం ఎలా కనిపించాలి?
5. పిల్లలు మన మాటలను మాత్రమే కాకుండా మన జీవితాన్ని కూడా చూసి నేర్చుకుంటారు. మీ పిల్లలు మీ కోపం, ప్రార్థన, డబ్బు వినియోగం, క్షమ, మాటలు, సంబంధాలను అనుకరిస్తే వారు ఎలాంటి క్రైస్తవ జీవితాన్ని నేర్చుకుంటారు?
6. 6:5-8లో పౌలు పని గురించి ఏ సూత్రాలను బోధిస్తున్నాడు? "మనుష్యులకు కాదు, ప్రభువుకు చేసినట్లుగా" పనిచేయడం నేటి ఉద్యోగం, చదువు, వ్యాపారం లేదా పరిచర్యలో ఎలా కనిపించాలి?
7. 6:9 ప్రకారం యజమానులు, మేనేజర్లు మరియు ఇతర నాయకులు తమ అధికారాన్ని ఎలా ఉపయోగించాలి? "మీకూ పరలోకంలో ఒక ప్రభువు ఉన్నాడు" అనే సత్యం నాయకత్వాన్ని ఎలా మార్చాలి?
8. ఈ భాగంలో మీ జీవితానికి ఎక్కువ సవాలు చేస్తున్న విషయం ఏది - తల్లిదండ్రులను గౌరవించడం, పిల్లల పెంపకం, నిజాయితీగా పనిచేయడం, లేక అధికారాన్ని సరిగ్గా ఉపయోగించడం? ఈ వారంలో మీరు తీసుకోగల ఒక స్పష్టమైన అడుగు ఏమిటి?

## నాయకులకు - ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులు వాక్యాన్ని చదివి సమాధానాలు కనుగొననివ్వండి. వెంటనే మీ సమాధానం చెప్పకండి. ఇలాంటి చిన్న ప్రశ్నలు అడగండి: "ఈ మాట ఏ వచనంలో ఉంది?" "ఇక్కడ క్రీస్తు పాత్ర ఏమిటి?" "ఈ అధికారం ఎవరి కింద ఉంది?" "ఇది ఇంటిలో ఎలా కనిపిస్తుంది?" "ఇది పనిస్థలంలో ఎలా కనిపిస్తుంది?"

## ప్రశ్న 1 – ప్రతి సంబంధంపై క్రీస్తు ప్రభుత్వం

సభ్యులతో ఈ మాటలను గుర్తించనివ్వండి: "ప్రభువులో" "క్రీస్తుకు" "ప్రభువుకు" "మీ ప్రభువు పరలోకంలో ఉన్నాడు" ఇవి మొత్తం భాగాన్ని కలిపే దారంలాంటివి. ప్రధాన సత్యం: క్రైస్తవ జీవితం సంఘ సమావేశానికి మాత్రమే కాదు. ఇంటిలోను పనిలోను క్రీస్తే ప్రభువు.

**ఇంకా అడగండి:** "మనకు అత్యంత దగ్గరగా జీవించే వారు మనలో క్రీస్తు ప్రభావాన్ని చూడకపోతే, ఆదివారం కనిపించే ఆత్మీయత ఎంత నిజమైనది?"

## ప్రశ్న 2 – విధేయత మరియు గౌరవం

విధేయత ప్రధానంగా తల్లిదండ్రుల సంరక్షణలో ఉన్న పిల్లలకు వర్తిస్తుంది. కానీ గౌరవం? జీవితాంతం. వృద్ధ తల్లిదండ్రులకు గౌరవం ఎలా కనిపించవచ్చు? మంచిగా మాట్లాడటం. వినడం. సమయం ఇవ్వడం. కృతజ్ఞత చూపడం. అవసరంలో సహాయం చేయడం. **ఇంకా అడగండి:** "పెద్దవారైన తరువాత తల్లిదండ్రులను గౌరవించడం ఆజ్ఞలు పాటించడం కాకుండా ఇంకెలా కనిపించవచ్చు?"

## ప్రశ్న 3 – "ప్రభువులో"

తల్లిదండ్రుల అధికారం దేవుడు ఇచ్చినదే. కానీ అది చివరి అధికారం కాదు. క్రీస్తే అత్యున్నత అధికారి. అందుకే దేవుని వాక్యానికి స్పష్టంగా విరుద్ధమైన పని చేయమని అడిగితే మొదటి విధేయత దేవునికే. కానీ పిల్లలు తమకు నచ్చని ఆజ్ఞను తప్పించుకోవడానికి ఈ సూత్రాన్ని ఉపయోగించకూడదు.

**ఇంకా అడగండి:** "దేవునికి విధేయత పేరుతో స్వార్థపూర్వక తిరుగుబాటును ఎలా గుర్తించవచ్చు?"

## ప్రశ్న 4 – పిల్లలను రెచ్చగొట్టవద్దు

పిల్లలను నిరుత్సాహపరచే విషయాలు: నిరంతర విమర్శ. పోలిక. పక్షపాతం. అస్థిరమైన నియమాలు. అసాధ్యమైన అంచనాలు. అవమానం. అరవడం. వినకపోవడం. పౌలు కేవలం: "ఇవి చేయవద్దు" అని ఆగడం లేదు. ఏమంటున్నాడు? "ప్రభువు శిక్షణలోను బోధలోను పెంచండి." ఇందులో లేఖనం, ప్రార్థన, సువార్త బోధ, ప్రేమతో కూడిన క్రమశిక్షణ, సంభాషణ, మంచి నమూనా జీవితం ఉన్నాయి.

**ఇంకా అడగండి:** : "నేను పిల్లను సరిదిద్దేటప్పుడు అతని హృదయాన్ని గెలుచుకోవాలనుకుంటున్నానా? లేక కేవలం ప్రవర్తనను నియంత్రించాలనుకుంటున్నానా?"

## ప్రశ్న 5 – నమూనా జీవితం

తల్లిదండ్రులు ప్రతి రోజు బోధిస్తారు. మాటలతో మాత్రమే కాదు. జీవితంతో. "నేను చెప్పేది చేయి; నేను చేసేది చూడకు" అనే విధానం పనిచేయదు. పిల్లలు మనం: తప్పు ఒప్పుకుంటామా? క్షమాపణ అడుగుతామా? దయ చూపుతామా? డబ్బును ఎలా చూస్తామా? ఇతరుల గురించి ఎలా మాట్లాడతామా? కష్టాలను ఎలా ఎదుర్కొంటామా? అన్నీ గమనిస్తారు.

**ఇంకా అడగండి:** "నా బోధ కంటే నా జీవితం నా పిల్లలకు ఏ సందేశం ఇస్తోంది?"

## ప్రశ్న 6 – పని కూడా క్రీస్తుకు సేవ

రోమా దాస్య వ్యవస్థను ఆధునిక ఉద్యోగ వ్యవస్థతో సమానంగా చూపించకండి. కానీ పని గురించి స్పష్టమైన సూత్రాలు ఉన్నాయి: నిజాయితీ – శ్రద్ధ – హృదయపూర్వక సేవ – ఎవరూ చూడనప్పుడు కూడా విశ్వాస్యత క్రైస్తవుని పని చివరికి ఎవరికి? ప్రభువుకు. **ఇంకా అడగండి:** "బాస్ లేని సమయంలో నా పని నాణ్యత తగ్గితే, నేను నిజంగా ఎవరి కోసం పని చేస్తున్నాను?"

## ప్రశ్న 7 – అధికారంలో ఉన్నవారికీ ప్రభువు ఉన్నాడు

పౌలు పనివారినే సరిదిద్దడం లేదు. యజమానులతో కూడా ఏమంటున్నాడు? "బెదిరింపులను మానండి." క్రైస్తవ నాయకత్వంలో ఏమి ఉండాలి? న్యాయం. గౌరవం. వినడం. స్పష్టమైన అంచనాలు. మానవీయత. పక్షపాతం లేకపోవడం. ప్రధాన సత్యం: ప్రతి మానవ అధికారి కూడా క్రీస్తు అధికారానికి లోబడి ఉన్నాడు.

**ఇంకా అడగండి:** "నా కింద పనిచేసే వ్యక్తి కూడా దేవుని స్వరూపంలో సృష్టించబడినవాడని, క్రీస్తుకు జవాబుదారుడని నిజంగా నమ్మితే, నేను అతనితో ఎలా మాట్లాడుతాను?"

**ప్రశ్న 8** - వ్యక్తిగత అన్వయం

"చాలా మంచి పాఠం" అని ముగించవద్దు. ప్రతి ఒక్కరూ ఒక స్పష్టమైన అడుగు ఎంచుకునేలా చేయండి.

**అడగండి:** "నేను ఎవరితో మరింత గౌరవంగా మాట్లాడాలి?" "నా పిల్లలతో ఏ ప్రవర్తన మార్చుకోవాలి?" "నా పనిలో ఏ విషయంలో మరింత నిజాయితీ అవసరం?" "నా అధికార వినియోగంలో ఏ మార్పు కావాలి?" తర్వాత: "ఈ వారం మీరు నిజంగా ఏమి చేయబోతున్నారు?" అని అడగండి.

## నాయకులు గమనించవలసిన ముఖ్యమైన విషయాలు

1. గౌరవం కొనసాగుతుంది - విధేయత రూపం మారుతుంది.  పెద్దవారైన తరువాత ప్రతి తల్లిదండ్రుల అభ్యర్థనకు విధేయత చూపాల్సిన అవసరం లేదు. కానీ గౌరవం, కృతజ్ఞత, సంరక్షణ కొనసాగాలి.

2. తల్లిదండ్రుల అధికారం దుర్వినియోగానికి అనుమతి కాదు

   పౌలు పిల్లలకు విధేయత చెప్పిన వెంటనే తల్లిదండ్రులను కూడా హెచ్చరిస్తున్నాడు: "పిల్లలను రెచ్చగొట్టవద్దు." అధికారానికి ఎప్పుడూ జవాబుదారీతనం ఉంది.

3. మంచి క్రైస్తవ పెంపకం రక్షణకు హామీ కాదు

   తల్లిదండ్రులు సువార్తను విశ్వాసంగా బోధించాలి. ప్రార్థించాలి. మంచి నమూనా చూపాలి. కానీ నూతన జన్మ ఎవరు ఇస్తారు? దేవుడే.

4. ఎఫెసీయులకు 6:5-9ను దోపిడీని సమర్థించడానికి ఉపయోగించకండి

   పనివారికి విశ్వాస్యత అవసరం. యజమానులకు న్యాయం అవసరం. ఇద్దరూ ఎవరికి జవాబుదారులు? క్రీస్తుకు.

5. క్రీస్తు కోసం పని చేయడం అంటే అన్యాయాన్ని పట్టించుకోకపోవడం కాదు

   అవసరమైనప్పుడు హద్దులు, సరైన అప్పీలు, చట్టబద్ధమైన చర్యలు ఉండవచ్చు. క్రైస్తవ విశ్వాస్యత అంటే దోపిడీకి అనుమతి ఇవ్వడం కాదు.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చను చివరికి ఈ సత్యానికి తీసుకురండి: క్రీస్తు ఇంటిలోను పనిలోను ప్రభువు. అందుకే: పిల్లలు గౌరవిస్తారు - తల్లిదండ్రులు ప్రేమతో పోషిస్తారు - పనివారు నిజాయితీగా సేవ చేస్తారు - నాయకులు వినయంగా అధికారాన్ని ఉపయోగిస్తారు - అందరూ క్రీస్తుకు జవాబుదారులు. క్రైస్తవ పరిపక్వతకు నిజమైన పరీక్ష ఎక్కడ జరుగుతుంది? కేవలం సంఘ సమావేశంలో కాదు. కుటుంబ జీవితంలో. పని నైతికతలో. ఇతరులతో ప్రవర్తనలో. అధికార వినియోగంలో.

## చివరి ప్రశ్న

క్రీస్తు నిజంగా నా జీవితానికి ప్రభువైతే - నా ఇంటిలో ఉన్నవారు, నా పిల్లలు, నా తల్లిదండ్రులు, నాతో పనిచేసేవారు, నా ఆధీనంలో ఉన్నవారు - నా మాటలు, నా పని, నా సంరక్షణ, నా నిజాయితీ, నా అధికార వినియోగాన్ని చూసి: "ఈ వ్యక్తి జీవితంలో క్రీస్తు ప్రభావం కనిపిస్తోంది" అని చెప్పగలరా?

## బైబిల్ స్టడీ పాఠం 13 ఎఫెసీయులకు 6:10-24

# దేవుని సంపూర్ణ కవచం

### ప్రధాన అంశం

ఆత్మీయ పోరాటంలో మన బలం ఎక్కడ ఉంది? మనలోనా? మన ధైర్యంలోనా? మన అనుభవంలోనా? లేదు. మన బలం ప్రభువులో ఉంది. అందుకే పౌలు మనలను ఇలా పిలుస్తున్నాడు: ప్రభువులో బలపడండి - స్థిరంగా నిలబడండి - దేవుని సంపూర్ణ కవచం ధరించండి - ప్రార్థించండి - సువార్తను ధైర్యంగా ప్రకటించండి.

### సందర్భం

పౌలు ఇప్పుడు ఎఫెసీయుల పత్రిక చివరికి వచ్చాడు. ఇప్పటివరకు ఏమి చెప్పాడు? క్రీస్తులో మనం ఎవరో చెప్పాడు. ఆ కొత్త గుర్తింపు మన సంఘ జీవితం, మాటలు, సంబంధాలు, వివాహం, కుటుంబం, పని అన్నింటినీ ఎలా మార్చాలో వివరించాడు. ఇప్పుడు మరో ముఖ్యమైన వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాడు. క్రైస్తవ జీవితం ఎప్పుడూ సులభమైన ప్రయాణమా? లేదు. అది ఆత్మీయ పోరాటాన్ని కూడా కలిగి ఉంటుంది. కష్టమైన పరిస్థితులు వస్తాయి. కష్టమైన మనుషులు ఎదురవుతారు. శోధనలు వస్తాయి. నిరుత్సాహం వస్తుంది. తప్పుడు బోధ వస్తుంది. భయం వస్తుంది. విభజనలు వస్తాయి. వీటన్నిటి వెనుక ప్రతి సారి ఒకే కారణం ఉందని చెప్పలేం. కానీ పౌలు ఒక నిజమైన ఆత్మీయ శత్రువు కూడా ఉన్నాడని గుర్తుచేస్తున్నాడు. అతడు ఏమి చేయాలని ప్రయత్నిస్తాడు? మోసం చేయడానికి. శోధించడానికి. నిందించడానికి. నిరుత్సాహపరచడానికి. విభజించడానికి. సత్యం నుండి దూరం చేయడానికి. అయితే మనం ఎలా నిలబడాలి? పౌలు ఇలా అంటున్నాడా? "మీలో మీరు బలవంతులు కండి." లేదు. అతను చెబుతున్నది: "ప్రభువులోను ఆయన మహాశక్తిలోను బలవంతులై ఉండండి" (6:10). ఈ భాగాన్ని సులభంగా ఇలా గుర్తుంచుకోండి: బలపడు - నిలబడు - కవచం ధరించు - ప్రార్థించు - సువార్త ప్రకటించు

### 1. మన బలం ప్రభువులోనే ఎఫెసీయులకు 6:10-11

పౌలు మొదటి ఆజ్ఞ ఏమిటి? "ప్రభువులోను ఆయన మహాశక్తిలోను బలవంతులై ఉండండి." ఇక్కడ ముఖ్యమైన మాట ఏది? "ప్రభువులో." క్రైస్తవ బలం అంటే ఏమి కాదు? Self-confidence కాదు. Positive thinking కాదు. బలమైన వ్యక్తిత్వం కాదు. "నేను ఏదైనా చేయగలను" అనే మనోబలం కూడా కాదు. అయితే మన బలం ఎక్కడుంది? ప్రభువులో - ఆయన శక్తిలో. తర్వాత పౌలు ఏమంటున్నాడు? "అపవాది తంత్రాలకు ఎదురు నిలబడటానికి దేవుని సంపూర్ణ కవచాన్ని ధరించండి." "తంత్రాలు" అనే మాట గమనించండి. శత్రువు ఎప్పుడూ బహిరంగంగానే వస్తాడా? లేదు. ఎలా రావచ్చు? మోసం ద్వారా. శోధన ద్వారా. నింద ద్వారా. నిరుత్సాహం ద్వారా. గర్వం ద్వారా. విభజన ద్వారా. తప్పుడు బోధ ద్వారా. చేదు ద్వారా. భయం ద్వారా. అందుకే మొదటి ప్రశ్న: "నేను ఎంత బలవంతుడిని?" అనేది కాదు. "నేను ప్రభువు బలంపై ఆధారపడుతున్నానా?" అనేదే.

### 2. మన నిజమైన శత్రువు ఎవరు? ఎఫెసీయులకు 6:12

పౌలు ఏమంటున్నాడు? "మన పోరాటం రక్తమాంసములతో కాదు." అంటే మనుషులు మనకు ఎప్పుడూ సమస్యలు కలిగించరా? కలిగిస్తారు. మనకు హాని చేయవచ్చు. అన్యాయం చేయవచ్చు. వ్యతిరేకించవచ్చు. అయితే వారినే మన చివరి శత్రువులుగా చూడాలా? లేదు. కొన్నిసార్లు ఎవరు శత్రువులా కనిపించవచ్చు? మన భార్య లేదా భర్త. మరో సంఘ సభ్యుడు. ఒక నాయకుడు. మనతో ఏకీభవించని వ్యక్తి. కానీ పౌలు మన దృష్టిని మరింత లోతైన ఆత్మీయ పోరాటం వైపు తీసుకువెళ్తున్నాడు. దీని అర్థం మనుషుల పాపాన్ని పట్టించుకోకూడదా? అన్యాయాన్ని అలాగే వదిలేయాలా? లేదు. అవసరమైనప్పుడు సరిదిద్దాలి. హద్దులు పెట్టాలి. సంఘ క్రమశిక్షణ అవసరం కావచ్చు. న్యాయం కోరాలి. కానీ మనుషుల పట్ల ద్వేషంతో జీవించకూడదు. అందుకే ప్రశ్న: "కష్టమైన వ్యక్తిని నేను శత్రువుగా ద్వేషిస్తున్నానా? లేక సత్యం, ప్రేమ, జ్ఞానం, ప్రార్థనతో స్పందిస్తున్నానా?"

### 3. ఆత్మీయ శత్రువు నిజమైనవాడు - కానీ క్రీస్తు అతనికంటే గొప్పవాడు

పౌలు ప్రభుత్వాలు, అధికారాలు, చీకటి శక్తులు, దుష్టాత్మల గురించి మాట్లాడుతున్నాడు. బైబిల్ ఆత్మీయ దుష్టత్వాన్ని కల్పనగా చూస్తుందా? లేదు. అయితే మనం సాతాను గురించి భయంతో మునిగిపోవాలా? లేదు. ఎందుకు? ఎఫెసీయులకు 1:21లో పౌలు ఇప్పటికే ఏమి చెప్పాడు? క్రీస్తు ప్రతి ప్రభుత్వానికి, అధికారానికి, శక్తికి, ఆధిపత్యానికి ఎంతో పైగా ఉన్నాడు. అందుకే ఈ భాగం కేంద్రం: "శత్రువు ఎంత బలవంతుడు!" అనేది కాదు. కేంద్రం: "ప్రభువులో బలపడండి." సాతాను నిజమైనవాడు. కానీ అతడు

దేవునికి సమానుడు కాదు. క్రీస్తు అతనికంటే ఎంతో గొప్పవాడు. అందుకే భయం కాదు. అలక్ష్యం కూడా కాదు. క్రీస్తుపై ఆధారపడే జాగ్రత్త.

## 4. స్థిరంగా నిలబడండి ఎఫెసీయులకు 6:13

ఈ భాగంలో ఒక మాట మళ్లీ మళ్లీ వస్తోంది. ఏది? "నిలబడండి." "ఎదురు నిలబడండి." "స్థిరంగా నిలబడండి." పౌలు చూపిస్తున్న ప్రధాన చిత్రం ఏమిటి? తనకు అప్పగించిన స్థలాన్ని విడిచిపెట్టని సైనికుడు. శోధన వచ్చినప్పుడు? నిలబడు. తప్పుడు బోధ వచ్చినప్పుడు? నిలబడు. శ్రమ వచ్చినప్పుడు? నిలబడు. నిరుత్సాహం వచ్చినప్పుడు? నిలబడు. రాజీ పడమని ఒత్తిడి వచ్చినప్పుడు? నిలబడు. కానీ ఎలా? మన బలంతోనా? లేదు. దేవుడు ఇచ్చిన కవచంతో.

దేవుని సంపూర్ణ కవచం

## 5. సత్యమనే నడికట్టు ఎఫెసీయులకు 6:14

యేసు అపవాదిని ఏమని పిలిచాడు? "అబద్ధాలకు తండ్రి" (యోహాను 8:44). అందుకే ఆత్మీయ పోరాటంలో మొదట ఏమి అవసరం? సత్యం. ఏ విషయాల గురించి సత్యం? దేవుని గురించి. మన గురించి. పాపం గురించి. క్రీస్తు గురించి. సువార్త గురించి. రక్షణ గురించి. దేవుని వాగ్దానాల గురించి. శత్రువు ఏమి చెప్పవచ్చు? "దేవుడు నిన్ను పట్టించుకోడు." "ఈ పాపం అంత పెద్ద విషయం కాదు." "దేవుడు నిన్ను క్షమించడు." "నువ్వు పూర్తిగా విఫలమయ్యావు." "దేవుడు నిన్ను విడిచేశాడు." అప్పుడు మనం ఏమి చేయాలి? మన భావాలనే నమ్మాలా? లేదు. దేవుని సత్యాన్ని గుర్తుచేసుకోవాలి. అందుకే ప్రశ్న: "భయం, నింద, శోధన వచ్చినప్పుడు అబద్ధాన్ని గుర్తించేంతగా దేవుని వాక్యం నాకు తెలుసా?"

## 6. నీతి అనే రొమ్ముకవచం ఎఫెసీయులకు 6:14

"నీతి" మనకు రెండు ముఖ్యమైన విషయాలను గుర్తుచేస్తుంది. మొదట – క్రీస్తు ద్వారా దేవునితో మనకు వచ్చిన సరైన స్థానం. దేవుడు మనలను ఎందుకు అంగీకరిస్తాడు? మన మంచితనం వల్లనా? లేదు. క్రీస్తు వల్ల. రెండవది – ఆ సంబంధం నుండి నీతిమంతమైన జీవితం రావాలి. అంటే మనం తెలిసికొని పాపాన్ని పట్టుకుని ఉంటూ ఆత్మీయంగా బలంగా ఉండగలమా? లేదు. తెలిసికొని పాపాన్ని పోషించడం మనలను బలహీనపరుస్తుంది. అందుకే ఆత్మీయ పోరాటం అంటే కేవలం "సాతానును మందలించడం" కాదు. పాపాన్ని ఒప్పుకోవడం. విడిచిపెట్టడం. దేవునికి విధేయత చూపడం. నిజాయితీగా జీవించడం. క్షమించడం. సత్యం మాట్లాడడం. ఇవన్నీ కూడా ఆత్మీయ పోరాటంలో భాగమే. అందుకే అడగండి: "దేవుడు విడిచిపెట్టమని చెబుతున్న ఏ పాపాన్ని నేను ఇంకా పట్టుకుని ఉన్నానా?"

## 7. సమాధాన సువార్త సిద్ధత అనే పాదరక్షలు ఎఫెసీయులకు 6:15

సైనికుడు స్థిరంగా నిలబడటానికి మంచి పాదరక్షలు అవసరం. అలాగే మనకు స్థిరత్వం ఇచ్చేది ఏమిటి? సువార్త. సువార్త మనకు ఏమి గుర్తుచేస్తుంది? క్రీస్తు ద్వారా దేవునితో సమాధానం కలిగింది. మన పాపాలు క్షమించబడ్డాయి. మనము ఆయనకు చెందినవారము. మన నిరీక్షణ క్రీస్తులో భద్రంగా ఉంది. అయితే "సిద్ధత" అనే మాట కూడా ఉంది. సువార్త మనకు మాత్రమేనా? లేదు. ఇతరులకు చెప్పడానికి కూడా సిద్ధంగా ఉండాలి. అందుకే ప్రశ్న: "నేను సువార్తను నా కోసం మాత్రమే ఆనందిస్తున్నానా? లేక మరొకరికి చెప్పడానికి సిద్ధంగా ఉన్నానా?"

## 8. విశ్వాసమనే డాలు ఎఫెసీయులకు 6:16

పౌలు "అగ్నిబాణాలు" అంటున్నాడు. అవి నేడు ఎలా రావచ్చు? భయం. సందేహం. శోధన. నింద. నిరుత్సాహం. దేవుని స్వభావం గురించి అబద్ధాలు. విశ్వాసం అంటే సమస్యలు లేవని నటించడమా? లేదు. విశ్వాసం ఇలా అంటుంది: "దేవుడు ఏమి చేస్తున్నాడో నాకు పూర్తిగా అర్థం కాకపోయినా, ఆయన ఎవరో నాకు తెలుసు. ఆయన నమ్మదగినవాడు. ఆయన వాగ్దానాలను నమ్ముతాను." మన ధైర్యం: "నా విశ్వాసం చాలా బలంగా ఉంది" అనేది కాదు. "నా దేవుడు నమ్మదగినవాడు" అనేదే. అందుకే కష్టంలో: "నా పరిస్థితి ఏమి చెబుతోంది?" అనేది మాత్రమే కాదు. "దేవుడు ఎవరు? ఆయన ఏమి వాగ్దానం చేశాడు?" అని కూడా అడగాలి.

## 9. రక్షణ అనే శిరస్త్రాణం ఎఫెసీయులకు 6:17

శిరస్త్రాణం ఏ భాగాన్ని కాపాడుతుంది? తలను. అలాగే రక్షణపై నిశ్చయత మన ఆలోచనలను స్థిరపరుస్తుంది. శత్రువు ఏమి చెప్పవచ్చు? "నీకు ఆశ లేదు." "నీ గతమే నిన్ను నిర్వచిస్తుంది." "దేవుడు నిన్ను విడిచేశాడు." "నీకు క్షమ లేదు." అప్పుడు సువార్త ఏమి చెబుతుంది? నేను క్రీస్తుకు చెందినవాడిని. ఆయన ద్వారా నా పాపాలు క్షమించబడ్డాయి. దేవుడు నన్ను తనవాడిగా

చేసుకున్నాడు. నా నిరీక్షణ క్రీస్తు చేసిన కార్యంలో ఉంది. రక్షణ నిశ్చయత మన మారుతూ ఉండే భావాలపై ఆధారపడదు. అది క్రీస్తు మరియు ఆయన పూర్తిచేసిన కార్యంపై ఆధారపడుతుంది.

## 10. ఆత్మ ఖడ్గం – దేవుని వాక్యం ఎఫెసీయులకు 6:17

పౌలు స్పష్టంగా ఏమంటున్నాడు? "ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యాన్ని తీసుకోండి." యేసు శోధించబడినప్పుడు ఎలా స్పందించాడు? "వ్రాయబడియున్నది..." దేవుని వాక్యంతో. అయితే కొన్ని ఇష్టమైన వచనాలు గుర్తుపెట్టుకుంటే చాలు? లేదు. ఎందుకు? యేసును శోధించినప్పుడు సాతాను కూడా లేఖనాన్ని ఉటంకించాడు. అయితే సమస్య ఏమిటి? వచనాన్ని సందర్భం నుండి వేరు చేసి తప్పుగా ఉపయోగించవచ్చు. అందుకే దేవుని వాక్యాన్ని చదవాలి. అర్థం చేసుకోవాలి. సందర్భంలో చూడాలి. మన జీవితానికి సరిగ్గా వర్తింపజేయాలి. అప్పుడు అది అబద్ధాన్ని బయటపెడుతుంది. తప్పును సరిచేస్తుంది. మనస్సును నూతనపరుస్తుంది. మన నిర్ణయాలను మారుస్తుంది. అందుకే ప్రశ్న: "నేను బైబిల్‌ను కేవలం చేతిలో మోస్తున్నానా? లేక దేవుని వాక్యం నా మనస్సును, నా జీవితాన్ని నిజంగా మలుస్తున్నదా?"

## 11. "సంపూర్ణ" కవచం

పౌలు "దేవుని కవచం" అని మాత్రమే చెప్పడం లేదు. "దేవుని సంపూర్ణ కవచం" అంటున్నాడు. ఎందుకు? "నేను ప్రార్థిస్తాను; బైబిల్ అవసరం లేదు" అనగలమా? లేదు. "నాకు వాక్యం తెలుసు; ప్రార్థన అవసరం లేదు" అనగలమా? లేదు. "సువార్త నమ్ముతున్నాను; పరిశుద్ధ జీవితం అంత ముఖ్యం కాదు" అనగలమా? లేదు. అన్నీ కలిసి ఉన్నాయి: సత్యం – నీతి – సువార్త – విశ్వాసం – రక్షణ – దేవుని వాక్యం – ప్రార్థన ఇది ఏదో మాంత్రిక కవచం కాదు. సువార్త సత్యాలతో నిండిన, దేవునిపై ఆధారపడే, విశ్వాసమైన క్రైస్తవ జీవితం.

## 12. పోరాటమంతటిలో ప్రార్థన ఎఫెసీయులకు 6:18

కవచాన్ని వివరించిన తరువాత పౌలు ఏమి చెబుతున్నాడు? "సమస్త ప్రార్థనలతోను విజ్ఞాపనలతోను ప్రతి సమయమందు ఆత్మలో ప్రార్థించండి." అంటే ప్రార్థన కవచానికి చివర్లో జోడించిన చిన్న విషయం మాత్రమేనా? లేదు. ఆత్మీయ పోరాటమంతా ప్రార్థనతో నిండి ఉండాలి. ఎప్పుడు ప్రార్థించాలి? ప్రతి సమయంలో. ఎన్ని రకాలుగా? అన్ని రకాల ప్రార్థనలతో. ఎవరి కోసం? పరిశుద్ధులందరి కోసం. ఎలా? మేల్కొని, పట్టుదలతో. ఆత్మీయ పోరాటం మనలను సాతాను గురించి ఎక్కువగా మాట్లాడేలా చేయకూడదు. దేవునిపై ఎక్కువగా ఆధారపడేలా చేయాలి. అందుకే ప్రార్థన ఆత్మీయ బలహీనతకు గుర్తు కాదు. దేవునిపై ఆధారపడుతున్నామనే గుర్తు.

## 13. "ఆత్మలో ప్రార్థించండి" అంటే ఏమిటి?

ఇది ఒక ప్రత్యేకమైన భావోద్వేగ స్థితి మాత్రమేనా? లేదు. ఒక ప్రత్యేకమైన ప్రార్థనా పద్ధతి మాత్రమేనా? లేదు. అయితే ఏమిటి? పరిశుద్ధాత్మ సహాయంతో, దేవునిపై ఆధారపడి, ఆయన వాక్యానికి, ఆయన ఉద్దేశాలకు సరిపోయేలా ప్రార్థించడం. దేవుని వాక్యాన్ని ఎవరు ప్రేరేపించారు? పరిశుద్ధాత్మ. అయితే అదే ఆత్మ మనలను దేవుని వాక్యానికి విరుద్ధంగా ప్రార్థించమంటాడా? లేదు. అందుకే: వాక్యం మరియు ప్రార్థన కలిసి నడవాలి. దేవుడు తన వాక్యం ద్వారా మనతో మాట్లాడుతాడు. మనము ప్రార్థనలో ఆయనకు స్పందిస్తాము. అందుకే మంచి ప్రశ్న: "నా ప్రార్థనలు దేవుని వాక్యంతో నిండుతున్నాయా? లేక నా కోరికలతో మాత్రమే నిండుతున్నాయా?"

## 14. పౌలు తన కోసం ప్రార్థన అడుగుతున్నాడు ఎఫెసీయులకు 6:19-20

పౌలు ఎక్కడ ఉన్నాడు? సంకెళ్లలో. అయితే అతను మొదట ఏ ప్రార్థన కోరతాడని మనం ఊహిస్తాం? "నన్ను జైలు నుండి బయటకు తీసుకురండి." అది సహజమైన కోరిక. కానీ పౌలు ఏమి అడుగుతున్నాడు? "నేను సువార్తను స్పష్టంగా, ధైర్యంగా ప్రకటించడానికి నాకు మాటలు ఇవ్వబడాలని ప్రార్థించండి." ఇది ఆశ్చర్యకరం కాదా? అతని మొదటి దృష్టి తన సౌకర్యం మీద కాదు. విశ్వాసమైన సాక్ష్యం మీద. మనము: "ప్రభువా, ఈ సమస్యను తొలగించు" అని ప్రార్థించవచ్చు. అది తప్పు కాదు. కానీ పౌలు ఇంకో ప్రార్థన కూడా నేర్పుతున్నాడు: "ప్రభువా, ఈ పరిస్థితి వెంటనే మారకపోయినా, ఇందులో నన్ను విశ్వాసంగా ఉపయోగించు."

## 15. ఆత్మీయ పోరాటం మరియు సువార్త సాక్ష్యం

దేవుని కవచం కేవలం మనలను మనం కాపాడుకోవడానికి మాత్రమేనా? లేదు. సువార్త సాక్ష్యంతో కూడా ఇది సంబంధం కలిగి ఉంది. శత్రువు అబద్ధాన్ని వ్యాప్తి చేస్తాడు. విశ్వాసులు సత్యంలో నిలబడతారు. శత్రువు భయం కలిగిస్తాడు. విశ్వాసులు దేవునిపై నమ్మకం ఉంచుతారు. శత్రువు విభజిస్తాడు. సువార్త ఒకే శరీరాన్ని సృష్టిస్తుంది. శత్రువు అబద్ధాలతో బంధిస్తాడు. సువార్త క్రీస్తులో

విమోచనను ప్రకటిస్తుంది. అందుకే రెండు విషయాలు కలిసి నడుస్తాయి: నిలబడటం – సువార్త ప్రకటించడం మనము కేవలం రక్షణాత్మకంగా మూసుకుపోవడం కాదు. సత్యంలో నిలబడి, క్రీస్తును ప్రకటించాలి.

## 16. చివరి మాటలు – సమాధానం, ప్రేమ, విశ్వాసం, కృప ఎఫెసీయులకు 6:21-24

ఎఫెసీయుల పత్రిక చివర పౌలు ఏ మాటలతో ముగిస్తున్నాడు? సమాధానం. ప్రేమ. విశ్వాసం. కృప. ఎఫెసీయుల పత్రిక ఎలా ప్రారంభమైంది? కృపతో. ఎలా ముగుస్తోంది? కృపతో. ఇది ఎంత అందమైన విషయం! క్రైస్తవ జీవితం ఎలా ప్రారంభమవుతుంది? కృపచేత. ఎలా కొనసాగుతుంది? కృపచేత. చివరి లక్ష్యానికి ఎలా చేరుతుంది? కృపచేత. ఆత్మీయ పోరాటంలో నిలబడే శక్తి కూడా చివరికి ఎవరు ఇస్తారు? దేవుడే.

### ఈ భాగమంతా ఎలా కలుస్తుంది?

మొదట? ప్రభువులో బలపడు. తర్వాత? నిజమైన పోరాటాన్ని గుర్తించు. అప్పుడు? స్థిరంగా నిలబడు. ఎలా? సత్యంతో. నీతితో. సువార్తతో. విశ్వాసంతో. రక్షణ నిశ్చయతతో. దేవుని వాక్యంతో. ఇంకా? నిరంతరం ప్రార్థించు. తర్వాత? సువార్తను ధైర్యంగా ప్రకటించు. సులభంగా గుర్తుంచుకోండి: బలపడు – నిలబడు – కవచం ధరించు – ప్రార్థించు – సువార్త ప్రకటించు

### అన్వయం

దేవుని కవచం ఏదో రహస్యమైన, మాంత్రికమైన విషయం కాదు. అది మన రోజువారీ క్రైస్తవ జీవితంతో చాలా దగ్గరగా ఉంది. దేవుని కవచం ధరించడం ఎలా కనిపిస్తుంది? సత్యాన్ని తెలుసుకోండి. అబద్ధంతో జీవించకండి. నీతిగా జీవించండి. తెలిసికొని పాపాన్ని పట్టుకోకండి. సువార్తలో స్థిరంగా ఉండండి. మీ గుర్తింపు, క్షమ, నిరీక్షణను క్రీస్తులో గుర్తుంచుకోండి. దేవునిని నమ్మండి. పరిస్థితులకంటే ఆయన స్వభావాన్ని నమ్మండి. మీ రక్షణను గుర్తుంచుకోండి. మీ భావాలకంటే క్రీస్తు పూర్తిచేసిన కార్యాన్ని చూడండి. దేవుని వాక్యాన్ని తెలుసుకోండి. వచనాలను సందర్భంలో అర్థం చేసుకోండి. నిరంతరం ప్రార్థించండి. మీ కోసం మాత్రమే కాదు – పరిశుద్ధులందరి కోసం. సువార్తను ధైర్యంగా పంచుకోండి. మీరు నిలబడుతున్న సత్యాన్ని ఇతరులకు కూడా చెప్పండి.

### సువార్త సంబంధం

ఈ ఆత్మీయ పోరాటానికి కేంద్రం ఎవరు? మనమా? లేదు. క్రీస్తు. యేసు శోధించబడ్డాడు. ఏం చేశాడు? విధేయుడిగా నిలిచాడు. సాతాను అబద్ధాలను ఎలా ఎదుర్కొన్నాడు? సత్యంతో. తర్వాత? సిలువపై మన పాపాన్ని భరించాడు. మరణించాడు. మృతులలోనుండి లేచాడు. అంటే క్రీస్తు ఇంకా విజయం కోసం పోరాడుతున్నాడా? లేదు. తన మరణం, పునరుత్థానం ద్వారా నిర్ణయాత్మక విజయాన్ని ఇప్పటికే సాధించాడు. అందుకే పౌలు: "మీ బలంతో విజయాన్ని సాధించండి" అని చెప్పడం లేదు. అతను: "ప్రభువులో బలపడండి" అంటున్నాడు. సువార్తే మనం నిలబడే నేల. ఎఫెసీయుల పత్రిక మొత్తం గుర్తుచేసుకోండి. క్రీస్తులో ఎన్నుకోబడ్డాము. ఆయన రక్తం ద్వారా విమోచించబడ్డాము. క్షమించబడ్డాము. పాపంలో చనిపోయిన మనం జీవింపజేయబడ్డాము. దేవునికి దగ్గరకు తీసుకురాబడ్డాము. ఒకే శరీరంగా చేయబడ్డాము. పరిశుద్ధాత్మచేత ముద్రించబడ్డాము. క్రీస్తులో నిరీక్షణ పొందాము. అందుకే ఆత్మీయ పోరాటంలో మనం కొత్త గుర్తింపు సంపాదించుకోవడానికి పోరాడటం లేదు. క్రీస్తులో ఇప్పటికే పొందిన గుర్తింపులో నిలబడుతున్నాం.

### బైబిల్ అధ్యయన ప్రశ్నలు – 8

1. ఎఫెసీయులకు 6:10-13 ప్రకారం మన బలం ఎక్కడి నుండి వస్తుంది? "ప్రభువులో బలపడటం" అంటే ఏమిటి? మన బలం self -confidence లేదా మనోబలం కంటే ఎలా భిన్నంగా ఉంది?
2. "మన పోరాటం రక్తమాంసములతో కాదు" (6:12) అంటే ఏమిటి? ఈ సత్యం కష్టమైన వ్యక్తులు, విభేదాలు, అన్యాయం ఎదురైనప్పుడు మన స్పందనను ఎలా మార్చాలి?
3. పౌలు "నిలబడండి" అని మళ్లీ మళ్లీ ఎందుకు చెబుతున్నాడు? శోధన, తప్పుడు బోధ, శ్రమ, నిరుత్సాహం, రాజీ ఒత్తిడిలో నిలబడటం ఎలా కనిపిస్తుంది?
4. 6:14-15లోని సత్యం, నీతి, సమాధాన సువార్త మనలను ఎలా కాపాడతాయి? మన రోజువారీ జీవితంలో వీటిని ధరించడం ఎలా కనిపిస్తుంది?
5. 6:16-17లోని విశ్వాసమనే డాలు, రక్షణ అనే శిరస్త్రాణం భయం, సందేహం, నింద, నిరుత్సాహాన్ని ఎలా ఎదుర్కొంటాయి? మన నమ్మకం మన విశ్వాస బలంపైనా, దేవుని నమ్మదగిన స్వభావంపైనా?

6. "ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యం" మన జీవితంలో ఎలా పనిచేయాలి? కొన్ని వచనాలు గుర్తుంచుకోవడం మాత్రమే ఎందుకు సరిపోదు? సందర్భంలో వాక్యాన్ని అర్థం చేసుకోవడం ఎందుకు ముఖ్యం?
7. 6:18-20 ప్రకారం ఆత్మీయ పోరాటంలో ప్రార్థనకు ఏ స్థానం ఉంది? పౌలు తన విడుదలకంటే సువార్తను స్పష్టంగా, ధైర్యంగా ప్రకటించడానికి ప్రార్థన కోరడం మన ప్రార్థనలను ఎలా మార్చాలి?
8. ఈ భాగం ప్రకారం దేవుని సంపూర్ణ కవచాన్ని ధరించి జీవించడం ప్రస్తుతం మీ జీవితంలో ఎలా కనిపించాలి? ఏ అబద్ధాన్ని సత్యంతో ఎదుర్కోవాలి? ఏ పాపాన్ని విడిచిపెట్టాలి? ఏ విషయంలో దేవునిని నమ్మాలి? ఏ ప్రార్థన అలవాటు మార్చాలి? ఎవరితో సువార్త పంచుకోవాలి?

## నాయకులకు – ప్రతి ప్రశ్నకు సహాయం

ముందుగా సభ్యులు వాక్యాన్ని చదివి సమాధానాన్ని కనుగొనేలా చేయండి. ఈ పాఠంలో శత్రువు గురించి ఎక్కువ ఊహాగానాలకు వెళ్లకుండా, వాక్యం ఏది స్పష్టంగా చెబుతోందో అక్కడే ఉండండి. ఇలాంటి చిన్న ప్రశ్నలు అడగండి: "పౌలు మొదటి ఆజ్ఞ ఏమిటి?" "ఈ సమాధానం ఏ వచనంలో ఉంది?" "ఇక్కడ మన బాధ్యత ఏమిటి? దేవుని సమకూర్పు ఏమిటి?" "ఈ అబద్ధానికి దేవుని సత్యం ఏమి చెబుతోంది?" "ఇది మన రోజువారీ జీవితంలో ఎలా కనిపిస్తుంది?"

### ప్రశ్న 1 - బలం ఎక్కడి నుండి?

చర్చను మొదటి ఆజ్ఞ దగ్గరకు తీసుకురండి: "ప్రభువులోను ఆయన మహాశక్తిలోను బలవంతులై ఉండండి." మన బలం వ్యక్తిత్వం కాదు. Self-confidence కాదు. మనోబలం కాదు. అనుభవం కాదు. మూలం: ప్రభువు మరియు ఆయన శక్తి. మరింతగా అడగండి: "కష్టంలో నేను మొదట నా సామర్థ్యాన్ని చూస్తున్నానా? లేక ప్రభువును చూస్తున్నానా?"

### ప్రశ్న 2 - మనుషులు చివరి శత్రువులు కాదు

"రక్తమాంసములతో కాదు" అనే మాటను మానవ బాధ్యత తొలగించడానికి ఉపయోగించవద్దు. మనుషులు పాపం చేస్తే బాధ్యత ఉంది. అవసరమైనప్పుడు సరిదిద్దడం, హద్దులు, క్రమశిక్షణ, న్యాయం అవసరం. కానీ ద్వేషం మన స్పందన కాకూడదు. ప్రధాన సత్యం: మనుషులనే చివరి శత్రువులుగా చూడకండి.

**ఇంకా అడగండి:** "ఎవరినైనా శత్రువుగా చూడటం మొదలైతే, నా మాటలు, ప్రార్థనలు, స్పందన ఎలా మారిపోతాయి?"

### ప్రశ్న 3 - నిలబడటం

ఈ భాగంలో "నిలబడటం" అనే మాటను సభ్యులతో గుర్తించండి. నిలబడటం అంటే: క్రీస్తుకు విశ్వాసంగా ఉండటం. సత్యాన్ని విడిచిపెట్టకపోవడం. శోధనకు లొంగకపోవడం. రాజీ పడకపోవడం. ప్రధాన చిత్రం: తన స్థానాన్ని విడిచిపెట్టని సైనికుడు. **ఇంకా అడగండి:** "ప్రస్తుతం నేను ఏ విషయంలో వెనక్కు తగ్గమనే ఒత్తిడిని ఎదుర్కొంటున్నాను?"

### ప్రశ్న 4 - సత్యం, నీతి, సువార్త

సత్యం – శత్రువు అబద్ధాలను బయటపెడుతుంది. నీతి – క్రీస్తులో మనకు వచ్చిన దేవుని అంగీకారాన్ని, దానికి తగిన పరిశుద్ధ జీవితాన్ని గుర్తుచేస్తుంది. సువార్త – దేవునితో సమాధానం, స్థిరత్వం, గుర్తింపు, నిరీక్షణ ఇస్తుంది. అలాగే ఇతరులకు సువార్త చెప్పడానికి సిద్ధం చేస్తుంది.

**ఇంకా అడగండి:** "నేను ప్రస్తుతం నమ్ముతున్న ఏ అబద్ధాన్ని సువార్త సరిచేస్తుంది?"

### ప్రశ్న 5 - విశ్వాసం మరియు రక్షణ

దృష్టి: "నా విశ్వాసం ఎంత బలంగా ఉంది?" అనే దానిపై కాకుండా: "నా దేవుడు ఎంత నమ్మదగినవాడు?" అనే దానిపై ఉండాలి. రక్షణ నిశ్చయత మన భావాలపై కాదు. మన పనితీరుపై కాదు. క్రీస్తు పూర్తిచేసిన కార్యం మరియు దేవుని వాగ్దానాలపై.

**ఇంకా అడగండి:** "నేను విఫలమైనప్పుడు నా భావాలు ఏమి చెబుతాయి? సువార్త ఏమి చెబుతుంది?"

### ప్రశ్న 6 - దేవుని వాక్యం

దేవుని వాక్యం మోసాన్ని గుర్తిస్తుంది. సత్యాన్ని చూపిస్తుంది. తప్పును సరిదిద్దుతుంది. మనస్సును నూతనపరుస్తుంది. కానీ సందర్భం ఎందుకు ముఖ్యం? ఎందుకంటే వచనాన్ని తప్పుగా ఉపయోగించవచ్చు. యేసు శోధనలో సాతాను కూడా లేఖనాన్ని ఉటంకించాడు. అందుకే: వచనం తెలుసుకోవడం – సందర్భం అర్థం చేసుకోవడం – సరిగ్గా వర్తింపజేయడం అన్నీ అవసరం.

**ఇంకా అడగండి:** "నేను వచనాలను మాత్రమే తెలుసుకుంటున్నానా? లేక వాక్యపు అర్థాన్ని కూడా నేర్చుకుంటున్నానా?"

### ప్రశ్న 7 - ప్రార్థన

పౌలు ఏ విధంగా ప్రార్థించమంటున్నాడు? ప్రతి సమయంలో - అన్ని రకాల ప్రార్థనలతో - పరిశుద్ధులందరి కోసం - మేల్కొని, పట్టుదలతో. పౌలు తన కోసం ఏ ప్రార్థన కోరాడు? మొదట జైలు విడుదలనా? లేదు. సువార్తను ధైర్యంగా ప్రకటించే మాటలు. అందుకే మన ప్రార్థనలో రెండు విషయాలు ఉండవచ్చు: "ప్రభువా, ఈ కష్టాన్ని తొలగించు." అలాగే: "ఈ కష్టంలో కూడా నన్ను విశ్వాసంగా ఉపయోగించు."

### ప్రశ్న 8 - వ్యక్తిగత అన్వయం

"నేను దేవుని కవచం ధరించాలి" అనే సాధారణ సమాధానంతో ఆగిపోకండి. స్పష్టంగా అడగండి: సత్యం - "నేను ఏ అబద్ధాన్ని నమ్ముతున్నాను?" నీతి - "ఏ పాపాన్ని విడిచిపెట్టాలి?" సువార్త - "నేను ఏ సువార్త సత్యాన్ని మర్చిపోయాను?" విశ్వాసం - "ఏ విషయంలో దేవునిని నమ్మాలి?" రక్షణ - "నింద వచ్చినప్పుడు క్రీస్తు చేసిన కార్యాన్ని గుర్తుంచుకుంటున్నానా?" వాక్యం - "నా బైబిల్ అధ్యయనంలో ఏ మార్పు కావాలి?" ప్రార్థన - "ఎవరి కోసం లేదా ఏ విషయానికి ఎక్కువగా ప్రార్థించాలి?" సాక్ష్యం - "ఎవరితో సువార్త పంచుకోవాలి?"

## నాయకులు గమనించవలసిన ముఖ్యమైన విషయాలు

**1. సాతానును ఈ పాఠానికి కేంద్రంగా చేయవద్దు**

పౌలు శత్రువు గురించి మాట్లాడుతున్నాడు. కానీ ప్రధాన ఆజ్ఞ ఏమిటి? "ప్రభువులో బలపడండి." కేంద్రం సాతాను కాదు. క్రీస్తు మరియు దేవుని సమకూర్పు.

**2. ప్రతి సమస్యకు నేరుగా దయ్యమే కారణం అని చెప్పవద్దు**

ఎఫెసీయుల పత్రికలో ఇప్పటికే పౌలు మానవ పాపం, తప్పు ఆలోచనలు, పాప కోరికలు, కోపం, అబద్ధం, చేదు, సంబంధ సమస్యలు, వ్యక్తిగత బాధ్యత గురించి మాట్లాడాడు. అందుకే ప్రతి సమస్యను దయ్యానికి మాత్రమే ఆపాదించకండి.

3. ఆత్మీయ పోరాటాన్ని మాంత్రికంగా చేయవద్దు

దేవుని కవచం అంటే ప్రత్యేకమైన రహస్య పదాలు పలకడం కాదు. సందర్భం లేకుండా కొన్ని వచనాలు పలకడం కూడా కాదు. పౌలు చెప్పే కవచం: సత్యం - నీతి - సువార్త - విశ్వాసం - రక్షణ - వాక్యం - ప్రార్థన అంటే సువార్త సత్యాలతో నిండిన విశ్వాసమైన జీవితం.

**4. కవచమంతా దేవుని సమకూర్పు**

ఇది మనం తయారు చేసుకున్నది కాదు. దేవుడు సమకూరుస్తాడు - మనం ధరించాలి. అందుకే గర్వానికి స్థానం లేదు. ఆధారపడటానికి మాత్రమే స్థానం ఉంది.

## నాయకులు గుర్తుంచుకోవలసిన ప్రధాన సత్యం

చర్చను మళ్లీ మొదటి ఆజ్ఞ దగ్గరకు తీసుకురండి: "ప్రభువులోను ఆయన మహాశక్తిలోను బలవంతులై ఉండండి." తర్వాత ఈ క్రమాన్ని సభ్యులతో కలిసి చెప్పించండి: ప్రభువుపై ఆధారపడు - నిజమైన పోరాటాన్ని గుర్తించు - సత్యంలో నిలబడు - నీతిగా జీవించు - సువార్తలో స్థిరపడు - దేవునిని నమ్ము - రక్షణను గుర్తుంచుకో - వాక్యాన్ని ఉపయోగించు - నిరంతరం ప్రార్థించు - క్రీస్తును ధైర్యంగా ప్రకటించు.

## ఎఫెసీయుల పత్రికకు ముగింపు

ఎఫెసీయుల పత్రిక మొదట మనకు ఏమి చెప్పింది? క్రీస్తులో మనం ఎవరం. తర్వాత ఏమి చెప్పింది? క్రీస్తులో పొందిన కొత్త గుర్తింపుకు తగినట్లుగా ఎలా జీవించాలి. చివర ఏమి చెబుతోంది? ఆ కొత్త జీవితాన్ని వ్యతిరేకించే ఆత్మీయ పోరాటంలో ఎలా నిలబడాలి. అందుకే ఎఫెసీయుల పత్రికను మూడు చిన్న ప్రశ్నలతో గుర్తుంచుకోవచ్చు: క్రీస్తులో నేను ఎవరు? క్రీస్తుకు తగినట్లుగా నేను ఎలా నడవాలి? ఆ జీవితం కోసం పోరాటంలో నేను ఎలా నిలబడాలి? సమాధానం? క్రీస్తులో - క్రీస్తు ద్వారా - క్రీస్తు బలంతో.

## చివరి ప్రశ్న

ఎఫెసీయుల పత్రిక చివర మనం అడగాల్సిన ప్రశ్న: "నేను క్రైస్తవ పోరాటానికి తగినంత బలవంతుడినా?" అనేది కాదు. అసలు ప్రశ్న: "నేను క్రీస్తులో నిలబడి, దేవుడు ఇచ్చిన సంపూర్ణ కవచాన్ని ధరించి, ఆయన బలం, ఆయన సత్యం, ఆయన సువార్త, ఆయన వాక్యం,

## చదవండి □ అర్థం చేసుకోండి □ అన్వయించండి □ బోధించండి

వాక్యభాగాన్ని జాగ్రత్తగా చదవండి

సందర్భాన్ని అర్థం చేసుకోండి

వాక్యాన్ని నమ్మకంగా వివరించండి

అన్వయ ప్రశ్నలు అడగండి

సువార్త సంబంధాన్ని గుర్తించండి

### అధ్యయనం □ ఆచరణ □ బోధన

### ఎజ్రా 7:10

"ఎజ్రా యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి
దానిచొప్పున నడుచుకొనుటకును, ఇశ్రాయేలీయులకు
కట్టడలను విధులను నేర్పుటకును
దృఢనిశ్చయము చేసికొనెను."

**2026లో సిద్ధం చేయబడింది**